'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 272

మంగళవారం 23-12-2025

మరో విజయం లక్ష్యంగా...
విశాఖపట్నంలో నేడు శ్రీలంకతో భారత మహిళల రెండో టి20
-12లో

ఆనియన్ క్వీన్
ఉల్లి నిల్వల సంరక్షణకు ఓ పరికరాన్ని కనిపెట్టింది కల్యాణీ షిండే
-11లో

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

స్టార్‌లింక్ శాటిలైట్లకు ముప్పు!
కృత్రిమ ఉపగ్రహాలను కూల్చేసే అధునాతన ఆయుధ తయారీలో రష్యా నిమగ్నమైందని పశ్చిమ దేశాలు అనుమానిస్తున్నాయి.
వివరాలు 6లో ▸



కొండలపై కత్తి!
కాలపరీక్షకు తట్టుకుని నిలిచిన పురాతన ఆరావళీ పర్వత శ్రేణులు మనిషి పేరాశతో ఉనికి కోల్పోయే ప్రమాదంలో పడ్డాయి.
వివరాలు 6లో ▸

వాణిజ్య ఒప్పందం ఖరారు
ద్వైపాక్షిక వాణిజ్యాన్ని ఐదేళ్లలో రెట్టింపు స్థాయికి చేర్చే లక్ష్యంతో భారత్, న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి.
వివరాలు 6లో ▸



సౌదీపై మంచు దుప్పటి
అత్యధిక ఉష్ణోగ్రతలకు చిరునామాగా నిలిచే సౌదీ అరేబియా ఎడారుల్లో ఇప్పుడు మంచు కుప్పలుతెప్పలుగా కనిపిస్తోంది.
వివరాలు 6లో ▸

• పేరుకుపోతున్న అర్జీలు.. పేరుకే సదస్సులు

రెవె'న్యూసెన్స్'!

ఫిర్యాదులపై ఏమాత్రం స్పందించని చంద్రబాబు సర్కారు

ప్రతి సోమవారం 'పీజీఆర్ఎస్'లో 80 శాతం రెవెన్యూ సమస్యలే

కబ్జాలు, సరిహద్దు సమస్యలు, రికార్డులు మాయం, అక్రమాలపై ఫిర్యాదుల వెల్లువ

పట్టా భూములను సైతం నిషేధిత జాబితాలో చేర్చడంపై బాధితుల ఆక్రందన.. రసీదుల జారీతోనే సరి.. పరిష్కారం దొరకక జనం సతమతం

- సమస్య తీర్చాలని పదేపదే వేడుకుంటున్నా ఫలితం శూన్యం
- 22-ఏ నిషేధిత జాబితాలోని భూములకు గత ప్రభుత్వంలో ఫ్రీహోల్డ్.. బాబు రాకతో తిరిగి నిషేధం
- గత ప్రభుత్వంలో ఇచ్చిన పట్టాదారు పుస్తకాలు రద్దు.. తిరిగి కొత్తవి ఇవ్వని చంద్రబాబు సర్కారు
- క్రయవిక్రయాలు, రుణాలకు తీవ్ర ఇక్కట్లు పడుతున్న రైతన్నలు.. వారసత్వ భూములను మ్యుటేషన్ చేయడంలోనూ అంతులేని జాప్యం
- తూతూ మంత్రంగా గ్రామ సభలు.. రెవెన్యూ సదస్సులు
- రెవెన్యూ సమస్యలపై 'సాక్షి' క్షేత్రస్థాయి పరిశీలన.. ఊరూరా బాధితుల అవస్థలు

2 లో

బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం బత్తులవారిపాలెంలో నివసించే చిమటా మార్క్‌కు సర్వే నెంబర్ 351/9 లో 1.26 ఎకరాలు, 314/6 లో 22 సెంట్లు కలిపి మొత్తం 1.48 ఎకరాల పొలం ఉంది. డాక్యుమెంట్లు అన్నీ ఆయన పేరుతోనే ఉన్నా తటవర్తి సాయి, పందరబోయిన శ్రీను అనే వ్యక్తులు ఆ సర్వే నంబర్లలో 1.22 ఎకరాలను ఆక్రమించుకున్నారు. మార్క్‌ను భూమిలోకి రానివ్వడం లేదు. తన భూమిని ఆక్రమించారని.. సమస్య పరిష్కరించాలని డాక్యుమెంట్లు చేత పట్టుకుని మార్క్ ఏడాదిన్నరగా తహసీల్దార్, కలెక్టర్ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నాడు. ఫిర్యాదు స్వీకరించామంటూ రసీదు చేతిలో పెట్టడం మినహా సమస్య పరిష్కరించే నాథుడే లేడని మార్క్ వాపోతున్నాడు.

చిత్తూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మామిడి రైతులు

రూ.350 కోట్ల బకాయిలు

ఎప్పుడిస్తారు?

చంద్రబాబు ప్రభుత్వంపై మండిపడిన చిత్తూరు మామిడి రైతులు

పోలీసులను ఉసిగొల్పి తమను అణచివేస్తోందని ఆగ్రహం

- 40 ఫ్యాక్టరీల కోసం 40 వేలమందిని రోడ్డున పడేశారు
- 4.30 లక్షల టన్నుల పంట తోలి 7 నెలలైనా అతీగతి లేని వైనం
- నేతలకు చెప్పినా.. ఫ్యాక్టరీల చుట్టూ తిరిగినా ఫలితం శూన్యం
- విసుగెత్తి చిత్తూరు కలెక్టరేట్‌ను ముట్టడించిన మామిడి రైతులు
- మోసగిస్తే గుణపాఠం తప్పదని హెచ్చరిక... ధర్నాతో దద్దరిల్లిన కలెక్టరేట్

3 లో

"మామిడి రైతులంటే ఎందుకింత చులకన?

మామిడి రైతుల పట్ల బాబు ప్రభుత్వానికి చులకన భావం తగదు. కష్టాన్ని నమ్ముకుని చెమటోడ్చి పంటలు పండించే అన్నదాతలను పట్టించుకోకపోవడం దారుణం. మామిడి రైతులకు పరిశ్రమలు ఇవ్వాల్సిన డబ్బు ఇప్పించకపోవడం ఎంతవరకు సబబు? వెంటనే నగదును చెల్లించేలా చర్యలు చేపట్టాలి.
- మునిరత్నంనాయుడు, మామిడి రైతు

ఏపీ సెట్స్ షెడ్యూల్ విడుదల

వివిధ విద్యా కోర్సులకు నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్షలకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. 2026 - 27 విద్యా సంవత్సరంలో చేపట్టే ప్రవేశాలకు అనుగుణంగా 2026లో ఈ పరీక్షలు నిర్వహించనుంది. - సాక్షి, అమరావతి

2026లో ఎంట్రన్స్ టెస్ట్‌ల షెడ్యూల్ ఇలా..

సెట్	పరీక్ష తేదీ
ఏపీ ఈసెట్	ఏప్రిల్ 23
ఏపీ ఐసెట్	ఏప్రిల్ 28
ఏపీ పీజీఈ సెట్	ఏప్రిల్ 29, 30, మే 2
ఏపీ లా సెట్	మే 4
ఏపీ ఎడ్ సెట్	మే 4
ఏపీ పీజీ సెట్	మే 5, 8, 9, 10, 11
ఏపీఈఏపీసెట్ (ఇంజనీరింగ్)	మే 12, 13, 14, 15, 18
ఏపీఈఏపీసెట్ (అగ్రికల్చర్ ఫార్మసీ)	మే 19, 20

నేడు పులివెందులకు వైఎస్ జగన్

మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ నేటి నుంచి మూడురోజుల పాటు పులివెందులలో పర్యటించనున్నారు. ప్రజా దర్బార్, క్రిస్మస్ ప్రార్థనలు తదితర కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు.
3 లో

అయ్యా.. నీ కాళ్లు మొక్కుతా.. పింఛను ఇప్పించండి

తిరుపతి కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం పింఛను కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు దివ్యాంగులు, మానసిక రోగులు, వితంతువులు, వృద్ధులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. 'అయ్యా మీ కాళ్లు మొక్కుతాం.. మాకు పింఛను ఇప్పించండి సార్..' అంటూ అధికారులను, కలెక్టర్ వెంకటేశ్వర్, చివరకు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ని సైతం వేడుకున్నారు. పింఛన్లు పొందడానికి తమకు పూర్తి అర్హత ఉందని.. ప్రభుత్వం నుంచి అనుమతులు ఇప్పించాలంటూ వారు విజ్ఞప్తి చేశారు.
- తిరుపతి అర్బన్

• ఇవిగో సాక్ష్యాలు..

రోడ్డెక్కితే బాదుడు నిజమే

గత నెల 26న సీఎం చంద్రబాబు సమీక్షలో సెస్‌ల ప్రతిపాదన

- ఒకసారి సెస్ విధించాక ఎన్నేళ్లయినా కొనసాగింపే
- 1,500 కి.మీ. అంతిమ వ్యయం రూ.15,326 కోట్లు
- మరి కిలోమీటర్‌కు రూ.10 కోట్లు వ్యయం కాదా?
- కాంట్రాక్టర్‌కు 15 ఏళ్లలో చెల్లింపు అని అంగీకారం
- 60 శాతం వడ్డీతో కలిపి ఆరు నెలలకోసారి చెల్లింపు
- 'సాక్షి' కథనానికి రహదారులు-భవనాల శాఖ వివరణ

10 లో



APRDC - HAM PROJECTS – POSSIBLE REVENUE SOURCES

Sl. No.	Recommendation	Amount per year in Rs Cr
1.	Rs.1/- cess on Petrol & Diesel	732
2.	10% cess over Mines & Minerals	441
3.	10% cess of Motor Vehicle Tax	350
4.	Cess on port cargo	To be assessed
5.	Cess on property registration where road widening / new NH / SH road laid	To be assessed
6.	Commercial utilization of R&B lands and Assets	Proposal sent to Finance for engaging consultant for monetization of assets
7.	Advertisement Revenue all along R&B roads	To be assessed
	Total	1636

ROADS & BUILDINGS DEPARTMENT, GOVT. OF ANDHRA PRADESH

పెట్రోల్, డీజిల్ తదితరాలపై సెస్‌ల వసూలు ద్వారా ఏటా రూ.1,636 కోట్లు సమకూర్చవచ్చని పేర్కొన్న ఆర్ అండ్ బీ శాఖ

చంద్రబాబు మార్క్ బాదుడు

10 లో

- రాష్ట్రంలోని రెండు వరుసల రోడ్లపైనా టోల్ వసూలు
- తొలి దశలో ఏడు రోడ్లలో వసూలుకు నిర్ణయం
- 470 కిలోమీటర్ల రోడ్లకు టోల్ రూపంలో ఏడాదికి రూ.96.03 కోట్లు వస్తుందని అంచనా

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్లు రిటైల్ ధర ₹96

ఫారం దగ్గర లైవ్ బర్డ్ 140 కిలో

రిటైల్ లైవ్ బర్డ్ 167 కిలో

డ్రెస్డ్ స్కిన్‌తో 242 కిలో

స్కిన్ లెస్ 276 కిలో

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

పల్నాడులో జంట హత్యలు

మాచర్ల నియోజకవర్గం దుర్గి మండలం అడిగొప్పలలో ఘటన

హనుమంతు, శ్రీరామమూర్తి (ఫైల్)

- అన్నదమ్ములు హనుమంతు, శ్రీరామమూర్తిని ఆదివారం రాత్రి హత్య చేసిన ప్రత్యర్థులు
- ఒకే సామాజికవర్గానికి చెందిన టీడీపీ నాయకుల మధ్య వర్గపోరుతోనే హత్యలు జరిగినట్టు అనుమానం

సాక్షి టాస్క్‌ఫోర్స్: తెలుగుదేశం పార్టీలో ఆధిపత్య పోరు మరో ఇద్దరిని బలితీసుకుంది. వెల్దుర్తి మండలం గుండ్లపాడులో జరిగిన జంట హత్యలు మరువకముందే దుర్గి మండలం అడిగొప్పలలో ఓ వర్గం మరో వర్గంలోని ఇరువురు సోదరులను హతమార్చింది. ఈ జంట హత్యలు పల్నాడును ఉలికిపాటుకు గురి చేశాయి. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి టీడీపీలో అంతర్గతపోరు తారాస్థాయికి చేరి హత్యాకాండలకు ఉసిగొల్పుతోంది. పోలీసుల కథనం ప్రకారం... పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం దుర్గి మండలం అడిగొప్పల గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి అన్నదమ్ములను ప్రత్యర్థులు ఒకరి తర్వాత మరొకరిని అత్యంత దారుణంగా వేటకొడవళ్లతో నరికి హతమార్చారు. కొత్త శ్రీరామమూర్తి (33) గ్రామంలోని శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి

మిగతా 5వ పేజీలో ▶

కేజీ బేసిన్‌లో చమురు వెలికితీతకు 'వేదాంత'కు అనుమతి

3 లో

- కృష్ణా, గోదావరి(కేజీ) బేసిన్ పరిధిలోని కృష్ణా జిల్లాలో 20 ప్రాంతాల్లో చమురు, సహజ వాయువు(గ్యాస్) నిక్షేపాల వెలికితీతకు వేదాంత లిమిటెడ్ సంస్థకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కృష్ణా జిల్లా నిడుమోలు వద్ద 3, గూడూరు వద్ద 3 ప్రాంతాల్లో బావులు తవ్వుతారు. మద్దిపట్ల, కాజా, రాయవరం వద్ద రెండేసి చోట్ల, తరకటూరు, కంచకోడూరు, ఆవురుపూడి, కలపటం, ముక్కొళ్లు, పినగూడురు లంక, నరికేడ్లపాలెం, మల్లవోలులో ఒక్కో బావికి అనుమతిస్తూ ఎన్‌వోసీ జారీ చేసింది.

189 టన్నుల గోమాంసం

పూడ్చివేతకు సిద్ధం

నవంబర్ 3న విశాఖ శివారులో శ్రీమిత్ర మెరైన్ ఏజెన్సీస్ కోల్డ్ స్టోరేజీలో భారీగా మాంసం గుర్తింపు

శాంపిళ్లు పరిశీలించగా అధికంగా గోమాంసం ఉన్నట్లు నిర్ధారణ.. విదేశాలకు ఎగుమతి చేస్తున్న మహమ్మద్ ఫర్హాన్‌తోపాటు మరో ఇద్దరి అరెస్ట్

లా అండ్ ఆర్డర్ డీసీపీ - 1 వీఎన్ మణికంఠ వెల్లడి

11లో

కోల్డ్ స్టోరేజీ నుంచి గో మాంసాన్ని లారీలోకి లోడ్ చేస్తున్న దృశ్యం

'మద్యం' లాటరీ విధానంపై

పునఃసమీక్ష

- మద్యం షాపుల యజమానులకు మార్జిన్ పెంపుపై కసరత్తు చేయండి
- మద్యం దుకాణాలపై ఏఆర్ఈటీ మినహాయింపుపై పరిశీలించండి
- ఎక్సైజ్ శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు

11లో

● పేరుకుపోతున్న అర్జీలు.. పేరుకే సదస్సులు

రెవె'న్యూ'సెన్స్!

ఫిర్యాదులపై ఏమాత్రం స్పందించని చంద్రబాబు సర్కారు

ప్రతి సోమవారం 'పీజీఆర్ఎస్'లో 80 శాతం రెవెన్యూ సమస్యలే

కబ్జాలు, సరిహద్దు సమస్యలు, రికార్డులు మాయం, అక్రమాలపై ఫిర్యాదుల వెల్లువ

రెవెన్యూ సమస్యలను అధికారులకు విన్నవించుకోవడానికి గానూ ఇటీవల తిరుపతి కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు భారీగా హాజరైన ప్రజలు

సాక్షి ప్రతినిధి, కర్నూలు: తప్పుడు పేర్లతో ఆన్‌లైన్‌లో రికార్డులు మాయం చేయడం.. పట్టా భూములను సైతం నిషేధిత జాబితాలో చేర్చడం.. భూ కొలతల్లో తిమ్మిని బమ్మిని చేయడం.. భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోకపోవడం.. ఇలా రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సమస్యలు వెల్లువెత్తుతున్నాయి. తమ గోడు పట్టించుకునే దిక్కులేక లక్షలాది మంది సతమతమవుతున్నా చంద్రబాబు సర్కారు చేష్టలుడిగి చూస్తోంది. చలానాలు కట్టినా.. స్వయంగా న్యాయస్థానాలు ఆదేశించినా.. భూములు సర్వే చేసే దిక్కులేక అల్లాడుతున్నారు. ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే వినతుల్లో సింహభాగం రెవెన్యూ సమస్యలే ఉంటున్నాయి. ఈ నెల 15న చిత్తూరు కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌కు 293 అర్జీలు వస్తే రెవెన్యూ సమస్యలే 204 ఉన్నాయి. ఇలా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అందుతున్న ఫిర్యాదుల్లో 70–80 శాతం రెవెన్యూ సమస్యలే కావడం గమనార్హం. ప్రభుత్వ ఉదాసీనత, రెవెన్యూ శాఖ నిర్లక్ష్యంతో రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న అవస్థలపై 'సాక్షి' బృందాలు ఈ నెల 15న సోమవారం అన్ని జిల్లాల కలెక్టరేట్‌లలో పీజీఆర్ఎస్‌ను ఆసాంతం పరిశీలించాయి. మొత్తంగా ఆయా జిల్లాల్లో ఒక్క రోజులో ఎన్ని సమస్యలు వచ్చాయి..? వాటిలో రెవెన్యూ సమస్యలు ఎన్ని..? అని ఆరా తీసింది. ఆ తర్వాత మంగళ, బుధవారాల్లో పీజీఆర్ఎస్‌కు హాజరైన కొందరు బాధితుల గ్రామాలకు వెళ్లి సమస్య మూలాలను పరిశీలించాయి. బాధితులతో మాట్లాడాయి. వెళ్లిన ప్రతి చోటా సమస్యల పరిష్కారంలో లెక్కలేనితనం, ప్రభుత్వ బాధ్యతారాహిత్యం, అవినీతి స్పష్టంగా కనిపించింది. ఒక్క రోజులో పరిష్కరించగలిగే చిన్న సమస్యలను సైతం నెలల తరబడి పట్టించుకోకపోవడం లేదని తేటతెల్లమైంది. చలానాలు కూడా కట్టించుకుని సర్వేలు చేయడం లేదంటే నిర్లక్ష్యం ఏ స్థాయికి చేరుకుందో కళ్లకు కడుతోంది.

గత ప్రభుత్వం పరిష్కరించినా.. మళ్లీ అసైన్ ఉచ్చు

ఏళ్ల తరబడి పొలాలు సాగు చేసుకుంటున్నా 22–ఏ నిషేధిత జాబితాలో అసైన్డ్ భూములు ఉండటంతో బ్యాంకు రుణాలు అందక, అవసరాలకు భూములు విక్రయించుకోలేక సుదీర్ఘకాలంగా రైతన్నలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారి సమస్యలను గుర్తిస్తూ, 20 ఏళ్లుగా లబ్ధిదారుల అనుభవంలో ఉన్న అసైన్డ్ భూములను 22–ఏ జాబితా నుంచి తొలగించి వైఎస్సార్‌సీపీ హయాంలో రైతులకు హక్కులు కల్పించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పేద రైతులు ఎంతో సంతోషపడ్డారు. కానీ 2024లో చంద్రబాబు గద్దెనెక్కిన తర్వాత ఫ్రీహోల్డ్ అయిన భూములను తిరిగి 22–ఏ నిషేధిత జాబితాలో చేర్చింది. దీంతో రుణాల నుంచి క్రయవిక్రయాల వరకు అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం వెంకటరెడ్డిపల్లిలో ఇంజా లక్ష్మీరెడ్డికి వారసత్వంగా వచ్చిన 65 ఎకరాల ఉమ్మడి పొలం ఉంది. నలుగురు అన్నదమ్ములు కావడంతో లక్ష్మీరెడ్డి వాటాగా నాలుగో వంతు రావాలి. సజ్జలదిన్నె గ్రామంలో సర్వే నెంబర్లు 44, 602, 581, 612, 467–డి, 270–ఎం, 270–ఓ, 33, 390–బిలో తొమ్మిది ఎకరాల పొలం వివాదంలో ఉంది. కోర్టు ఆయనకు అనుకూలంగా తీర్పు ఇచ్చి పోలీసు భద్రతతో సర్వే చేయాలని రెవెన్యూ శాఖను ఆదేశించింది. సర్వే కోసం బాధితుడు చలానా కట్టినా వీఆర్‌వో సర్వే చేయించడం లేదు. 'మేం చేయించం.. నీకు దిక్కున్న చోట చెప్పుకో..' అని బెదిరిస్తున్నాడు. లక్ష్మీరెడ్డి ఇప్పటివరకు 31 సార్లు అర్జీలు ఇచ్చినా భూమిని సర్వే చేయడం లేదు. రెవెన్యూ వ్యవహారాలు ఇంత అధ్వాన్నంగా ఉంటే ఎవరికి చెప్పుకోవాలని ఆయన వాపోతున్నారు.

పట్టాదారు పుస్తకాలు ఎక్కడ?

గత ప్రభుత్వంలో రైతులకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను అందజేశారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఫొటో ఉందనే సాకుతో వాటిని చంద్రబాబు ప్రభుత్వం రద్దు చేసింది. కొత్తగా ప్రభుత్వ ఎంబ్లమ్‌తో పాసు పుస్తకాలను ఇస్తామని ప్రకటించింది. ఏడాదిన్నర దాటినా ఇప్పటి వరకు పాసు పుస్తకాలు జాడ లేదు. పాత పాస్ పుస్తకాలు రద్దు కావడం, కొత్తవి ఇవ్వకపోవడంతో రైతులు రుణాల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాసు పుస్తకాలు ఇవ్వాలని పీజీఆర్‌సీకు పెద్ద ఎత్తున విజ్ఞాపనలు వస్తున్నాయి.

విచారిస్తూనే ఉన్నారు...!

ప్రకాశం జిల్లా మర్రిపూడి మండలం వేమవరంలో ముప్పరాజు పాపయ్య పేరుతో 11.93 ఎకరాల భూమి ఉండగా ఆయన ఇద్దరు కుమారులు, పెద్దకోడలు కూడా చనిపోయారు. చిన్న కోడలు శేషమ్మ మాత్రమే మిగిలి ఉంది. ఈ భూమిని ఒంగోలుకు చెందిన రియల్టర్ మారం వెంకటేశ్వరరెడ్డి తప్పుడు పత్రాలతో అగ్రిమెంట్ చేసుకున్నాడు. శేషమ్మ భూమిని కొట్టేయాలని యత్నిస్తున్నాడు. దీంతో శేషమ్మ రెవెన్యూ అధికారులను సంప్రదించగా ఈ వివాదాన్ని ఎంతకీ తేల్చడం లేదు. ఈ భూమిపై హక్కుదారులెవరో విచారణ చేస్తున్నామని తహసీల్దార్ చెబుతున్నారు.

మొక్కుబడిగా గ్రామ సభలు, రెవెన్యూ సదస్సులు

భూముల సంబంధిత సమస్యల పరిష్కారానికి చంద్రబాబు ప్రభుత్వం జనవరిలో 10 రోజులు గ్రామ సభలు నిర్వహించింది. అనంతరం మరో 15 రోజులు రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం సదస్సులు నిర్వహించింది. కర్నూలు సహా పలు జిల్లాల్లో ఈ సభల్లో ప్రభుత్వం దృష్టికి వచ్చిన సమస్యల్లో ఒక్కటీ పరిష్కారం కాలేదు. రికార్డుల్లో మాత్రం సమస్యలు పరిష్కారమైనట్లు నమోదు చేశారు. క్షేత్ర స్థాయిలో ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదు. దీంతో రెవెన్యూ సదస్సులకు వచ్చిన వారు తిరిగి పీజీఆర్ఎస్‌కు క్యూ కడుతున్నారు. దీన్నిబట్టి రెవెన్యూ సదస్సులు ఎంత అధ్వానంగా జరిగాయో స్పష్టమవుతోంది.

మ్యుటేషన్లు బంద్..

రీ సర్వేలో మిగులు భూముల మ్యుటేషన్లను చంద్రబాబు ప్రభుత్వం కఠినతరం చేసింది. ఆ భూముల్లో అనుభవదారులున్నా, వాటిని వారి వారసులకు మ్యుటేషన్ చేయడం లేదు. దాదాపు ఏడాదిన్నరగా రైతులు వాటి కోసం పడిగాపులు కాస్తున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో చుక్కల భూములపై హక్కులు ఇచ్చారు. అయితే ఆధారాలు చూపలేని కొందరు రైతులకు సంబంధించిన భూములు పెండింగ్‌లో ఉన్నాయి. ఆ రైతులంతా తమ భూములను డాటెడ్ జాబితా నుంచి తొలగించాలని ఆధారాలతో రెవెన్యూ అధికారులకు మొర పెట్టుకుంటున్నా ఆలకించడం లేదు. రీసర్వేలో జాయింట్ ఎల్‌పీఎంలను తొలగించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీని కోసం గ్రామాల్లో రైతుల నుంచి లంచాలు వసూలు చేస్తూ టీడీపీ నాయకులు సెటిల్‌మెంట్లు చేస్తున్నారు. వీటిపై కూడా పీజీఆర్ఎస్‌కు అర్జీలు భారీగా వస్తున్నాయి.

ఐవీఆర్ఎస్ కాల్స్, ఆడిట్‌లో ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి

సాక్షి, అమరావతి: సూపర్ సిక్స్ ఎన్నికల హామీలను అమలు చేయకుండా మోసం చేసిన సీఎం చంద్రబాబు కనీసం ప్రజల ఆర్థికేతర సమస్యలకు పరిష్కారం చూపడంలోనూ దారుణంగా విఫలమయ్యారు. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కలెక్టర్ల సదస్సులోనే ఈ విషయం వెల్లడైంది. సమస్యలపై ప్రజలు ఇచ్చిన అర్జీలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోయాయి. పరిష్కరించామని చెబుతున్న సమస్యలపై ఆర్టీజీఎస్ ద్వారా నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ఈ డొల్లతనం బయటపడింది.

అల్లూరి జిల్లాలో అత్యధికం..

విజ్ఞాపనల పరిష్కారంపై ఈ ఏడాది సెప్టెంబర్ 15 నుంచి డిసెంబర్ 15 వరకు ఆర్టీజీఎస్ ద్వారా సర్వే చేయగా 43 శాతం మంది ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిష్కరించినట్లు చెబుతున్న వినతులపై ఆడిట్ నిర్వహించడంతో పాటు అర్జీదారులకు ఐవీఆర్ఎస్ కాల్ చేసి అభిప్రాయం కోరగా తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. అత్యధికంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 80% మంది, చిత్తూరు జిల్లాలో 60, శ్రీసత్యసాయి జిల్లాలో 62, అన్నమయ్య జిల్లాలో 60, అనంతపురం జిల్లాలో58, ఎన్టీఆర్ జిల్లాలో 53, బాపట్ల జిల్లాలో 50% మంది ప్రజలు విజ్ఞాపనల పరిష్కారం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్ల సదస్సుల్లో సీఎం సమక్షంలో అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ ఏడాది జూన్ 15 నుంచి అసంతృప్తి స్థాయి మూడునెలల్లో భారీగా పెరిగినట్లు వెల్లడైంది. ఇక రెవెన్యూ శాఖలో పరిష్కరించినట్లు చెబుతున్న అంకెలన్నీ తప్పేనని కలెక్టర్ల సదస్సుల్లోనే ఓ ఉన్నతాధికారి స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం విషయంలో లెక్కలకు, వాస్తవాలకు పొంతనలేదని కలెక్టర్ల సదస్సులో తేలడంతో సీఎం చంద్రబాబు స్పందించారు. ఎక్కడో ఫెయిల్ అవుతున్నామని వ్యాఖ్యానించారు.

ఎన్ని సమస్యలో..!

→ మదనపల్లెవాసి మురళీకి కురబలకోట సర్వే నెంబర్ 1913/2ఎలో 3.39, 1913/3లో 1.50 ఎకరాలు భూమి ఉంది. 1958లో మురళీ తాత దువ్వూరి రామన్న పేరుతో ఉన్న భూమి ఆయన మృతి తర్వాత 1994లో వారసత్వంగా మురళీ పేరుతో రికార్డుల్లోకి ఎక్కింది. దీనికి పక్కనే ఉన్న మరో యజమాని మురళీ భూమిని ఆక్రమించాడు. సర్వే చేసి తన భూమికి హద్దులు తేల్చాలని రెండేళ్లుగా మురళీ సబ్ కలెక్టర్ ఆఫీసు చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు.

→ చిత్తూరు రూరల్ దిగువమాసాపల్లికి చెందిన తులసికి సర్వే నెంబర్ 183లో ఇంటి స్థలం ఇచ్చారు. ఆమె స్థలాన్ని రెవెన్యూ అధికారులు మరొకరికి పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చారు. తన స్థలం మరొకరికి ఎలా ఇస్తారని బాధితురాలు ప్రతి వారం తహసీల్దార్ చుట్టూ తిరుగుతున్నా ఉపయోగం లేకపోవడంతో పీజీఆర్ఎస్‌ను ఆశ్రయించింది. అయినా సమస్య పరిష్కారం కాలేదు.

→ కృష్ణా జిల్లా కంకిపాడు మండలం కుందేరు వాసి షేక్ ఆదాం షరీఫ్ ఇంటి స్థలం, ఇల్లు తొలగించి 2015లో రైవస్ కాలువపై వంతెన నిర్మించారు. ఆయనకు నష్ట పరిహారం చెల్లిస్తామని స్థలం తీసుకున్నారు. పీజీఆర్ఎస్‌తో పాటు మంగళగిరిలో ప్రజా దర్బార్‌కు వెళ్లినా షరీఫ్‌కు పరిహారం దక్కలేదు.

→ కృష్ణాజిల్లా కోడూరు మండలం లింగారెడ్డిపాలెం వాసి విజయభాస్కరరావుకు 3 ఎకరాల పొలం ఉంది. గతంలో చంద్రబాబు ప్రభుత్వం దాన్ని చుక్కల భూముల జాబితాలోకి చేర్చడంతో బ్యాంకు రుణాలు తీసుకోలేక ఇబ్బందులు పడ్డాడు. అనంతరం జగన్ ప్రభుత్వం ఆ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించింది. ఇప్పుడు తిరిగి చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ వాటికి చుక్క పెట్టింది. కళ్లెదుట మూడు ఎకరాల పొలం ఉన్నప్పటికీ ఎందుకూ ఉపయోగ పడటం లేదని, నిషేధ జాబితా నుంచి తొలగించాలని బాధితుడు మొర పెట్టుకుంటున్నాడు.

→ శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం కాలసముద్రం వాసి ప్రభాకర్‌కు సర్వే నంబర్ 201–7లో వారసత్వంగా సంక్రమించిన 27 సెంట్ల స్థలం ఉంది. ఉపాధి కోసం ఆయన కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో ఉండటంతో ప్రభాకర్ సమీప బంధువు ఆ భూమిని తన పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నాడు. అక్కడ సెంటు రూ.6 లక్షలు వరకు ఉంది. రెవెన్యూ అధికారులకు డబ్బులు ఇచ్చి రూ.1.62 కోట్ల ఆస్తిని కబ్జా చేశారు. తన భూమిని ఇవ్వాలని ఏడాదిన్నరగా ప్రభాకర్ రికార్డులతో రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు. ఈ నెల 15న శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్‌లో బాధితుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు.

పట్టా ఇచ్చారు.. భూమి ఎక్కడ?

నా భర్త సింహాచలం కల్లుగీత కార్మికుడు. కొన్నేళ్ల క్రితం ప్రమాదంలో చనిపోయారు. ప్రభుత్వం సర్వే నెంబర్ 23పీలో నాకు 0.80 ఎకరాల భూమి ఇచ్చింది. పట్టాదారుపాసు పుస్తకం ఇచ్చారు. అడంగల్‌లో కూడా నా పేరు ఉంది. ఆ భూమి ఎక్కడ ఉందో చూపించి హద్దులు తేల్చాలని రెవెన్యూ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా. కలెక్టరేట్‌లో కూడా అర్జీలు ఇస్తున్నా నా సమస్య తీరడం లేదు.

– అప్పమ్మ, ఏవో అగ్రహారం, ఎచ్చెర్ల మండలం, శ్రీకాకుళం జిల్లా

ఊరికి దూరంగా బతుకుతున్నా

నాకు మా గ్రామంలోని సర్వే నెంబర్ 203లో 16 సెంట్ల స్థలం ఉంది. అందులో ఇల్లు కూడా ఉంది. ఈ స్థలాన్ని ఓ వ్యక్తి కబ్జా చేసి నన్ను రానివ్వడం లేదు. నాలుగు నెలల క్రితం నేను ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో దాడి చేసి చంపాలని చూశారు. అప్పటి నుంచి ఊరికి దూరంగా బతుకుతున్నా. గ్రామసభలో చెప్పినా ఫలితం లేదు. నా పేరుతోనే స్థలం డాక్యుమెంట్లు ఉన్నా ఏమిటీ అన్యాయం? అధికారులకు విన్నవించినా ఫలితం లేదు.

– వారి పెద్దిరెడ్డి, ఏట్రవారిపాలెం, కర్లపాలెం మండలం, బాపట్ల జిల్లా

కలెక్టర్‌కు చెప్పినా..

మా నాన్న మంగలి నారాయణ పేరుతో సర్వే నంబర్ 893లో 1.43 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఏడాది క్రితం నుంచి ఈ పొలం తమదంటూ 892 సర్వే నంబర్‌లో ఉంటున్న జగదీష్ గొడవ పడుతున్నాడు. ఈ ఏడాది ఖరీఫ్‌లో మేం సాగు చేసిన పంటను దౌర్జన్యంగా తొలగించాడు. పొలం సర్వే చేసి సమస్య పరిష్కరించాలని ఏడాదిగా తహసీల్దార్, ఆర్డీవోతో పాటు పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు వినతి పత్రాలు ఇస్తున్నా ఫలితం లేదు. ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు.

– మంగలి తిరుపతయ్య, బేతంచెర్ల, నంద్యాల జిల్లా

'పచ్చ'గా.. యథేచ్ఛగా

'అశోక' వనంలో పేకాట

రిక్రియేషన్ ముసుగులో భారీ క్లబ్ నడుపుతున్న టీడీపీ నేత

- చినబాబు మనుషులమంటూ హడావుడి
- హైకోర్టు ఆర్డర్ ఉందంటూ ఫ్లెక్సీ ఏర్పాటు
- రెండు నెలలుగా ఆగిరిపల్లిలోని మామిడి తోటలో పేకాట దందా
- పోలీసుల దాడిలో 281 మంది జూదరుల అరెస్టు
- రూ.32 లక్షల నగదు స్వాధీనం

సాక్షి ప్రతినిధి, ఏలూరు/నూజివీడు: తెలుగు తమ్ముళ్లు పేకాట డాన్లుగా మారిపోయారు. పచ్చని మామిడి తోటల మధ్య రిక్రియేషన్ క్లబ్ ముసుగులో భారీ జూద శిబిరం నిర్వహణకు తెరతీశారు. స్థానికుల నిరసనలు, ఇతరత్ర అంశాలను లెక్కచేయకుండా లోకేశ్ బాబు టీమ్ అంటూ హడావుడి చేశారు. స్థానిక మంత్రి నుంచి లోకేశ్ వరకు అందరి అండదండలతోనే క్లబ్ నిర్వహిస్తున్నామంటూ జూదరుల వద్ద ప్రచారం చేశారు. పోలీసుల దాడులు, కేసులు ఉండవని చెప్పడంతోపాటు హైకోర్టు ఉత్తర్వులకు లోబడి పేకాట నిర్వహిస్తామంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేసి మరీ నిర్వహిస్తున్న క్లబ్‌పై ఆదివారం సాయంత్రం పోలీసులు మెరుపుదాడి చేశారు. కట్ చేస్తే.. 4 జిల్లాలకు చెందిన 281 మంది జూదరులు అరెస్టయ్యారు. 130 కార్లు, 40 బైక్‌లను సీజ్ చేసిన పోలీసులు చివరికి మాత్రం రూ.32 లక్షలు నగదును మాత్రమే గుర్తించినట్టు ప్రకటించారు. ఆగిరిపల్లి మండలం పోతవరప్పాడులో 20 ఎకరాల మామిడి తోటలో మ్యాంగో బై కల్చరల్ అండ్ రిక్రియేషన్ సొసైటీ కిలారు అప్పారావు అధ్యక్షుడిగా ఏర్పాటైంది. 2011 నుంచి 2018 వరకు రిక్రియేషన్ ముసుగులో అడపాదడపా పేకాట శిబిరాలు నిర్వహించారు. 2019 ప్రారంభంలో రెండు మూడు సార్లు పోలీసులు దాడులు చేసి కేసులు నమోదు చేయడంతో క్లబ్‌ను మూసివేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 2019లో రిట్ పిటిషన్ 18807/2019 నంబర్‌తో పేకాటకు అనుమతించాలని కోర్టు నుంచి ఉత్తర్వులు తీసుకువచ్చారు. ఉత్తర్వులను సాకుగా చూపి భారీ జూద శిబిరం ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జూదశిబిరం ప్రారంభం కాకుండా ఉక్కుపాదం మోపింది. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే క్లబ్ ప్రారంభించడానికి భారీ లాబీయింగ్‌కు తెర తీశారు. ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా ఉన్న కాట్రగడ్డ అశోక్ కుమార్ రింగ్ లీడర్‌గా మారి పేకాట క్లబ్‌ను ఈ ఏడాది అక్టోబర్ 28న ప్రారంభించడానికి సన్నాహాలు చేశాడు. ఈ క్రమంలో ఆగిరిపల్లి యువకులు నిరసనలు, ఆందోళనలు చేయడంతో నిలిచిపోయింది. మళ్ళీ వారం రోజుల వ్యవధిలో నవంబర్ మొదటి వారంలో ప్రారంభించారు. ప్రారంభానికి ముందే నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి కొలుసు పార్థసారథి మొదలుకొని స్థానిక పోలీసుల వరకు అందరితో మాట్లాడేసి అందరినీ చక్కబెట్టామని చెప్పి పేకాట ప్రారంభించారు. జూదరులు క్లబ్‌కు రావడానికి వీలుగా క్లబ్ వద్ద హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం కల్చరల్ రిక్రియేషన్ సొసైటీ నడుస్తోందంటూ కోర్టు కేసుల నంబర్ల వివరాలు సహా క్లబ్ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా, కృష్ణా, గుంటూరు, ఉభయగోదావరి జిల్లాల నుంచి జూదరులకు ప్రత్యేకంగా సమాచారమిచ్చి క్లబ్‌కు వచ్చేలా ఏర్పాటు చేసి దాదాపు 55 రోజులకుపైగా నిర్వహించారు. రూ.10 వేల నుంచి లక్ష వరకు వారాంతాల్లో వీటితో పాటు రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు 26 టేబుళ్లు ఏర్పాటు చేశారు. నగదు స్వీకరించి కాయిన్స్ ఇవ్వడానికి వీలుగా ఏడు డిపాజిట్ కౌంటర్లను ఏర్పాటు చేసి రోజూ కోట్లలో పేకాట నిర్వహిస్తున్నారు. దీనికి గాను స్థానిక ఎస్ఐ నుంచి మంత్రి వరకు నెలవారీ ముడుపులు చెల్లిస్తున్నామని క్లబ్‌లో బహిరంగంగా చెబుతున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో పక్కా సమాచారంతో పోలీసులు మెరుపుదాడి చేసి సొసైటీ అధ్యక్షుడు కిలారు అప్పారావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ కాట్రగడ్డ అశోక్‌కుమార్‌తోపాటు 281 మంది జూదరులను అరెస్టుచేశారు.

లోకేశ్ సన్నిహితుడిగా ప్రచారం

విజయవాడ నగరానికి చెందిన కాట్రగడ్డ అశోక్ కుమార్ టీడీపీలో క్రియాశీలక నాయకుడు. మంత్రి లోకేశ్ సొంత మనిషినంటూ ఆగిరిపల్లిలో విస్తృత ప్రచారం చేసుకున్నాడు. గతంలో యువగళం పాదయాత్రలో కూడా పాల్గొన్నాడు. అరెస్టు నేపథ్యంలో 15 రోజుల్లో మళ్ళీ క్లబ్ ప్రారంభిస్తానని, అందరికీ తన సంగతి తెలుసునంటూ పోలీసుల వద్ద మాట్లాడినట్టు సమాచారం. ఆదివారం రాత్రి మెరుపు దాడి నిర్వహించి రూ.32 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. జూదరుల పూర్తి వివరాలు అన్నీ క్లబ్‌లోనే పూర్తి చేసి సోమవారం రాత్రి కోర్టుకు హాజరుపరిచారు.

మంత్రి లోకేశ్‌తో క్లబ్ నిర్వాహకుడు కాట్రగడ్డ అశోక్ (ఫైల్)

మ్యాంగో బే క్లబ్‌లో పట్టుబడిన పేకాటరాయుళ్లు

జూదరుల తరఫున ఆందోళన

జూదరులపై సెక్షన్ 3 అండ్ 4 గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ తెలిపారు. అక్కడ ఉన్న సామగ్రిని స్వాధీనం చేసుకుని కోర్టు ముందు ప్రవేశపెడతామని పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం జంగారెడ్డిగూడెం ఏఎస్పీ సుస్మిత రామనాథన్ మ్యాంగో బే క్లబ్ వద్దకు వచ్చి ఐదు బస్సుల్లో జూదరులను నూజివీడు కోర్టుకు తరలించారు. అయితే 24 గంటలు గడిచినా మ్యాంగో బే క్లబ్‌లో పేకాట ఆడుతూ పట్టుబడిన వారిని కోర్టులో హాజరు పరచకపోవడంపై జూదరుల తరఫున కొందరు రోడ్డుపై ఆందోళనకు దిగారు.

రబీలోనూ తప్పని యూరియా కష్టాలు

ఖరీఫ్‌లోనే కాదు రబీలోనూ రైతులను యూరియా కష్టాలు వెంటాడుతున్నాయి. చంద్రబాబు ప్రభుత్వ అలసత్వం రైతన్నకు శాపంగా మారింది. ఆర్ఎస్‌కేలు, ప్రైవేటు దుకాణాల వద్ద యూరియా కోసం పడిగాపులు పడుతున్నారు. మరోపక్క అధికారులు యూరియా కొరత లేదని గొప్పలు చెబుతున్నారు. విజయనగరం జిల్లా గుర్ల మండలం కోటగండ్రేడులోని ఓ ప్రైవేటు దుకాణం వద్ద సోమవారం యూరియా విక్రయిస్తున్నారన్న సమాచారంతో 500 మంది రైతులు గుమిగూడారు. గంటల తరబడి నిరీక్షించారు. తీరా ఒక్క బస్తాకూడా విక్రయించకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరిగారు.

– గుర్ల

కలెక్టరేట్‌లోనే కరెంట్ కట్

చంద్రబాబు పాలనలో ఒకప్పుడు కొవ్వొత్తుల వెలుగుల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేస్తే.. ఇప్పుడు ఆ ట్రెండ్ మారి సెల్‌ఫోన్ వెలుగుల్లో పనులు చేయాల్సిన దుస్థితి దాపురించింది. సోమవారం విశాఖ కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్ ఇందుకు వేదికైంది. జేసీ మయూర్ అశోక్ ప్రజల నుంచి వినతులు తీసుకుంటుండగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో సిబ్బంది సెల్‌ఫోన్లలోని టార్చ్‌లైట్స్ ఆన్ చేయగా.. ఆ వెలుతురులోనే జేసీ వినతులు స్వీకరించారు. ఆ సమయంలో గ్రీవెన్స్‌లో ఈపీడీసీఎల్ ఎస్ఈ శ్యామ్‌బాబు ఉండటం కొసమెరుపు.

– సాక్షి, విశాఖపట్నం

26న కొత్త 'ఉపాధి' చట్టంపై ప్రత్యేక గ్రామసభలు

సాక్షి, అమరావతి: ప్రస్తుతం అమల్లో ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కేంద్రం కీలక మార్పులు చేసి కొత్తగా వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ పేరుతో చేపట్టే కార్యక్రమంపై ప్రజలకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పించేందుకు 26న అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభ నిర్వహించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు అన్ని రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులకు సూచించారు. మార్పులతో కూడిన కొత్త ఉపాధి చట్టానికి రాష్ట్రపతి కూడా ఆమోదం తెలపడంతో సోమవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు రాష్ట్రాల ప్రతినిధులకు కొత్త చట్టంలోని ప్రధాన ప్రతిపాదనలను గురించి వివరించారు. ప్రతి కుటుంబానికి ఏటా ప్రస్తుతం వంద పనిదినాలకు మాత్రమే అవకాశం ఉండగా, కొత్త చట్టంలో ఏడాదికి 125 పనిదినాలకు అవకాశం ఉన్న అంశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. కాగా కొత్త ఉపాధిహామీ పథకంపై 26న రాష్ట్రంలో అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధికారులు వెల్లడించారు.

కేబినెట్ సమావేశం 29కి వాయిదా

సాక్షి, అమరావతి: ఈ నెల 24న జరగాల్సిన కేబినెట్ సమావేశాన్ని 29వ తేదీకి వాయిదా వేస్తూ సీఎస్ కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులిచ్చారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన 29న ఉదయం 10.30 గంటలకు సచివాలయంలోని మొదటి బ్లాకులో కేబినెట్ భేటీ జరుగుతుందని పేర్కొన్నారు.

రూ.350 కోట్ల బకాయిలు ఎప్పుడిస్తారు?

చంద్రబాబు ప్రభుత్వంపై మండిపడిన చిత్తూరు మామిడి రైతులు | **పోలీసులను ఉసిగొల్పి తమను అణచివేస్తోందని ఆగ్రహం**

కిలోకు రూ.8 చొప్పున వెంటనే చెల్లించాలంటూ కలెక్టరేట్ ఎదుట మామిడి రైతుల ధర్నా

చిత్తూరు కలెక్టరేట్: ''ఆశించిన స్థాయిలో పంట చేతికొస్తే గిట్టుబాటు ధర లేకుండా చేశారు. తోతాపురి కిలోకు ఫ్యాక్టరీలు రూ.8, ప్రభుత్వం రూ.4 చొప్పున మొత్తం రూ.12 చెల్లిస్తామని మాటిచ్చాయి. 4.30 లక్షల టన్నుల పంటను ఫ్యాక్టరీలకు పంటను తోలి ఏడు నెలలవుతోంది. ఇంకా బకాయిలు చెల్లించ లేదు. నాయకులకు చెప్పినా, ఫ్యాక్టరీల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. బకాయిలు అడుగుతుంటే ప్రభుత్వం పోలీసులను ఉసిగొల్పి గొడవలు పెట్టుకునేలా చేస్తోంది. ఇది ఎంతవరకు సమంజసం చంద్రబాబూ?'' అని మామిడి రైతులు మండిపడ్డారు. వెంటనే బకాయిలు చెల్లించాలంటూ రైతు సంఘం నాయకులు, రైతులు సోమవారం చిత్తూరు కలెక్టరేట్‌ను ముట్టడించి ధర్నా నిర్వహించారు. మిన్నంటేలా నినాదాలు చేశారు. సమస్య చెప్పుకొనేందుకు ధర్నా చేస్తుంటే పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. మైక్ పెట్టకుండా అడ్డుకోవడంతో వాగ్వాదం జరిగింది. అనంతరం రైతులు మాట్లాడుతూ... మళ్లీ మామిడి సీజన్‌కు పెట్టుబడుల సమయం వచ్చిందని, పరిశ్రమలు బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏడు నెలలుగా ఇవ్వకపోవడం దుర్మార్గంగా అభివర్ణించారు. కిలోకు రూ.8 ఇవ్వని ఫ్యాక్టరీలను సీజ్ చేస్తామని కలెక్టర్ హెచ్చరించారని గుర్తుచేశారు. ఇప్పటికి ఆరుసార్లు కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించామని పేర్కొన్నారు.

ఫ్యాక్టరీలకు కొమ్ముకాస్తున్న చంద్రబాబు ప్రభుత్వం

చిత్తూరు జిల్లాలోని 40 మామిడి ఫ్యాక్టరీలకు కొమ్ముకాస్తూ 40 వేల మందిని చంద్రబాబు ప్రభుత్వం రోడ్డున పడేసిందని రైతులు నిప్పులు చెరిగారు. ఫ్యాక్టరీ యాజమాన్యాలు కచ్చితంగా కిలోకు రూ.8 ఇస్తాయని చిత్తూరు కలెక్టర్ ఉత్తర్వులిచ్చారని, అవి అమలుకు నోచుకోనే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. 40 ఫ్యాక్టరీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని శాసిస్తున్నాయా? అని నిలదీశారు. తమను మోసగిస్తే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

అధిక సంఖ్యలో పాల్గొన్న రైతులు..

చిత్తూరు కలెక్టరేట్ వద్ద ధర్నాకు పలు ప్రాంతాల నుంచి రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లా మామిడి రైతుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మునీశ్వరరెడ్డి, మురళీ, ఉపాధ్యక్షులు హేమలత, నాయకులు రామానాయుడు రైతులతో పాటు ఆందోళనలో పాల్గొన్నారు. పరిశ్రమల వద్ద నిల్వ ఉన్న మామిడి పల్ప్‌ను టీటీడీ, విద్యార్థులు మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు సూచించారు. రైతులను మోసగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ధర్నా అనంతరం కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీకి వినతిపత్రం అందజేశారు.

సంక్రాంతి వరకు సమయం ఇస్తున్నాం

ఫ్యాక్టరీలు ఇవ్వాల్సిన రూ.8 నగదు చెల్లించేందుకు సంక్రాంతి వరకు సమయం ఇస్తున్నామని రైతులు తెలిపారు. ఆలోపు డబ్బు వేయకపోతే గ్రామాల్లో ఎక్కడికక్కడ రోడ్లపై బైఠాయిస్తామని హెచ్చరించారు. ''మామిడి పంటను నమ్ముకున్న మేము దారుణ స్థితిలో ఉన్నాం. పంటను అమ్ముకోలేక, అమ్మిన పంటకు డబ్బు చేసుకోలేక తీవ్రంగా నష్టపోతున్నాం. ఈ ఏడాది గిట్టుబాటు ధర పొందలేకపోయాం. ఫ్యాక్టరీలపై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు అజమాయిషీ చేయడం లేదు? రూ.350 కోట్లకు పైగా ఉన్న ఫ్యాక్టరీల బకాయిలపై ఎందుకు నోరు మెదపడం లేదు. పంటను తోలాక 15 రోజుల్లో రైతులకు డబ్బులు చెల్లించాలి. దానిని పాటించకుండా మా కష్టాన్ని దోచుకుంటున్నారు'' అని వాపోయారు.

నగదు ఎందుకివ్వరు..?

ఫ్యాక్టరీ యజమానులు నగదును ఎందుకు ఇవ్వడం లేరు? ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో ఫ్యాక్టరీల యజమానులు డబ్బు వేయలేదు. మరి ఇంకెప్పుడు ఇస్తారు...? మొదట్లో ఒక మాట మామిడి పంట ఫ్యాక్టరీలకు తోలిన తర్వాత మరో మాట చెప్పి మోసగించడం దారుణం. ఏటా ఇదే తంతు. పటిష్ట చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. కలెక్టర్ చొరవ తీసుకోవాలి.

– త్యాగరాజులురెడ్డి, మామిడి రైతు

నెలలు గడుస్తున్నా స్పందించరా?

కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం రైతులకు ఫ్యాక్టరీ యజమానులు కిలోకు రూ.8 ఇచ్చి తీరాల్సిందే. తప్పుచేస్తే సహించేది లేదు. నెలలు గడుస్తున్నా నగదు ఇవ్వకపోవడంతో ఆందోళన చేపడుతున్నాం. సంక్రాంతిలోగా బకాయిలు చెల్లించకపోతే ఉద్యమం ఉద్ధృతం చేస్తాం.

– మురళీ, మామిడి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ఊరుకునేది లేదు

రైతులను మోసం చేస్తే ఊరుకునేది లేదు. మాకు ఇచ్చిన మాట ప్రకారం కచ్చితంగా రూ.8 చొప్పున ఇవ్వాలి. ర్యాంపులలో అతి తక్కువగా రేట్లు ఇచ్చారు. వాటన్నింటినీ పరిశీలించి రూ.8 చెల్లించేలా చర్యలు చేపట్టాలి. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తాం. జిల్లాలోని 40 ఫ్యాక్టరీల యజమానులు నగదు చెల్లించేలా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి.

– ఉమాపతినాయుడు, మామిడి రైతు

నేడు పులివెందులకు వైఎస్ జగన్

మూడు రోజుల పర్యటన

సాక్షి, అమరావతి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 23 నుంచి మూడు రోజులపాటు వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో పర్యటించనున్నారు. ఆయన మంగళవారం సాయంత్రం 4 గంటలకు పులివెందుల చేరుకుని భాకరాపురం క్యాంప్ ఆఫీస్‌లో ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. రాత్రికి అక్కడి నివాసంలో బస చేస్తారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు పులివెందుల నుంచి ఇడుపులపాయకు చేరుకుని ప్రేయర్ హాల్‌లో జరిగే క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఇడుపులపాయ నుంచి బయలుదేరి పులివెందుల చేరుకుని భాకరాపేట క్యాంప్ ఆఫీస్‌లో ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. రాత్రికి అక్కడి నివాసంలో బస చేస్తారు. గురువారం ఉదయం 8.30 గంటలకు క్రిస్మస్ సందర్భంగా సీఎస్ఐ చర్చిలో జరిగే వేడుకల్లో పాల్గొంటారు.

మంత్రి ఉన్నంత వరకు టీడీపీ సోషల్ మీడియా కార్యకర్తల కొనసాగింపు

గతంలో ప్రతి మంత్రికీ ఏడాది కాలానికి ఇద్దరేసి సోషల్ మీడియా కార్యకర్తలు

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఉపాధి కల్పించడంలో భాగంగా ప్రతీ మంత్రికి ఇద్దరు సోషల్ మీడియా కార్యకర్తలను ఏడాదిపాటు నియమించిన ప్రభుత్వం ఇప్పుడు ఆ కాలాన్ని మంత్రి పదవి ఉన్నంతకాలం కొనసాగే విధంగా మార్పు చేస్తూ సవరణ ఉత్తర్వులను జారీచేసింది. ప్రతి మంత్రి పేషీలో ఒక సోషల్ మీడియా ఎగ్జిక్యూటివ్, సోషల్ మీడియా అసిస్టెంట్లను నియమిస్తూ గతేడాది డిసెంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఔట్‌సోర్సింగ్ విధానంలో ఏడాది కాలానికి నియమిస్తున్నట్టు అప్పటి ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇప్పుడు వీటిని మంత్రి పదవిలో కొనసాగినంత కాలం లేదా అవసరం ఉన్నంత వరకు కొనసాగించే విధంగా సవరణ ఉత్తర్వులను జారీ చేసింది.

క్లుప్తంగా...

75% రాయితీపై ఎలక్ట్రానిక్ యూనిట్స్‌కు భూములు

సాక్షి, అమరావతి: ఎలక్ట్రానిక్స్ తయారీ యూనిట్లకు 75 శాతం రాయితీ ధరలపై రాష్ట్ర ప్రభుత్వం భూములను కేటాయించనుంది. అదేవిధంగా ఏపీఐఐసీ అభివృద్ధి చేసిన భవనాల్లో ఏర్పాటయ్యే ఎలక్ట్రానిక్ కంపెనీలకు మూడేళ్ల పాటు అద్దెలో 50 శాతం మినహాయింపు ఇవ్వనున్నారు. ఈ మేరకు ఏపీ ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ పాలసీ 2024–29 విధివిధానాలను రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ సోమవారం విడుదల చేశారు. రూ.1,000 కోట్ల పెట్టుబడి పెట్టి ఐదేళ్లలో కనీసం 1,000 మందికి ఉపాధి కల్పించే సంస్థలకు టైలర్‌మేడ్ కింద మరిన్ని రాయితీలను ఇవ్వనున్నారు. ఐదేళ్లలో కనీసం రూ.250 కోట్ల పెట్టుబడి పెట్టే మొదటి 10 పెట్టుబడి ప్రతిపాదనలకు ఎర్లీబర్డ్ ప్రోత్సాహకం పేరిట 50 శాతం క్యాపిటల్ సబ్సిడీ ఇవ్వనున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎలక్ట్రానిక్స్ కాంపొనెంట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కీం (ఈసీఎంఎస్) కింద ఎంపికైన కంపెనీలకు 100 శాతం మ్యాచింగ్ సబ్సిడీ ఇవ్వనున్నారు. మొత్తం ప్రాజెక్టు వ్యయంలో ప్రోత్సాహకాల విలువ 75 శాతం మించకుండా పరిమితి విధించారు.

ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో మందుల కొరత

బీచ్ రోడ్డు (విశాఖ): ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో బీ కాంప్లెక్స్ టాబ్లెట్లు అందుబాటులో లేవు. ఈ విషయాన్ని ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన రాష్ట్ర ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సౌరబ్ గౌర్ గుర్తించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన విశాఖలోని మానసిక ఆస్పత్రి ఓపీ, స్టోర్స్, ఫార్మసీ విభాగాలను తనిఖీ చేశారు. మానసిక ఆస్పత్రిలో సైకియాట్రిక్ రోగులకు అవసరమైన మందులు లేకపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం బీ కాంప్లెక్స్ మందులు కూడా ఉండకపోతే ఎలా అంటూ సూపరింటెండెంట్‌పై మండిపడ్డారు. మందుల కొరతపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వైద్యులు పనితీరు మెరుగుపర్చుకోవాలని.. లేదంటే కఠిన చర్యలకు వెనుకాడేది లేదని హెచ్చరించారు.

కేజీ బేసిన్‌లో చమురు వెలికితీతకు 'వేదాంత'కు అనుమతి

- కృష్ణా జిల్లాలో 20 చోట్ల బావుల తవ్వకానికి గ్రీన్ సిగ్నల్
- పలు షరతులతో ఎన్వోసీ జారీ
- సాగు నీరు, భూగర్భ జలాలను కలుషితం చేస్తే ఎన్వోసీ రద్దు చేస్తామని హెచ్చరిక

సాక్షి, అమరావతి: కృష్ణా గోదావరి (కేజీ) బేసిన్ పరిధిలో కృష్ణా జిల్లాలో 20 ప్రాంతాల్లో గ్యాస్ నిక్షేపాల వెలికితీతకు వేదాంత లిమిటెడ్ సంస్థకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కృష్ణా జిల్లా నిడుమోలు వద్ద 3, గూడూరు వద్ద 3 ప్రాంతాల్లో బావులు తవ్వుతారు. మద్దిపట్ల, కాజ, రాయవరం వద్ద రెండేసి చోట్ల, తరకటూరు, కంచకోడూరు, ఆవురుపూడి, కలపటం, ముక్కొల్లు, పినగూడురు లంక, నరికేడ్లపాలెం, మల్లవోలులో ఒక్కో బావికి అనుమతిస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ సోమవారం నిరభ్యంతర ధృవీకరణ పత్రం (ఎన్వోసీ) జారీ చేశారు. చిన్న క్షేత్రాల్లో చమురు, సహజవాయు నిక్షేపాల వెలికితీత (డీఎస్ఎఫ్) విధానం–2018 కింద కృష్ణా జిల్లాలోని కేజీ/ఓఎన్‌డీఎఫ్/కాజా/2018 బ్లాక్‌లో ఈ బావుల పనులను వేదాంత పొందింది. ఈ పనులు చేపట్టేందుకు అనుమతి కోరుతూ ఏప్రిల్ 16న వేదాంత సంస్థ దరఖాస్తు చేసుకోగా, దానిపై కృష్ణా డెల్టా సీఈ, జలవనరుల శాఖ ఈఎన్‌సీ పంపిన ప్రతిపాదనకు జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆమోదముద్ర వేశారు. కంపెనీ కార్యకలాపాల వల్ల ఉత్పన్నమయ్యే చట్టపరమైన వివాదాలు, కోర్టు కేసులు, ప్రజా అభ్యంతరాలు, శాంతి భద్రతల సమస్యలను జలవనరుల శాఖ పరిగణనలోకి తీసుకోదని, ఇటువంటి విషయాల్లో ఆ శాఖను పార్టీగా చేయకూడదని స్పష్టం చేశారు. సాగునీటి వనరులు, భూగర్భ జలాలను కలుషితం చేస్తే ఎన్వోసీని రద్దు చేస్తామని ఉత్తర్వుల్లో స్పష్టం చేస్తూ.. పలు షరతులు విధించారు.

ఇవీ షరతులు

- కాలువలు, చెరువులు వంటి సాగు నీటి వనరులకు 500 మీటర్ల వ్యాసార్థంలో ఎటువంటి బావులు తవ్వకూడదు.
- కాలువలు, చెరువులు తదితర సాగు నీటి వనరులపై ఎలాంటి శాశ్వత కట్టడాలను నిర్మించకూడదు. ఈ వనరులకు ఏవైనా ఆటంకం జరిగితే.. వాటికి మరమ్మతులను వేదాంత సంస్థే చేయాల్సి ఉంటుంది.
- వ్యర్థాలను సాగునీటి కాలువలు, డ్రెయిన్‌లు, భూగర్భంలోకి వదలకూడదు.
- బందరు కెనాల్, కృష్ణా డెల్టా కాలువల వ్యవస్థ, డ్రెయిన్‌లు, జలాశయాలు, చెరువులు వంటి ఉపరితల సాగు నీటి వనరుల నుంచి నీటిని వాడుకోకూడదు. వాల్టా చట్టానికి లోబడి భూగర్భ జలాలను మాత్రమే వాడుకోవాలి.
- చమురు, సహజ వాయువు వెలికితీతపై గ్రామాల ప్రజలు, సంఘాలు, సామాజిక కార్యకర్తల నుంచి అభ్యంతరాలు, నిరసనలకు అవకాశం ఉంటే.. జిల్లా కలెక్టర్ నుంచి అవసరమైన అన్ని అనుమతులు పొందాలి.

న్యాయవాదులకు ఆర్థిక సాయం

దరఖాస్తులన్నింటినీ పరిష్కరించిన న్యాయవాదుల సంక్షేమ నిధి కమిటీ

సాక్షి, అమరావతి: న్యాయవాదుల మరణానంతర ప్రయోజనాల నిమిత్తం నామినీలు సమర్పించిన దరఖాస్తులన్నింటినీ రాష్ట్ర బార్ కౌన్సిల్ న్యాయవాదుల సంక్షేమ నిధి కమిటీ పరిష్కరించింది. అనారోగ్యంతో బాధపడుతున్న న్యాయవాదులు ఆర్థిక సాయం కోసం పెట్టుకున్న దరఖాస్తులను, పదవీ విరమణ ప్రయోజనాల నిమిత్తం చేసుకున్న దరఖాస్తులన్నింటినీ కూడా సంక్షేమ నిధి కమిటీ పరిష్కరించింది. మొత్తం రూ.5.60 కోట్లను ఆర్థిక సాయం కింద అందించింది. బార్ కౌన్సిల్ చైర్మన్, సంక్షేమ నిధి కమిటీ చైర్మన్ ఎన్.ద్వారకనాథరెడ్డి అధ్యక్షతన సోమవారం సమావేశం జరిగింది. సమావేశంలో సంక్షేమ నిధి కమిటీ సభ్యులు ముప్పాళ్ల సుబ్బారావు, పి.నర్సింగరావు, హైకోర్టు ప్రతినిధులు, న్యాయ శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు. మొత్తం 54 మంది న్యాయవాదుల మరణానంతర ప్రయోజనం కింద వారి కుటుంబ సభ్యులకు రూ.3.51 కోట్లు చెల్లించారు. అనారోగ్యంతో బాధపడుతున్న 137 మంది న్యాయవాదులకు రూ.1.90 కోట్లు, ఏడుగురు న్యాయవాదులకు పదవీ విరమణ ప్రయోజనాల కింద రూ.19.20 లక్షలు చెల్లించారు. న్యాయవాదుల సంక్షేమం కోసం చొరవ తీసుకుని పెద్ద మొత్తం నిధులు వెచ్చించినందుకు బార్ కౌన్సిల్ చైర్మన్ ద్వారకనాథరెడ్డికి న్యాయవాదులు కృతజ్ఞతలు తెలిపారు.

కదం తొక్కిన సీఆర్‌ఎంటీలు

విజయవాడ ధర్నా చౌక్‌లో ఆత్మగౌరవ దీక్ష

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమగ్రశిక్ష క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్లు (సీఆర్‌ఎంటీ) కదం తొక్కారు. స్కూల్ అసిస్టెంట్ అర్హతలతో విద్యాశాఖలో పనిచేస్తున్న వారంతా ఏపీ సీఆర్‌ఎం టీచర్స్ యునైటెడ్ ఫోరం ఆధ్వర్యంలో విజయవాడలోని ధర్నా చౌక్‌లో సోమవారం ఆత్మగౌరవ దీక్ష చేపట్టారు. తొలుత సీఆర్‌ఎం టీచర్లు ఏలూరు లాకుల సెంటర్ నుంచి ధర్నా చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వేతనాలు పెంచాలని, మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, ట్రావెలింగ్ అలవెన్స్ ఇవ్వాలని, డీఎస్సీలో వెయిటేజ్ ఇవ్వాలనే డిమాండ్లతో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. అనంతరం చేపట్టిన దీక్షలో ఏపీ ఎన్జీఓ అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి రమణ, ఫ్యాప్టో చైర్మన్ ఎల్.సాయిశ్రీనివాస్, ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చిరంజీవి, ఎస్టీయూ అధ్యక్షుడు రఘునాథరెడ్డి, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్, పీఆర్‌టీయూ అసోసియేట్ అధ్యక్షుడు మర్రి ప్రభాకర్ పాల్గొని మద్దతు ప్రకటించారు. దీక్షను ఉద్దేశించి సీఆర్‌ఎం టీచర్స్ యునైటెడ్ ఫోరం ప్రతినిధులు ఎం.కాశి, బి.నారాయణమూర్తి, పోలినాయుడు, రాంజీప్రసాద్, యు.సాయికుమార్ మాట్లాడుతూ.. డిగ్రీ, బీఈడీ, టెట్ అర్హతలు కలిగిన తాము అతి తక్కువ వేతనానికి 14 ఏళ్లుగా సమగ్ర శిక్షలో పనిచేస్తున్నామన్నారు. అర్హతకు తగిన వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్కూల్ కాంప్లెక్సులను ఏ, బీ క్లస్టర్ ప్రతిపాదిత విధానాన్ని విరమించాలని డిమాండ్ చేశారు. తొమ్మిదేళ్లుగా వేతన పెంపు లేకుండా పనిచేస్తున్నామన్నారు. అన్ని అర్హతలు ఉన్న సీఆర్‌ఎంటీలకు డీఎస్సీలో వెయిటేజ్ ఇవ్వాలని, ట్రావెలింగ్ అలవెన్సు పునరుద్ధరించాలని, సీఆర్‌ఎంటీలలో నెలకొన్న అభద్రతా భావాన్ని తొలగించి అందరికీ ఒకే విధమైన హోదాను, పనిని అప్పగించాలని డిమాండ్ చేశారు. కొన్ని జిల్లాల్లో ఖాళీ పోస్టుల్లో 50–100కిలో మీటర్ల దూరం ఉన్న వారిని మ్యాపింగ్ చేసే ప్రక్రియను విరమించాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులకు నూతన నియామకాలు చేపట్టి సీఆర్‌ఎంటీలపై అదనపు పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. సీఆర్‌ఎంటీలకు నిర్దిష్టమైన జాబ్ చార్ట్ ప్రకటించాలన్నారు. సీఆర్‌ఎంటీలను విద్యాశాఖలో విలీనం చేసి, రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

గురజాలలో ప్రజాస్వామ్యానికి తూట్లు

- కౌన్సిల్ సమావేశానికి వెళ్లకుండా చైర్‌పర్సన్‌ను అడ్డుకున్న పోలీసులు
- ఆమె సెలవులో ఉన్నారంటూ గేటు వద్దే నిలిపివేత
- కీలక సమావేశంలో ఓటు వేసేందుకు అవకాశమివ్వని అధికారులు
- వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల ఆందోళన

గురజాల: పల్నాడు జిల్లా గురజాలలో పోలీసులు ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచారు. కౌన్సిల్ సమావేశంలో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకునేందుకు బయలుదేరిన వైఎస్సార్‌సీపీకి చెందిన చైర్‌పర్సన్‌పై పోలీసులు దౌర్జన్యం చేసి అడ్డుకున్నారు. ఆమె సెలవులో ఉన్నారంటూ కౌన్సిల్ హాలు గేటు బయటే నిలిపేశారు. టీడీపీ కూటమి నేతల ఒత్తిడి మేరకు గురజాల నగర పంచాయతీ నుంచి జంగమహేశ్వరపురం గ్రామాన్ని విడదీసి ప్రత్యేక పంచాయతీగా మార్చేందుకు కౌన్సిల్ తీర్మానం కోసం సోమవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో పాల్గొనేందుకు వైఎస్సార్‌సీపీకి చెందిన చైర్‌పర్సన్ పోలు పవన్మయి రాగా, పోలీసులు అడ్డుకున్నారు. పవన్మయి కొద్దికాలం కిందట చైర్‌పర్సన్ పదవికి సెలవు పెట్టారని, ఆమె స్థానంలో మరొకరు చైర్మన్‌గా కొనసాగుతున్నారని, ముందస్తు సమాచారం లేకుండా కౌన్సిల్ సమావేశానికి హాజరై ఓటు వేయడానికి వీల్లేదని పోలీసులు గేటు బయటే నిలిపేశారు.

పవన్మయిని బలవంతంగా బయటకు తీసుకువస్తున్న పోలీసులు

ఓటు హక్కు కల్పించాలని కోరినా...

చైర్‌పర్సన్ పదవికి సెలవు పెట్టినా కనీసం తాను కౌన్సిలర్‌గా అయినా సమావేశంలో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం ఇవ్వాలని పవన్మయి కోరినా, మున్సిపల్ అధికారులు, పోలీసులు అనుమతించలేదు. దీంతో ఆమె గేటు వద్ద బైఠాయించి ఆందోళనకు దిగారు. ఆమెకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు వచ్చి పవన్మయిని సమావేశానికి అనుమతించాలని డిమాండ్ చేశారు. కానీ, పోలీసులు, మున్సిపల్ అధికారులు మాత్రం ఆమె సెలవులో ఉన్నారంటూ లోపలికి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. చాలాసేపు వాగ్వాదం అనంతరం ఆమె బయట ఉండగానే కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మొత్తం 20 మంది సభ్యులకు గాను, 18 మంది హాజరయ్యారు. గురజాల నగర పంచాయతీ నుంచి జంగమహేశ్వరపురాన్ని విడదీసి ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసే తీర్మానానికి అనుకూలంగా టీడీపీలో కొనసాగుతున్న 11 మంది, వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీకి చెందిన ఏడుగురు ఓటు వేశారు. మెజార్టీ సభ్యులు ఓటు వేయడంతో తీర్మానాన్ని ఆమోదించారు.

కౌరవ సభను తలపించిన గురజాల కౌన్సిల్

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి


మురళీధర్‌రెడ్డి

గురజాల రూరల్: పల్నాడు జిల్లా గురజాల నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం కౌరవ సభను తలపించిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, వినుకొండ, పెదకూరపాడు నియోజకవర్గాల పరిశీలకుడు యెనుముల మురళీధర్ రెడ్డి అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓ మహిళా చైర్‌పర్సన్‌ను కౌన్సిల్లోకి రానీయకపోవడం దారుణమని, గురజాల చరిత్రలో దీనిని బ్లాక్‌డేగా పరిగణించాలన్నారు. 'గురజాలకు 90 ఏళ్ల చరిత్ర ఉంది. 1999లో రాజకీయ కారణాల వల్ల గురజాల నుంచి జంగమహేశ్వరపురాన్ని విడగొట్టారు. అభివృద్ధికి ఆమడ దూరంలోఉన్న జంగమహేశ్వరపురాన్ని 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత అప్పటి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చొరవతో గురజాలలో విలీనం చేశారు. అప్పటినుంచి సుమారు రూ.22 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. టీడీపీ కూటమి అధికారం చేపట్టాక మళ్లీ జంగమహేశ్వరపురాన్ని మళ్లీ గురజాల నుంచి విడదీయాలని చూస్తోంది' అని యెనుముల విమర్శించారు. కౌన్సిల్ సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు పవన్మయిని కౌన్సిల్ బయటే అడ్డుకోవడం దారుణమని, ఇదేనా మహిళలకు ఇచ్చే గౌరవం అని ప్రశ్నించారు. 'జంగమహేశ్వరపురం గురజాలలోనే ఉండాలి. నగర పంచాయతీగా ఉంటేనే అభివృద్ధిసాధ్యం. ఎట్టి పరిస్థితుల్లోనూ గురజాల నుంచి జంగమహేశ్వరపురాన్ని విడదీయనీయం' అని స్పష్టం చేశారు. ఆరుగురు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను బెదిరింపులకు గురిచేసి టీడీపీకి మద్దతుగా చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ తీరుపై కోర్టుకు వెళ్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు కొమ్మినేని వెంకటేశ్వర్లు, కె.బుజ్జి, కె.అన్నారావు, సిద్దాడపు గాంధీ, పాల్గొన్నారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

VALEUR FABTEX — **Engagement of Vocational Trainers**

Valeur Fabtex Private Limited, invites applications from candidates with prescribed qualification & Experience for Engagement as Vocational Trainers - Agriculture & Beauty & Wellness to be engaged in Government Schools in the Andhra Pradesh

Trade	Position	Qualification
Vocational Trainer	Agriculture	Post-Graduation in Agriculture/Horticulture OR BSc/ B.Tech Agriculture/ Horticulture OR B. Voc (Bachelor of Vocation) in any Science discipline. All-inclusive Gross Honorarium ₹ 24,000/- Per month
Vocational Trainer	Beauty& wellness	Vocational Trainer Beauty & Wellness Any Graduate with Diploma in Cosmetology OR Any Graduate with Diploma in Beauty Therapy OR Any Graduate with Diploma in Beauty Culture
Vocational Coordinator	No.of Position - 1	Masters (3+2 or 4+2) with two years of experience at district level in manager/coordinator position. All-inclusive Gross Honorarium ₹ 30,000/- Per month

Pre-Requisite:
1. Candidate should be resident of Andhra Pradesh and willing to work at any location within the state.
2. Candidates must be able to read and write in Telugu and English languages.
3. Age limit 21- 37 years for VT & for VC limit 25-37 years (as of December 1, 2025)

Note: All communication for job application to be done through e-mails. All positions purely on Contractual basis. This is not a Government Job and the selection process is strictly based on merit and management reserves the right to accept/reject an application without assigning any reasons whatsoever. Last date for receipt of CV: 24 December 2025. Interested Candidates can fill the Form - https://forms.gle/41BX7M3njLv6UP5t5 or Send CV on hr1@valeurfabtex.com

INDUS EDUTRAIN — **JOB OPPORTUNITY**

an NSDC empaneled Training Partner, invites Applications from candidates with prescribed qualification & experience for deployment as Vocational Trainers in Secondary & Higher Secondary,

- Graduation in Automobile Engineering /Mechanical Engineering from a recognized Institute /University OR Diploma in Automobile Engineering/ Mechanical Engineering from a recognized Institute /University OR B.Voc (bachelor in vocational) in Automobile engineering from recognized institute / University.
- Post Graduation/Graduate/B Tech In Agriculture/Horticulture from a recognized institution / university/B.Voc (Bachelor of Vocational) in any Science discipline
- Diploma in Cosmetology/ Beauty Therapy/ Beauty Culture after graduation from a recognized Institution
- Bachelor of Engineering / Technology in Electricals OR Electronics OR Graduate with Diploma in Electronics/ OR SSC Certified on the said job role OR B.Voc (bachelor in vocational) in Electronics from recognized institute / University
- B.Sc / B.Tech / BE in Food Technology/ Food Engineering/ Food Production/ Hotel Management from a recognized Institute /University Or 3-year diploma in Hotel Management and Catering Technology from recognized (AICTE) approved University, Colleges. Or 1- year Diploma in Patisserie and bakery arts from reputed culinary Institute in India. Or 1- year craft course. Or 1 - Year Diploma in Culinary Arts with any Graduation
- B.Sc. Nursing and Midwifery (4 years) or 3½ years Diploma in GNM
- Graduate in Retail Management OR Diploma in Retail Management OR P.G. Diploma in Marketing/Retail Management OR MBA In Marketing. Preference given to higher education with MBA (Retail Marketing& Finance) and/ or PG Diploma in Retail Management.
- Masters (3+2 or 4+2) with two years of experience at district level in manager/ coordinator position, Age limit 25-37 years (as on 01.12.2025)
- Effective Communication Skills (oral and written),Basic Computing Skills, Technical Competency, Soft Skills, and Facilitation Skills.

Age Limie for Trainers 21-37 Years (As of 1st December 2025)

All communications for job applications to be done through - mails. All positions are purely on contractual basis. This is not a government job, and the selection process is strictly based on merit Only Shortlisted candidates will be called for the examination.

Scan QR for VT Application Copy paste the below link in browser https://forms.gle/6vf2LZucN6EW5uPJ7
Scan QR for VC Application Copy paste the below link in browser https://forms.gle/XZuZfpqQknedNg3F6

S.R.R PROJECTS
Recruitment of Vocational Trainers & Vocational Coordinators (On Contractual Basis)

S.R.R Projects, invites Applications from candidates with prescribed qualification & experience for deployment as Vocational Trainers in Secondary and Higher Secondary Schools and Vocational Coordinator in districts in Andhra Pradesh

Sector	Total Positions	Districts and Positions	Eligibility
Apparel, Made-ups and Home Furnishing (Vocational Trainers)	8	BAPATLA - 1,YSR KADAPA - 1 KURNOOL - 2,NANDYAL - 2 SPSR Nellore - 1,PALNADU - 1	Post-graduation in Textile & Clothing or relevant area; Graduate in Textiles and Clothing or relevant area; Diploma in Textiles and Clothing or relevant area
Automotive (Vocational Trainers)	34	BAPATLA - 6, ELURU - 2 GUNTUR - 2, YSR KADAPA -1 KRISHNA - 6, NANDYAL - 1 SPSR Nellore - 1, NTR - 5 PRAKASAM - 4, TIRUPATI - 4 WEST GODAVARI - 2	Graduation in Automobile Engineering; Graduation in Mechanical Engineering; Diploma in Automobile Engineering; Diploma in Mechanical Engineering; B.Voc (Bachelor in vocational) in Automobile engineerin
IT/ITeS (Vocational Trainers)	27	YSR KADAPA - 2, KURNOOL - 2 NANDYAL - 5 SPSR Nellore - 3 PALNADU - 4 PRAKASAM - 8 TIRUPATI - 3	BE/BTech in Computer Science; BE/BTech in Information Technology; Master of Computer Application; Master of Science in Computer Science; Master of Science in Information Technology; NIELIT "B" Level Certificate; BE/BTech in Artificial Intelligence; BE/BTech in Data Science; B.Voc (Bachelor of Vocation) in IT
(Vocational Coordinator)	3	Guntur - 1 Konaseema - 1 West Godavari - 1	Masters (3+2 or 4+2) with two years of experience at district level in manager/ coordinator position; Age limit 25-37 years (as on 01.12.2025); Gross Honorarium – Rs. 30,000/- per month
Minimum Competency	For all Posts	For all locations	Effective Communication Skills (Oral and written), Basic Computing skills, Technical Competency, Soft Skills, and Facilitation Skills

All Educational qualifications should be from the recognized university
Experience should be from the recognized institutions/organizations. For all the Post's
Note – Candidate should be Resident of Andhra Pradesh
link by 25/12/2025 till 6 PM. All Communications via E-mail only srr.amaravathi@gmail.com
All positions are purely on contractual basis and selection process is strictly based on Written test, Interview and Merit. Do not use any unfair means.
**This is not a Govt. Job. It is purely a Pvt. Job on contractual basis.

కష్టపడి పని చేయకుండా
ఏ కలనూ సాధించలేము.
- చౌధరీ చరణ్ సింగ్

సాక్షి
మంగళవారం, 23 డిసెంబర్ 2025

యూనస్ కళ్లు తెరుస్తారా!

మరో రెండు నెలల్లో ఎన్నికలు జరగబోతున్న బంగ్లాదేశ్‌లో హింస ఇప్పట్లో తగ్గుముఖం పట్టేలా కనబడటం లేదు. విద్యార్థి నాయకుడు షరీఫ్ ఉస్మాన్ హదీ హత్యతో గతవారం దేశమంతా నిరసన ప్రదర్శనలు జరిగాయి. హింస చెలరేగింది. దుస్తుల ఫ్యాక్టరీలో పనిచేస్తున్న మైనారిటీ హిందూ యువకుణ్ణి మతాన్ని కించపరిచాడన్న ఆరోపణతో కొట్టి చంపారు. 'ప్రథమ్ ఆలో', 'ద డైలీ స్టార్' అనే రెండు ప్రధాన మీడియా సంస్థల కార్యాలయాలకు నిప్పంటించారు. ఈలోగా సోమవారం మరో విద్యార్థి నాయకుడు, నేషనల్ సిటిజన్ పార్టీ(ఎన్‌సీపీ) స్థానిక నేత మొతలబ్ షిక్దర్‌ను దుండగులు కాల్చి చంపారు. బంగ్లాదేశ్ అప్పటి ప్రధాని షేక్ హసీనా ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోవటం, ఎన్నికలను ప్రహసన ప్రాయంగా మార్చటం వగైరాలతో జనం ఆగ్రహించి నిరుడు జూలైలో ఉద్యమించారు. దాన్ని తమకు అనుకూలంగా మలచుకోవటంలో, హింసను రెచ్చగొట్టి మైనారిటీ హిందూ మతస్తులపై, మహిళలపై దాడులు చేయటంలో మతతత్వవాదులు విజయం సాధించారు. ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా ఉన్న నోబెల్ గ్రహీత మహ్మద్ యూనస్ వీటన్నిటినీ గుడ్లప్పగించి చూస్తున్నారు. ఉద్యమకారులు రోడ్లపైకొచ్చి విధ్వంసం సృష్టిస్తుంటే వాటిని అడ్డుకోవటానికి ప్రభుత్వపరంగా ఆయన చేసిందేమీ లేదు. అది చేతగానితనమా, వ్యూహాత్మకమా అన్నది తేలాల్సి ఉంది.

హసీనా నిష్క్రమించాక చోటుచేసుకుంటున్న వరస పరిణామాలు అరాచకానికి బీజాలు వేశాయి. నేరగాళ్లను జైళ్లనుంచి విడిచిపెట్టడం, జమాత్–ఎ–ఇస్లామీ(జేఐ) వంటి పాక్ అనుకూల మతతత్వ సంస్థలకు స్వేచ్ఛనీయటం వగైరాలు ఎడతెగని హింసకు దారితీశాయి. హసీనా సొంత పార్టీ అవామీ లీగ్ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో పోటీచేసే అవకాశం లేకపోవటం, మరో ప్రధాన పార్టీ బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ(బీఎన్‌పీ) అధినేత ఖలీదా జియా తీవ్ర అస్వస్థత వల్ల ఆ పార్టీ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారటం వగైరా పరిణామాలతో జేఐ వంటి మతతత్వ సంస్థలు తామే విజేతలమన్న భ్రమలో బతుకుతున్నాయి. భారత్ వ్యతిరేకతను ఇదే స్థాయిలో రెచ్చగొడుతూపోతే తమకే అధికారం దక్కుతుందని తలపోస్తున్నాయి. హదీ చురుకైన విద్యార్థి నాయకుడే. కానీ జేఐకి బద్ధ వ్యతిరేకి. 'ఇంక్విలాబ్ మంచా'(ఐఎం) అనే మరో మతతత్వ సంస్థకు అధికార ప్రతినిధి. ఇటీవలే 'ప్రథమ్ ఆలో' పత్రిక సర్వే నిర్వహించి ఐఎం కన్నా జేఐకే ప్రజాదరణ ఎక్కువుందని తెలిపింది. బంగ్లాలో వరసబెట్టి ఆలయాలపై, దర్గాలపై సాగుతున్న దాడులపై అమెరికాలో పరిశోధక విద్యార్థిగా ఉన్న అసిఫ్ బిన్ అలీ రాసిన సవివరమైన వ్యాసాన్ని ప్రచురించింది. ఇదంతా కంటగింపుగా మారి ఐఎం మూకలు ఆ పత్రిక కార్యాలయానికి నిప్పెట్టాయి. పాక్ పాలకులు తమ సంస్కృతినీ, భాషనూ అణగదొక్కాలని చూసిన పర్యవసానంగానే బంగ్లా ఆవిర్భవించిందన్న కనీస అవగాహన కూడా లేని ఈ మూకలు దేశాన్ని ఎటు తీసుకెళ్తాయో అనూహ్యం.

భారత్ వ్యతిరేకత ఎంతగా ప్రదర్శిస్తే అంతగా తమకు జనాదరణ పెరుగుతుందని మతతత్వ సంస్థలు భావిస్తున్నాయి. దేశం ఎదుర్కొంటున్న అధిక ధరల సమస్య లేదా నిరుద్యోగాన్ని రూపుమాపటం, కనీసం అవినీతి అంతానికి ఏం చేస్తారో చెప్పటం వగైరాలు మరిచిన ఈ సంస్థలు భారత్ వ్యతిరేకత పైనే ఆశ పెట్టుకున్నట్టు కనబడుతోంది. హదీ భారత వ్యతిరేకి కావొచ్చుగానీ... అంతమాత్రాన ఆ హత్య వెనక భారత్ హస్తం ఉన్నదనీ, హదీ హంతకులకు అది ఆశ్రయమిచ్చిందనీ వదంతులు వ్యాపింపజేయటం, ప్రభుత్వం మౌనంగా ఉండిపోవటం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇలాంటి వైఖరే అరాచకానికి దారితీస్తోంది. ప్రజాస్వామ్యం ఒక్కరోజులో కుప్పకూలదు. దీర్ఘకాలం కొనసాగే అరాచకం, హింస అందుకు తోడ్పడతాయి. హదీ సంస్మరణ సభలో మాట్లాడిన వారు భారత్‌కు హెచ్చరికలు జారీచేయటం, హసీనానూ, హదీ హంతకులనూ అప్పగించాలంటూ తేదీ ఖరారు చేయటం... ఎన్నికలు ముంచుకొస్తుండగా ప్రభుత్వం దీన్ని మౌనంగా వీక్షించటం బాధ్యతా రాహిత్యం. సకాలంలో ఈ అరాచకాన్ని నివారించకపోతే మున్ముందు తనను కూడా ఈ శక్తులు లక్ష్యంగా మార్చుకుంటాయని యూనస్ తెలుసుకోవటం మంచిది.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు పుష్య మాసం, **తిథి:** శు.తదియ ఉ.10.27 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** శ్రవణం తె.5.54 వరకు (తెల్లవారితే బుధవారం), తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** ఉ.8.59 నుండి 10.39 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.37 నుండి 9.21 వరకు, తదుపరి రా.10.37 నుండి 11.29 వరకు, **అమృత ఘడియలు:** సా.6.51 నుండి 8.32 వరకు.

సూర్యోదయం : 6.30
సూర్యాస్తమయం: 5.27
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

సోషల్ టాక్

లెక్కుండాలి

బిజినెస్ అనే ఆలోచన రాగానే మొదట మీరు నష్టాల లెక్కలు వేసుకోవాలి. తర్వాతే... లాభాల మాట, లాభాల బాట. బిజినెస్‌ను ప్రారంభించటానికి ఇప్పుడు మీరున్న కంఫర్ట్ జోన్ నుంచి బయటికి రావటం మాత్రమే సరిపోదు. నష్ట నివారణ ప్రణాళికతో సిద్ధమవ్వాలి.

– రాజీవ్ ఎల్. గుప్త, అమెరికన్ బిజినెస్‌మేన్

కుటుంబం

మీ కుటుంబమే మీకు నిజమైన కవచంగా ఉంటుంది. ప్రపంచం మీ ముఖం చూడనప్పుడు, ప్రపంచం మీ పైకి రాళ్లు విసిరినప్పుడు కుటుంబ సభ్యులే మీకు అండగా ఉంటారు. మీపై పడవచ్చిన రాళ్లను తిప్పి కొడతారు. వాళ్లే ఎప్పటికైనా మీ భరోసా.

– రవి దూబే, టెలివిజన్ ప్రెజెంటర్

నాయకుడు

నాయకత్వం వహించటం అంటే వినయంతో ప్రజలకు సేవ చేయటం. వ్యక్తిగత కీర్తి కోసం కాకుండా, సమాజ శ్రేయస్సు కోసం పని చేయటం. బాధ్యత తీసుకోవటం. జవాబుదారీగా ఉండటం. నిరంతరం సామాజిక సంక్షేమం కోసం శ్రమించటం.

– కుమ్మనం రాజశేఖరన్, మిజోరం మాజీ గవర్నర్

సృజనశీలత



ఎంత బాధాకరమైనా, సామాజిక సమస్యలను చూడకుండా నేను కళ్లు మూసు కోలేను. ఆ నొప్పి సృజనాత్మకతకు ఆటకం కలిగించవచ్చు. కానీ, అదే నొప్పి నన్ను తీవ్రంగా ఆలోచింపజేసి, సృజన వైపు నన్ను మరింతగా పురిగొల్పుతుంది. స్పష్టమైన దృష్టిని ఇస్తుంది.

– పండిట్ తరుణ్ భట్టాచార్య, శాస్త్రీయ సంగీతకారుడు

అంధకారం



సబ్‌స్క్రిప్షన్ జర్నల్స్ లోకాన్ని అంధకారం చేస్తాయి. వాటికి చందా కట్టగలిగిన వారికి మాత్రమే వాటిలోని జ్ఞానం లభ్యం అవుతుంది. సమాజాన్ని మీరు నిజంగా మార్చాలనుకుంటే కనుక జ్ఞానాన్ని చందాల్లో బంధించటం కాదు, ఉదారంగా అందరికీ అందించాలి.

– ఫ్రెడెరిక్ నోరోన్హా, వికీపీడియా ఎడిటర్

రెజ్లింగ్



ఒక రెజ్లర్ బలం కండరాలలో ఉండదు. మనస్సును కేంద్రీకరించటంలో ఉంటుంది. ఓటమిలోనూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగే సామర్థ్యంలో ఉంటుంది. మానసిక దృఢత్వంలో ఉంటుంది. ఇదే రెజ్లింగ్‌లోని విజయం రహస్యం.

– సంజయ్ కుమార్, రెజ్లర్

మయన్మార్‌లో ఎన్నికల తంతు

విశ్లేషణ

నిరుపమా సుబ్రమణియన్

ఆంగ్ సాన్ సూకీ ఎన్నికల విజయాన్ని మయన్మార్ సైన్యం దుర్మార్గంగా చేజిక్కించుకుని దాదాపు ఐదేళ్లు గడిచిపోయాయి. ఇప్పుడా సైనిక ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించ తలపెట్టింది. ఇవి డిసెంబర్ 28 నుంచి 2026 జనవరి వరకు జరుగుతాయి. ఈ ఎన్నికల ద్వారా తమ పాలనకు చట్టబద్ధత సాధించాలని సైన్యం విఫలయత్నం చేస్తోంది. కానీ దేశంలో ఇప్పటికే నెలకొని ఉన్న అరాచక పరిస్థితి ఈ ఎన్నికలతో మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంది.

ప్రధాన రాజకీయ పార్టీ ఎన్ఎల్‌డీ (నేషనల్ లీగ్ ఫర్ డెమాక్రసీ) సహా అనేక పక్షాలు సైనిక పాలకులు ప్రకటించిన ఈ ఎన్నికల్లో పోటీ చేయడం లేదు. మయన్మార్ ప్రజాస్వామ్య ఆకాంక్షలకు ప్రతిరూపమైన సూకీని జైల్లో పెట్టిన సైనిక ప్రభుత్వం ఎన్నికల ప్రక్రియలో పాల్గొనకుండా ఆమెపై అనర్హత వేటు వేసింది. అందుకు నిరసన ప్రకటిస్తూ, కొత్త చట్టం కింద రాజకీయ పార్టీగా నమోదయ్యేందుకు ఆమె పార్టీ ఎన్ఎల్‌డీ నిరాకరించింది. దీంతో సైనిక పాలకులు ఆ పార్టీని రద్దు చేశారు.

2020 ఎన్నికల్లో సూకీ నేతృత్వంలోని ఎన్ఎల్‌డీ ఘన విజయం సాధించింది. సైనిక ప్రభుత్వం 2008లో ప్రకటించిన రాజ్యాంగం ప్రకారం, జాతీయ పార్లమెంటు ఉభయసభల్లోని 476 స్థానాల్లో 25 శాతం సీట్లు సైన్యానికి రిజర్వు అయ్యాయి. సైన్యం అనుకూల జాతీయవాద పార్టీ యూనియన్ సాలిడారిటీ అండ్ డెవలప్ మెంట్ పార్టీ (యూఎస్‌డీపీ) ఆ ఎన్నికల్లో చావుదెబ్బ దెబ్బతింది.

అయిదేళ్ల క్రితం ఆరంభమైన ప్రజాస్వామ్య పునరుద్ధరణ ప్రక్రియను పూర్తి చేస్తాననీ, అందుకు వీలుగా రాజ్యాంగాన్ని సంస్కరిస్తాననీ 2020 ఎన్నికల్లో సూకీ దేశ ప్రజలకు వాగ్దానం చేశారు. కాబట్టి, పగ్గాలు చేపట్టిన వెంటనే సూకీ సైన్యం తోక కత్తిరిస్తారని అంతా అనుకున్నారు. కానీ అలా జరగలేదు. కొత్త సభ్యులు ప్రమాణ స్వీకారానికి సిద్ధమవుతున్న సమయంలో సైన్యం తిరుగుబాటు చేసింది. అధికారం హస్తగతం చేసుకుంది.

అదుపు సాధించని సైన్యం

వేల మంది ప్రజాస్వామ్య అనుకూల ఆందోళనకారులను సైనిక ప్రభుత్వం జైళ్లలో పెట్టింది. సొంత పౌరుల మీద బాంబులు కురిపించింది. గ్రామాలకు గ్రామాలను తగలబెట్టింది. సూకీని ఎక్కడ నిర్బంధించారో కూడా కచ్చితంగా తెలియదు. ఇంత చేసి కూడా సైన్యం దేశం మీద పట్టు సాధించలేకపోయింది. అనేక ప్రాంతాల్లో ప్రజాస్వామ్య అనుకూల పౌరసేనలు, సాయుధ పోరాట సంస్థలు సైనికులతో పోరు సలుపుతున్నాయి. ఆ ప్రాంతాల్లో ఎన్నికల నిర్వహణ సాధ్యపడేది కాదు.

◆ డిసెంబర్ 28 నుంచి మొదలుకానున్న మయన్మార్ ఎన్నికలు ఒక తంతు మాత్రమే. ప్రజాస్వామ్య ఆకాంక్షలకు ప్రతిరూపమైన ఆంగ్ సాన్ సూకీని ఎక్కడ నిర్బంధించారో కూడా తెలియదు. అయినా ఈ ఎన్నికల ద్వారా తమ పాలనకు చట్టబద్ధత సాధించాలని సైన్యం ప్రయత్నిస్తోంది. ఏమైనా మయన్మార్ పరిస్థితులు ఇండియాకు ఏ విధంగానూ అనుకూలంగా లేవు.

'స్ప్రింగ్ రివల్యూషన్' పేరిట మయన్మార్‌లో ఉవ్వెత్తున ఎగసిన ప్రజాస్వామ్య అనుకూల ఉద్యమం సైన్యాన్ని పూర్తిగా ధిక్కరించాలని నిర్ణయించింది. 'నేషనల్ యూనిటీ గవర్నమెంట్' (ఎన్‌యూజీ)కి అనుబంధంగా పనిచేసే 'పీపుల్స్ డిఫెన్స్ ఫోర్సెస్' వంటి సాయుధ ప్రతిఘటన సంస్థలు ఇందులో భాగం అయ్యాయి. ఎన్‌యుజి తానే దేశానికి నిజమైన ప్రభుత్వం అని ప్రకటించుకుంది. అజ్ఞాతం నుంచో ప్రవాసం నుంచో పనిచేస్తున్న నాయకులు దీన్ని నడుపుతున్నారు. ఏమైనప్పటికీ, మెజారిటీ స్థానాల్లో సైన్యం అనుకూల యూఎస్‌డీపీ నెగ్గుతుంది. ఇది సైనిక పాలకులకు మద్దతు ఇస్తుంది.

భారత్‌కు భద్రతా సమస్య

భారత్ ఈ ఎన్నికల కోసం ఈవీఎంలు సమకూర్చినట్లు వార్తలు వచ్చాయి. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ విషయాన్ని ప్రస్తావించకుండా ఒక ప్రకటన చేసింది: 'ప్రజాస్వామ్యం దిశగా మయన్మార్ పరివర్తనకు ఇండియా మద్దతు ఇస్తుంది. ఎన్నికల ప్రక్రియ విశ్వసనీయతకు అన్ని రాజకీయ వర్గాల భాగస్వామ్యం కీలకం. మయన్మార్లో శాంతి, చర్చలు, సాధారణ పరిస్థితుల పునరుద్ధరణకు తోడ్పడే అన్ని యత్నాలకూ ఇండియా ఇకమీదట కూడా మద్దతిస్తుంది'.

చాలా రాజకీయ పార్టీలు ఎన్నికల్లో పాల్గొనడం లేదనీ, ఇవి స్వేచ్ఛగా, సమ్మిళితంగా జరిగే ఎన్నికలు కావనీ ఇండియాకు తెలుసు. ఈ ఎన్నికలు ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించక పోయినా, కనీసం అక్కడి హింసాకాండకు ఒక రాజకీయ పరిష్కారం చూపించగలిగినా చాలు. నాలుగు ఈశాన్య రాష్ట్రాల వెంబడి మయన్మార్‌తో ఇండియాకు 1,643 కి.మీ. సరిహద్దు రేఖ ఉంది. ఆ దేశంలో ఏం జరిగినా దాని ప్రభావం మన మీద పడుతుంది.

సైనిక తిరుగుబాటు అనంతరం వ్యతిరేక వర్గానికి చెందిన వేల మంది సైనికులు శరణార్థులుగా మిజోరం రాష్ట్రంలోకి పారిపోయి వచ్చారు. చిన్ రాష్ట్రం మీద సైనిక పాలకులు బాంబులు కురిపించినప్పుడు మిజోరంలోని సరిహద్దు గ్రామీణులు సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీయవలసి వచ్చింది. అంతేకాదు, ప్రజాస్వామ్య అనుకూల గ్రూపులతో పోరాడేందుకు మయన్మార్ సైన్యం సగాయింగ్ ప్రాంతం (మయన్మార్) లోని ఈశాన్య రాష్ట్రాల తిరుగుబాటు గ్రూపులతో కలసి పనిచేస్తోంది. ఇది ఇండియాకు భద్రత సమస్య. ఇండియా–మయన్మార్–థాయిలాండ్ త్రైపాక్షిక రహదారి ప్రాజెక్టు కూడా మయన్మార్ అలజడుల కారణంగా అసంపూర్తిగా మిగిలిపోయింది.

పాలు పోని ఇండియా

సూటిగా చెప్పాలంటే, మయన్మార్ ప్రజాస్వామ్య ఉద్యమకారుల్లో మన పట్ల ఉన్న గౌరవాభిమానాలను పణంగా పెట్టి క్రూరులైన ఆ దేశ సైనిక పాలకులతో ఇండియా సంబంధాలు నెరపింది. తద్వారా ఎంత ప్రయోజనం పొందగలిగింది? మణిపూర్ అశాంతికి మయన్మార్ చొరబాటుదారులే కారణమని నిందిస్తూ కూడా ఇలాంటి విధానం ఎందుకు అనుసరిస్తోంది? తాజాగా, మయన్మార్ సరిహద్దుల వెంబడి ఇండియా దృఢమైన కంచె నిర్మిస్తోంది. ఒకప్పుడు అఫ్గానిస్తాన్‌లో డ్యూరాండ్ లైన్ వెంబడి కంచె నిర్మించడం ద్వారా వేలాది కుటుంబాలను, గ్రామాలను, తెగలను వేరు చేసిన బ్రిటిష్ పాలకుల తప్పిదాన్నే ఇండియా పునరావృతం చేస్తోంది. చైనా మాత్రం తన సొంత మైనింగ్, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కాపాడుకునేందుకు తెగల ప్రజలను ఉపయోగించుకుంది. అందుకు ప్రతిగా సైనిక పాలకులకు ఆయుధాలను సమకూర్చింది.

ఎట్టకేలకు, ఇండియా ఇప్పుడు మేల్కొంది. ప్రజాస్వామ్య అనుకూల ఉద్యమ గ్రూపులతో మంతనాలు జరుపుతోంది. దేశం నుంచి ఆర్భాటం లేకుండా పనిచేసుకోడానికి వారికి అనుమతించింది. ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయనేది తెలిసిన విషయమే. పాకిస్తాన్ అధ్యక్షుడు అయ్యేందుకు జనరల్ పర్వేజ్ ముషారఫ్ నిర్వహించిన రెఫరెండం లాంటిదే ఈ ఎన్నికల తంతు. ఇండియాకు ఎదురవుతున్న సవాళ్లు, ఆ దేశంలో పెరుగుతున్న చైనా ప్రభావం ఇలాగే కొనసాగుతాయి. 'యాక్ట్ ఈస్ట్' అనేది కలగానే మిగిలిపోనుంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

వెనిజులా ముడిచమురుపై డేగకన్ను

అమెరికా చరిత్రలో అతిపెద్ద మిలిటరీ ఖర్చు బిల్లును 2026 సంవత్సరానికి గానూ 90,100 కోట్ల డాలర్లతో ప్రతినిధుల సభ ఆమోదించింది. లాటిన్ అమెరికాలో సరికొత్త యుద్ధానికి ట్రంప్ సిద్ధమవుతున్న తరుణంలో, ఈ వ్యయ బిల్లు ఆమోదం కోసం డెమోక్రాట్లు కూడా రిపబ్లికన్లతో కలిసి ఓటు వేయడం గమనార్హం. ఇప్పటికే జూలైలో కేటాయించిన 15,600 కోట్ల డాలర్ల అనుబంధ సైనిక వ్యయ నిధులతో కలిపితే, 2026లో ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలను ప్రోత్సహించడానికి అమెరికా మొత్తం లక్షా 5,700 కోట్ల డాలర్లను వెచ్చించనుంది. 'ఆపరేషన్ దక్షిణ గోళం' పేరిట కరేబియన్ ప్రాంతానికి ఎఫ్–35 స్టెల్త్ ఫైటర్లు, యుద్ధనౌకలను తరలించడం... 1962 క్యూబా క్షిపణి సంక్షోభం తర్వాత అతిపెద్ద సైనిక మోహరింపుగా పరిగణించవచ్చు. శత్రు వైమానిక రక్షణ వ్యవస్థలను అణచివేసే ఇఎ18జి వార్‌జెట్‌లు ఇప్పటికే ప్యూర్టోరికో చేరుకున్నాయి.

అమెరికా చూపు ఇప్పుడు వెనిజులాలోని అపారమైన ముడి చమురు నిల్వలపై పడింది. ప్రపంచంలోనే అత్యధికంగా 20 శాతం ముడిచమురు నిల్వలు (సుమారు 30,000 కోట్ల బారెల్స్) ఈ చిన్న దక్షిణ అమెరికా దేశంలోనే ఉన్నాయి. ఇది సౌదీ అరేబియా కంటే ఎక్కువ. గతంలో అధ్యక్షుడు ఛావెజ్ చమురు పరిశ్రమలను జాతీయం చేసి, 2005లో భూసంస్కరణల ద్వారా సామాన్య రైతాంగాన్ని భూస్వాముల నుండి విముక్తి చేశారు. అదే ఏడాది 13 లాటిన్ అమెరికా దేశాలు కలిసి వాణిజ్య సమాఖ్యగా ఏర్పడి స్వల్ప ధరలకే ముడిచమురును అమ్ముకోవాలని ఒప్పందం చేసుకున్నాయి. 2008లో బ్యాంకులను జాతీయం చేయడం, రష్యాతో కీలక ఒప్పందాలు చేసుకోవడం ద్వారా అమెరికా ఆయిల్ కంపెనీల ఆధిపత్యాన్ని వెనిజులా తగ్గించింది. ఇవన్నీ అమెరికాకు మింగుడుపడని అంశాలుగా మారాయి.

ప్రస్తుతం 'మాదక ద్రవ్యాల ఉగ్రవాదం' ముసుగులో మదూరో ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు వాషింగ్టన్ కుయుక్తులు పన్నుతోంది. 'కార్టెల్ ఆఫ్ సన్స్' అనే సంస్థతో వెనిజులా నాయకత్వానికి సంబంధాలు ఉన్నాయని అమెరికా ఆరోపిస్తుండగా, అధ్యక్షుడు మదూరో, కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో ఈ వాదనలను తిరస్కరిస్తున్నారు. వెనిజులా ప్రజలకు మద్దతుగా నిలుస్తానని రష్యా అధ్యక్షుడు పుతిన్ బహిరంగంగా ప్రకటించారు.

యుద్ధ తంత్రాన్ని అమెరికా మరింత క్రూరంగా మార్చి, నేరుగా భూభాగంలోకి సైన్యాన్ని పంపకుండా క్షిపణులు, డ్రోన్ల సహాయంతో దాడులు చేసే వ్యూహంలో ఉంది. ఇటీవల డ్రోన్ల దాడిలో కొందరు మత్స్యకారులు ప్రాణాలు కోల్పోవడం దీనికి నిదర్శనం. ఆయుధ కంపెనీలకు లాభాలు చేకూర్చడమే లక్ష్యంగా అమెరికా ఈ యుద్ధాలను ప్రోత్సహిస్తోంది.

గత నాలుగేళ్లలో ఉక్రెయిన్‌కు 17,000 కోట్ల విలువైన ఆయుధాలను, ఇజ్రాయెల్‌కు భారీగా ఆయుధ సామగ్రిని సరఫరా చేస్తూ అమెరికా తన యుద్ధ దాహాన్ని ప్రదర్శిస్తోంది. పశ్చిమాసియాలో చమురు ఆధిపత్యం కోసం ఇజ్రాయెల్‌ను అంగరక్షకుడిగా వాడుకున్నట్లే, ఇప్పుడు దక్షిణ అమెరికాలోని వెనిజులాలో తన కీలుబొమ్మ ప్రభుత్వాన్ని స్థాపించాలని అమెరికా ప్రయత్నిస్తోంది. 1946 నుండి ఇప్పటివరకు ఇజ్రాయెల్‌కు సుమారు 35,000 కోట్ల డాలర్ల ఆర్థిక సాయం అందించిన అమెరికా, ఇప్పుడు సహజ సంపదను దోచుకోవడమే లక్ష్యంగా వెనిజులాపై దాడికి సిద్ధమవుతోంది. ప్రపంచ శాంతికి విఘాతం కలిగిస్తూ సాగుతున్న ఈ యుద్ధ క్రీడలో వెనిజులా ఇప్పుడు బలిపీఠంపై ఉంది.

– జమిందార్ బుడ్డిగ
ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యవర్గ సభ్యులు

అరుదైన నేత

ఇన్ బాక్స్

పీవీ నరసింహారావు భారత రాజకీయ రంగంలో అరుదైన నాయకుడు. ఆయన బహుభాషా కోవి దుడు, రాజనీతిజ్ఞుడు. 1921 జూన్ 28న కరీంనగర్ జిల్లా వంగరలో జన్మించారు. వందేమాతరం ఉద్యమంలో పాల్గొన్నందుకు నిజాం పాలనలో విద్యావకాశం కోల్పోయి, పూనాలో బీఎస్సీ, నాగపూర్‌లో న్యాయశాస్త్రం పూర్తి చేశారు. అనంతరం బూర్గుల రామకృష్ణారావు వద్ద జూనియర్ న్యాయవాదిగా చేరి, స్వామి రామానంద తీర్థ సిద్ధాంతాలకు ఆకర్షితులై క్విట్ ఇండియా, నిజాం వ్యతిరేక పోరాటాల్లో క్రియాశీలక పాత్ర పోషించారు. 1957 నుండి 1972 వరకు మంథని ఎమ్మెల్యేగా వరుసగా విజయం సాధించి, రాష్ట్ర మంత్రివర్గంలో న్యాయ, ఆరోగ్య, విద్యా శాఖలను నిర్వహించారు. 1971 నుండి 1973 వరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి పాలనలో తన విశిష్ట ముద్ర వేశారు.

పీవీ నరసింహారావు

కేంద్రంలో విదేశాంగ, హోం శాఖల బాధ్యతలు నిర్వహించడమే కాకుండా, రాజీవ్ గాంధీ హయాంలో మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా నూతన విద్యా విధానం, నవోదయ విద్యాలయాలకు నాంది పలికారు. 1991లో దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు ప్రధానిగా బాధ్యతలు చేపట్టి, విప్లవాత్మక ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టారు. పూర్తి మెజారిటీ లేని మైనారిటీ ప్రభుత్వాన్ని ఐదేళ్ల పాటు చాకచక్యంగా నడిపిన ఆయనను 'అపర చాణక్యుడు' అని పిలుస్తారు.

విశ్వనాథ సత్యనారాయణ 'వేయి పడగలు' నవలను పీవీ హిందీలోకి అనువదించి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందారు. తన ఆత్మకథాత్మక నవలను 'ఇన్‌సైడర్' (లోపలి మనిషి) పేరుతో రచించారు. గాంధేయవాదిగా ఖాదీ సంస్థల అభివృద్ధికి కృషి చేస్తూ, 1993లో వాటి కోసం ప్రత్యేక బ్యాంకు విధానాన్ని ప్రకటించారు. గ్రామీణ యువత ఉపాధి కోసం భూదాన్ పోచంపల్లిలో 'స్వామి రామానంద తీర్థ గ్రామీణ ఉపాధి కల్పన విశ్వవిద్యాలయా'న్ని నెలకొల్పారు.

2004 డిసెంబర్ 23న కన్నుమూసిన ఆయన విశిష్ట సేవలను గుర్తిస్తూ 2024 ఫిబ్రవరి 9న కేంద్ర ప్రభుత్వం అత్యున్నత 'భారతరత్న' పురస్కారాన్ని ప్రకటించింది. మౌనముద్రతోనే భవిష్యత్తును అంచనా వేస్తూ దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుండి గట్టెక్కించిన ఆయన ప్రస్థానం నేటి యువతకు స్ఫూర్తిదాయకం. ఆయన నాయకత్వం... ఒక ప్రచండమైన తుపాను నుండి ఓడను సురక్షితంగా తీరానికి చేర్చిన దార్శనిక కెప్టెన్ లాంటిది అనడం ఏమాత్రం అతిశయోక్తి కాదు.

– జి.వి. సుబ్బారావు | తెలంగాణ గాంధీ స్మారక నిధి అధ్యక్షుడు

డేటా పాయింట్



శారదామాత ఉపదేశం

భగవాన్ రామకృష్ణ పరమహంస సహధర్మచారిణి జనని శారదాదేవి. వారు యోగ సాధన, తపస్సు, కాళీమాత కైంకర్యములలో మునిగితేలేవారు. శారదాదేవి–రామకృష్ణుల సహజీవనము అపూర్వమైనది. రామకృష్ణ పరమహంస కాళీమాతతో తాదాత్మ్యం చెందారు. శారదామాత తన జీవితాన్ని భర్త జీవితానుగుణంగా మార్చుకొన్నారు. వారిరువురు పరస్పరం ఒకరినొకరు కాళీమాతగానే భావించుకొనేవారు.

శారదా దేవి 1853 డిసెంబర్ 22న జన్మించారు. 1873 మే 25న 'ఫలహారిణీ కాళీపూజ' శుభదినాన రామకృష్ణులు జగన్మాత భావంతో శారదాదేవికి 'షోడశీ పూజ' గావించి, జపమాలతో సహా తమ సాధనా ఫలాన్నంతా అర్పించారని చెబుతారు. ఈ రీతిగా రామకృష్ణుల పారమార్థిక సంపదకంతటికీ వారసురాలైనప్పటికీ శారదాదేవి తన జీవితంలో కఠోర సాధనలెన్నింటినో ఆచరించారు. ఆ దివ్యజనని ఆశీస్సులతోనే స్వామి వివేకానంద నేతృత్వంలో 1888 డిసెంబర్‌లో బేలూరులో రామకృష్ణ మఠం ఏర్పడింది.

శారదా మాత బోధనలు ఎంతో సరళంగా ఉంటాయి. ఆమె బోధనల్లో కొన్ని: పారమార్థిక సాధనలు ఎంత తీవ్రంగా ఆచరిస్తే, అంత గాఢంగా భగవంతుడు మనలను అనుగ్రహిస్తాడు; రోజూ ఇరవై నాలుగ్గంటలూ జపధ్యానాలను చేయగలమా? లేదు. అందుకే 'సత్కార్యాచరణ' అవసరం; 'మనస్సు ఏకాగ్రం కాకపోయినా, మంత్ర జపం మాత్రం మానవద్దు; మన ప్రేమను మానవులపై ఉంచితే సంతాపం తప్పదు. అదే ప్రేమను భగవంతునిపై ఉంచితే నిశ్చయంగా సంతోషం కలుగుతుంది; మనశ్శాంతి కావాలంటే పరుల ద్వేషాలు ఎంచవద్దు. దాని బదులు నీలోని ద్వేషాలు చూసుకో; తనలో ద్వేషాలున్న వానికే ఇతరులలో లోపాలు కనిపిస్తాయి; ప్రపంచమంతా నీ సొంతమే. పరాయి వారెవరూ లేరు; భార్యాభర్తలు ఇద్దరికీ ఆధ్యాత్మిక సాధనం విషయంలో ఏకాభిప్రాయం ఉంటే... వారికి సులభంగా ఆధ్యాత్మిక పురోగతి లభిస్తుంది; కష్టాలు కలకాలం ఉండవు. వంతెన క్రింద నీటి వలె దొరలిపోతాయి.

– వేదుల జనార్దన రావు

అప్పన్న సన్నిధిలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి

సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనంతరామనాథ్ హెగ్డే, రాజస్థాన్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, మహారాష్ట్ర రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్పర్సన్ జస్టిస్ సంభాజీ శివాజీ షిండే సోమవారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభానికి ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో న్యాయమూర్తులు పేరిట అర్చకులు పూజ చేశారు. వేద పండితులు ఆశీర్వదించగా, అధికారులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు.

భారత మహిళా క్రికెటర్లు కూడా..: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని భారత మహిళా క్రికెటర్లు సోమవారం దర్శించుకున్నారు. కెప్టెన్ హర్మన్ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన, అరుంధతి రెడ్డి, స్నేహ రానా, రేణుకాసింగ్, షఫాలీ వర్మ, శ్రీచరణి, వైష్ణవి శర్మ స్వామివారిని దర్శించుకున్నవారిలో ఉన్నారు. – సింహాచలం

కప్పస్తంభానికి మొక్కుకుంటున్న కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనంత్రామనాథ్ హెగ్డే

రాజస్థాన్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంభాజీ శివాజీషిండేకి ప్రసాదం అందిస్తున్న ఏఈవో

ఆలయ ప్రాంగణంలో మహిళా క్రికెట్ టీమ్ కెప్టెన్ హార్మన్ప్రీత్కౌర్, షఫాలీ వర్మ, రేణుకాసింగ్, స్నేహ్రాణా తదితరులు

ఇదేం 'టార్చర్'రా బాబూ..!

- సిగ్నల్ లైట్లను కప్పేసిన 'టార్చ్బేరర్' ఫ్లెక్సీలు
- ఇబ్బంది పడుతున్న వాహనచోదకులు

ట్రాఫిక్ సిగ్నల్సను మూసివేసేలా ఏర్పాటు చేసిన మంత్రి లోకేశ్ ఫ్లెక్సీ

సాక్షి టాస్క్ఫోర్స్: మంత్రి లోకేశ్ ఆశీస్సులు పొందేందుకు టీడీపీ నాయకులు ఆయనను 'టార్చ్బేరర్' అంటూ పొగుడుతూ రాజమహేంద్రవరంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇంత వరకూ బాగానే ఉన్నా.. ఆ ఫ్లెక్సీలతో సిగ్నల్ లైట్లను కూడా మూసేయడం రాజమహేంద్రవరంలో హాట్టాపిక్గా మారింది. నగరంలో నిత్యం అధిక ట్రాఫిక్ ఉండే ప్రాంతాల్లో లాలాచెరువు సెంటర్ ఒకటి. ఇటీవల లోకేశ్ రాజమహేంద్రవరం వచ్చిన సందర్భంగా రోడ్డు మొత్తం మూసేసేలా భారీ ఫ్లెక్సీని స్వాగత ద్వారం మాదిరిగా ఏర్పాటు చేశారు. వాహన చోదకులకు ట్రాఫిక్ సిగ్నల్ కనిపించక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో, ఇక్కడ ప్రత్యేకంగా పోలీసు సిబ్బందిని ట్రాఫిక్ నియంత్రణకు రోజూ వినియోగించాల్సి వస్తోంది. అంతేకాకుండా రోడ్డును సగ భాగం వరకూ ఫ్లెక్సీలు మూసేయడంతో వాహనాలు వెళ్లేందుకు అతి తక్కువ జాగా మాత్రమే ఉంది. రెండు లేన్లుగా ఉన్న ఈ రోడ్డులో ఒక లేన్ మొత్తాన్ని ఈ ఫ్లెక్సీలు ఆక్రమించేశాయి. దీంతో, ఇక్కడకు వచ్చేసరికి ఒక లేన్లోనే వాహనాలు వెళ్లాల్సి వస్తోంది. నిత్యం వేలాది మంది ఈ జంక్షన్ మీదుగానే అటు హైవే, మరోవైపు సెంట్రల్ జైలు రోడ్డు, ఇంకోవైపు క్వారీ మార్కెట్ సెంటర్కు వెళ్తుంటారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ అధికంగా ఉంటుంది. ఇలాంటి చోట ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్సీపై నగరంలో తీవ్ర చర్చ జరుగుతోంది.

నేడు సికింద్రాబాద్–వేలంగిణి మధ్య ప్రత్యేక రైలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): తమిళనాడులోని వేలంగిణి మేరీమాత చర్చిలో క్రిస్మస్ వేడుకలకు హాజరయ్యే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైలు నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. సికింద్రాబాద్–వేలంగిణి ప్రత్యేక రైలు (07407) మంగళవారం రాత్రి 7.25 గంటలకు సికింద్రాబాద్లో బయలుదేరి, మరుసటి రోజు సాయంత్రం 5.30 గంటలకు వేలంగిణి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07408) గురువారం ఉదయం 8 గంటలకు వేలంగిణిలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 6.10 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. ఈ రైలు చర్లపల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, చెన్నై ఎగ్మోర్, తాంబరం మీదుగా వేలంగిణి చేరుతుందని అధికారులు వెల్లడించారు.

శ్రీవారి సన్నిధిలో మద్రాస్ హైకోర్టు జడ్జి

తిరుమల శ్రీవారిని మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.వేలుమురుగన్ సోమవారం దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయ రంగ నాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వదించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. – తిరుమల

రసాయనాలు తగ్గిద్దాం.. పుడమికి ప్రాణం పోద్దాం

'రసాయన వాడకం తగ్గిద్దాం.. పుడమికి ప్రాణం పోద్దాం' నినాదంతో తూర్పు గోదావరి జిల్లా రంగంపేటలో సైకత శిల్పి దేవిన శ్రీనివాస్ కుమార్తెలు మోహిత, ధన్యత (దేవిన సిస్టర్స్) సైకత శిల్పం రూపొందించారు. మంగళవారం జాతీయ రైతు దినోత్సవాన్ని (కిసాన్ దివస్) పురస్కరించుకుని ఈ శిల్పాన్ని తయారు చేశారు. రెండున్నర యూనిట్ల ఇసుకతో 12 గంటల్లో రూపొందించిన ఈ సైకత శిల్పంపై రైతు, ఎద్దు, మహిళ, పంట ఆకృతులు తీర్చిదిద్దారు. – రంగంపేట

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

పెదగంట్యాడ(గాజువాక): అతనో ఆటోడ్రైవర్.. మద్యం అలవాటు ఉంది.. 21న వైన్షాపు వద్ద పూటుగా మద్యం తాగాడు. ఆ దుకాణం వద్దే కుప్పకూలిపోయాడు.. అక్కడే మృతి చెందాడు.. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. విశాఖ జిల్లా పెదగంట్యాడ మండలంలోని నెల్లిముక్కుకు చెందిన పాల శ్రీనివాసరెడ్డి (40) ఆటో డ్రైవర్. అతని భార్య తేజ పూర్ణా మార్కెట్లో కూరగాయల వ్యాపారం చేస్తూ ఉంటుంది. శ్రీనివాసరెడ్డి ఈ నెల 21న ఆదివారం పెదగంట్యాడలోని ఓ వైన్ షాపు వద్ద మద్యం తాగాడు. అతిగా మద్యం తాగడంతో కుప్పకూలి, అక్కడే మృతి చెందాడు. దీన్ని గమనించిన ఓ వ్యక్తి మృతుని భార్యకు సమాచారం ఇచ్చాడు. ఆమె న్యూపోర్టు పోలీసులకు సమాచారం ఇచ్చింది. మృతునికి కుమారుడు ఉన్నాడు. మృతుని భార్య తేజ ఫిర్యాదు మేరకు న్యూపోర్టు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వైకుంఠ ద్వార దర్శనాల్లో సామాన్యులకే ప్రాధాన్యం

మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

తిరుమల: తిరుమలలో డిసెంబర్ 30 నుంచి జనవరి 8 వరకు నిర్వహించనున్న వైకుంఠ ద్వార దర్శనాల్లో సామాన్యులకే పెద్ద పీట వేస్తున్నట్లు రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చెప్పారు. తిరుమలలోని అన్నమయ్య భవన్లో సోమవారం వైకుంఠ ద్వార దర్శనాల ఏర్పాట్లపై ప్రభుత్వం నియమించిన ముగ్గురు మంత్రుల ఉప సంఘం భేటీ అయింది. హోం మంత్రి అనిత, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్తో కలిసి మంత్రి ఆనం టీటీడీ, జిల్లా, పోలీసు ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు.

- పదిరోజుల్లో 182 గంటల దర్శన సమయంలో 164 గంటలు అంటే దాదాపు 90శాతం సామాన్యులకే కేటాయింపు
- పది రోజుల వైకుంఠ ద్వార దర్శనాలకు పటిష్ట ఏర్పాట్లు
- తొలిమూడురోజుల దర్శనాలకు 27రాష్ట్రాల నుంచి 23.64 లక్షల మంది ఈ–డిప్నకు నమోదు
- 1.89 లక్షల మంది సామాన్య భక్తులకు ఈ–డిప్ ద్వారా టోకెన్ల కేటాయింపు
- భక్తులు ఏరోజు, ఏ సమయానికి దర్శనానికి రావాలో సమాచారం అందజేత
- టోకెన్ లేని భక్తులు జనవరి 2 నుంచి 8 వరకు సర్వదర్శన క్యూద్వారా వైకుంఠ ద్వారదర్శనాలు
- ఏఐ టెక్నాలజీతో క్యూల పర్యవేక్షణ, భక్తుల సంఖ్య, వేచి ఉండే సమయాన్ని అంచనా వేస్తూ క్యూల నిర్వహణ
- పోలీసులు, టీటీడీ విజిలెన్స్ సమన్వయంతో భక్తులకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు.

పల్నాడులో జంట హత్యలు

మొదటి పేజీ తరువాయిఆలయం

వాటర్ ప్లాంట్ వద్ద ఉండగా అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు యాగంటి నరేష్ తన అనుచరులతో కలిసి మారణాయుధాలతో దాడికి పాల్పడ్డాడు. అనంతరం శ్రీరామమూర్తి సోదరుడు కొత్త హనుమంతు (30) అడిగొప్పల గ్రామంలోని బొడ్డురాయి సెంటర్ వద్ద ఉన్నాడని తెలుసుకుని నరేష్ తోడల్లుడు రామలింగం, అతని స్నేహితుడు వెంకటేష్ ఇనుపరాడ్లతో దాడి చేసి హత్య చేశారు. సమాచారం అందుకున్న కారంపూడి సీఐ టి.శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. మృతుల తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో 11 మందిపై కేసు నమోదు చేశారు. సోమవారం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు గ్రామంలోని సంఘటనా స్థలాలను పరిశీలించి వివరాలు సేకరించారు. నిందితుల కోసం గాలిస్తున్నారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. మృతుల్లో కొత్త శ్రీరామమూర్తికి భార్య, ఇద్దరు పిల్లలుండగా కొత్త హనుమంతరావు అవివాహితుడు.

పల్నాడు జిల్లా అడిగొప్పల గ్రామాన్ని సందర్శించిన ఎస్పీ కృష్ణారావు

ఆధిపత్య పోరుతోనే హత్యలు..?

శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయంలో ఒప్పంద ఉద్యోగుల నియామకాల్లో జరిగిన ఆధిపత్య పోరుతోనే జంట హత్యలు జరిగినట్టు పోలీసులు భావిస్తున్నారు. హత్యకు గురైన అన్నదమ్ములు ఇటీవల స్థానిక టీడీపీ నాయకుడు యాగంటి నరేష్ అత్తతో గొడవపడ్డారు. కొంతకాలంగా ఆలయంలో ఒప్పంద ఉద్యోగుల నియామకంలో మృతులు, ప్రత్యర్థుల మధ్య మనస్పర్ధలు ఉన్నాయి. ఆలయంపై ఆధిపత్యం చెలాయించాలంటే శ్రీరామమూర్తి, హనుమంతు అడ్డు తొలగించుకోవాలని భావించిన నరేష్ హత్యలకు పథక రచన చేశాడు. అన్నదమ్ములిద్దరు వేర్వేరు చోట్ల ఒంటరిగా ఉన్న విషయాన్ని తెలుసుకుని మారణాయుధాలతో దాడి చేసి హతమార్చారు. అనంతరం పరారయ్యారు. మరోవైపు స్థానిక ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అసమర్థతతోనే హత్యలు జరుగుతున్నాయని.. నియోజకవర్గ టీడీపీలో నెలకొన్న ఆధిపత్య పోరును పరిష్కరించడంలో విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తన అసమర్థతతో జరుగుతున్న హత్యలను ప్రతిపక్ష పార్టీ నేతలపైకి నెట్టి రాజకీయ కక్షలను తీర్చుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

కూటమి కారణంగా ఇబ్బందులు, గొడవలు తప్పవు

- జనసేన నేతలు దానికి మానసికంగా సిద్ధమవ్వాలి
- వాటిని అధిగమించి ఎలా ఎదుగుతారనేది ముఖ్యం
- పార్టీ నేతల సమావేశంలో పవన్ కళ్యాణ్

సాక్షి, అమరావతి: ''కూటమి కారణంగా కొన్ని ఇబ్బందులు ఉంటాయి. సీట్ల వాటాల్లో కావొచ్చు. ఇంకోటి కావొచ్చు. గొడవలు తప్పదు. అందుకు మీరు మెంటల్గా ప్రిపేర్ అవ్వండి. వాటిని ఎలా అధిగమించి ఎదుగుతారనేది ముఖ్యం'' అని డిప్యూటీ సీఎం పవన్కళ్యాణ్ వ్యాఖ్యానించారు. నామినేటెడ్ పదవులు పొందిన జనసేన నాయకులతో సోమవారం మంగళగిరిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ''ఒక్కోసారి డబ్బులు కనిపించవు. అయినా, నామినేటెడ్ పదవి చిన్నది అనుకోకుండా సమర్థంగా నిర్వహించాలి. ఊర్లో రోడ్డు లేకపోతే పవన్కళ్యాణ్ దగ్గరకు వెళ్తే రోడ్డు వస్తది అన్నారంటే వైఫల్యమే. అది జిల్లా కలెక్టరో, ఎమ్మెల్యేనో, సర్పంచో చేయాల్సిన పని. ఉప ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి వస్తేనే పరిష్కారం అవుతుందంటే ప్రజాస్వామ్య లక్షణాన్ని బలహీనపరిచినట్లే'' అని అన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధనకు కృషి చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును పోలవరం ప్రాజెక్టుకు పెట్టాలని పవన్ సూచించారు. 'కొన్ని ప్రభుత్వ పాలసీలలో లోపాలున్నాయి. రాష్ట్రంలో పటిష్ఠ శాంతిభద్రతలతో పాటు సేఫ్టీ టూరిజం పాలసీ ఉండాలి. సింగపూర్ తరహా పాలన చాలా అవసరం' అని వ్యాఖ్యానించారు. 'స్థానిక ఎన్నికల్లో జనసేన బలంగా నిలవాలంటే పార్టీ సంస్థాగత నిర్మాణం అవసరం. సభ్యత్వ నమోదును మార్చిలోగా పూర్తి చేయాలి. మార్చి 14న పార్టీ ఆవిర్భావ వేడుకలను కొత్త తరం యువతను ఉద్దేశించి నిర్వహించనున్నాం'' అని చెప్పుకొచ్చారు. తాను ఒక కులం కోసం జనసేన పార్టీని స్థాపించలేదని తెలిపారు. తనను ఒక కులానికి పరిమితం చేయాలనుకోవడం కొందరి ఎత్తుగడ కావొచ్చని, తమ ఇంటిలో కుల ప్రస్తావనే రాదని పవన్ పేర్కొన్నారు. వైఎస్సార్సీపీ ఒక పార్టీ అయితే విధానాలపై మాట్లాడాలని, ఆకు రౌడీలను సపోర్ట్ చేస్తామనే వాళ్లను పార్టీగా గుర్తించనని పవన్ వ్యాఖ్యానించారు. 'పోలీసులు, కాంట్రాక్టర్లను మాజీ సీఎం బెదిరించడమంటే తప్పుడు సంకేతం. ఇలాంటి మాటలు శాశ్వతంగా రాకుండా ఏం చేయాలో నాకు బాగా తెలుసు. వైఎస్సార్సీపీ నేతలు బెదిరించడం మానేయాలి'' అని అన్నారు.

నకిలీ జీఎస్టీ నెట్వర్క్ గుట్టురట్టు

రూ.27.07 కోట్ల ఇన్పుట్ ట్యాక్స్ క్రెడిట్ కొల్లగొట్టిన ఘనులు

సాక్షి, విశాఖపట్నం: విశాఖలో మరో భారీ జీఎస్టీ కుంభకోణం వెలుగుచూసింది. ఎలాంటి వస్తువులు కొనుగోళ్లు, అమ్మకాలు జరపకుండానే నకిలీ బిల్లులు సృష్టించి, సుమారు రూ.27.07 కోట్ల మేర ఇన్పుట్ ట్యాక్స్ క్రెడిట్ను అక్రమంగా పొందిన ఓ నెట్వర్క్ను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ (డీజీజీఐ) అధికారులు బట్టబయలు చేశారు. ఈ వ్యవహారంలో కీలక సూత్రధారిగా భావిస్తున్న మల్లికార్జున మనోజ్కుమార్ను అధికారులు మంగళవారం రాత్రి అరెస్టు చేశారు. డీజీజీఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడు పలు డమ్మీ కంపెనీలను సృష్టించి, నకిలీ ఇన్వాయిస్ల ద్వారా ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులను ఎగ్గొట్టడమే కాకుండా, అక్రమంగా ఇన్పుట్ ట్యాక్స్ క్రెడిట్ను క్లెయిమ్ చేసుకున్నట్లు గుర్తించారు. ఇలా ఇప్పటివరకు రూ.27.07 కోట్ల ఇన్పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందగా, మరో రూ.15.30 కోట్ల ఇన్పుట్ ట్యాక్స్ క్రెడిట్ను ఇతరులకు బదిలీ చేసినట్లు అధికారుల విచారణలో వెల్లడైంది. ఇన్వాయిస్ మొత్తంలో 3 శాతాన్ని కమీషన్ ఉంచుకుని, మిగిలిన డబ్బును వివిధ ఖాతాల ద్వారా మళ్లించి.. చివరకు నగదు రూపంలో విత్డ్రా చేసుకున్నట్లు దర్యాప్తులో తేలింది. తమ విచారణలో సేకరించిన ఆధారాలతో మల్లికార్జున మనోజ్ కుమార్ను ఈ నెట్వర్క్ ఆపరేటర్గా గుర్తించినట్లు డీజీజీఐ అధికారులు తెలిపారు.

బార్ల విషయంలో జనాభా నిర్వచనాన్ని మార్చటానికి వీల్లేదు

- అధికారిక జనాభా లెక్కల ఆధారంగానే రిటైల్ ఎక్సైజ్ వసూలు చేయాలి
- మున్సిపల్ కమిషనర్ లెక్కలకు శాస్త్రీయ ప్రామాణికత లేదు
- హైకోర్టు స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: అధికారిక జనాభా లెక్కల ఆధారంగానే మద్యం బార్ల నుంచి రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ (ఆర్ఈటీ) వసూలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టం చేసింది. చట్ట నిబంధనల్లో నిర్దేశించిన 'జనాభా' నిర్వచనాన్ని ఇష్టారాజ్యంగా మార్చడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. అధికారిక జనాభా లెక్కలకు విరుద్ధంగా, శాస్త్రీయ ప్రామాణికత లేకుండా జనాభా సంఖ్యను పెంచి చూపడానికి వీల్లేదని పేర్కొంది. 2011 తరువాత జనగణన జరగలేదని, అందువల్ల ఆ కాలానికి ఉన్న జనాభానే రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ ఖరారుకు ప్రామాణికంగానే తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. 50 వేలకంటే తక్కువ జనాభా ఉన్న మున్సిపాలిటీల్లో రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ రూ.35 లక్షలే వసూలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కడప జిల్లా మైదుకూరు మున్సిపల్ జనాభా 50వేల కన్నా తక్కువ ఉన్న నేపథ్యంలో ఆర్ఈటీని రూ.55 లక్షల నుంచి రూ.35 లక్షలకు సవరించాలని కోరుతూ లక్ష్మీ వెంకటేశ్వర రెస్టారెంట్ అండ్ బార్ యజమాని సీజీ వెంకటసుబ్బయ్య వినతిని తిరస్కరిస్తూ కడప జిల్లా ఎక్సైజ్ అధికారి జారీ చేసిన ప్రొసీడింగ్స్ను రద్దు చేసింది. తాము వ్యక్తం చేసిన ఈ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఎక్సైజ్ ట్యాక్స్ను రూ.35 లక్షలకు సవరించాలన్న సుబ్బయ్య అభ్యర్థనను మరోసారి పరిశీలించాలని ఆదేశించింది. ఆరు వారాల్లోపు నిర్ణయం తీసుకోవాలని.. లేనిపక్షంలో రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ను ఏడాదికి రూ.35 లక్షలు మాత్రమే వసూలు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు ఇటీవల తీర్పు వెలువరించారు. లక్ష్మీ వెంకటేశ్వర రెస్టారెంట్ అండ్ బార్ యజమాని సీజీ వెంకటసుబ్బయ్య హైకోర్టులో దాఖలు చేసిన వ్యాజ్యంపై విచారణ జరిపిన జస్టిస్ తర్లాడ రాజశేఖర్ పైన పేర్కొన్న ఉత్తర్వులు జారీ చేశారు.

సీఐపై కత్తితో యువకుడు దాడి

- మద్యం సేవిస్తుండగా స్నేహితుల మధ్య గొడవ
- రాజా అనే యువకుడిని కత్తితో పొడిచిన మరో యువకుడు అజయ్
- పట్టుకోవడానికి వెళ్లిన సీఐపై దాడి చేయడంతో సర్వీస్ రివాల్వర్తో కాల్పులు

అజయ్ను ఆస్పత్రికి తీసుకొస్తున్న పోలీసులు (ఇన్సెట్లో) గాయపడ్డ సీఐ

రాప్తాడురూరల్: అనంతపురం నగర శివార్లలో కాల్పుల మోత సంచలనం కలిగించింది. రెండు హత్యాయత్నాల కేసుల్లో నిందితున్ని పట్టుకోవడానికి వెళ్లిన సీఐపై కత్తితో దాడి చేయడంతో.. ప్రతిఘటించే క్రమంలో సీఐ తన సర్వీస్ రివాల్వర్తో కాల్చిన సంచలన ఘటన అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లి సమీపంలో జరిగింది. వివరాలు.. అనంతపురం నగరం నాయక్నగర్కు చెందిన చాకలి రాజా, సొహైల్, అక్రం, అజయ్ స్నేహితులు. వీరు ఆదివారం రాత్రి 8.15 గంటల సమయంలో నగరంలోని అరవిందనగర్లో అయ్యప్ప కేఫ్ వద్ద మద్యం సేవిస్తుండగా గొడవపడ్డారు. ఈక్రమంలో తీవ్ర ఆగ్రహానికి గురైన అజయ్ తన స్నేహితుడు చాకలి రాజాను కత్తితో కడుపులో బలంగా పొడవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించగా వెంటిలేటర్పై చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు అజయ్ కోసం గాలింపు చేపట్టారు.

మఫ్టీలో వెళ్లిన పోలీసులపై దాడికి యత్నం..

నిందితుడు అజయ్ సోమవారం ఉదయం 8.30 గంటల సమయంలో టీవీ టవర్ సమీపంలోని షికారు కాలనీలో ఉన్నాడనే సమాచారం అందడంతో ఇన్ఫార్మర్ ఆటోడ్రైవర్ బాబాను వెంట బెట్టుకుని టూటౌన్ సీఐ శ్రీకాంత్, ఎస్ఐ రుష్యేంద్రబాబు, సిబ్బంది మఫ్టీలో వెళ్లారు. పోలీసులు రౌండప్ చేయడాన్ని పసిగట్టిన అజయ్.. తన దగ్గరికి వస్తున్న ఆటోడ్రైవరు బాబాను ఒక్కసారిగా కత్తితో పొడిచాడు. ఆపై వీరంగం సృష్టిస్తూ మహిళలను కత్తితో బెదిరిస్తూ ముళ్లపొదల్లోకి దూరి పారిపోయాడు.

చెరుకు తోటలో నక్కి ఉండి.. సీఐపై అటాక్..

వరుసగా దాడులకు పాల్పడుతున్న అజయ్ను పట్టుకోవాలని సవాల్గా తీసుకున్న పోలీసులకు ఆకుతోటపల్లి సమీపంలోని కందుకూరుకు వెళ్లే దారిలో ఓ చెరుకుతోటలో నిందితుడు దాక్కున్నట్లు సమాచారం రావడంతో చుట్టూ మోహరించారు. చెరుకు తోట ఏపుగా ఉండడంతో సీఐ శ్రీకాంత్ లోపలకు వెళ్లి లొంగిపోవాలని కోరాడు. అయితే సీఐ దగ్గరకు సమీపిస్తుండగా అజయ్ ఒక్కసారిగా కత్తితో దాడి చేయడంతో భుజానికి గాయమైంది. మరోమారు దాడి చేసేందుకు రావడాన్ని గమనించిన సీఐ అప్రమత్తమై తన సర్వీస్ రివాల్వర్తో రెండు రౌండ్లు కాల్చాడు. ఒక బుల్లెట్ అజయ్ మోకాలిలో దూరి బయటకు రావడంతో అక్కడే పడిపోయాడు. మరోవైపు సీఐ శ్రీకాంత్ గాయపడడంతో అక్కడే ఉండగా సిబ్బంది అక్కడికి చేరుకుని ఇద్దరినీ ఆస్పత్రికి తరలించారు. అజయ్ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా, సీఐ శ్రీకాంత్ పై యువకుడు కత్తితో దాడి చేయడాన్ని ఏపీ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయభాస్కర్ ఓ ప్రకటనలో ఖండించారు.

అజయ్పై హత్యాయత్నం కేసు: ఎస్పీ జగదీష్

సీఐ శ్రీకాంత్పై కత్తితో దాడి చేసిన నిందితుడు అజయ్పై ఇటుకలపల్లి పోలీస్స్టేషన్లో హత్యాయత్నం కేసు నమోదైంది. సీఐ శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై రెండు కేసులు నమోదు చేశారు. ఘటనాస్థలాన్ని పరిశీంచిన ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ నిందితుడిపై గతంలోనూ క్రిమినల్ కేసులున్నాయన్నారు. చట్టపరంగా నిందితుడిపై కఠిన చర్యలతో పాటు వారి కుటుంబ ఆస్తుల జప్తునకు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామన్నారు.

అన్నను హత్య చేసిందని వదినను చంపిన మరిది

కర్నూలు జిల్లాలో ఘటన

ఆస్పరి: తన అన్నను హత్య చేసిందనే కక్షతో వదినను మరిది హతమార్చాడు. ఈ ఘటన కర్నూలు జిల్లా ఆస్పరి మండలం తొగలుగల్లు గ్రామంలో జరిగింది. గ్రామస్తులు, సీఐ తెలిపిన వివరాల మేరకు..ఈ ఏడాది సెప్టెంబర్ 3న తొగలుగల్లు గ్రామ సమీపంలో అహోబిలం అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఈ హత్యను హతుడి భార్య గంగావతి(26), ఆమె ప్రియుడు చెన్నబసవ కలిసి చేసినట్లు ఆస్పరి పోలీసులు కేసు నమోదు చేసి ఇరువురినీ అదే నెల 8న అరెస్టు చేశారు. అక్టోబర్ 18న గంగావతికి బెయిల్ వచ్చింది. అనంతరం వారం పాటు బంధువుల ఇళ్లల్లో ఉన్న గంగావతి తన స్వగ్రామమైన తొగలుగల్లుకు ఇటీవల వచ్చి రేకుల షెడ్డులో తన పిల్లలతో ఉంటోంది. ఈ క్రమంలో తన అన్నను చంపిన వదిన గంగావతిపై మరిది గొల్ల పెద్దయ్య కక్ష పెంచుకున్నాడు. ఆదివారం రాత్రి గంగావతి పిల్లలు నిద్రించేందుకు తమ బంధువుల ఇంటికి వెళ్లారు. దీన్ని అదునుగా చేసుకున్న గొల్ల పెద్దయ్య.. గంగావతి నిద్రిస్తుండగా రేకుల షెడ్డు గడియ తీసి రోకలి కట్టెతో ఆమెపై దాడి చేసి దారుణంగా హత్య చేశాడు. ఆపై సోమవారం ఉదయం పోలీసులకు లొంగిపోయాడు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, అహోబిలం, గంగావతి దంపతులకు భరత్(7), వర్షిణి(5) సంతానం. వివాహేతర సంబంధం ఈ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. తల్లిదండ్రులు ఇద్దరూ హత్యకు గురవడంతో పిల్లలు అనాథలయ్యారు.

టెట్పై ప్రభుత్వం సుప్రీంలో రివ్యూ పిటిషన్ వేయాలి

- సవరణ తీసుకొచ్చేలా కేంద్రానికి లేఖ రాయాలి
- వైఎస్సార్సీపీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్ రెడ్డి

సాక్షి,అమరావతి: సర్వీస్లో ఉన్న టీచర్లకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇచ్చేలా ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని, ఉద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం ప్రధానమంత్రి, కేంద్ర విద్యాశాఖ మంత్రితో మాట్లాడి టెట్ నుంచి సర్వీస్ టీచర్లను మినహాయించాలని వైఎస్సార్సీపీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్రెడ్డి సీఎం చంద్రబాబును డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. టీచర్లకు మద్దతుగా టీడీపీ ఎంపీలు పార్లమెంట్లో గళం విప్పి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నారు. ఉద్యోగాలు ఊడపెరికేసి ఇంటికి పంపేసేలా టీచర్లను కూటమి ప్రభుత్వం వేధిస్తోందని విమర్శించారు. అక్టోబర్ 18న తనను కలిసిన టీచర్లతో టెట్ నుంచి మినహాయింపు దక్కేలా చూస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు, నాలుగు రోజులకే మాట మార్చి అందరూ పరీక్ష పాసవ్వాలని అక్టోబర్ 22న టెట్ నోటిఫికేషన్ ఇచ్చారని ధ్వజమెత్తారు. ప్రమోషన్ వద్దనుకునే వారికి, ఐదేళ్లలోపు రిటైర్ అయ్యే వారికే టెట్ పాస్ నుంచి మినహాయింపు ఇస్తామని చెప్పడం ఉద్యోగులను బ్లాక్మెయిల్ చేయడమేనని మండిపడ్డారు. 20 ఏళ్లుగా ఒక సబ్జెక్ట్ టీచర్గా పనిచేస్తున్న వారు కొత్తగా అన్ని సబ్జెక్టులూ ప్రిపేర్ అయ్యి పరీక్ష పాస్ కావడం ఎంత కష్టమో ప్రభుత్వానికి తెలియదా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా టీచర్ల అభిప్రాయాలకు భిన్నంగా వ్యవహరించడం ప్రభుత్వానికి మంచిది కాదని చంద్రశేఖర్ రెడ్డి హెచ్చరించారు. టీచర్ల ఉద్యోగాలకు ఎసరుపెట్టే యత్నాలను వైఎస్సార్సీపీ అడ్డుకుంటుందని స్పష్టం చేశారు.

నకిలీ కార్ల ముఠా అరెస్ట్

చిలకలూరిపేట రోడ్డు ప్రమాద ఘటనతో వెలుగులోకి.. నలుగురి అరెస్ట్.. 20 కార్లు స్వాధీనం

నరసరావుపేట రూరల్: నకిలీ కార్ల ముఠాను అరెస్ట్ చేసి వారి నుంచి 20 కార్లను స్వాధీనం చేసుకున్నట్లు పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు. సోమవారం నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్లో ఆయన విలేకరులకు ఈ కేసు వివరాలను వెల్లడించారు. ఈనెల 12న విజయవాడకు చెందిన పుల్లా శ్రీనివాసరెడ్డి తన కారును నకరికల్లుకు చెందిన పుల్లంశెట్టి అంజినాయుడు వద్ద తాకట్టు పెట్టగా, అసలు, వడ్డీ చెల్లించినా కారు తిరిగి ఇవ్వకుండా నంబర్ ప్లేట్ను మార్చి తిరుగుతున్నట్లు నరసరావుపేట రూరల్ స్టేషన్లో ఫిర్యాదు అందిందన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు అంజినాయుడు ఇచ్చిన సమాచారంతో నకరికల్లు మండలం నర్సింగపాడుకు చెందిన పుల్లంశెట్టి భానుప్రకాష్, గురజాలకు చెందిన షేక్ మహమ్మద్ రఫీ, హైదరాబాద్కు చెందిన మధ్యాహ్నపు మోహన సత్యశ్రీనివాస్లు రావిపాడు రోడ్డు చెక్పోస్ట్ వద్ద 3 కార్లు తీసుకుని విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. విచారణలో 3 కార్లకు ఎటువంటి డాక్యుమెంట్లు లేకపోవడంతో వాటిని సీజ్ చేశామన్నారు. నిందితులను విచారించగా.. ఫైనాన్స్ సంస్థలకు బకాయిలు ఎగ్గొట్టేందుకు నంబర్ ప్లేట్లు మార్చినట్లు నేరాన్ని అంగీకరించినట్లు చెప్పారు. ఈ విధంగా తాకట్టు పెట్టుకునే క్రమంలో ఒక ముఠాగా ఏర్పడి పలు ఫైనాన్స్ సంస్థల నుంచి 20 కార్లను తీసుకున్నట్లు తెలిపారు. ఆయా కార్లకు నెలవారి కిస్తీలు చెల్లించకుండా నంబర్ ప్లేట్లు మార్చి అద్దెకు తిప్పుతున్నట్లు విచారణలో తేలిందన్నారు. దీంతో పాటు కొందరు యజమానుల నుంచి కార్లను తాకట్టు రూపంలో తీసుకుని అసలు, వడ్డీ చెల్లించినా కార్లు తిరిగి ఇవ్వకుండా బెదిరించి బలవంతపు అగ్రిమెంట్లు తీసుకున్నారన్నారు. ఆ విధంగా 20 కార్లను తీసుకుని కొన్నిటికి నంబర్లు మార్చి, మరికొన్నిటికి ఫైనాన్స్ ఎగ్గొట్టారని తెలిపారు. ఒక వాహనానికి రిజిస్ట్రేషన్ నంబర్ను మరొక వాహనానికి మార్చారని చెప్పారు.

స్వాధీనం చేసుకున్న కార్లతో జిల్లా ఎస్పీ కృష్ణారావు

వెలుగులోకి వచ్చిందిలా..

చిలకలూరిపేట బైపాస్ రోడ్డు ప్రమాదంలో ఐదుగురు ఇంజనీరింగ్ విద్యార్థుల మృతి కేసులో నిందితులు వినియోగించిన కారుపై విచారణ జరపడంతో నకిలీ కార్ల వినియోగం వెలుగు చూసింది. నకిలీ కార్ల కేసులో ఇప్పటికే నలుగురిని అరెస్ట్ చేయగా మరో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేయాల్సి ఉందని ఎస్పీ చెప్పారు. నకరికల్లు గ్రామానికి చెందిన పొనుగంటి రామకృష్ణ అలియాస్ ఆర్కే, హైద్రాబాద్కు చెందిన భానుప్రకాష్గౌడ్, వైజాగ్కు చెందిన వర్మ, నరసరావుపేటకు చెందిన ఏఎస్ఐ కుమారుడు మదమంచి వెంకట అనుజ్ఞనాయుడు, పుల్లంశెట్టి మహేష్బాబులను అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు. నిందితులకు కార్లకు సంబంధించిన నకిలీ డాక్యుమెంట్లు అందించడంలో ప్రకాష్ గౌడ్, సత్యశ్రీనివాస్, వర్మలు సహకరించారని తెలిపారు. ఇద్దరు పోలీసు అధికారులు కూడా గతంలో నిందితుల నుంచి వాహనాలు కొనుగోలు చేసినట్టు విచారణలో తెలిసిందన్నారు. ఆ వాహనాలను అప్పుడే సదరు ఫైనాన్స్ సంస్థకు అప్పగించినట్టు తెలిపారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
I.T. డిపార్ట్మెంట్
ఇ–ప్రొక్యూర్మెంట్ టెండరు ప్రకటన
Adv. No.17/TTD-11021(91)/5/2025-IT-TTD, తేది: 22-12-2025
దిగువ NIT నంబర్లతో గల పనుల కోసం ఇ-ప్రొక్యూర్మెంట్ ప్లాట్ఫారంపై ఆన్లైన్ ఓపెన్ టెండర్లు కోరబడుచున్నవి.
NIT No.115 to 123/EDPM/TTD/TPT/2025-26
టెండరు ప్రకటన కోసం http://www.tirumala.org ని దర్శించండి. ఇ-టెండర్లో పాల్గొనుటకు https://tender.apeprocurement.gov.inకు లాగాన్ అవ్వండి లేదా https://www.apeprocurement.gov.in కు లాగాన్ అవ్వండి.
TTD-40021/10/2025-PRO SEC(Adv.No.331), Dt:22-12-2025 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ & ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్
CDS బిల్డింగ్, గవర్నమెంట్ హాస్పిటల్ ప్రిమిసెస్, N.R.పేట్, ఏలూరు, ఏలూరు జిల్లా.
ఫోన్ నం. 9014042853, ఇ-మెయిల్ ఐడి: seapmsidceluru@gmail.com
టెండరు ప్రకటన నం. 03/APMSIDC/SE-ELR/PA/2025-26/ తేది:20-12-2025
పూర్తి మొత్తం రూ.1,72,36,934/-లతో 6 పనులు అనగా 1) ఏలూరు జిల్లాలో దెందులూరు, భీమడోలు & తూర్పుగోదావరి జిల్లాలో గోకవరం, నిడదవోలు వద్ద 4 నం.ల మరమ్మతులు & పునరాభివృద్ధి పనులు, 2) మచిలీపట్నం వద్ద GGHలో ఆయుష్ బిల్డింగ్ నిర్మాణం, 3) కృష్ణా జిల్లాలో కౌతవరం వద్ద BPHU నిర్మాణం కోసం ఇ-ప్రొక్యూర్మెంట్ ప్లాట్ఫారం ద్వారా ఇ-టెండర్లు కోరబడుచున్నవి. తదుపరి వివరాలను వెబ్సైట్ http://www.tender.apeprocurement.gov.in వద్ద చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, APMSIDC సర్కిల్, ఏలూరు
DIPR RO No.4692PP/CL/Advt/1/1/2021-22, Dt: 22.12.2025



పాలసంద్రంలో కృష్ణశిల

తెల్లని నురగలతో నిండిన పాలసంద్రంలోకి పడిపోతున్న నల్లరాయిలా కన్పిస్తున్న ఈ శిల వాస్తవానికి ఒక ఉపగ్రహం. దీని పేరు ఫోబోస్. ఇది అంగారకుని చుట్టూ పరిభ్రమిస్తోంది. మార్స్‌కు అత్యంత సమీపంగా అంతర్గత కక్ష్యలో తిరిగే ఈ ఫోబోస్ తాజా ఫొటోలను యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ(ఈఎస్ఏ) ఇటీవల క్లిక్ మనిపించి విడుదలచేసింది. ఇమేజ్ స్పెషలిస్ట్ అయిన ఆండ్రియా లక్ ఈ ఫొటోలను అందరితో పంచుకున్నారు. ఈఎస్ఏ వారి 'మార్స్ ఎక్స్‌ప్రెస్ ఆర్బిటార్' ద్వారా ఈ ఫొటోలను తీశారు. ఓ పెద్ద బంగాళదుంపను తలపించేలా ఉన్నట్టు రాయిలా ఈ ఉపగ్రహం భలేగా కన్పిస్తోందని ఒక నెటిజన్ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్‌పెట్టారు. సౌరవ్యవస్థలోనే అత్యంత వైవిధ్యమైన నేలలున్న గ్రహంగా మార్స్ పేరొందింది. విస్తారమైన అగ్నిపర్వత నేలలు, రుధిరవర్ణ ఉపరితలం మీదుగా గగనతలంలో నల్లటి ఫోబోస్ దూసుకుపోవడం ఫొటోల్లో మరింత అందంగా కన్పిస్తోంది. ఫోబోస్ వెడల్పు 27 కిలోమీటర్లు మాత్రమే. అత్యల్ప స్థాయి సహజ ఉపగ్రహాల తీరుతెన్నులను గమనించేందుకు ఇలాంటి ఫొటోలు అక్కరకొస్తాయని ఖగోళ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

-సాక్షి, నేషనల్ డెస్క్

స్టార్‌లింక్ శాటిలైట్లకు రష్యా ముప్పు

ఉపగ్రహాలను ధ్వంసంచేసే అధునాతన ఆయుధతయారీలో రష్యా బిజీ

- పశ్చిమదేశాల నిఘా వర్గాల సమాచారం
- మిల్లీమీటర్ పొడవుండే వందలాది పెల్లెట్లతో దాడి!

పారిస్: ప్రొపల్షన్ సిస్టమ్ సమస్యతో ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ ఉపగ్రహ కూటమిలోని కృత్రిమ ఉపగ్రహం '35956' అదుపుతప్పి భూమి దిశగా కదులుతూ కొత్త ముప్పుమోసుకొస్తుంటే మరోవైపు పెను ముప్పు రష్యారూపంలో పొంచి ఉందని పశ్చిమదేశాల నిఘా వర్గాలు ఆందోళనవ్యక్తంచేశాయి. అంతరిక్షంలో కక్ష్యలో తిరిగే వందలాది కృత్రిమ ఉపగ్రహాలను పెల్లెట్లతో రాల్చేసే అధునాతన ఆయుధాన్ని తయారు చేయడంలో రష్యా తలమునకలైందని పశ్చిమదేశాల నిఘా వర్గాలు అనుమానం వ్యక్తంచేస్తున్నాయి. ఈ మేరకు నిఘా సమాచారంతో ది అసోసియేటెడ్ ప్రెస్ వార్తాసంస్థ ఒక కథనాన్ని వెలువరించింది.

దాని పేరు జీరో ఎఫెక్ట్

అంతరిక్షంలోని ఉపగ్రహాలపైకి అత్యంత సాంద్రతతో తయారుచేసిన సూక్ష్మ పెల్లెట్లను ప్రయోగించి వాటికి తీవ్ర నష్టం కలిగేలా చేయడమే రష్యా ఆయుధం అసలు లక్ష్యం. ఈ ఆయుధానికి 'జీరో ఎఫెక్ట్' అని పేరుపెట్టినట్లు తెలుస్తోంది. వందలాది పెల్లెట్లను ఒకేసారి ప్రయోగించడంతో వాటి ధాటికి ఒకేసారి పెద్ద సంఖ్యలో శాటిలైట్లను సర్వనాశనం అవుతాయి. ఇవి చిన్నచిన్న ముక్కలుగా శకలాలుగా చెల్లాచెదురుగా పడటంతో సమీప కక్ష్యల్లోని ఇతర ఉపగ్రహాలకు సైతం దెబ్బతింటాయి. దీంతో వినాశనం ఊహించనంత పెద్దదిగా ఉంటుంది. ఇంతటి పెనువినాశనం సృష్టించగల ఆయుధాన్ని రష్యా సృష్టించకుండా ఉంటుందని తాము భావించట్లేదని అమెరికాలోని ప్రభుత్వేతర 'సెక్యూర్ వరల్డ్ ఫౌండేషన్'లోని అంతరిక్ష భద్రతా నిపుణుడు విక్టోరియా సామ్సన్, కెనడా సైన్యంలోని అంతరిక్ష విభాగ బ్రిగేడియర్ జనరల్ క్రిస్టోఫర్ హోర్నర్ వ్యాఖ్యానించారు. జీరో ఎఫెక్ట్ ఆయుధ తయారీ మీడియా ప్రశ్నించగా రష్యా అధ్యక్షకార్యాలయం అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ డొంకతిరుగుడు సమాధానం చెప్పారు. '' కక్ష్యలో తిరుగుతోన్నా సామర్థ్యమున్న ఆయుధాల ప్రయోగాలను శత్రుదేశాలు ఆపేలా ఐరాస చొరవచూపాలి. అయినా అణ్వస్త్ర సామర్థ్యమున్న అంతరిక్ష ఆయుధాలను మోహరించబోమని పుతిన్ గతంలోనే చెప్పారు'' అని పెస్కోవ్ వ్యాఖ్యానించారు. తక్కువ ఎత్తులో తిరిగే స్టార్‌లింక్ ఉపగ్రహాలు రష్యా గగనతలంపై నిఘా పెట్టి ఉక్రెయిన్ దిశలో రష్యా సేనల జాడను గుర్తించి ఉక్రెయిన్‌కు అందిస్తున్నాయి. దీంతో స్టార్‌లింక్ ఉపగ్రహాలు తమ సార్వభౌమత్వం, భద్రతకు ముప్పుగా వాటిల్లుతుందని వీటిని నాశనంచేయాలని రష్యా భావిస్తోందని పశ్చిమాసియా నిఘా వర్గాలు నిర్ధారించాయి.

పొడవు మిల్లీమీటర్!

''హఠాత్తుగా నింగిలోకి దూసుకెళ్లిన రాకెట్ల వంటి వాటినే గుర్తించగలం. కేవలం మిల్లీమీటర్ పొడవుండే సూక్ష్మ పెల్లెట్లను భూతల, గగనతల నిఘా వ్యవస్థలు గుర్తించలేవు. వీటితో ఉపగ్రహాలపై దాడి చేస్తే నష్టనివారణ అసాధ్యం. పెల్లెట్ల దెబ్బకు ఒక కక్ష్యలోని ఉపగ్రహాలన్నీ నాశనంఅవుతాయి. అదేకాకుండా దాడి చేసింది రష్యానే అని నిరూపించడం కూడా చాలా కష్టం. మిల్లీమీటర్ పొడవు పెల్లెట్లతో ఉపగ్రహాలకు మరణశాసనం రాయొచ్చు. చైనా ఉదంతమే ఇందుకు చక్కటి ఉదాహరణ. నవంబర్‌లో సూక్ష్మస్థాయి అంతరిక్ష శకలం తగిలి చైనా వ్యోమనౌక దెబ్బతింది. దాంతో చైనా సొంత అంతరిక్ష కేంద్రం నుంచి అది బయల్దేరలేక అక్కడే ఉండిపోయింది. దాంతో దాని ద్వారా భూమి మీదకు రావాల్సిన చైనా వ్యోమగాములు సైతం అక్కడే చిక్కుబడిపోయారు'' అని బ్రిగేడియర్ జనరల్ క్రిస్టోఫర్ హోర్నర్ ఆందోళన వ్యక్తంచేశారు. '' ఉపగ్రహాల ఉపరితలాల్లో అధిక ప్రాంతాన్ని ఆక్రమించేవి సౌర ఫలకాలే. పెల్లెట్లు ఉపరిపడితే ఇవన్నీ బద్దలవుతాయి. అప్పుడు ఉపగ్రహం మనుగడ ప్రశ్నార్థకమవుతుంది'' అని వాషింగ్టన్‌లోని 'సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్'లో అంతరిక్ష భద్రత, ఆయుధాల నిపుణుడు క్లేటన్ స్వాప్ చెప్పారు. స్టార్‌లింక్ ఉపగ్రహాలు భూమి నుంచి ఆకాశంలో 500 కిలోమీటర్ల ఎత్తులో సంచరిస్తున్నాయి. వీటి కింది కక్ష్యల్లో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం, చైనా వారి తియాంగ్ స్పేస్ స్టేషన్ తిరుగుతున్నాయి. రష్యా దాడి చేస్తే ఉపగ్రహాల శకలాలుగా ఛిద్రమై అవి ఐఎస్ఎస్, తియాంగ్ స్పేస్‌స్టేషన్లనూ నాశనంచేసే ఆస్కారముంది.

కొండలపై కత్తి!

- ప్రమాదంలో ఆరావళి పర్వతాల మనుగడ
- 100 మీటర్లు మించితేనే గుట్టలు: సుప్రీం
- ప్రమాదకరమైన తీర్పు: పర్యావరణవాదులు
- 90 శాతం ఆరావళి త్వరలో మటుమాయమే
- ఉత్తరాది ఎడారైపోతుందంటూ హెచ్చరికలు

ఒకసారి కాలంలో ఓ 300 కోట్ల ఏళ్లు వెనక్కి వెళ్లి, అంతరిక్షం నుంచి ప్రస్తుత భారతదేశాన్ని ఒక్కసారి చూస్తే? ఉత్తర ప్రాంతంలో కన్పించే ఏకైక భౌగోళిక స్వరూపం ఏమిటో తెలుసా? ఆరావళీ పర్వత శ్రేణులు! భూమిపై అత్యంత పురాతన పర్వతాల్లో ఒకటిగా అది గుర్తింపు పొందింది. కానీ, వందలాది కోట్ల ఏళ్లుగా అతి కఠినమైన కాలపరీక్షకు తట్టుకుని మరీ ఉనికిని కాపాడుకుని నిలిచిన ఆరావళీ శ్రేణులు మనిషి పేరాశ పాలిట పడి త్వరలోనే ఉనికి కోల్పోయే ప్రమాదంలో పడ్డాయి. వాటి పరిరక్షణకు తాము చిరకాలంగా చేస్తున్న ప్రయత్నాలకు సుప్రీంకోర్టు ఇటీవలి తీర్పు గొడ్డలిపెట్టుగా మారిందని పర్యావరణవేత్తలు వాపోతున్నారు. ''ఫలితంగా పంజాబ్, హరియాణా మొదలుకుని దేశ రాజధాని ఢిల్లీ దాకా ఆరావళి శ్రేణులు చూస్తుండగానే గనులుగా, రియల్ వెంచర్లుగా మారిపోవడం ఖాయం. అదే జరిగితే థార్ ఎడారి అడ్డూ అదుపూ లేకుండా విస్తరిస్తుంది. దాంతో ఉత్తరాదిలో చాలా భాగం అతి త్వరలోనే ఎడారిగా మారిపోతుంది''అని హెచ్చరిస్తున్నారు! ఆరావళి. గుజరాత్ మొదలుకుని ఢిల్లీ దాకా 650 కిలోమీటర్ల పైచిలుకు విస్తరించిన పర్వత శ్రేణులు. ఉత్తరాదిని అన్నివిధాలా పెట్టని కోటలా కాపాడుకుంటూ వస్తున్నాయి. థార్ ఎడారి తూర్పు దిశగా విస్తరించకుండా అడ్డుకుంటున్నాయి. ఉత్తరాదిన అంతంత మాత్రమే ఉండే భూగర్భ జలాలను గుజరాత్ నుంచి ఢిల్లీ దాకా 4 రాష్ట్రాల పరిధిలో ఎప్పటికప్పుడు రీచార్జి చేయడమే గాక రాజధాని ప్రాంతంలోని అపార కాలుష్యాన్ని వీలైనంత మేరకు తగ్గిస్తున్నాయి.

కోర్టు తీర్పుతో...

ఆరావళి రగడ ఇప్పటిది కాదు. దశాబ్దాలుగా ఉన్నదే. సుప్రీంకోర్టు ఇటీలి తీర్పుతో తాజాగా అది మరోసారి రగులుకుంది. అసలు ఆరావళి పర్వత శ్రేణుల నిర్వచనం పరిధిలోకి వచ్చే ప్రాంతాలు ఏమిటన్న దానిపై కోర్టు చిరకాలంగా విచారణ జరుపుతూ వస్తోంది. ఈ విషయంలో కేంద్రం వాదనతో ఏకీభవిస్తూ గత నవంబర్ 20న కోర్టు తీర్పు వెలువరించింది. దానిప్రకారం పరిసర ప్రాంతాలతో పోలిస్తే కనీసం 100 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తున్న వాటిని మాత్రమే గుట్టలుగా, అంటే ఆరావళీ ప్రాంతంగా గుర్తిస్తారు! ఇది చాలా ప్రమాదకరమైన తీర్పు అని విపక్షాలు మొత్తుకుంటున్నాయి. హరియాణా, దేశ రాజధాని ప్రాంతంలో అస్మదీయులైన రియల్టీ, ఇన్‌ఫ్రా వ్యాపార దిగ్గజాలకు మేలు చేసేందుకే కేంద్రం ఈ వాదన లేవనెత్తింది. దానితో సుప్రీంకోర్టు ఏకీభవించడం తీవ్ర పర్యవసానాలకు దారితీస్తుంది. దోపిడీదారులు ఇప్పుడిక చట్టబద్ధంగానే పేట్రేగుతారు''అని పేర్కొంటున్నాయి. పర్యావరణవేత్తలు కూడా ఈ వాదనతో ఏకీభవిస్తున్నారు. ఆరావళి శ్రేణుల్లో దాదాపు 90 శాతం ప్రాంతం 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తే ఉంటుందని వారు గుర్తు చేస్తున్నారు. ''కనుక నయా నిర్వచనం ప్రకారం అది గుట్టల లెక్కలోకి రాదు. కనుక అక్కడ గనులు తవ్వుకోవడం మొదలుకుని రియల్టీ వెంచర్ల దాకా ఏమైనా చేసుకోవచ్చు. కానీ ఇది పర్యావరణానికే గాక మొత్తం ఉత్తరాదికే తీరని నష్టం చేస్తుంది. చూస్తుండగానే ఢిల్లీ నుంచి పంజాబ్ దాకా ఏమాత్రమూ నివాసయోగ్యం కాకుండా పోవ డం ఖాయం ''అని వారు హెచ్చరిస్తున్నారు.

-సాక్షి, నేషనల్ డెస్క్

కొట్టిపారేస్తున్న కేంద్రం

పాలక బీజేపీ మాత్రం ఆరావళి విషయమై విపక్షాలు, పర్యావరణవేత్తల ఆందోళనలను అసంబద్ధమైనవిగా కొట్టిపారేస్తోంది. ఆరావళి శ్రేణుల నిర్వచనం విషయంలో సుప్రీంకోర్టు నిజానికి ఎలాంటి సడలింపులూ ఇవ్వలేదని కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్ చెప్పుకొచ్చారు. ఆరావళి శ్రేణులు నిత్యం పచ్చగా ఉండాలన్నదే కేంద్రం ఆకాంక్ష అన్నా రు. అయితే, '100 మీటర్ల ఎత్తు'నిర్వచనం ప్రపంచవ్యాప్తంగా అంగీకరించినదేనంటూ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారాయన! ఆరావళి శ్రేణుల్లో కేవలం 0.19 శాతం ప్రాంతంలో మాత్రమే మైనింగ్‌కు అనుమతిస్తున్నట్టు వివరించారు. మొత్తమ్మీద 90 శాతం పర్వతాలను పూర్తిస్థాయిలో పరిరక్షిస్తున్నామన్నారు.

సేవ్ ఆరావళి

అతి పురాతనమైన ఆరావళి పర్వత శ్రేణులను విధ్వంసం బారినుంచి కాపాడుకుందామంటూ ఆన్‌లైన్‌లో ఉద్యమం ఊపందుకుంటోంది. 'సేవ్ ఆరావళి'హాష్‌ట్యాగ్‌కు సోషల్ సైట్లలో మద్దతు వెల్లువెత్తుతోంది. ఇది క్రమంగా ఉత్తరాదిని దాటుకుని జాతీయ ఆందోళనగా రూపుదిద్దుకునే సూచనలు కన్పిస్తున్నాయి.

26న చీఫ్ సెక్రటరీల సదస్సు.. ప్రారంభించనున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఈ వారంలో జరిగే చీఫ్ సెక్రటరీల 5వ జాతీయ సదస్సును ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు మూడు రోజులపాటు ఈ సదస్సు కొనసాగుతుందని అధికారులు సోమవారం తెలిపారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ సదస్సుకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో పనిచేసే యువ జిల్లా కలెక్టర్లు, మేజిస్ట్రేట్లతోపాటు కేంద్ర మంత్రిత్వ శాఖలకు చెందిన పలువురు అధికారులు సైతం ఇందులో పాల్గొనే అవకాశముందని చెప్పారు.

న్యూజిలాండ్ భారత్ వాణిజ్య ఒప్పందం ఖరారు

- న్యూజిలాండ్ మార్కెట్లోకి పోటెత్తనున్న భారతీయ ఉత్పత్తులు
- వచ్చే ఐదేళ్లలో రెట్టింపు కానున్న ద్వైపాక్షిక వాణిజ్యం
- భారతీయ విద్యార్థులకు దీర్ఘకాలిక వర్క్ వీసాలు

న్యూఢిల్లీ: ద్వైపాక్షిక వాణిజ్యాన్ని ఐదేళ్లలో రెట్టింపు స్థాయికి చేర్చే లక్ష్యంతో భారత్, న్యూజిలాండ్ చరిత్రాత్మకమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ఖరారుచేసుకున్నాయి. సంబంధిత చర్చలు విజయవంతంగా ముగిశాయని ఇరుదేశాలు సోమవారం ప్రకటించాయి. భారత ప్రధాని మోదీ, న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్‌లు ఫోన్‌లో సంభాషించి ఒప్పందాన్ని ఖరారుచేశారని భారత విదేశాంగ శాఖ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. వచ్చే ఏడాది ప్రథమార్ధంలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేసే అవకాశముంది. వచ్చే ఐదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 5 బిలియన్ డాలర్ల స్థాయికి చేర్చే లక్ష్యంతో ఇరుదేశాలు ఉమ్మడిగా ముందుకుసాగనున్నాయి. న్యూజిలాండ్ నుంచి ఉన్ని, బొగ్గు, కలప మొదలు వైన్, అవకాడో, బ్లూబెర్రీల దాకా పలు రకాల ఉత్పత్తులపై 95 శాతం టారిఫ్‌ను భారత్ తొలగించనుంది. దీంతో ఇవన్నీ సరసమైన ధరలకు భారతీయులకు అందుబాటులోకి వచ్చే వీలుంది. భారతీయ ఎగుమతిదారుల నుంచి పాల ఉత్పత్తులు, ఉల్లి, చక్కెర, మసాలా దినుసులు, వంటనూనెలు, రబ్బర్‌దాకా పలు రకాల ఉత్పత్తులను న్యూజిలాండ్ మార్కెట్లోకి ఎగుమతిచేసి లాభాలను కళ్లజూడనున్నారు. తయారీ, మౌలికరంగం, సేవలు, ఆవిష్కరణలు, ఉపాధి కల్పనా రంగాల్లో వచ్చే 15 ఏళ్లలో న్యూజిలాండ్ 20 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టనుంది. ఆపిల్ ఎగుమతులపై టారిఫ్ ప్రయోజనాలు పొందనుంది. ఇరుదేశాల మధ్య పటిష్టమైన ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలతోపాటు రెండు దేశాల మార్కెట్లలోకి సరుకుల అనుమతి, నూతన పెట్టుబడుల ప్రోత్సాహం, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలపర్చుకోవడం, ఆవిష్కర్తలు, నూతన పరిశ్రమల స్థాపన సహా రైతులు, సూక్ష్మ,చిన్న,మధ్యతరహా పరిశ్రమలు, విద్యార్థులు, యువత ప్రయోజనాలే పరమావధిగా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసుకున్నామని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. భారతీయ పాడిరైతుల ప్రయోజనాలను కాపాడుతూ న్యూజిలాండ్ పాలు, పెరుగు, వెన్న, చీజ్ తదితర ఉత్పత్తులపై టారిఫ్‌లను యథాతథంగా కొనసాగించనున్నారు. కృత్రిమ తేనె, ఆయుధాలు, మొక్కజొన్న, బాదం, వజ్రాభరణాలు, కాపర్, అల్యూమినియం ఉత్పత్తులపై గతంలో మాదిరే భారత్ టారిఫ్ విధించనుంది.



వేల మంది భారతీయులకు ప్రయోజనం

న్యూజిలాండ్‌లోని నైపుణ్య ఉద్యోగాల్లోకి ఏటా 5,000 మంది భారతీయ విద్యార్థులకు అవకాశం కల్పిస్తూ వర్క్ వీసాలను ఇచ్చేందుకు న్యూజిలాండ్ అంగీకారం తెలిపింది. దీంతో ఆయుష్ వైద్యులు, యోగా నిపుణులు, పాకశాస్త్ర ప్రవీణులు, సంగీతం, ఐటీ, ఇంజనీరింగ్, ఆరోగ్యసంరక్షణ, విద్య, నిర్మాణ రంగాల్లో భారతీయులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. భారతీయ విద్యార్థులు న్యూజిలాండ్‌లో చదువుకునేకాలంలో గరిష్టంగా వారానికి 20 గంటలపాటు పనిచేసుకునేందుకు అనుమతిస్తారు. డిగ్రీ కోర్సు అయితే రెండేళ్ల వర్క్ వీసా, బ్యాచిలర్స్ డిగ్రీ(ఆనర్స్) లేదా సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్,మెడిసిన్(స్టెమ్) గ్రాడ్యుయేట్ అయితే మూడేళ్ల వర్క్ వీసా, పోస్ట్‌గ్రాడ్యుయేషన్ అయితే నాలుగేళ్ల వర్క్ వీసా ఇస్తారు. ఈ ఏడాది మార్చినెలలో భారత్‌లో న్యూజిలాండ్ ప్రధాని లక్సన్ పర్యటించిన కాలంలోనే ఈ ఒప్పందంపై విస్తృతస్థాయిలో చర్చలు జరిగాయని భారత వాణిజ్యశాఖ మంత్రి పియూష్ గోయల్ వ్యాఖ్యానించారు. భారత్‌లో కివీపండు, ఆపిల్, తేనె దిగుబడి పెంపే లక్ష్యంగా ఈ మూడింటి కోసం ప్రత్యేకంగా సాగు–సాంకేతికత చర్యా ప్రణాళికను రూపొందించనుంది. భారతీయ వైన్స్, స్పిరిట్‌లను న్యూజిలాండ్‌లోనూ రిజిస్ట్రేషన్ చేసే అక్కడి భౌగోళిక గుర్తింపు(జీఐ) ట్యాగ్ సంబంధ చట్టాలకు సవరణలు చేయనుంది. ఆయుష్, సంస్కృతి, మత్స్య, శ్రవణ దృశ్య పర్యాటకం, అటవీ, ఉద్యానవనాలతోపాటు వైద్యం, వ్యవసాయం వంటి సంప్రదాయ జ్ఞానపరంపరలోనూ సహకార దృక్పథంతో ముందుకుసాగుతాం'' అని మంత్రి గోయల్ చెప్పారు. ''చర్చలు కేవలం 9 నెలల్లోనే ఒప్పందం ఖరారు స్థాయికి చేరుకోవడం విశేషం. ఇది ఇరుదేశాల ప్రభుత్వాల పరిపాలనా సంకల్పానికి ప్రతీక'' అని ప్రధాని మోదీ 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు.

సౌదీ అరేబియా ఎడారి ఇసుకపై పర్చుకున్న మంచు

సౌదీపై మంచు దుప్పటి

- ఎడతెరపి కురుస్తున్న మంచు
- అమితాశ్చర్యంతో సౌదీ ప్రజలు
- వాతావరణ మార్పుల విపరిణామాల ఫలితమంటున్న శాస్త్రవేత్తలు

రియాద్: ఎటుచూసినా ఇసుక తిన్నెలు, భగభగమండే భానుడి సెగలు, భరించరాని వేడి, అత్యధిక ఉష్ణోగ్రతలకు చిరునామాగా నిలిచే సౌదీ అరేబియా ఎడారుల్లో ఇప్పుడు లెక్కలేనంత మంచు కుప్పలుతెప్పలుగా కనిపిస్తోంది. భారీ వర్షాలతో ముంపు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. చలికాలం కావడంతో రాత్రిపూట ఉష్ణోగ్రతలు అత్యంత కనిష్టాలకు పడిపోతున్నాయి. దీంతో తమ ఎడారుల్లో మంచు దుప్పట్లు పర్చుకోవడంతో సౌదీ స్థానికులు ఒకింత ఆశ్చర్యానికి, మరికొంద గందరగోళానికి గురవుతున్నారు. వాతావరణ మార్పుల విపరిణామాల కారణంగానే ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తుంటాయని వాతావరణ శాస్త్రవేత్తలు వ్యాఖ్యానించారు. ఈశాన్య సౌదీలో అత్యధికంగా మంచు కురుస్తోంది. తబుక్ ప్రావిన్స్‌లోని పర్వతాలన్నీ ఇసుకరేణువులపై పడిన మంచుతో దవళవర్ణ శోభను సంతరించుకున్నాయి. జిబెల్ అల్–లావాజ్ పరిధిలో సముద్రమట్టానికి 2,600 మీటర్ల ఎత్తులోని ప్రఖ్యాత ట్రోజెనా ప్రాంతం మొత్తం మంచుతో నిండిపోయింది. ఎడారి ఓడగా వినతికెక్కిన ఒంటెలన్నీ ఇప్పుడు మంచు చల్లదనాన్ని తెగ ఆస్వాదిస్తున్నాయి. ఎడారి ఇసుకతిన్నెలన్నీ తెలుపురంగులో మిలమిలా మెరిసిపోవడం, ఒంటెల శరీరాల మీదుగా మంచు పేరుకుపోయిన దృశ్యాలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. సముద్రమట్టం నుంచి అత్యంత ఎత్తయిన ప్రదేశాల్లో తెల్లవారుజామున ఉష్ణోగ్రతలు ఏకంగా సున్నా డిగ్రీసెల్సియస్‌కు పడిపోవడం విశేషం. పలు రీజియన్లలో వర్షాలు పడటంతో వాటికి చల్లటిగాలులు తోడై ఉష్ణోగ్రతలను కనిష్టాలకు పరిమితంచేస్తున్నాయి. సౌదీ అరేబియాలో ఇంతటి స్థాయిలో మంచు కురవడం గత 30 ఏళ్లలో ఇదే తొలిసారికావడం గమనార్హం.

ఎయిరిండియా విమానంలో ఇంజిన్ వైఫల్యం

- గంటపాటు గాల్లో ప్రాణాలు
- విమానంలో 355 మంది

న్యూఢిల్లీ: ఎయిరిండియా విమానంలో ఇంజిన్ వైఫల్యం కలకలం రేపింది. సోమవారం ఉదయం 355 మందితో ఢిల్లీ నుంచి ముంబై బయల్దేరిన బోయింగ్ 777–300 విమానంలో కాసేపటికే సమస్య తలెత్తింది. దాంతో ప్రయాణికులు బెంబేలెత్తిపోయారు. ఎట్టకేలకు బయల్దేరిన గంటలోపే వెనుదిరిగి మళ్లీ ఢిల్లీలో క్షేమంగా దిగడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై ఎయిరిండియాను పౌర విమానయాన శాఖ వివరాలు కోరింది. అంతేగాక ఈ ఉదంతంపై డీజీసీఏ సమగ్ర విచారణ జరపనుంది. ఇంజిన్ ఆయిల్ పీడనం తగ్గడాన్ని సిబ్బంది గమనించారు. కుడివైపు ఇంజిన్ లో ఈ సమస్య తలెత్తిందని డీజీసీఏ వర్గాలు తెలిపాయి.

సులభతరంగా చైనా వీసా దరఖాస్తు ప్రక్రియ

ఆన్‌లైన్ సేవలను ఆరంభించిన చైనా

బీజింగ్: భారతీయులు వీసాకోసం ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకునేలా ఢిల్లీలోని చైనా రాయబార కార్యాలయం కొత్త సదుపాయాన్ని సోమవారం నుంచి అందుబాటులోకి తెచ్చింది. https:// www. visaforchina. cn/ DEL3& EN/ qianzh engyewu వెబ్‌సైట్ లింక్ ద్వారా ఇకపై ఆన్‌లైన్ లో దరఖాస్తుచేసుకోవచ్చని భారత్‌లోని చైనా ఎంబసీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. గతంలో వ్యక్తిగతంగా హాజరై పలు రకాల డాక్యు మెంట్లు, పత్రాలను సమర్పించడం ప్రహసనంగా ఉండేది. ఇప్పుడా బాధల నుంచి విముక్తుల్ని చేస్తూ ఆన్‌లైన్ సేవలు ప్రారంభించామని ఆ ప్రకటనలో పేర్కొంది.

హెచ్-1బీ, హెచ్-4 వీసాల నిశిత పరిశీలన

న్యూఢిల్లీ: అన్ని దేశాల వారికి చెందిన హెచ్–1బీ, హెచ్–4 వీసా దరఖాస్తుదారుల పరిశీలన ప్రక్రియ చురుగ్గా సాగుతోందని భారత్ లోని అమెరికా దౌత్య కార్యాలయం వెల్లడించింది. స్టాండర్డ్ వీసా వెట్టింగ్‌లో భాగంగా డిసెంబర్ 15 నుంచే ఇది ప్రపంచమంతటా కొనసాగుతోందని తెలిపింది. ముఖ్యంగా సదరు దరఖాస్తుదారుల ఆన్ లైన్ కార్యకలాపాలపై నిశితంగా దృష్టి సారించినట్టు వివరించింది. భారత్‌లో డిసెంబర్‌లో జరగాల్సిన వేలాదిమంది హెచ్–1బీ వీసా ఇంటర్వ్యూలను రద్దు చేస్తూ అమెరికా ఇటీవలే నిర్ణయం తీసుకోవడం తెలిసిందే. దాంతో వాటి కోసం స్వదేశానికి వచ్చిన ఎంతోమంది భార త ఐటీ నిపుణులు ఇక్కడే చిక్కు బడిపోయారు. వారి ఇంటర్వ్యూలను మార్చి నుంచి మే దాకా అమెరికా ఈ రీ షెడ్యూల్ చేసింది. ఈ నేపథ్యంలో ఎంబసీ సోమవారం ఎక్స్‌లో ఇలా 'వెట్టింగ్' పోస్ట్ పెట్టింది. హెచ్ –1బీ వీసాల దుర్వినియో గానికి చెక్ పెట్టడంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్టు కూడా అందులో వెల్లడించింది!

బంగ్లాలో మరో విద్యార్థి నేతపై కాల్పులు

దేశంలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు

ఢాకా: బంగ్లాదేశ్‌లో మరోసారి కల్లోలం రాజుకునే పరిస్థితులు కన్పిస్తున్నాయి. విద్యార్థి నేత షరీఫ్ ఉస్మాన్ హాది హత్య తాలూకు కల్లోలం ఇంకా సద్దుమణగకముందే మొతలెబ్ షిక్దర్ అనే మరో విద్యార్థి నేతపై సోమవారం హత్యాయత్నం జరిగింది. వీరిద్దరూ గతేడాది షేక్ హసీనా సర్కారును కుప్పకూల్చిన హింసాత్మక విద్యార్థి ఆందోళనలకు నేతృత్వం వహించిన నేతలే కావడం విశేషం. ఆగ్నేయ పట్టణమైన ఖుల్నాలో గుర్తు తెలియని దుండగుడు షిక్దర్‌పై సమీపం నుంచే తలలోకి కాల్పులు జరిపాడు. దాంతో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతన్ని హుటాహుటిన ఖుల్నా మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉందని నేషనల్ సిటిజన్ పార్టీ నేత మహ్మూదా మితూ చెప్పారు. షిక్దర్ ఆ పార్టీ కేంద్ర సమన్వయకర్తగా ఉన్నారు. హాది కూడా వచ్చే ఫిబ్రవరిలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో ఆ పార్టీ తరఫునే బరిలో దిగనున్నట్టు ప్రకటించిన కొద్ది రోజులకే హత్యకు గురయ్యారు. డిసెంబర్ 12న కాల్పుల్లో తీవ్రంగా గాయపడ్డ ఆయనను సింగపూర్ తరలించి ప్రత్యేక చికిత్స అందించినా లాభం లేకపోవడం తెలిసిందే. షిక్దర్ హత్య నేపథ్యంలో సోమవారం రాత్రి రాజధాని ఢాకాతో సహా పలు నగరాలు, పట్టణాల్లో హింసాత్మక ఘటనలు, ఆందోళనలు చోటు చేసుకున్నాయి.

వీసాల జారీ నిలిపి వేసిన బంగ్లాదేశ్

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీతోపాటు, త్రిపురలో వీసాల జారీని నిలిపివేయాలని బంగ్లాదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి న్యూఢిల్లీలోని బంగ్లాదేశ్ హై కమిషన్, త్రిపురలోని బంగ్లాదేశ్ అసిస్టెంట్ హై కమిషన్ కార్యాలయాలు ఒక ప్రకటన చేశాయి. అంతేకాదు, బెంగాల్‌లోని సిలిగురిలో బంగ్లాదేశ్ వీసాల జారీని సంబంధిత ప్రైవేట్ సంస్థ నిలిపివేసింది.

కారు కింద అమర్చిన బాంబు పేలి రష్యా సైనిక జనరల్ మృతి

రాజధాని మాస్కోలో ఘటన • ఉక్రెయిన్ పనేనంటున్న దర్యాప్తు విభాగం

మాస్కో: రష్యా సైన్యంలోని కీలకమైన మరో అధికారి బాంబు దాడిలో చనిపోయారు. సోమవారం ఉదయం రాజధాని మాస్కోలోని దక్షిణ ప్రాంతంలో ఘటన చోటుచేసుకుంది. కారు కింద అమర్చిన బాంబు పేలి రష్యా ఆర్మీ జనరల్ స్టాఫ్ ఆపరేషనల్ ట్రెయినింగ్ డైరెక్టరేట్ చీఫ్‌గా ఉన్న ఫనిల్ సర్వరోవ్(56) ప్రాణాలు కోల్పోయారు. ఈ ఏడాదిలో హత్యకు గురైన మూడో సీనియర్ సైనికాధికారి ఈయన. ఉక్రెయిన్ సీక్రెట్ సర్వీస్ విభాగం దీని వెనుక ఉండి ఉంటుందని రష్యా దర్యాప్తు అధికారులు అంటున్నారు. ఉదయం 6.55 గంటల సమయంలో జనరల్ ఫనిల్ సర్వరోవ్ తన కారులో ఉన్న సమయంలో భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. ఆ తీవ్రతకు కారు నుజ్జయింది. డోర్లు దూరంగా పడిపోయాయి. చుట్టుపక్కల కార్లు సైతం దెబ్బతి న్నాయి. తలకు తీవ్రగాయాలైన సర్వరోవ్‌ను అధికారులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. కొద్దిసేపటి తర్వాత ఆయన చనిపోయినట్లు ప్రకటించారు. ఉక్రెయిన్ ఇంటెలిజెన్స్ సర్వీసెస్ కుట్ర కోణం సహా ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు జరుగుతోందని రష్యా దర్యాప్తు కమిటీ ప్రతినిధి స్వెట్లానా పెట్రెంకో చెప్పారు. సర్వరోవ్ హత్యపై అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు వెంటనే సమాచారం అందజేశామని అధ్యక్షభవనం క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రీ పెష్కోవ్ చెప్పారు. ఫనిల్ సర్వరోవ్ గతంలో చెచెన్యా యుద్ధంలో కీలకంగా ఉన్నారు. సిరియాలోనూ రష్యా తరఫున ఆపరేషన్లకు సారథ్యం వహించారు. ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలోనూ ఆపరేషన్స్ విభాగంలో సర్వరోవ్ ముఖ్యుడిగా ఉన్నారు. తాజా ఘటనపై ఉక్రెయిన్ స్పందించలేదు.



బాంబు దాడిలో ధ్వంసమైన కారు (ఇన్‌సెట్‌లో) సర్వరోవ్ (ఫైల్)

సాక్షి
గుంటూరు
మంగళవారం । 23 । డిసెంబర్ । 2025

పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి నీటి విడుదల నిలుపుదల చేశారు. దిగువకు 2400 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నీటి నిల్వ 41.7333 టీఎంసీలు.



నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1000, గరిష్ట ధర రూ.1500, మోడల్ ధర రూ.1200 వరకు పలికింది.

ఆలయ అభివృద్ధికి విరాళం

దుగ్గిరాల: కంఠంరాజు కొండూరులోని శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానం అభివృద్ధికి మంచికలపూడికి చెందిన లోకం శ్యామ్‌సుందరరావు దంపతులు రూ.3 లక్షల నగదును ఆలయ ఈఓకి సోమవారం అందించారు.

న్యూస్‌రీల్

న్యూజిలాండ్‌లో వై.ఎస్.జగన్ పుట్టిన రోజు వేడుకలు

ముఖ్య అతిథిగా
ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఆదివారం న్యూజిలాండ్‌లో ఎన్‌ఆర్‌ఐ విభాగం కన్వీనర్ బుజ్జిబాబు నెల్లూరి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పరిపాలనలో వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతే ధ్యేయంగా, సంక్షేమాన్ని వారి గడప ముందుకు చేర్చారని తెలిపారు. రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీ మరింత బలోపేతం అయ్యే దిశగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. న్యూజిలాండ్ (ఎన్ఆర్ఐ) కన్వీనర్ నెల్లూరి బుజ్జిబాబు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు న్యూజిలాండ్‌లో నిర్వహించడం సంతోషాన్ని కలిగించిందని పేర్కొన్నారు. ఈ వేడుకలకు మౌంట్ ఆల్బర్ట్ పార్లమెంట్ సభ్యురాలు హెలెన్ వైట్ హాజరయ్యారు. కార్యక్రమంలో గోవర్ధన్ మల్లెల కళ్యాణ్ కసుంగాటి, బాల బీరమ్, ఇందిరా సిరిగిరి, వాసు కునపల్లి, ప్రవీణ్ మోటుపల్లి, శివ కిలారి, జనక్, అరుణ్‌రెడ్డి, చంద్రశేఖర్ కోడూరి, మురళి, రోహిత్‌రెడ్డి, రామ్‌మోహన్ దంతాల, ప్రదీప్, నిర్మల్ పాండే, కృష్ణారెడ్డి, శ్రీనివాస్ పానుగంటి పాల్గొన్నారు.

అగ్ని మాపక భవన నిర్మాణానికి శంకుస్థాపన

గుంటూరు వెస్ట్: జిల్లా అగ్నిమాపక భవనం నిర్మాణానికి జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా సోమవారం శంకుస్థాపన చేశారు. భవనాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో రూ.3.39 కోట్లతో నిర్మించనున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ భవనాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని ఆకాంక్షించారు. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో షేఖ్ ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, ప్రాంతీయ అగ్నిమాపక అధికారి ఎం.ఎ.క్యూ జిలానీ, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వరాహావతారంలో శ్రీ వెంకటేశ్వరస్వామి

తెనాలిఅర్బన్: శ్రీ విశ్వావసు నామ సంవత్సర ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వైకుంఠపురంలో స్వామివారికి ముక్కోటి ఏకాదశి దశావతార మహోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం స్వామివారిని వరాహావతారంతో అలంకరించి పురవీధుల్లో రథంపై ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వి.అనుపమ, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజధాని రోడ్డు వెంబడి పంటలకు దుమ్ము ముప్పు

తాడికొండ: అమరావతి రాజధానికి గుంటూరు నుంచి వెళ్లే ప్రధాన రహదారి గత మూడు నెలలుగా గుంతలమయంగా మారడంతో పంటలు అధ్వానంగా తయారయ్యాయి. మరమ్మతుల పేరుతో అధికారులు కాలయాపన చేస్తుండటంతో ఇప్పటికే పూర్తిగా పాడైన పెదపరిమి–తుళ్లూరు మధ్య రహదారిపై దుమ్ము లేచి పంటలు పనికిరాకుండా పోతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టి నెల దాటినా అధికారులు మరమ్మతులు చేయకపోవడంతో అటు రైతులతో పాటు ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. రాజధానికి వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి ఇలా ఉండటం పట్ల అంతా మండిపడుతున్నారు.

'ముస్తాబు' చేయలేక అవస్థలు

- గురువులకు కొత్త అగచాట్లు
- పాఠశాలల్లో ముస్తాబు కార్నర్లు ఏర్పాటు చేయాలని జీవో విడుదల చేసిన చంద్రబాబు సర్కార్
- కార్నర్‌లో అద్దం, దువ్వెన, సబ్బు, నెయిల్ కటర్, హ్యాండ్‌వాష్ ఉంచాలి
- ఉపాధ్యాయ సంఘాల మండిపాటు

కోయవారిపాలెంలోని హెచ్ఈ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థికి తల దువ్వుతున్న ప్రత్తిపాడు ఎంఈవో-2 లీలారాణి

ప్రత్తిపాడులోని ఎల్ఈ ప్రాథమిక పాఠశాలలో తల దువ్వుకుంటున్న విద్యార్థిని

కోయవారిపాలెంలోని ఓ పాఠశాల తరగతి గదిలో ఏర్పాటు చేసిన అద్దం

పుల్లడిగుంట ప్రాథమిక పాఠశాలలో ముస్తాబు కార్నర్‌లో అద్దం, దువ్వెన, పౌడర్, హ్యాండ్ వాష్

ప్రత్తిపాడు: అయ్యవార్లకు కొత్త అగచాట్లు వచ్చిపడ్డాయి. గత ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగిస్తున్నారంటూ నానా రచ్చ చేసిన అప్పటి ప్రతిపక్షం, గద్దెనెక్కిన తరువాత నాడు చెప్పిన మాటలను విస్మరించింది. బోధనేతర పనులు అప్పగిస్తుండడంపై ఉపాధ్యాయులు కస్సుబుస్సు లాడుతున్నారు. ఇప్పటికే పది తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న వంద రోజుల యాక్షన్ ప్లాన్ పర్యవేక్షణకు ఒక్కో పాఠశాలకు నోడల్ ఆఫీసర్ చొప్పున ఇతర శాఖల అధికారులను నియమించారు. ఇతర శాఖల కర్ర పెత్తనం ఏమిటంటూ రగిలిపోతున్న పంతుళ్లపై చంద్రబాబు సర్కారు ముస్తాబు పేరుతో మరో అదనపు పని భారం మోపింది. దీంతో విద్యార్థులను 'ముస్తాబు' చేయలేక చంద్రబాబు ప్రభుత్వ తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

జీవో విడుదల

ప్రభుత్వ పాఠశాలల్లో డైలీ హైజీన్ అండ్ డిసిప్లిన్ పేరుతో 'ముస్తాబు' కార్యక్రమాన్ని ఈనెల 19 నుంచి అమలు చేయాలంటూ చంద్రబాబు ప్రభుత్వం జీవో నంబరు 43 ఇచ్చింది. తప్పనిసరిగా ప్రతి తరగతి గదిలో ముస్తాబు కార్నర్ ఏర్పాటు చేయాలి. అందులో అద్దం, దువ్వెన, సబ్బు, హ్యాండ్ వాష్, నెయిల్ కట్టర్ ఉంచాలి. విద్యార్థులు పరిశుభ్రంగా, క్రమశిక్షణగా ఉండేలా చూడాలన్నది ఆ జీవో సారాంశం. అంతేకాకుండా చేతులు శుభ్రం చేసుకోనే దశల చార్టులు, గోర్లు, జుత్తు, వ్యక్తిగత పరిశుభ్రత చార్టు, టాయిలెట్ వినియోగం, సురక్షిత నీటిపై విద్యార్థులకు అనుకూలమైన ఐఈసీ మెటీరియల్‌ను కూడా ప్రదర్శించాలి. ఇద్దరు విద్యార్థులను ఎంపిక చేసి వారికి తర్ఫీదు ఇవ్వాలి. వారం వారం ముస్తాబు స్టార్ ఆఫ్ ది వీక్‌లను ఎంపిక చేయడం, రివార్డులివ్వడం చేయాలి. పాఠశాలకు అపరిశుభ్రంగా వచ్చే విద్యార్థులు, తలదువ్వుకోకుండా వచ్చే విద్యార్థులను గుర్తించాలి. వారితో బడిలోనే తలదువ్వడం, లేదా దువ్వించడం చేయించాలి. అయితే, ఈ కార్యక్రమంపై ఉపాధ్యాయులు వర్గాలు, యూనియన్లు భగ్గుమంటున్నాయి. బడికి వెళ్లి విద్యార్థులకు పాఠాలు బోధించాలా లేక ముస్తాబు చేయాలా, చేయిస్తూ కూర్చోవాలా? అంటూ వ్యంగ్యాస్త్రాలు విసురుతున్నారు.

ఉపాధ్యాయుల్లో తీవ్ర అసహనం

వాస్తవానికి ఈ కార్యక్రమం మూడు రోజుల కిందటే ప్రారంభమైనప్పటికీ సగానికి పైగా పాఠశాలల్లో నిర్వహించిన జాడలే లేవు. ప్రధానోపాధ్యాయుల్లో ఆసక్తి కరువడంతో కొన్ని బడుల్లో ముస్తాబు కార్నర్లు కనిపించని పరిస్థితి చోటుచేసుకుంది. మరికొన్ని పాఠశాలల్లో నామమాత్రంగా ఏర్పాటు చేసి చేతులు దులిపేసుకున్నారు. ఎన్నికలకు ముందు కన్నీళ్లు తుడిచేందుకు కల్లబొల్లి మాటలు చెప్పి కాలం నెట్టుకొచ్చిన చంద్రబాబు అండ్ కో ఇప్పుడు బోధనేతర బాధ్యతలు అప్పగించడంపై ఉపాధ్యాయ వర్గాలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నాయి.

గుంటూరు జిల్లాలో పాఠశాలలు, ఉపాధ్యాయుల లెక్క		
ప్రైమరీ స్కూల్స్	:	609
యూపీ స్కూల్స్	:	25
హైస్కూల్స్	:	130
విద్యార్థులు	:	51,982
ఉపాధ్యాయులు	:	3,429

బోధన మరుగున పడుతుంది

ఒకదాని వెంట ఒకటి బోధనేతర కార్యక్రమాలను ఉపాధ్యాయులకు అప్పగిస్తున్నాం. ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయకుండా ముస్తాబు వంటి బోధనేతర కార్యక్రమాల బాధ్యతలు మోపడం వలన అసలు విషయం మరుగున పడుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ నిర్ణయాలపై పునరాలోచన చేయాలి.

–ఎస్‌కే. బాజీ (జిల్లా అధ్యక్షుడు, ఎస్టీయూ)

దువ్విన తలనే దువ్వుతూ..

వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు శుభ్ర పరుచుకోవడం వంటివి అవసరమే. అయితే విద్యాలయాల్లో విద్యార్థులకు అందుబాటులో దువ్వెన, అద్దం, సబ్బు వంటివి ఉంచడం వల్ల వారు చదువుపై కన్నా వ్యక్తిగత సౌందర్యంపైనే శ్రద్ధ చూపే అవకాశాలూ లేకపోలేదు. ప్రాథమిక పాఠశాలల స్థాయిలో ఎలా ఉన్నా ఆ ప్రభావం హైస్కూల్స్‌పై పడే ప్రమాదం లేకపోలేదు. దీంతో తల్లిదండ్రులు, గురువులు ఇవేమి ఉత్తర్వులంటూ వాపోతున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.

ముస్తాబుతో బోధనకు ఆటంకం

విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత గురించి, తరగతి, గృహం, పరిసరాల పరిశుభ్రత గురించి ఉపాధ్యాయులు ఎప్పుడూ గుర్తు చేస్తూనే ఉంటారు. తల్లిదండ్రులు చేయవలసిన పనులకు కూడా ఉపాధ్యాయులనే బాధ్యులను చేయడం బాధాకరం. ముస్తాబుపై ఎక్కువ దృష్టి సారిస్తే బోధనకు ఆటంకం ఏర్పడుతుంది. అంత గౌరవం కూడా ఉండదు. ఈ కాన్సెప్ట్‌పై గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా ఉపాధ్యాయులకు విద్యార్థులకు, తల్లిదండ్రులకు చేరవేస్తే మంచిది. ప్రవీణ్ ప్రకాషే బాధ పెట్టాడనుకుంటే అంతకు మించిన బాధను ఇప్పుడు పెడుతున్నారు.

– కె.బసవలింగారావు, అధ్యక్షుడు, ఏపీటీఎఫ్, గుంటూరు జిల్లా

ఒత్తిడికి గురిచేయడమే..

మరో పది రోజుల్లో ఎఫ్‌ఏ– 3 పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జీఎఫ్ఎల్ఎన్ పేరుతో పాఠ్యాంశ బోధన సమయాన్ని సగానికి సగం తగ్గించారు. ముస్తాబుతో పాటు అన్నిటికి ప్రతీ రోజూ రిజిస్టర్లు రాయాల్సి ఉంటుంది. వీటి వల్ల పొందే లాభం కంటే బోధన సమయం తగ్గిపోవడం వల్ల పిల్లలకు నష్టం కలుగుతోంది. ఇది ఉపాధ్యాయులను మానసికంగా ఇబ్బంది పెట్టడమే. అవుతుంది. ఒక పక్క బోధనేతర కార్యక్రమాలు తగ్గించమని మొత్తుకుంటుంటే రోజురోజుకీ కొత్త కార్యక్రమాలను పెంచుతున్నారే గానీ తగ్గించడం లేదు.

– కళాధర్ (యూటీఎఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి)

బాధితుల సమస్యలు వింటున్న కలెక్టర్ తమీమ్ అన్సారి

పెండింగ్ లేకుండా అర్జీల పరిష్కారం

కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్: సంవత్సరం ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో అర్జీలు పెండింగ్‌లో లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా అధికారులకు సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ఆమె మాట్లాడారు. వ్యక్తిగత, సామాజిక అంశాలపై ప్రజలు అందించిన అర్జీలను సక్రమంగా, సకాలంలో పరిష్కరించేలా అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో ప్రజల సౌకర్యం కోసం ఎన్నో సులభ మార్గాలను ప్రవేశపెట్టామని, అయితే కింది స్థాయిలో సిబ్బంది కూడా పూర్తి స్థాయిలో సహకరించాలని ఆమె కోరారు. ఇంటి స్థలాల కోసం అర్జీలు అందించడానికి వచ్చిన వికలాంగుల నుంచి సమావేశ మందిరానికి వచ్చి వాటిని స్వీకరించారు. అనంతరం ప్రజల నుంచి వచ్చిన 320 అర్జీలను జేసీ, డీఆర్వో షేక్ ఖాజావలి, డెప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, ఆర్డీవో కె. శ్రీనివాసరావు, సీపీఓ శేషశ్రీ , జెడ్పీ సీఈఓ వి జ్యోతిబసు, జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. కారుణ్య నియామక ప్రక్రియలో భాగంగా షేక్ అబ్దుల్ రవూఫ్, డి. భాను చరణ్, బి. శ్యామ్ ప్రకాశ్‌కు నియామక పత్రాలను అందజేశారు.

ఉపాధి హామీ చట్టానికి తూట్లు

2005 ఉపాధి హామీ హక్కు చట్టానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయి. మహాత్మా గాంధీ పేరు మార్చడంతోపాటు కొత్త నిబంధనలు పెట్టి బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నాలను విరమించుకోవాలి. పేదవాడికి అన్యాయం చేసే కూటమి సర్కార్ ఆగడాలను సహించే ప్రసక్తే లేదు. దీనిపై ఉద్యమాలు తీవ్రతరం చేస్తాం.

–పాశం రామారావు, కౌలు, వ్యవసాయ, కార్మిక సంఘాల నాయకులు

వక్ఫ్ భూముల్లో పరిశ్రమలు పెట్టనివ్వం

చిన కాకాని గ్రామంలో వక్ఫ్ బోర్డుకు సంబంధించిన 77.57 ఎకరాల భూమిలో ప్రభుత్వం ఇండస్ట్రియల్, ఐటీ పార్క్ ఏర్పాటుకు సిద్ధమవ్వడాన్ని ముస్లిం సమాజం తీవ్రంగా ఖండిస్తోంది. ఆ భూములు ముస్లిం, మైనారిటీల విద్య, ఇతర అభివృద్ధి కోసం కేటాయించాలి. ప్రభుత్వం ఆలోచనలు అమలుకు ఏమాత్రం ఒప్పుకోం.

–సయ్యద్ సలావుద్దీ, ముస్లిం సమైక్య వేదిక నాయకులు

స్మార్ట్ మల్టీపర్పస్ చైర్

విభిన్న ప్రతిభావంతులకు బహుళ ప్రయోజనకారిగా ఉపయోగపడే సౌర శక్తితో పని చేసే చైర్‌ను మంగళగిరిలోని సీకే జూనియర్ కాలేజీ ఎయిడెడ్ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థినులు ఎం. మాన్యశ్రీ , ఏ. కౌశిక్ గైడ్ టీచర్ బి. టైటస్ సహకారంతో రూపొందించారు. అడ్జస్ట్ చేసుకునే టేబుల్, ఆటోమెటిక్‌గా సెన్సార్ ద్వారా తాగునీరు, హ్యాండ్ వాష్ బేసిన్, లైట్, ఫ్యాన్‌తో పాటు కుర్చీని బెడ్‌గా మార్చుకునే విధానం బాగుంది.

రైతన్నకు అండగా పంట కోసే యంత్రం

రైతన్నలకు అండగా నిలిచి పంటలను కోసే యంత్రాన్ని తక్కువ ఖర్చుతో వట్టిచెరుకూరు మండలం కాట్రపాడు పీఎస్ఎస్ జెడ్పీ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థులు షేక్ అర్షద్, కె.భావేజ్ రూపొందించారు. ట్రాక్టర్‌కు వెనుకవైపు రెండు వైపులా తిరిగే రంపాన్ని అమర్చి, దాని ద్వారా పొలంలో గడ్డిని, పంటను సులువుగా కత్తిరించవచ్చు. రైతు ప్రయోజనకారిగా దీనికి రూపకల్పన చేశారు.

ఫ్లడ్ కంట్రోల్ గేట్

ఇటీవల చెన్నైలో వరదలతో ప్రజలు పడిన ఇబ్బందులను గుర్తించిన విద్యార్థులు డి.మల్లికార్జున్, టి. విలియం కేరీ, సీహెచ్. శివ శంకర్ ఫ్లడ్ గేట్ ప్రాజెక్టుతో పరిష్కారం చూపించారు. పెదనందిపాడు మండలం అనపర్రు జెడ్పీ హైస్కూల్లో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు నూతన ఆలోచనతో ఇంటి ముందు ఇనుప గేటును బిగించడం ద్వారా వరద నీరు ఇంట్లోకి ప్రవేశించకుండా అడ్డుకునే మార్గాన్ని చూపారు.

ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

చిట్టి బుర్రలు... గట్టి ఆవిష్కరణలు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు ఆలోచనలకు పదును పెట్టారు. దైనందిన జీవితంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు మేధస్సును ఉపయోగించి పరిష్కార మార్గాలు అన్వేషించారు. వినూత్నమైన ఆలోచనలతో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టారు. గుంటూరులోని జిల్లా పరీక్ష భవన్‌లో సోమవారం పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు తాము రూపొందించిన నమూనా ప్రాజెక్టులను ప్రదర్శించారు.

ఇంటి పంటల సాగుకు ప్రయోజనకారి

కొల్లిపర మండలం వల్లభాపురం జెడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థులు వి. కార్తిక్, ఏ. కార్తిక్ రూపొందించిన వర్టికల్ ఫార్మింగ్ ప్రాజెక్టు ఇంటి పంటల సాగుకు ప్రయోజనకారిగా ఉంది. పట్టణాల్లోని బహుళ అంతస్తుల భవనాల్లో మొక్కలు పెంచేందుకు స్థలం సరిపోక ఎదురవుతున్న సమస్యలకు విద్యార్థులు తమ ఆలోచనతో పరిష్కారం చూపారు. పెద్ద సైజు డబ్బాకు రంధ్రాలు చేసి, అందులో మట్టిని పోసి ఒకేసారి కూరగాయలు, ఆకుకూరలు, పూల మొక్కలను పెంచారు. వర్షపు నీటి ఆధారంగా మొక్కలు పెంచే విధానంతో నీటిని కూడా ఆదా చేయవచ్చు.

గ్యాస్ లీకేజీ డిటెక్షన్ అలారం

ప్రమాదవశాత్తూ గ్యాస్ లీకేజీ అయితే వెంటనే దాన్ని పసిగట్టి అప్రమత్తం చేసే అలారంతో పరికరాన్ని గుంటూరులోని శ్రీ శారదా నికేతన్ బాలికోన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థినులు సీహెచ్. జ్యోత్స్న, ఏ. ప్రణతి రూపకల్పన చేశారు.

ముక్కోటి ఏకాదశి ఉత్సవానికి భారీగా ఏర్పాట్లు

మంగళగిరి టౌన్: పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఈనెల 30న వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎండోమెంట్ కమిషనర్ రామచంద్ర మోహన్ తెలిపారు. సోమవారం రాత్రి ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఆలయ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి రోజున భక్తులు 30 వేల పైగా రానున్నట్లు అంచనా వేశామని, వారికి తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా వివిధ శాఖ అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు. క్యూలైనులో భక్తులకు మంచినీరు తోపాటు ఉచిత ప్రసాదాలు అందిస్తామని తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని ఉత్తర ద్వారా దర్శనం చేసుకొని, శంఖు తీర్థం స్వీకరించాలని కోరారు.

క్లుప్తంగా

ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

గుంటూరు రూరల్: నల్లపాడు ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇంటర్ పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్ గేమ్స్ (ఏపీఎస్ జీఎమ్)– 2025 మీట్ సోమవారం ప్రారంభమైంది. నియోజకవర్గ ఎమ్మెల్యే బి. రామాంజనేయులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెరుగుతుందని తెలిపారు. జీవితంలో పైకి ఎదగడానికి క్రీడలు ఒక గొప్ప వేదికగా ఉంటాయని చెప్పారు. ఆటలు ఆడేటప్పుడు కేవలం ప్రతిభ కాదు గెలవాలన్న పట్టుదల కూడా ముఖ్యమని సూచించారు. సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ గణేష్ కుమార్ మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో ఆడాలని, గెలుపు ఓటములు సహజమని తెలిపారు. ప్రిన్సిపాల్ పి.రాజశేఖర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 19 ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 382 మంది క్రీడాకారులు రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆయా కళాశాలల పీడీలు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలువలో పడిన యువకుడి మృతదేహం లభ్యం

దుగ్గిరాల: బీటెక్ పూర్తి చేసి, ఖాళీగా ఉంటున్నావు ఎందుకంటూ తండ్రి మందలించగా మనస్తాపం చెంది కాలువలో పడి గల్లంతైన పఠాన్ గఫార్ (24) శవమై కనిపించాడు. వడ్డేశ్వరం గ్రామానికి చెందిన గఫార్ తండ్రి మందలించి కారణంగా శనివారం బకింగ్ హామ్ కెనాల్‌లో పడి గల్లంతయ్యాడు. తండ్రి నాగూర్ ఫిర్యాదు మేరకు తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం సాయంత్రం బకింగ్ హామ్ కాలువలో రెండు రోజులుగా వెతుకుతున్న ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందికి తుమ్మపూడి సమీపంలో మృతదేహం కనిపించింది. గఫార్ కుటుంబ సభ్యులకు తెలియపరచగా వారు తమ కుమారుడేనని గుర్తించారు. అనంతరం పంచనామా నిమిత్తం మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

మిర్చి యార్డు సమాచారం
(సోమవారం ధరలు)

వచ్చిన బస్తాలు	52,872
అమ్మకాలు	49,859
నిల్వ	10,174

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–17,200
నంబరు–5	12,000–15,200
273	11,500–14,200

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–17,000
నంబరు–5	11,000–15,000
341	11,000–16,600
4884	12,000–14,000

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 16,200
బాడిగ–355	11,000 – 16,500
దేవనూరు డీలక్స్	11,000 – 16,500
ఆర్మూర్	10,000 – 12,700
తాలుకాయలు	5,000 – 6,800

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–14,800
బాడిగ – 355	10,000–16,500
దేవనూరు డీలక్స్	10,500–16,000
తాలు	5,200 -6,800

–కొరిటెపాడు (గుంటూరు)

పసుపు ధరలు
(సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 1,030

కొమ్ములు : 791 బస్తాలు (ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
11,450	12,500	12,100

కాయలు : 239 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,300	12,450	12,100

మొత్తం అమ్మకాలు : 772.5 క్వింటాళ్లు

–దుగ్గిరాల

ఉరకలెత్తిన ఉత్సాహం

సందడిగా వివా- వీవీఐటీయూ యువజనోత్సవం

విజేతలతో ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రో ఛాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ తదితరులు

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీలో జాతీయస్థాయి యువజనోత్సవం (వీవా–వీవీఐటీయూ 2025–26) వేడుకలు ఘనంగా ముగిశాయి. రెండు రోజుల యువజనోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన సాంకేతిక, సాంస్కృతిక, క్రీడలు యువతను ఆకట్టుకున్నాయి.

- ముఖ్య అతిథిగా పాల్గొన్న విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత లావు రత్తయ్య మాట్లాడుతూ యువజన ఉత్సవాల నిర్వహణ వెనుక గొప్ప ఉద్దేశం ఉంటుందని, నాయకత్వ లక్షణాలు, జీవన నైపుణ్యాల పెంపునకు దోహదపడతాయని తెలిపారు.
- వీవీఐటీ విశ్వవిద్యాలయం చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ రెండు రోజుల యువజనోత్సవంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారని, మంచి అనుభూతులతో సంతోషంగా గడిపారని తెలిపారు.
- వీవీఐటీయూ ప్రో–చాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ మాట్లాడుతూ విద్యార్థులు విజయవంతంగా యువజనోత్సవాన్ని నిర్వహించారని, వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుదలకు ఈ కార్యక్రమం దోహదపడిందని తెలిపారు.
- ముఖ్య అతిథి విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత లావు రత్తయ్య, వీవీఐటీయూ చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.
- ఈ వేడుకలో చాంపియన్ చిత్ర బృందం హీరో రోషన్, హీరోయిన్ అనస్వరా రాజన్ బృందం, వానర చిత్ర బృందం హీరో అవినాష్ తిరువీధుల, హీరోయిన్ సిమ్రాన్ చౌదరి సందడి చేశారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కొడాలి రాంబాబు, రిజిస్ట్రార్ వై. మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ కె.గిరిబాబు, ఆధ్యాపకులు పాల్గొన్నారు.

ఆటపాటలతో సందడి చేస్తున్న విద్యార్థిని, విద్యార్థులు

మాట్లాడుతున్న విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత లావు రత్తయ్య

గుట్టుచప్పుడు కాకుండా బెట్టింగ్

- బాల్ టు బాల్‌కు పందెం
- వంద రూపాయల నుంచి పది వేల వరకు పందేలు
- యాప్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్
- ఇద్దరు నిర్వాహకులు, ఆరుగురు ఆటగాళ్లు అరెస్ట్
- రూ.13.60 లక్షలు, ఆన్‌లైన్‌లో రూ.5.05 లక్షలు ఫ్రీజ్,
- ఎనిమిది మొబైల్ ఫోన్లు, ల్యాప్ ట్యాప్ సీజ్

మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

పేక ముక్కలకు ఉపయోగించిన రిస్ట్ వాచీని చూపుతున్న ఎస్పీ

నగరంపాలెం: ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌లు కేసులో ఇద్దరు నిర్వాహకులు, ఆరుగురు ఆటగాళ్లను పట్టాభిపురం పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాలులో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వివరాలను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. సోమవారం టాస్క్‌ఫోర్స్ సమాచారంతో గుంటూరు పశ్చిమ డీఎస్పీ అరవింద్ పర్యవేక్షణలో పట్టాభిపురం పీఎస్ సీఐ గంగా వెంకటేశ్వర్లు సిబ్బందితో వికాస్ నగర్ మూడో వీధిలోని ఓ డాబాపై ఆకస్మిక తనిఖీలు చేశారు. హాలులో ఇద్దరు టేబుల్ ఎదురు కూర్చొని ఉండగా, మరో ఆరుగురు ఫోన్లల్లో బెట్టింగ్‌లు చేస్తున్నట్లు గుర్తించారు. సోమవారం ఆస్ట్రేలియాలో జరిగిన బిగ్‌బాష్ లీగ్ తొమ్మిదో మ్యాచ్ (సిడ్నీ థండర్/బ్రిస్‌బానే హార్ట్) బెట్టింగ్ నిర్వర్తించే క్రమంలో వీరందర్ని పట్టుకున్నారు. నిర్వాహకుడైన తాతినేని శ్రీనివాసరావు, విజయభాస్కరరెడ్డి, కొరిటెపాడు నాలుగో వీధికి చెందిన షేక్ సలీం అలియాస్ శ్రీను, తిరుమలశెట్టి నాగు, శివారెడ్డిపాలెం పోలేరమ్మ గుడి ప్రాంతంలో ఉంటున్న కోటపాటి వెంకటరెడ్డి, పొన్నూరు రోడ్ సాయిబాబాకాలనీ ఒకటో వీధి వాసి దొడ్డా శ్రీకాంత్, బృందావన గార్డెన్స్ ఏడో వీధిలో ఉంటున్న జిల్లేలమూడి బ్రహ్మతేజ, నెహ్రూనగర్ తొమ్మిదో వీధికి చెందిన పల్లె సుధాకర్‌లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.13.60 లక్షలు, ఆన్‌లైన్‌లో రూ.5.05 లక్షలు ఫ్రీజ్, ల్యాప్‌టాప్, ఎనిమిది సెల్‌ఫోన్లు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ పేర్కొన్నారు. ఇందులో నల్లచెరువు మేనకగాంధీనగర్‌కు చెందిన తాతినేని శ్రీనివాసరావు గత పదేళ్లగా ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో వెల్లడైందని తెలిపారు. కొరిటెపాడు పార్కు వెనుక ఉండే యర్రబోతుల విజయభాస్కర రెడ్డితో కలసి శ్రీనివాసరావు బెట్టింగ్‌లు నిర్వహించేవాడని చెప్పారు. ఇద్దరూ ఒక బెట్టింగ్‌లను పలువురికి అలవాటు చేశారని, యాప్‌ల ద్వారా బాల్ టు బాల్ బెట్టింగ్ నిర్వహించే వారని వివరించారు.

పేకాటలో మోసం

అంతర్జాతీయ, జాతీయ, లీగ్ క్రికెట్ మ్యాచ్‌ల వేళ తాతినేని శ్రీనివాసరావు సెల్‌ఫోన్‌లో వాట్సాప్ గ్రూప్‌లోని సభ్యులకు సమాచారం చేరవేసేవాడని ఎస్పీ తెలిపారు. పీచ్ ఈఎక్స్‌సీహెచ్ యాప్ సంబంధించి లాగిన్ ఐడీలు, పాస్‌వర్డ్‌లు పంపించి బెట్టింగ్‌లు చేసేవాడని వివరించారు. ఇదిగాక శ్రీనివాసరావు అప్పుడప్పుడు తెలిసిన వ్యక్తులతో పేకాట ఆడేవాడని చెప్పారు. ఇందులో సెల్‌ఫోన్, రిస్ట్ వాచీ, చెవిలో బ్లూ టూత్ ఉపయోగించి మిగతా ఆటగాళ్లను మోసగించేవాడన్నారు. ఆటగాళ్లకు ఫోన్‌పేల నగదు చెల్లించేవారని, వంద నుంచి పదివేల రూపాయల వరకు పందేలు ఉంటాయని తెలిపారు. అరెస్ట్ చేసిన ఎనిమిది మందిని న్యాయస్థానంలో హాజరుపరిచామని ఎస్పీ చెప్పారు. పీచ్ ఈఎక్స్‌సీహెచ్ యాప్ వెనుక ఎవరూ ఉన్నారనేది విచారిస్తున్నామని, గత పదేళ్లల్లో శ్రీనివాసరావుపై ఒక్క కేసు నమోదై ఉందని వెల్లడించారు. కేసుని ఛేదించిన డీఎస్పీలు అరవింద్ (గుంటూరు పశ్చిమ), శ్రీనివాసులు (ఎస్‌బీ), సీఐలు అలహరి శ్రీనివాస్ (ఎస్‌బీ), గంగా వెంకటేశ్వర్లు (పట్టాభిపురం పీఎస్), ఎస్ఐ నాగేంద్ర, పోలీస్ సిబ్బందిని అభినందించారు.

ఆకాశమే హద్దుగా విజయాలు ఉండాలి

సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలత

బాలలతను సత్కరిస్తున్న ప్రొఫెసర్ విజయలక్ష్మి తదితరులు

ఏఎన్‌యూ(పెదకాకాని): మారుతున్న కాలంలో సాంకేతికతను ఉపయోగించుకుంటూ ఎక్కువ కష్టపడే వారికి విజయావకాశాలు ఆకాశమే హద్దుగా మారిపోతాయని సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలత అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ డిపార్ట్‌మెంట్ లీగల్ స్టడీస్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ప్రథమ సంవత్సర న్యాయ విద్యార్థుల స్వాగతోత్సవ కార్యక్రమానికి ఆమె గౌరవ అతిథిగా పాల్గొని ప్రసంగించారు. యువ న్యాయ విద్యార్థులు కోర్సు పూర్తి అయ్యాక ఏమి చేయాలో ఆలోచించడం కన్నా కోర్సు ఆరంభంలోనే వారు ఏమి కావాలనుకుంటున్నారో నిర్ణయించుకొని ఆ ప్రకారంగా తగిన ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన యూనివర్సిటీ లా బోర్డ్ స్టడీస్ చైర్ పర్సన్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ డిపార్ట్‌మెంట్ లీగల్ స్టడీస్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ విభాగం న్యాయ విద్యార్థులకు అన్ని విధాలుగా తోడ్పడుతూ వారి జీవన, విద్యా ప్రమాణాలను పెంపునకు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ ప్రోగ్రాం ఆఫీసర్ మండూరి వెంకటరమణ పోటీలలో విజేతలైన విద్యార్థిని విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. న్యాయ విభాగం అధ్యాపకులు డాక్టర్ పి.వెంకటరమణ, డాక్టర్ ఎస్. చంద్రశేఖర్, డాక్టర్ సురేష్ చెన్నం, డాక్టర్ రామకోటిరెడ్డి, డాక్టర్ రామకృష్ణ బాబా, పరుచూరు కుమారి, దినకర్, మనోజ్, సైకాలజీ అధ్యాపకురాలు ప్రమీలారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టర్ దాసరి శ్రీనివాసులు సరెండర్?

గుంటూరు మెడికల్: జిల్లా టీబీ నియంత్రణ అధికారిగా, జిల్లా ఎయిడ్స్, లెప్రసీ అధికారిగా పనిచేస్తున్న డాక్టర్ దాసరి శ్రీనివాసులును సరెండర్ చేస్తున్నట్లు సమాచారం. రెండు రోజుల్లో సరెండర్ ఉత్తర్వులు వెలువడే అవకాశాలు ఉన్నాయి. జిల్లా టీబీ కార్యాలయంలో కాంట్రాక్టు పోస్టుల్లో డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు వచ్చాయి. పలువురు లిఖితపూర్వకంగా దాసరి శ్రీనివాసులుపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్య అధికారులు రహస్యంగా విచారణ చేశారు. విచారణలో డబ్బులు చేతులు మారినట్లు తెలిసింది. ఈనేపథ్యంలో డాక్టర్ దాసరి శ్రీనివాసులును సరెండర్ చేసేందుకు జిల్లా వైద్య అధికారులు రంగం సిద్ధం చేశారు.

వక్ఫ్ భూములకు పూర్తిస్థాయిలో సర్వే

కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా ఆదేశం

గుంటూరు వెస్ట్: జిల్లాలోని వక్ఫ్ భూముల్ని పూర్తిస్థాయిలో సర్వే చేసి హద్దులు ఏర్పాటుకు వక్ఫ్ బోర్డు, సర్వే, రెవెన్యూ అధికారులు పటిష్ట ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో సోమవారం జిల్లా స్థాయి ఇంటర్ డిపార్ట్‌మెంటల్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మైనార్టీ సంక్షేమ శాఖ జారీ చేసిన ఉత్తర్వులు మేరకు జిల్లా వక్ఫ్ ఆఫీసర్‌గా జిల్లా రెవెన్యూ అధికారి, మండల వక్ఫ్ ఆఫీసర్‌గా తహసీల్దార్ వ్యవహరిస్తూ భూములు ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వక్ఫ్ బోర్డ్ అధికారులను సమన్వయం చేసుకుంటూ భూముల్ని రెవెన్యూ డివిజన్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ చెప్పారు. ఆక్రమణలు, రిజిస్ట్రేషన్లపై వక్ఫ్ బోర్డు అధికారులు లిఖితపూర్వకంగా వివరాలు అందిస్తే విచారణ చేయించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్వే పూర్తయిన భూములు ఆక్రమణ కాకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, డీఆర్వో షేక్ ఖాజావలి, జిల్లా రిజిస్ట్రార్ డి. శైలజ, డీపీఓ సాయికుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, జిల్లా సర్వేయర్ పవన్ కుమార్, వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ ఖాజా మస్తాన్, ఎస్ఈ సుందరరామిరెడ్డి పాల్గొన్నారు.

కృష్ణా నదిలో గుర్తు తెలియని మృతదేహం

తాడేపల్లి రూరల్: సీతానగరం పుష్కర ఘాట్ల సమీపంలో రైల్వే బ్రిడ్జి కింద మృతదేహం ఉన్నట్లు స్థానికులు సోమవారం తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి వారు వెళ్లి విజయవాడ నుంచి కృష్ణా కెనాల్‌కు వచ్చే రైల్వే ట్రాక్ వద్ద మృతదేహాన్ని గుర్తించారు. దాన్ని బయటకు తీసి గుట్టుచప్పుడు కాకుండా మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం మృతుడి శరీరంపై గాయాలు ఉన్నాయని, ఒక కన్ను పూర్తిగా పోయి లొట్టగా ఉందని తెలియవచ్చింది. మృతి చెందిన వ్యక్తి వయస్సు సుమారు 35 ఉండొచ్చు. ట్రైన్‌లో నుంచి జారి పడ్డాడా? గతంలో మాదిరి రైల్వేబ్రిడ్జిపై హత్యచేసి కిందకు నీళ్లలోకి పడవేశారా ? అనే విషయాలు తెలియాల్సి ఉంది.

టిప్పర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ముందు వెళ్తున్న టిప్పర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనుక బైక్‌పై వస్తున్న వ్యక్తి టిప్పర్‌ను ఢీకొని మృతి చెందాడు. ఈ ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని వెస్ట్ బైపాస్ రోడ్డులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లా చిన్న కాకాని గ్రామానికి చెందిన వల్లభాపురం నరేష్(38) కృష్ణాయపాలెంలో ఓ కంపెనీలో పని చేస్తుంటాడు. ఆదివారం సాయంత్రం నరేష్ తమ్ముడికి కంపెనీ నుంచి ఫోన్ చేసి మీ అన్నయ్య వెస్ట్ బైపాస్ రోడ్డులో యాక్సిడెంట్ అయి చనిపోయాడని చెప్పాడు. దీంతో ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం గురించి ఆరా తీయగా, నున్నలో ఓ పని కోసం వచ్చి, ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తున్న క్రమంలో నరేష్‌కు ప్రమాదం చోటు చేసుకుందని చెప్పాడు. దీంతో మృతుని భార్య కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఫిర్యాదులకు చట్ట పరిధిలో పరిష్కారం

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం పీజీఆర్ఎస్ (గ్రీవెన్స్) నిర్వహించారు. బాధితుల నుంచి ఫిర్యాదులను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ స్వీకరించారు. వారి మొరను ఆయన ఆలకించారు. నిర్ణీత గడువులోగా ఫిర్యాదులను చట్ట ప్రకారం పరిష్కరించాలని పోలీసు అధికారులకు సూచించారు. అర్జీలు పునరావృతం కాకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ రమణమూర్తి (పరిపాలన), డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి (మహిళా పీఎస్), బెల్లం శ్రీనివాసరావు (ట్రాఫిక్), అబ్దుల్ అజీజ్ (గుంటూరు తూర్పు) పాల్గొన్నారు.

అనధికారికంగా షెడ్ల నిర్మాణం

కోనేరు వెనుక హిందూ అపరకర్మలకు స్థలం ఉంది. మేం ఊరెళ్లిన సమయంలో ఆవరణలో, రహదారిపై అక్రమంగా షెడ్లు నిర్మించారు. తీసేయాలని సదరు వ్యక్తులకు విన్నవించినా పట్టించుకోలేదు. అందులో మూడు షెడ్లను నిర్మించారు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదు. సిబ్బందికి రక్షణతో పాటు సంఘ ఆస్తులకు భద్రత కల్పించాలని విన్నవించాం. అయినప్పటికీ చర్యల్లేవు. జీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదు. అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

– జీవీ. కుమార్, అన్నవరపు పాండురంగారావు (హిందూ అపరకర్మల నిర్వహణ సంఘం)

సహకార ఉద్యోగుల ఆందోళన

ఆందోళన చేస్తున్న సహకార సంఘాల నాయకులు, ఉద్యోగులు

కొరిటెపాడు(గుంటూరు): దీర్ఘకాలికంగా పేరుకుపోయిన వ్యవసాయ సహకార సంఘం ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బ్రాడీపేటలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఆవరణలో ఏపీ వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సహకార సంఘాల ఉద్యోగులు సోమవారం ధర్నా నిర్వహించారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఏపీ వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మువ్వా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వెంటనే జీఓ నంబర్ 36ను అమలు చేసి పెండింగ్‌లో ఉన్న వేతన సవరణలు చేసి అప్పటి వరకు మధ్యంతర భృతిని ఇవ్వాలని కోరారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన గ్రాట్యూటీ సీలింగ్‌ను రూ.2 లక్షల నుంచి ఎత్తి వేయాలన్నారు. గ్రాట్యూటీ చట్టం ప్రకారం చెల్లింపులు చేయాలన్నారు. సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు రూ.5 లక్షలకు తక్కువ కాకుండా ఆరోగ్య బీమా, రూ.20 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్‌ను చేయించాలని సూచించారు. జీతభత్యాల్లో కోత విధించడం సరైనది కాదన్నారు. ఉద్యోగులందరికీ వేతనాలు పెంచాలని, కనీస వేతనం తగ్గకుండా ప్రతి ఉద్యోగికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోతే ఈ నెల 29వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం చేపడతామన్నారు. సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే జనవరి 5వ తేదీ నుంచి రిలే నిరాహార దీక్షలు చేపడతామని ఆయన హెచ్చరించారు. అనంతరం జీడీసీసీ బ్యాంక్ సీఈఓ ఫణికుమార్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సహకార సంఘాల నాయకులు, పెద్ద ఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో నేషనల్ అగ్రిటెక్ హ్యాకథాన్ ప్రారంభం

ఎంఓయూ పత్రాలతో కళాశాల యాజమాన్యం, అతిథులు

గుంటూరు రూరల్: వ్యవసాయ రంగంలో నూతన ఆవిష్కరణలతో విద్యార్థులు అన్నదాతకు అండగా నిలవాలని, ప్రతి ఇంటి నుంచి ఒకరు వ్యవసాయ వృత్తిలో భాగస్వాములవ్వాలని కేంద్ర ప్రభుత్వ ఐసీఏఆర్ నారమ్ ఏఐడీయా అడిషనల్ సీఈఓ డాక్టర్ విజయ్ తెలిపారు. చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్.టి.పి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ ఆధారిత సంస్థల సహకారంతో రెండు రోజుల పాటు జరగనున్న నేషనల్ అగ్రిటెక్ హ్యాకథాన్–2025 సోమవారం ప్రారంభించారు. దేశవ్యాప్తంగా 17 రాష్ట్రాల నుంచి 66 జట్లు, 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వ్యవసాయం, మత్స్య పరిశ్రమ, పశుపోషణ, చిరుధాన్యాల రంగాల్లోని సవాళ్లకు సాంకేతిక పరిష్కార మార్గాలను సూచించారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన విద్యార్థుల నూతన ఆవిష్కరణల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సాంకేతిక ఆవిష్కరణలను మరింత అభివృద్ధి చేసేందుకు డాక్టర్ విజయ్, కళాశాల సెక్రటరీ ఆర్ గోపాలకృష్ణలు ఎమ్ఓయూ కుదుర్చుకుని ఒప్పంద పత్రాలను అందుకున్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాల నాబార్డ్ ఏజీఎం జి. శరత్ బాబు, ఢిల్లీ ఇందిరాగాంధీ టెక్నికల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్. రాంనారాయణరెడ్డి, కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జె. మురళీమోహన్, ఎం. జగదీష్ , కళాశాల సెక్రటరీ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్ ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ఎం.వి.పి. చంద్రశేఖర్‌రావు, సీఈఓ ఆర్. హఫీజ్ బాషా, శోభ, పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కాకుమానులో గంజాయి స్వాధీనం

- మైనర్ బాలుడి అరెస్టు
- వైజాగ్ నుంచి బాపట్లకు ఆటోలో తరలింపు
- మూడున్నర కేజీల గంజాయి స్వాధీనం

వివరాలను వెల్లడిస్తున్న సౌత్ జోన్ డీఎస్పీ భానూదయ

ప్రత్తిపాడు: ఆటోలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న మైనర్ బాలుడిని కాకుమాను పోలీసులు అరెస్టు చేశారు. గుంటూరు సౌత్‌జోన్ డీఎస్పీ జి. భానోదయ సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఈ నెల 21వ తేదీ సాయంత్రం కాకుమాను ఎస్ఐ ఏక్‌నాథ్ స్థానిక అప్పాపురం రోడ్డు సమీపంలోని కరుణ రూరల్ గోడౌన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో పెదనందిపాడు వైపు నుంచి బాపట్ల వైపు వెళుతున్న ఆటోని నిలిపి తనిఖీ చేస్తుండగా, ఆటోలో ఉన్న ఇద్దరిలో ఒక వ్యక్తి దూకి పొలాల్లోకి పారిపోయాడు. దీంతో ఆటోలో ఉన్న బాపట్ల మండలం చెరువుజమ్ములపాలెం గ్రామానికి చెందిన మైనర్ బాలుడిని అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా అందులో గంజాయి దొరికింది. ఈ మేరకు మైనర్ బాలుడిపై కేసు నమోదు చేసి అతని వద్ద నుంచి మూడున్నర కేజీల గంజాయి, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సీఐ జి. శ్రీనివాసరావు, ఎస్ఐ. ఏక్‌నాథ్‌లు బాలుడిని అదుపులోకి అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PROPERTY FOR SALE

■ Guntur Edlapadu near NH-5 6 years age Red Sandel Trees with Plots Sale Any Marketing Teams & Developers Wanted 9885068298, 9963015243.

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

WANTED

■ బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ / బిజినెస్ మేనేజర్స్ కావలెను. డిగ్రీ, 3సం॥ల మార్కెటింగ్ రంగంలో అనుభవం, 30సం॥లోపు వారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

■ ప్రముఖ సెక్యూరిటీ సంస్థలు వినుకొండ ఏరియాలలో 8గం॥ పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ M/F కావలెను. జీతం: 12,000. సంప్ర॥ 9515524430

■ గ్రీన్ ఆర్బిట్ సర్వీసెస్ ప్రాజెక్ట్‌లో ఫీల్డ్ వర్క్ చేయుటకు మండలాల వారీగా PRO లు కావలెను. అర్హత: 10th–డిగ్రీ, జీతం: 15,000–18000, సంప్రదించండి ॥ 8008899861, 8179316236

■ గుంటూరు జిన్నాటవర్ సెంటర్ రామా ఎంటర్ ప్రైజెస్ నందు పని చేయుటకు 2సం॥ సేల్స్ అనుభవం కలిగిన లేడీ కావలెను. అర్హత ఇంటర్, టైం: 3 to 9, . జీతం: 10k. 8 to 9am 9441665758

■ గుంటూరు మెయిన్‌రోడ్డు లక్ష్మీపురం నందు ట్రాన్స్ మీడియా టెక్నాలజీస్(ఏ.పి) ప్రై.లి॥ కంపెనీలో పనిచేయుటకు టెక్నీషియన్స్ (M) కావలెను. 9059812327, 9603433389

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు క్లాసు ఇన్ ఛార్జీస్ మరియు క్యాంపస్ ఇన్‌ఛార్జీస్ గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 14000/- నుండి 21000/- వరకు ఇవ్వబడును. అర్హతలు: ఇంటర్ మరియు పి.జి వరకు, వయస్సు: 22 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యి ఉండాలి. సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 91000 69089

■ సె॥ గార్డ్స్ అమరావతి కొత్త CRDA ప్రాంతంలో 12 గం కావలెను వ 45 Q: 10th P/F, జీతం: 17 వేలు+ PF, ESI. ✆ 94903 80213, 94902 48039

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే (4 లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు ఎవరైనా క్లెయిమ్ చేసే వాటితో ఈ వారం పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయమన్న వారితో ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక

తాడేపల్లి రూరల్: గుంటూరు జిల్లా జేకేసీ కాలేజీలో ఈనెల 20వ తేదీన జరిగిన సీనియర్ బాలుర కబడ్డీ పోటీలలో తాడేపల్లి గుడ్‌న్యూస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థి ప్రతిభ కనబరిచారని పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్ రెవ.ఫాదర్ జె.ఆరోగ్యదాస్ సోమవారం తెలియజేశారు. తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎం.జితేంద్ర 72వ గుంటూరు జిల్లా సీనియర్ బాలుర కబడ్డీ పోటీలలో పాల్గొని ప్రతిభ చాటారని పేర్కొన్నారు. ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు కర్నూలులో జరిగే కబడ్డీ పోటీలలో విద్యార్థి పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి జితేంద్రను పాఠశాల అడ్మినిస్ట్రేటర్ రెవ.ఫాదర్ సుగంధన్, పాఠశాల క్యాంపస్ ఇన్‌చార్జి రెవ. ఫాదర్ సెబ్యాస్టియన్, పీడీ కె.అజయ్‌కుమార్, పీఈటీడీ సురేష్ అభినందించారు.

ఎస్సీ వర్గీకరణపై ఎన్డీయే నాయకుల దుష్ప్రచారం

దుగ్గిరాల: ప్రధాని మోడీ నేతృత్వంలోని బీజేపీ నాయకత్వం.. చంద్రబాబు నేతృత్వంలో టీడీపీ నాయకత్వం ప్రజలను తప్పుదోవ పట్టించడం సుప్రీంకోర్టు ధిక్కారమేనని ఏపీ ఎమ్మార్పీఎస్ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు అన్నారు. సోమవారం దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత న్యాయ వ్యవస్థ 2024 ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం న్యాయ సమీక్ష ద్వారా ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతకు దేశంలోని అన్ని రాష్ట్రాలకు అధికారాన్ని కల్పిస్తూ చారిత్రక తీర్పును వెలువరించిన విషయం విదితమేనని అన్నారు. సదర తీర్పును తామంటే తామే తెచ్చామని ఎ న్డీయే ప్రభుత్వ నాయకులు మాదిగ ప్రజలను తప్పుదోవ పట్టించడం సరికాదని పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలపై అధికారుల జులుం!

అనుమతి లేదంటూ తొలగింపు

మంగళగిరి టౌన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా నిడమర్రులో పలు చోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీనిని జీర్ణించుకోలేని టీడీపీ నేతలు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. టౌన్ ప్లానింగ్ సెక్రటరీలతో ఫ్లెక్సీల తొలగింపునకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. నిడమర్రు టౌన్ ప్లానింగ్ అధికారులు సిబ్బందిని వెంటబెట్టుకుని ఆయా ప్రాంతాల్లో ఉన్న వైఎస్ జగన్ ఫ్లెక్సీలను సోమవారం తొలగించారు. సమాచారం అందుకున్న పార్టీ నిడమర్రు గ్రామ అధ్యక్షులు సుబ్బారెడ్డి, నాయకులు ఫ్లెక్సీలు ఎందుకు తొలగిస్తున్నారంటూ ప్రశ్నించారు. అనుమతి తీసుకోకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినందున తొలగిస్తున్నామని సమాధానం ఇచ్చారు. అలా అయితే గ్రామంలో టీడీపీ ఫ్లెక్సీలు పదుల సంఖ్యలో ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు చేశారని, వీటన్నింటికీ అనుమతులు ఉన్నాయా అంటూ అధికారులను పార్టీ నాయకులు ప్రశ్నించారు. కొద్దిసేపటి అనంతరం టీడీపీకి చెందిన ఫ్లెక్సీలను కూడా తొలగించి అక్కడి నుంచి అధికారులు వెళ్లిపోయారు.

తెనాలి రోడ్డు విస్తరణ పనులు ఆపాలి

మంగళగిరి టౌన్: ప్రజా వ్యతిరేక గెజిట్‌ను తక్షణమే రద్దు చేసి తెనాలి రోడ్డు విస్తరణ పనులు ఆపాలని తెనాలి రోడ్డు చేనేత వ్యాపార పరిరక్షణ, విస్తరణ బాధితుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం గుంటూరు కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేశారు. రోడ్డు విస్తరణ వల్ల జీవనోపాధి కోల్పోతామని.. ప్రజాభిప్రాయం తీసుకోకుండా ఏకపక్షంగా తీసుకువచ్చిన గెజిట్‌ను రద్దు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ



ఫిరంగిపురం: గ్రామ పంచాయతీ పరిధిలోని 32 మంది పారిశుద్ధ్య కార్మికులకు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మేడాబాబు, పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి షేక్.ఫిరోజ్‌లు దుస్తులు, సోప్స్, చెప్పులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని వీధులు పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో విలువైనదని చెప్పారు. చెత్తాచెదారం లేకుండా గ్రామాన్ని స్వచ్ఛత గ్రామంగా పారిశుద్ధ్య కార్మికులు తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా ఉంటుంది

మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

ప్రాతూరులో వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

కేకను కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గెలుపొందిన వారితో వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లి రూరల్: పేదల జీవితాల్లో మార్పు రావాలంటే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం తాడేపల్లి రూరల్ పరిధి ప్రాతూరు గ్రామంలో మండల అధ్యక్షులు అమరా నాగయ్య, పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డిలతో కలిసి వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ.. పార్టీ నాయకులు, కార్యకర్తలకు చంద్రబాబు ప్రభుత్వం ఎటువంటి ఇబ్బందులు పెట్టినా వారికి అండగా ఉంటామని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరినీ గుర్తుపెట్టుకుంటామని అన్నారు. అనంతరం గ్రామంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపాలిటీ వింగ్ వైస్ ప్రెసిడెంట్ మున్నంగి వివేకానందరెడ్డి, ప్రాతూరు పార్టీ అధ్యక్షులు డోకుపర్తి చలపతి, మాజీ ఎంపీపీ పాతూరు లలితకుమారి, తాడేపల్లి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు సంకురు మరియబాబు, మహిళా అధ్యక్షులు నాగ స్రవంతి, మండల కార్యదర్శి సంకురు దిలీప్, మాజీ ఎంపీటీసీలు సత్యనారాయణ రెడ్డి, బొమ్మారెడ్డి సునీత, రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ ప్రాతూరు మేరీ రాణి, ఉపాధ్యక్షులు సంకురు యేబు, యువజన అధ్యక్షులు కారుకొండ నాని, బండ్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జగనన్న షెటిల్ టోర్నమెంట్..

తాడేపల్లి రూరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పెనుమాకలో మేకా బ్రదర్స్ ఆధ్వర్యంలో షెటిల్ టోర్నమెంట్ పోటీలను నిర్వహించారు. ఆటల పోటీలు ముగియడంతో సోమవారం గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పార్టీ తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా నాగయ్య, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు, పొన్నూరు నియోజకవర్గ పరిశీలకులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, రాష్ట్ర మున్సిపల్ వింగ్ వైస్ ప్రెసిడెంట్ మున్నంగి వివేకానందరెడ్డి విజేతలకు బహుమతులను అందజేశారు. పార్టీ పెనుమాక అధ్యక్షులు, మాజీ సొసైటీ ప్రెసిడెంట్ మేకా శివారెడ్డి, అంజిరెడ్డి, మేకా దామేష్ రెడ్డి, మేకా ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించడం ఆనందకరమైన విషయమని అమరా నాగయ్య అన్నారు. మొదటి బహుమతిగా రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, తృతీయ బహుమతి రూ, 10 వేలు, నాలుగో బహుమతి రూ.5 వేలను విజేతలకు అందించారు. అనంతరం గెలుపొందిన ప్రతి ఒక్కరికీ షీల్డ్‌ను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు భుజంగరావు, పచ్చల విజయ్‌కుమార్, పుల్లారావు, బషీర్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందున్న నాయకులు

ఫిరంగిపురం: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు పిలుపుమేరకు ఫిరంగిపురం మండలం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు వేడుకలకు తరలివెళ్లారని పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి అన్నారు. తాడికొండ అడ్డరోడ్డులో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో మండలంలోని పలుగ్రామాల నుంచి వచ్చిన సుమారు 40 మంది రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొని రక్తదానం చేసి జగనన్నపై అభిమానాన్ని చాటుకున్నారని పేర్కొన్నారు. రక్తదానం చేసిన వారిలో మోరంరెడ్డి శ్రీనివాసరెడ్డి, పెరికల చిన్న, కె.రామయ్య, యు.చరణ్, శివనాగిరెడ్డి, నందన్‌రెడ్డి, సయ్యద్ సైదుసాహెబ్, ఎం.రాయప్ప, పలువురు నాయకులు ఉన్నారు.

జననేత జగనన్న..

ఫిరంగిపురం: మండలంలోని మేరికపూడి గ్రామంలో ఆదివారం వైఎస్ జగన్ జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు కేకును కట్ చేశారు. సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు పి.వెంకట్రామిరెడ్డి, గ్రామపార్టీ అధ్యక్షుడు డి.బ్రహ్మారెడ్డి, సర్పంచ్ కంజుల పద్మ, పార్టీ నాయకులు కె.బ్రహ్మారెడ్డి, నాయకులు ఎ.శ్రీనివాస రెడ్డి, కె.భార్గవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ జగన్ జన్మదినోత్సవం

వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వేమారెడ్డి

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ, మండలంలో వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని ఆదివారం రాత్రి నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణ పరిధి రత్నాలచెరువు 21వ వార్డు అధ్యక్షులు బియ్యం శ్రీను ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. భారీ కేక్‌ను నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి కట్ చేసి సంబరాలు జరిపారు. తొలుత వార్డులోని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి స్థానిక నాయకులతో కలిసి వేమారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కాజా గ్రామంలో ఎస్సీసెల్ మండల అధ్యక్షులు గర్నెపూడి సుభాకర్ ఆధ్వర్యంలో జగనన్న జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, నాయకులు మల్లవరపు సుధారాణి, రవి, కోటేశ్వరరావు, బాజి, కుమారి, రామాంజనేయులు, స్థానిక నాయకులు, మండల అధ్యక్షులు నాలి వెంకటకృష్ణ, నాయకులు చిట్టిమళ్ల సుబ్బు, అంజిరెడ్డి, మండేపూడి బుజ్జి, కుక్కమళ్ల శేషు, అగస్టీన్, నాగరాజు, ప్రియనందన్, లేళ్ల సురేష్, ప్రశాంత్, సంతోష్, రత్నం, రత్నంరాజు, కిషోర్‌రాజు పాల్గొన్నారు. అలానే పట్టణంలోని 26వ వార్డులో నిర్వహించిన వేడుకల్లో నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షురాలు తమ్మిశెట్టి గౌతమి పాల్గొన్నారు.

వినియోగదారులకు హక్కులపై అవగాహన

హక్కులపై అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

మంగళగిరి టౌన్: వినియోగదారులు తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలని కేఎల్ యూనివర్సిటీ విద్యార్థి విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ సూచించారు. మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలో యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్, ఏఐఅండ్‌డీఎస్ విభాగాల ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కుల రక్షణ చట్టంపై సోమవారం వలంటీర్లు ఇంటింటికి వెళ్లి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వినియోగదారులు కొనుగోలు చేసే ఉత్పత్తుల సమాచారం, ధర, తయారీ తేదీ, గడువు తేదీ, కంపెనీ వివరాలు, నాణ్యత తదితరల వివరాలు, అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. నాణ్యత లేని ఉత్పత్తులు, తప్పుదోవ పట్టించే ప్రకటనలు, సేవా లోపాల వల్ల నష్టాలు జరిగితే కేసు వేసి న్యాయపరిహారం పొందే హక్కు ఉంటుందని వివరించారు. అందుకు 1800 114000, 88000 01915, 1915 నంబర్‌లకు ఫోన్ చేసి అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, ప్రోగ్రామ్ ఆఫీసర్ జోనితిన్, ఫీల్డ్ కోఆర్డినేటర్ సురేష్, వలంటీర్లను వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్‌ప్రసాద్, కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డీన్ డాక్టర్ హబీబుల్లా ఖాన్ తదితరులు అభినందించారు.

ఘనంగా రామానుజన్ జయంతి

దుగ్గిరాల: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప గణిత శాస్త్రవేత్తల్లో శ్రీనివాస రామానుజన్ ఒకరని స్థానిక బాలికల పాఠశాల ఉపాధ్యాయిని అరుణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రామానుజన్ జయంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలతో అంజలి ఘటించారు. అనంతరం హెచ్ఎం శోభాదేవి మాట్లాడారు. రేవేంద్రపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన రామానుజన్ జయంతి కార్యక్రమంలో హెచ్ఎం బీవీ కృష్ణారావు, ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, శివకుమారి, మాధురి, అనసూర్యదేవి, సరోజని, పాల్గొన్నారు.

రాజ్యాధికార పార్టీ అధ్యక్షులుగా విజయకుమార్ గౌడ్

విజయకుమార్‌కు నియామక పత్రం అందజేస్తున్న నారిగోని

తాడేపల్లి రూరల్: రాజ్యాధికార పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులుగా విజయకుమార్ గౌడ్‌ను నియమిస్తూ పార్టీ జాతీయ అధ్యక్షులు వి.జి.ఆర్. నారిగోని నియామకపత్రాన్ని సోమవారం అందజేశారు. తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారిగోని మాట్లాడారు. మహాత్మా జ్యోతిరావుపూలే, బాబా సాహెబ్ అంబేడ్కర్, కాన్షీరాం ఆశయాలకు అనుగుణంగా బహుజనుల రాజ్యాధికార పాలనకు ఉద్యమించడానికి, పార్టీ ఆశయాలను, లక్ష్యాల సాధనకు అంగీకరించినందున ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులుగా విజయ్‌కుమార్ గౌడ్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. అనంతరం జాతీయ ఉపాధ్యక్షులుగా వీరంకి అయ్యనబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఈర్ల వెంకటేశ్వర్లు ముదిరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీనివాసరావు, యువజన సంఘం అధ్యక్షులుగా సతీష్‌కుమార్‌లను ప్రకటించారు. సమావేశంలో నాయకులు లుక్కా వెంకటేశ్వరరావు, గద్ది శ్రీనివాసుల నాయుడు, బోయినపల్లి శ్రీదేవి, బొడ్డు జయచంద్ర, రాయల్ తిరుమలరావు, అనుమోలు విజయ్ కుమార్, ఎ.పూర్ణచంద్రరావు, జయబాబు, పి.దేవి, మురళీ, ఉప్పు రాంబాబు, వేల్పూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలి

బిల్లు ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

పొనుగుపాడులో బిల్లును దహనం చేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని సీపీఎం తాడేపల్లి మండల సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. సోమవారం వడ్డేశ్వరంలో అమరజీవి కామ్రేడ్ కేవీ పూర్ణచంద్రరావు విగ్రహం వద్ద నాయకులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ.. 2006లో ప్రభుత్వ భాగస్వామ్యంతో వామపక్ష పార్టీలు పేదలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేసేందుకు పోరాటం చేశారని అన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత 2015 నుంచి ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచే విధంగా నిధులకు కోత విధిస్తున్నారని విమర్శించారు. నేడు ఆ పథకాన్ని వికసిత్ భారత్ ఆవాస్ రోజ్ గార్ గ్రామీణ అవజీక పథకం పేరుతో బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం పేదల పొట్టగొట్టడమే అవుతుందని మండిపడ్డారు. అనంతరం ఉపాధి హామీ బిల్లు ప్రతులను దహనం చేశారు. నాయకులు పల్లెకృష్ణ, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, గుడిసె శ్రీనివాసరావు, వడ్డేశ్వరం బిక్షాలు, చొప్పర వెంకటేశ్వరరావు, కె.రాజేష్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

ఫిరంగిపురం: మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం తగదని సీపీఎం పార్టీ నాయకులు అన్నారు. మండలంలోని పొనుగుపాడులో సోమవారం వామపక్షాల పిలుపుమేరకు సీపీఎం ఆధ్వర్యంలో కేంద్రం ప్రవేశపెట్టిన నూతన వీబీజీ రాంజీ చట్టాన్ని నిరసిస్తూ ఉపాధి హామీ నూతన బిల్లు కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి ఆ చట్టంలోని గాంధీ పేరును తొలగించడం గాంధీని అవమానించడమే అవుతుందని అన్నారు. నూతన బిల్లును కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి షేక్.మస్తాన్‌వలి, నాయకులు కె.కోటేశ్వరరావు, కె.రమేష్, ఎన్.మస్తాన్, కోటేశ్వరరావులు పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కారానికి కచ్చాడ్రైయిన్

వివాదాలతో నిలిచిపోయిన పనులు

కచ్చా డ్రైయిన్ పూడిక తీస్తున్న ప్రొక్లయినర్

తాడేపల్లి రూరల్: చిర్రావూరులో పంట పొలాల మురుగుతో పాటు గ్రామంలో మురుగు సమస్యను పరిష్కరించేందుకు సోమవారం ఎంటీఎంసీ అధికారులు శ్రీకారం చుట్టారు. గత 20 రోజుల క్రితం డ్రెయినేజీ పనులు చేస్తుండగా పూర్తిగా ఆక్రమణలు తొలగించి పనులు ప్రారంభించాలని అడ్డుకున్నారు. ఇప్పటికే కొన్ని ఆక్రమణలను ఎంటీఎంసీ అధికారులు తొలగించారు. డ్రెయినేజీ 50 మీటర్లు తీస్తే కాలువ పూర్తి అవుతుంది. గ్రామంలో నివసిస్తూ పలు పార్టీలు మారిన నాయకుడు కరకట్ట నుంచి డ్రెయినేజీ మీదుగా పక్కా నిర్మాణాన్ని ఏర్పాటు చేశారు. మిగిలిన వారు 'మాకు కూడా ఆ అవకాశం ఇస్తే డ్రెయినేజీ తీయిస్తాం.. గతంలో నిర్మిస్తుంటే సచివాలయ సిబ్బంది అడ్డుకున్నారు.. అందరికీ ఒకటే న్యాయం ఉండాలి.. లేకుంటే నిర్మించినవి తొలగించండి.. అప్పుడే డ్రెయినేజీ పనులు చేయాలి..' అంటూ సిబ్బందిని నిలదీయడంతో తాత్కాలికంగా పనుల నిలిచిపోయాయి.

భావిభారత పౌరులను కాపాడుదాం

తాడేపల్లి రూరల్: 'భావిభారత పౌరులను గంజాయి మహమ్మారి నుంచి కాపాడుదాం' అనే నినాదంతో సోమవారం తాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో యూటీఎఫ్ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు భీమిరెడ్డి తాతిరెడ్డి మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు తీసుకుంటే భవిష్యత్తు అంధకారమవుతుందని విద్యార్థులకు సూచించారు. చక్కని క్రమశిక్షణతో పాఠశాలకు వచ్చి విద్యార్థులు మంచి విషయాలు నేర్చుకుని ఉన్నత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. యూటీఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు కె.వెంకటేశ్వరరావు, సత్యశివ నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి టి.ఆంజనేయులు, నాగేషులు, నాయకులు వైవీ ప్రసాద్, కె.రాంబాబు, గఫార్, ప్రేమ సుధారాణి, హనుమంతరావు, రాధాకృష్ణ, జాకీర్ హుస్సేన్, శంకర్, మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు వదలొద్దంటూ రైతన్నల వేడుకోలు!

- కట్ట తీస్తే అన్నదాతలకు తీవ్రనష్టం
- కట్ట వేస్తే నివాసాల్లోకి మురుగు

పంటపొలంలోకి చేరుతున్న మురుగు

తాడేపల్లి రూరల్: స్థానిక 16వ నంబర్ జాతీయ రహదారి నుంచి కుంచనపల్లి ప్రాతూరు, గుండిమెడ, చిర్రావూరు గ్రామ రైతులకు మురుగు కష్టాలు తప్పడం లేదు. కుంచనపల్లిలోని ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్‌లో కుంచనపల్లి బైపాస్ రోడ్డు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి మురుగు వచ్చి పంట కాలువల్లో చేరుతోంది. కాలువలోకి మురుగు రావడంతో అవి పంటపొలాల్లోకి చేరి పంటలు మురుగుతో నిండిపోతోంది. దీంతో రైతులు సోమవారం నీటిసంఘ నాయకులతో కలిసి ప్రతి నివాసానికి తిరిగి పంట కాలువలోకి నీరు వదలవద్దంటూ దండాలు పెట్టి వేడుకున్నారు. ఇళ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని.. మురుగు ఎటు పల్లంగా ఉంటే అటు వెళుతుందని నివాసదారులు చెప్పడంతో రైతులు వారిపై అసహనం వ్యక్తం చేశారు. చివరకు నీటిసంఘ నాయకులు మురుగు వదిలితే సహించేది లేదంటూ, ఇది రైతులు పంట పండించుకోవడానికి ఏర్పాటు చేసిన కాలువ అని, మురుగు వదిలేందుకు కాదని, రోడ్డు దాటించి పైపులైన్లు వేసి కాలువలోకి వదులుతున్నారని, ప్రతి ఒక్క పైపులైను వద్ద మట్టి పోస్తామని హెచ్చరించారు. ఇంతటి తీవ్రమైన సమస్యల నెలకొన్నా ఎంటీఎంసీ అధికారులు లేదా రాజకీయ పార్టీల నాయకులు ఎవరూ ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

మురుగు వదలడానికి వీల్లేదు..

ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ ఏర్పాటు చేసింది రైతులు పంటలు పండించుకోవడానికి. బైపాస్‌రోడ్ పక్కన ఉన్న పంటపొలాల్లో నివాసాలు ఏర్పడ్డాయి. మా పంట పొలాల్లో పంటలు పండించుకున్నాం. వారు ఇళ్లు కట్టుకునేటప్పుడు ఇచ్చిన అనుమతులు, మురుగు ఎలా మళ్లించాలో అధికారులు చెప్పాలి. మా పంటపొలాల్లోకి మురుగు రావడానికి వీల్లేదు.

– పాటిబండ్ల రాము, రైతు

నష్టాన్ని ఎవరిస్తారు..

ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్‌పై ఆధారపడి ప్రాతూరు, గుండిమెడలో పొలం కౌలుకు తీసుకుని పంటలు పండిస్తున్నాను. అధిక వర్షాలు, తుఫాన్ కారణంగా ఇప్పటికే నష్టపోయా. ఈ మురుగు వల్ల మరింత నష్టపోతున్నాం. ఈ ఏడాది కౌలు కూడా చెల్లించలేని పరిస్థితిలో ఉన్నాం. అప్పుల పాలవుతున్న మాకు ఆత్మహత్యలే శరణ్యం.

–ఈపూరు మురళీ, కౌలు రైతు

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఫిరంగిపురం: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సీఐ శివరామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని దీనాపూర్ ఇమ్మి నర్సింగ్ కళాశాలలో సోమవారం మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శివరామకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. మత్తు పానీయాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని చెప్పారు. అనంతరం చెడు అలవాట్లకు దూరంగా ఉంటామని చెబుతు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, పోలీస్ సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమీకరణకు స్వచ్ఛందంగా ముందుకొస్తున్న రైతులు

తాడికొండ: భూ సమీకరణకు రైతులు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారని పురపాలక పట్టణాభివృద్ధి శాఖామంత్రి పొంగూరు నారాయణ అన్నారు. రాజధాని ప్రాంతంలోని వడ్డమానులో కొత్తగా నిర్మించిన బీటీ రోడ్డును స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌తో కలిసి మంత్రి సోమవారం ప్రారంభించారు. ఈనెల 10వ తేదీన గ్రామంలో పూలింగ్ ప్రక్రియలో భాగంగా రైతులతో సమావేశం అయిన సందర్భంగా తమ గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు మంత్రిని కోరారు. స్పందించిన మంత్రి నారాయణ వారం రోజుల్లో కొత్తరోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రాజధాని గ్రామాల్లో మౌలిక వసతులకు రూ.900 కోట్లతో పనులు చేపట్టేందుకు డీపీఆర్ సిద్ధం చేస్తున్నామని, వచ్చే నెలలో పనులు ప్రారంభించి జూన్ నెలాఖరుకు అన్ని గ్రామాల్లో రోడ్లు, వీధి దీపాలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వరద నీటి కాలువల పనులు పూర్తి చేసేలా ముందుకెళ్తున్నట్లు తెలిపారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే ఉపేక్షించం

మేడికొండూరు: మండలంలోని ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు సంకల్పం యాంటీ ర్యాగింగ్, డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐ షేక్ నాగుల్ మీరా సాహెబ్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కళాశాలలో సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను పలు రకాలుగా ర్యాగింగ్ విధానమైన అంశాలను ప్రేరేపిస్తే వారిపై ర్యాగింగ్ చట్టాలను ఉపయోగించి కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. పాఠశాలలో ప్రత్యేకంగా యాంటీ ర్యాగింగ్ నిరోధించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మోకాళ్లపై నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

మంగళగిరి టౌన్: తాడేపల్లి ఎంబుక్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ చెంగయ్య డిమాండ్ చేశారు. మంగళగిరి పట్టణం ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట సోమవారం ఎంబుక్ కార్మికులకు నైట్ డ్యూటీ కొనసాగించాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. ఈ నిరసన నాలుగో రోజులో భాగంగా మోకాళ్లపై నిలబడి కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. నాలుగేళ్ల క్రితం ఎంబుక్ కార్మికులను కార్పొరేషన్ అధికారులు విధుల్లోకి తీసుకున్నారని.. రూ.10 వేల వేతనంతో నైట్ డ్యూటీ చేయించేవారని చెంగయ్య పేర్కొన్నారు. నేడు పగటిపూట డ్యూటీ చేయాలని ఎంబుక్ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. పగలు డ్యూటీ చేస్తే రూ. 21 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, వాసంతి, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

క్లుప్తంగా...

స్మగ్లింగ్ బాస్‌కు భయపడుతున్నారా?

- నగరిలో స్మగ్లింగ్ మాఫియాపై టీడీపీ సానుభూతిపరుల మండిపాటు
- చిత్తూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా

కలెక్టరేట్ ఎదుట సీఎం చంద్రబాబు ఫొటోతో ధర్నా నిర్వహిస్తున్న చలపతి, టీడీపీ నేతలు

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు జిల్లా నగరిలో ఉన్న స్మగ్లింగ్ బాస్‌కు అధికార యంత్రాంగం భయపడుతోందా? అని నగరి నియోజకవర్గానికి చెందిన టీడీపీ సానుభూతిపరుడు రామానుజం చలపతి ప్రశ్నించారు. నియోజకవర్గానికి చెందిన టీడీపీ సానుభూతిపరులు చిత్తూరు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. చలపతి మాట్లాడుతూ..నగరి నియోజకవర్గంలో రెండేళ్లుగా రేషన్ బియ్యం, ఇసుక, గ్రావెల్, కంకర, కలప, గంజాయి అనునిత్యం స్మగ్లింగ్ జరుగుతోందని ఆరోపించారు. ఈ స్మగ్లింగ్ వ్యవహారం దినపత్రికల్లో నిత్యం వస్తూనే ఉన్నా.. స్మగ్లింగ్ మాఫియాపై ఎలాంటి చర్యలు లేవన్నారు. స్మగ్లింగ్ మాఫియా ధనానికి అధికారులు అమ్ముడుపోయారేమోననే సందేహాలు తలెత్తుతున్నాయన్నారు. స్మగ్లింగ్ మాఫియా ఆగడాలను నిగ్గు తేల్చాలని కలెక్టర్‌ను డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రమిచ్చారు. ధర్నాలో టీడీపీ నేతలు అలిమేలు, భారతి, రాధ, చెంచమ్మ, రాజేశ్వరి, ఆదేమ్మ, గజేంద్ర, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు కమాండేషన్ డిస్క్ అవార్డులు

సాక్షి, అమరావతి: ఉత్తమ పనితీరు కనబరిచిన పోలీసు అధికారులకు 'డీజీపీ కమాండేషన్ డిస్క్' అవార్డులను రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం ప్రకటించింది. 2025కిగాను 'కమాండేషన్ గోల్డ్ డిస్క్' అవార్డు ఎవరినీ వరించలేదు. ఐపీఎస్ అధికారుల కేటగిరీలో పోలీసు నియామక మండలి చైర్మన్ ఆర్కే మీనా, ఏపీఎస్పీ డీఐజీ త్రివిక్రమ్ వర్మ, డీఐజీ (బెటాలియన్స్) ఫకీరప్ప, గ్రేహౌండ్స్ విభాగం గ్రూప్ కమాండెంట్ సుమిత్ సునీల్ 'కమాండేషన్ సిల్వర్ డిస్క్' అవార్డులకు ఎంపికయ్యారు. హోమ్‌శాఖ కార్యదర్శి కుమార్ విశ్వజిత్, డీజీ (ఆర్గనైజేషన్) బాలసుబ్రహ్మణ్యం, అదనపు డీజీ మధుసూదన్ రెడ్డి, అదనపు డీజీ(ఇంటెలిజెన్స్) మహేశ్ చంద్ర లడ్హా, ఐజీ ఆకే రవికృష్ణ, ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ దామోదర్, ఎస్పీ నరసింహ కిశోర్‌కు 'కమాండేషన్ బ్రాంజ్ డిస్క్' ప్రకటించారు. జిల్లాల్లో వివిధ హోదాల్లో ఉన్న 72మందికి 'కమాండేషన్ సిల్వర్ డిస్క్' అవార్డులు, 339 మందికి 'కమాండేషన్ బ్రాంజ్ డిస్క్' అవార్డులు ప్రకటించినట్టు డీజీపీ కార్యాలయం సోమవారం జారీ చేసిన నోటిఫికేషన్‌లో వెల్లడించింది.

మద్యం అక్రమ కేసులో నాకు బెయిల్ ఇవ్వండి

హైకోర్టులో వెంకటేష్ నాయుడు పిటిషన్

సాక్షి, అమరావతి: మద్యం అక్రమ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ చెరుకూరు వెంకటేష్ నాయుడు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో ఏసీబీ కోర్టు పలువురు నిందితులకు బెయిల్ మంజూరు చేసిందని, అదే రీతిలో తనకు కూడా బెయిల్ ఇవ్వాలని ఆయన తన పిటిషన్‌లో హైకోర్టును కోరారు. మద్యం కేసులో వెంకటేష్ నాయుడు 34వ నిందితునిగా ఉన్నారు. ఆయన బెయిల్ పిటిషన్‌ను కొట్టేస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు ఈ నెల 5న తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో ఆయన బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై సోమవారం వాదనలు విన్న న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప విచారణ నెల 30కి వాయిదా వేశారు.

రొమ్ము క్యాన్సర్‌కు నానో ఇంజెక్షన్

ఐఐటీ మద్రాసు, ఆస్ట్రేలియా పరిశోధకుల ఘనత

నానో ఇంజెక్షన్ డ్రగ్‌ను అభివృద్ధి చేసిన పరిశోధకుల బృందం

కొరుక్కుపేట: ప్రపంచవ్యాప్తంగా మహిళల మరణాలకు ప్రధాన కారణాలలో ఒకటైన రొమ్ము క్యాన్సర్‌ను నయం చేయడానికి ఐఐటీ మద్రాసు, ఆస్ట్రేలియన్ పరిశోధకులు నానో ఇంజెక్షన్ డ్రగ్‌ను అభివృద్ధి చేశారు. ఈ మేరకు సోమవారం ఐఐటీ మద్రాసులోని అప్లైడ్ మెకానిక్స్ అండ్ బయోమెడికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన డాక్టర్ స్వాతి సుధాకర్ మాట్లాడారు. మహిళల్లో పెరుగుతున్న రొమ్ము క్యాన్సర్‌ను నయం చేసేందుకు ఐఐటీ మద్రాసు, ఆస్ట్రేలియాలోని మోనాష్ విశ్వవిద్యాలయం, డీకిన్ విశ్వవిద్యాలయం పరిశోధకులు కలసి పరిశోధనలు చేపట్టామన్నారు. రొమ్ము క్యాన్సర్‌కు సురక్షితంగా, మరింత ప్రభావవంతంగా చికిత్స చేసే సామర్థ్యాన్ని కలిగి ఉన్న అత్యాధునిక నానో ఇంజెక్షన్ డ్రగ్‌ను అభివృద్ధి చేసినట్టు తెలిపారు.

చెవిరెడ్డిని విచారించిన సిట్

సాక్షి, అమరావతి: టీటీడీ కల్తీ నెయ్యి కేసులో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని సిట్ అధికారులు సోమవారం విచారించారు. గతంలో టీటీడీ పాలక మండలి సభ్యుడిగా వ్యవహరించిన ఆయన్ను నెయ్యి కాంట్రాక్టు కేటాయింపు అంశంపై ప్రశ్నించినట్టు సమాచారం. విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని న్యాయస్థానం అనుమతితో అధికారులు విచారించారు.

ఇవిగో సాక్ష్యాలు.. రోడ్డెక్కితే బాదుడు నిజమే

గత నెల 26న సీఎం చంద్రబాబు సమీక్షలో సెస్‌ల ప్రతిపాదన

'సాక్షి' కథనానికి రహదారులు-భవనాల శాఖ వివరణ

సాక్షి, అమరావతి: ''రోడ్డెక్కితే బాదుడే'' అనేది ముమ్మాటికీ నిజమని తేలింది..! 'సాక్షి' కథనం అక్షర సత్యమని స్పష్టమైంది..! రహదారుల–భవనాల శాఖ వివరణే దీనికి నిదర్శనంగా నిలిచింది...! హైబ్రిడ్ యాన్యుటీ (హెచ్‌టీ) పద్ధతిలో చేపట్టనున్న రోడ్ల నిర్మాణంలో ప్రజల జేబులను గుల్లచేసేలా చంద్రబాబు ప్రభుత్వం తలపెట్టిన నిర్వాకాన్ని ఎండగడుతూ రోడ్డెక్కితే బాదుడే శీర్షికన ఆదివారం 'సాక్షి' కథనం ఇచ్చింది. దీనికి ఆర్‌అండ్‌బీ శాఖ వివరణ ఇచ్చింది. దీనికిముందు జరిగిన తతంగం చూస్తే, గత నెల 26న సీఎం చంద్రబాబు నిర్వహించిన ఆర్‌అండ్‌బీ శాఖ సమీక్షలో ఏడాదికి పెట్రోల్, డీజిల్‌పై రూపాయి సెస్ ద్వారా రూ.732 కోట్లు, గనులు, ఖనిజాలపై 10 శాతం సెస్‌తో రూ.441 కోట్లు, మోటారు వాహనాల పన్నుపై 10 శాతం సెస్‌తో రూ.350 కోట్లు ఆదాయం వస్తుందని ప్రజంటేషన్ ఇచ్చారు. దీంతో రహదారి అభివృద్ధి కార్పొరేషన్... ఆర్థిక సంస్థల నుంచి అప్పులు చేయనున్నట్లు పేర్కొన్నారు.

- ➤ ఇక హైబ్రిడ్ యాన్యుటీలో కేంద్రం విధి విధానాల ప్రకారం టెండర్లు పిలుస్తామని, కాంట్రాక్టర్లకు దోచిపెట్టడం లేదని, రెండు లేన్ల రహదారులు కాదని ఆర్‌అండ్‌బీ శాఖ పేర్కొంది. కానీ, 2 లేన్లలోనే మూడు దశల్లో 1,500 కిలో మీటర్ల రోడ్లను హెచ్‌టీ పద్ధతిలో అభివృద్ధి చేయడానికి రూ.15,326 కోట్లు వ్యయం అవుతుందని సీఎం సమీక్షలో పేర్కొన్నారు. అంటే, కిలోమీటర్‌కు రూ.10 కోట్లు కాదా?
- ➤ మరోవైపు ఎలాంటి ప్రతిపాదనలు చేయలేదని శాఖ వివరణ ఇచ్చింది. కానీ, సీఎం సమీక్షలో వారు ఇచ్చిన ప్రజంటేషన్‌లోని ప్రతిపాదనలే దీనికిఇ సాక్ష్యంగా నిలిచాయి. 1,500 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం చేపట్టడానికి భూ సేకరణ, మౌలిక వసతులు (యుటిలిటీస్)కు రూ.4 వేల కోట్లను ప్రభుత్వం బ్యాంకుల నుంచి రుణం తీసుకుంటుందని పేర్కొన్నారు. హెచ్‌టీ విధానంలో 40 శాతం ప్రభుత్వం, 60 శాతం డెవలపర్ వ్యయం చేస్తారని రహదారులు–భవనాల శాఖ వివరణ ఇచ్చింది. 'సాక్షి' కూడా ఇదే చెప్పింది.
- ➤ 16 ఏళ్లలో ఆరు నెలలకోసారి డెవలపర్‌కు అసలు, వడ్డీ చెల్లిస్తారని సాక్షి పేర్కొంటే 15 ఏళ్లు అని ఆర్‌అండ్‌బీ శాఖ వివరించింది. మొత్తం వ్యయం ప్రజల నుంచే గుంజడం అవాస్తవమని తెలిపింది. కానీ, సెస్‌ల కింద ఏటా రూ.1,636 కోట్లు, టోల్ వసూలుతో రూ.375 కోట్లు వస్తుందని సీఎం సమీక్షలో పేర్కొన్నారు. ఈ లెక్కన 15 ఏళ్లలో రూ.24,540 కోట్లు, రూ.5,625 కోట్లు వసూలవడం వాస్తవం కాదా? ఈ రెండూ కలిపి రాష్ట్ర ప్రజలపై మొత్తం భారం రూ.30,165 కోట్లు కావడం లేదా? ఇక సెస్‌లను 16 ఏళ్లుగా సాక్షి పేర్కొంది. కానీ ఒకసారి సెస్ వేశాక అది ఎన్నేళ్లైనా కొనసాగుతుంది అనడంలో సందేహం లేదు.

DEVELOPMENT OF ROADS (SH) UNDER HAM MODEL (FINANCIALS)

Sanction Year	Length in Km	Project Cost (Civil) in Rs. Cr	LA, RR & Utilites Cost in Rs. Cr	Capital Grant in Rs. Cr. (40% of Project Cost)	Annuities in Rs. Cr	Bank Loan interest Payable in Rs. Cr	Total Commitments in Rs. Cr
1	2	3	4	5	6	7	8
1	600	3000	400	600			
2	600	3000	400	1200			
3	300	1500	200	900	232	445	677
4				300	464	445	909
5					575	445	1020
6					566	445	1011
7					557	445	1002
8					549	445	994
9					541	445	986
10					532	445	977
11					522	445	967
12					512	445	957
13					501	445	946
14					490	445	935
15					473	445	918
16					459	445	904
17					442	445	887
18					260	445	705
19					85	445	530
Total (A)	1500	7500	1000	3000	7781	7565	15326

Rs. 4000 Cr. Amount required

ROADS & BUILDINGS DEPARTMENT, GOVT. OF ANDHRA PRADESH

కాంట్రాక్టు సంస్థలకు 19 ఏళ్లలో ఏవిధంగా రూ.15,326 కోట్లు చెల్లిస్తారనే వివరాలతో అధికారులు రూపొందించిన నివేదిక

About Rs.375 Cr toll revenue is anticipated from the developed 1500 Km. Which would be used for development of new projects.

టోల్‌ఫీజు రూపంలో రూ.375 కోట్లు వసూలు చేయనున్నట్లు నివేదికలో పేర్కొన్న భాగం

చంద్రబాబు మార్క్ బాదుడు

ఏడు రోడ్లు అభివృద్ధి చేసి టోల్ వసూలుకు నిర్ణయం

కన్సల్టెంట్‌కు డీపీఆర్ రూపకల్పన బాధ్యతలు

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం హైవేలపైనే టోల్ వసూలు చేస్తే... చంద్రబాబు సర్కార్ మరో అడుగు ముందుకేసి రాష్ట్రంలోని రెండు వరసల రోడ్లపై కూడా టోల్ బాదాలని నిర్ణయించింది. ఇందుకోసం తొలి దశలో ప్రస్తుతం రెండు వరుసల్లో ఉన్న ఏడు రోడ్లను అభివృద్ధి చేసిన తర్వాత టోల్ వసూలు చేయాలని నిర్ణయించింది. ఆ ఏడు రోడ్లకు సంబంధించి సవివరమైన ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పన బాధ్యతలను కన్సల్టెంట్‌కు అప్పగించాలని నిర్ణయించింది. 470 కిలో మీటర్ల మేర ఏడు రోడ్లను రెండు వరసల్లో పటిష్టం చేసేందుకు గుర్తించారు. భూ సేకరణ అవసరం లేకుండా వాటిని 470 కిలో మీటర్ల మేర అభివృద్ధి చేసేందుకు రూ.936 కోట్ల వ్యయం అవుతుందని ప్రభుత్వం పేర్కొంది. తర్వాత ఆ రహదారులపై టోల్ వసూలు ద్వారా ఏడాదికి రూ.96.03 కోట్లు రాబడి వస్తుందని, దాని ఆధారంగా బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని మిగతా రోడ్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది.

ఈ మార్గాల్లో టోల్ బాదుడుకు సిద్ధం

రహదారి	కి.మీ.	ఏడాదికి టోల్ వసూలు (కోట్లలో)
మార్టేరు – ప్రక్కిలంక	63	14.40
విజయవాడ – విస్సనపేట	51	9.22
తడ – శ్రీకాళహస్తి	46	12.82
చిత్తూరు – పుత్తూరు	64	14.03
గుత్తి – పత్తికొండ – ఆదోని	71	17.50
గుంతకల్ – తుంగభద్ర	74	10.11
కర్నూలు – బళ్లారి	101	17.95
మొత్తం	470	96.03

రాష్ట్రాన్ని డ్రగ్స్ డెన్‌గా మార్చిన బాబు కూటమి

- విచ్చలవిడిగా పేకాట క్లబ్బులు
- టీడీపీ నేతల కనుసన్నల్లో డ్రగ్స్, గంజాయి, క్యాసినోలు
- మంత్రి పార్థసారథి నేతృత్వంలో ఆగిరిపల్లి వద్ద పెద్ద క్యాసినో
- తక్షణమే మంత్రిని డిస్మిస్ చేయాలి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగవీటి నరేంద్ర ఫైర్

సాక్షి, అమరావతి: చంద్రబాబు కూటమి రాష్ట్రాన్ని డ్రగ్స్ డెన్‌గా మార్చేసిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగవీటి నరేంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రంలో విచ్చలవిడిగా పేకాట క్లబ్బులు, క్యాసినోలను అనుమతిస్తోందని, టీడీపీ నేతల కనుసన్నల్లో డ్రగ్స్, గంజాయి దందా యథేచ్ఛగా సాగుతోందని చెప్పారు. నరేంద్ర సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి వద్ద మంత్రి పార్థసారథి, ఆయన సన్నిహితుల నేతృత్వంలో భారీ క్యాసినో నడుస్తోందని తెలిపారు. ఆయన్ని వెంటనే కేబినెట్ నుంచి డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎక్కడ నుంచైనా వచ్చి రాష్ట్రంలో పేకాడుకోవచ్చని ఆదివారంనాటి పోలీసు రైడ్‌లో బయటపడిందని అన్నారు. ఢిల్లీ నుంచి నేరుగా రాష్ట్రానికి మాదక ద్రవ్యాలు వస్తున్నా సీఎం చంద్రబాబులో కనీస స్పందన లేదన్నారు. హోం మంత్రి అనిత ఏం చేస్తున్నారో చెప్పాలని నిలదీశారు. పోలీసులకు శాంతి భద్రతలు, ప్రజా రక్షణ పట్టడం లేదని, వారు కేవలం వైఎస్సార్‌సీపీ నాయకుల అక్రమ అరెస్టుల కోసమే పని చేస్తున్నారని దుయ్యబట్టారు.

ఈగల్ ఏం చేస్తోంది?

'వైఎస్సార్‌సీపీ హయాంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) ఏర్పాటు చేసి, డ్రగ్స్‌ను నియంత్రించారు. ఆంధ్రా ఒడిశా సరిహద్దుల్లో 11,500 ఎకరాల్లో గంజాయి సాగును ధ్వంసం చేసి, దానిని పండించే గిరిజనులకు రూ.500 కోట్లతో ప్రత్యామ్నాయ జీవనోపాధి కూడా ఏర్పాటు చేశారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే సెబ్‌ను రద్దు చేసి, ఈగల్ అనే సంస్థను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి దందా ఎలా సాగుతోందో చంద్రబాబుకి నివేదిక ఇవ్వడానికి తప్ప, వాటి నియంత్రణకు ఈగల్ పని చేయడం లేదు' అని నరేంద్ర చెప్పారు.

క్యాసినో నుంచి మంత్రి పార్థసారథికి భారీగా కమీషన్లు

'వైఎస్ జగన్ ప్రభుత్వంలో పేకాట క్లబ్బులను పూర్తిగా నిషేధించారు. కానీ సంపద సృష్టిస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు.. అధికారం చేపట్టిన వెంటనే పేకాట క్లబ్బులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆగిరిపల్లి వద్ద మాంగో బే రిక్రియేషన్ క్లబ్బు నిర్వాహకులు కోర్టు ఆదేశాలతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కుటుంబ సభ్యుల సభ్యత్వంతో సొసైటీ పేరుతో సరదాగా గడపడానికి ఉద్దేశించిన రిక్రియేషన్ క్లబ్‌ను ఏకంగా పేకాట క్లబ్బుగా మార్చి, పెద్ద క్యాసినోనే నడుపుతున్నారని తెలిపారు. ఇక్కడికి ఏపీతో పాటు తెలంగాణ నుంచి కూడా రోజూ 300 నుంచి 400 మంది పేకాటరాయుళ్లు వస్తున్నారన్నారన్నారు. ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు కూడా జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోందన్నారు. ఇక్కడి నుంచి మంత్రి పార్థసారథికి భారీగా కమీషన్లు వస్తున్నాయని తెలిపారు. ఈ భారీ క్యాసినోకు మొత్తం ప్రభుత్వ యంత్రాంగంతో పాటు, పోలీసుల అండ ఉందన్నారు. ఈ క్లబ్‌పై పోలీసు దాడిలో 280 మందితో పాటు, రూ.50 లక్షల నగదు, 120 కార్లు, 50 బైకులను గుర్తించారన్నారు. ఇంత జరిగినా మీడియాలో వార్తలు రాలేదంటే.. చంద్రబాబు, టీడీపీ అండదండలే కారణమని అన్నారు. క్యాసినోలు, డ్రగ్స్ ద్వారా చంద్రబాబు ఈ రాష్ట్రాన్ని ఎక్కడికి తీసుకువెళ్తున్నారని నిలదీశారు. గంజాయి, డ్రగ్స్, క్యాసినోలపై పార్టీపరంగా పోరాటం చేస్తామని వంగవీటి నరేంద్ర హెచ్చరించారు.

దుష్ప్రచారంలో 'ఈనాడు' బరితెగింపు

మీభూమి పోర్టల్‌లో వైఎస్ సౌభాగ్యమ్మ పేరిట ఉన్న 1బి రికార్డు

సౌభాగ్యమ్మ పేరిట ఉన్న భూమి ఇప్పటికీ ఆన్‌లైన్‌లో ప్రత్యక్షం

సాక్షి ప్రతినిధి, కడప: తప్పుడు వార్తలు వండివార్చడంలో 'ఈనాడు' మరోసారి ముందు వరుసలో నిలిచింది. 'వివేకా కుటుంబంపై వైకాపా పగ' కథనమే అందుకు తాజా ఉదాహరణ. ఇప్పటికీ వైఎస్ సౌభాగ్యమ్మ పేరిట ఆన్‌లైన్‌లో ఉన్న భూమిని లేనట్లుగా ఎల్లో మీడియా చిత్రీకరించింది. పైగా మాజీ సీఎం వైఎస్ జగన్ హయాంలో ఇతరుల పేరుతో మ్యుటేషన్ చేశారని, అప్పటి తహశీల్దార్ మాధవకృష్ణారెడ్డి ఇలాంటి చర్యలకు పాల్పడ్డారంటూ తప్పుడు ప్రచారానికి తెగబడింది. పులివెందుల మండలం కె.వెలమవారిపల్లెలో 2006 ఫిబ్రవరి 17న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజుల సంఖ్య 1577/2006, 1579/2006 ప్రకారం నాలుగు సర్వే నంబర్లలో 7.03 ఎకరాల భూమి కొనుగోలు చేశారు. సర్వే నంబర్ 351/ఏలో 2.91 ఎకరాలు, 352–ఏలో 4.05 ఎకరాలు, 353/1ఏలో 0.04 సెంట్లు, 354ఏలో 0.03 సెంట్లు కలిపి మొత్తంగా 7.03 ఎకరాలు వైఎస్ సౌభాగ్యమ్మ పేరిట వెబ్‌ల్యాండ్‌లో కనిపించడం లేదంటూ ఈనాడు దుష్ప్రచారానికి దిగింది.

టీడీపీ హయాంలోనే ల్యాండ్ కన్వర్షన్..

వైఎస్ సౌభాగ్యమ్మ పేరుతో ఉన్న భూములను ల్యాండ్ కన్వర్షన్ చేయాలంటూ 2018లో దరఖాస్తు చేసుకున్నారు. ఆమేరకు రూ.65 వేలు చలానా చెల్లించారు. ఆ ఫైలును పరిశీలించిన అప్పటి జమ్మలమడుగు ఆర్డీవో ద్వారా 2018 మార్చి 20న ల్యాండ్ కన్వర్షన్ కూడా అయింది. అప్పటి టీడీపీ ప్రభుత్వంలోనే ల్యాండ్ కన్వర్షన్ చేపట్టారు. ఆమేరకు రెగ్యులర్ ఖాతా 763 నుంచి నోషనల్ ఖాతా నంబర్ 300004 కి మారింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మీభూమి పోర్టల్‌లో ఇప్పటికీ వైఎస్ సౌభాగ్యమ్మ పేరిట 1బీ నమోదై ఉంది. 351/ఏలో 3.47 ఎకరాలు పట్టాదారు పేరు తెలియదని వెబ్ ల్యాండ్‌లో నమోదై ఉంది. వైఎస్ సౌభాగ్యమ్మ భూమి ఇప్పటికీ వారి స్వాధీనంలో, వారి అనుభవంలోనే ఉంది. ఈ విషయమై పులివెందుల తహశీల్దార్ నజీర్‌ను వివరణ కోరగా.. సౌభాగ్యమ్మ పేరిట ఉన్న భూమి వన్‌టైమ్ కన్వర్షన్ అయ్యిందని.. కాబట్టే నోషనల్ ఖాతా నంబర్‌కు బదలాయింపు అయ్యిందని వివరించడం గమనార్హం.

అత్యాచారప్రదేశ్‌గా ఏపీ

- మహిళలపై లైంగికదాడుల్లో రెండోస్థానం
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత ధ్వజం

నెల్లూరు రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏపీని అత్యాచారప్రదేశ్‌గా మార్చారని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత మండిపడ్డారు. నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆమె మీడియా సమావేశం నిర్వహించారు. 18 నెలల కూటమి పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం తనయుడు లోకేశ్ ప్రాతినిథ్యం వహిస్తున్న మంగళగిరిలో 13 ఏళ్ల బాలికపై నలుగురు లైంగికదాడికి పాల్పడడం కిరాతకమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం చేష్టలుడిగి చోద్యం చూస్తోందని మండిపడ్డారు. పోలీసులను ప్రజల రక్షణకు కాకుండా ప్రతిపక్షాన్ని అణిచివేసేందుకు ఉపయోగించుకుంటోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని చెప్పడానికి ఇటీవల కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాసిన లేఖే నిదర్శనమన్నారు.

జగన్ చేతల సీఎం.. బాబు మాటల సీఎం

వైఎస్ జగన్ పాలనలో మహిళల భద్రతకు అనేక సంస్కరణలు తీసుకొచ్చారని పూజిత గుర్తుచేశారు. దిశ యాప్‌ను పటిష్టంగా అమలు చేశారని, దిశ పోలీసుస్టేషన్లు ఏర్పాటు చేశారని వివరించారు. ఆపదలో అబలలు ఉంటే ఐదు నుంచి ఎనిమిది నిమిషాల్లోపే పోలీసులు ఘటనాస్థలంలో ఉండేవారని పేర్కొన్నారు. కానీ చంద్రబాబు సీఎం అయ్యాక పోలీసులు శాంతిభద్రతలను గాలికొదిలేశారని విమర్శించారు. నేరస్థులపై కఠినంగా వ్యవహరిస్తామని డైలాగ్‌లు చెప్పే చంద్రబాబు మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. పోలీసులు అధికారపక్ష సేవలో తరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు మహిళల రక్షణ కోసమే రాజకీయాల్లోకి వచ్చానన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ సరిగా పనిచేయడం లేదని అమిత్‌షా సీఎం చంద్రబాబుకు లేఖరాశారని, దీనిపై ప్రజలకు సర్కారు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

సీబీఐ అదుపులో డీకే ఆదికేశవులు నాయుడు కుమారుడు, కుమార్తె

నకిలీ స్టాంప్ పేపర్లు, రియల్టర్ మృతి కేసులో విచారిస్తున్న సీబీఐ

డీకే శ్రీనివాస్

కల్పజ

బెంగళూరు (బనశంకరి)/చిత్తూరు అర్బన్: రియల్టర్ అనుమానాస్పద మృతి, నకిలీ స్టాంప్ పేపర్లతో తప్పుడు వీలునామా సృష్టించిన కేసులో చిత్తూరు మాజీ ఎంపీ డీకే ఆదికేశవులునాయుడు, టీడీపీ మాజీ ఎమ్మెల్యే సత్యప్రభ దంపతుల కుమారుడు డీకే శ్రీనివాస్, కుమార్తె కల్పజను సీబీఐ అధికారులు సోమవారం బెంగళూరులో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. బెంగళూరుకు చెందిన రియల్టర్ కె.రఘునాథ్ 2019 మే నెలలో అనుమానాస్పద స్థితిలో మరణించాడు. తన భర్త మరణం వెనుక డీకే శ్రీనివాస్, అతని కుటుంబసభ్యులు ఉన్నారంటూ రఘునాథ్ భార్య మంజుల బెంగళూరులోని హెచ్ఏఎల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. న్యాయస్థానం 2022లో ఈ కేసును సీబీఐకి అప్పగించింది. కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారులు.. కల్పజ, శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. అలాగే అప్పట్లో హెచ్ఏఎల్ సీఐగా ఉన్న డీఎస్పీ మోహన్‌ను కూడా సీబీఐ అధికారులు విచారిస్తున్నట్లు సమాచారం.

యూరియాపై వాస్తవాలు చెప్పాలి

- మార్క్‌ఫెడ్ ద్వారా ఎంత అమ్మారు?
- ప్రైవేట్ డీలర్లకు ఎంత కేటాయించారు?
- రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలి
- ఎంవీఎస్ నాగిరెడ్డి డిమాండ్

సాక్షి, అమరావతి/గుడివాడ టౌన్: రాష్ట్రంలో యూరియా సరఫరాకు సంబంధించి వాస్తవాలకు, ప్రభుత్వం చెబుతున్న లెక్కలకు ఎక్కడా పొంతన ఉండటం లేదని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి(రైతు విభాగం) ఎంవీఎస్ నాగిరెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో యూరియా వాడకం, నిల్వలపై వాస్తవాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీజన్‌లో నిపుణుల అంచనా ప్రకారం 5.5 లక్షల టన్నుల నుంచి 6 లక్షల టన్నుల వరకు యూరియా అవసరం కాగా, ప్రభుత్వ అంచనా 9.38 లక్షల టన్నుల యూరియా డిమాండ్ ఉన్నట్టు చూపిస్తున్నారని చెప్పారు. పంటల వారీగా, మొత్తం డిమాండ్ వివరాలను ప్రకటించాలన్నారు. డిసెంబరు నెలాఖరు నాటికి 3.93 లక్షల టన్నుల యూరియా అవసరమని అంచనా వేస్తే, ఇప్పటికే 3.23 లక్షల టన్నులు అమ్మినట్లు రికార్డుల్లో చూపడం విడ్డూరంగా ఉందన్నారు. వరి, జొన్న, మొక్కజొన్న మినహా మరే ఇతర పంటలకు యూరియాతో పెద్దగా అవసరం ఉండదని నాగిరెడ్డి పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారమే 51.72 లక్షల ఎకరాల్లో రబీ సాగు జరగాల్సి ఉంటే, ఇందులో వరి 18.62 లక్షల ఎకరాలు కాగా డిసెంబర్ 17 నాటికి 23 శాతం మించి సాగవ్వలేదని వివరించారు. సీజన్ ప్రాథమిక దశలోనే ఈ స్థాయిలో యూరియా కొరత రావడం వెనక, ఏదో మతలబు జరిగినట్లు అనుమానం కలుగుతోందన్నారు. రాష్ట్రంలో అసలు యూరియా రైతులకు అందుతుందా? లేక బ్లాక్ మార్కెట్‌కు మళ్లుతుందా? దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి వాస్తవాలు బయటపెట్టాలన్నారు. యూరియా కోసం సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల వద్ద స్టాక్ లేదన్న సమాధానం వస్తోందని, యూరియా ఎప్పుడు వస్తుందో? ఎప్పుడు అయిపోతుందో? కూడా తెలియని అయోమయ స్థితి నెలకొందన్నారు. సీజన్ ఆరంభంలో ప్రభుత్వం వద్ద ఉన్న యూరియా నిల్వలు. మార్క్‌ఫెడ్ ద్వారా ఎంత అమ్మారు? ప్రైవేట్ డీలర్లకు ఎంత కేటాయించారు? అన్న పూర్తి వివరాలు గణాంకాలతో సహా బయటపెట్టాలన్నారు. నానో యూరియా బలవంతంగా అమ్మవద్దని కేంద్ర ప్రభుత్వం ఆదేశించినా, క్షేత్రస్థాయిలో రైతులను కొనాలని బలవంతం చేస్తుండడం ఎంత వరకు సమంజసమని నాగిరెడ్డి ప్రశ్నించారు. యూరియా కట్ట కావాలంటే, రూ.450 విలువైన గుళికలు లేదా నానో యూరియా కొనాలని రైతులపై ఒత్తిడి చేస్తున్నారని, ఇటువంటి డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆత్మహత్య

ఎన్నికల అనంతరం టీడీపీ నేతల దాడులతో గ్రామం విడిచి వెళ్లిన కుటుంబం

మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య రాజేశ్వరి, కుటుంబ సభ్యులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గం అమరావతి మండలం నరుకుళ్లపాడు గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు..నరుకుళ్లపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉంటున్న మేకల చిన్న గోపి అలియాస్ చిన్న (35) వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా పార్టీలో ఉన్నాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు టీడీపీ నేతలు, కార్యకర్తలు గ్రామంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై తీవ్రంగా దాడులు చేశారు. గోపి ఇంటిపై కూడా దాడి చేయడంతో భయభ్రాంతులకు గురై గ్రామం విడిచి తూళ్లూరు మండలం అనంతవరంలో అద్దె ఇంట్లోకి భార్యా పిల్లలతో వెళ్లిపోయాడు. ఈ నెల 19న నరుకుళ్లపాడులో చర్చి ప్రారంభోత్సవానికి గోపి భార్యాపిల్లలతో వచ్చాడు. ప్రార్థనలు ముగించుకొని భార్య మేకల రాజేశ్వరి, కుమారుడు అజిత్, కుమార్తె ఇవాంకాలు తిరిగి అనంతవరం వెళ్లారు. గోపి మాత్రం తల్లిదండ్రులతో 2 రోజులు గడుపుతానని భార్యకు చెప్పి అక్కడే ఉన్నాడు. ఆదివారం తల్లిదండ్రులు బయట ఉన్న సమయంలో ఇంట్లోకి వెళ్లి దూలానికి ఉరి వేసుకున్నాడు.

సెల్ఫీ వీడియోలో ఆవేదన...

గోపి మరణించాక..ఇదివరకు తాను విడుదల చేసిన ఓ సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇందులో రెండేళ్లుగా టీడీపీ నేతలు తనను వేధిస్తున్నారని, అయినాసరే జగనన్న వెంటే ఉంటానని, మళ్లీ జగనన్న పాలన రావాలని, ఊళ్లోకి వచ్చే పరిస్థితి లేదని, చనిపోయిన బంధువులను చూసే యోగ్యత లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

టీడీపీ వేధింపులతోనే ఊరు వదిలి వెళ్లాం

మేము వైఎస్సార్‌సీపీ వాళ్లమని ఎన్నికల అనంతరం టీడీపీ వాళ్లు మాపై దాడి చేశారు. దీంతో మేం భయపడి అనంతవరంలో అద్దె ఇంట్లో ఉంటున్నాం. మొన్న నరుకుళ్లపాడు వచ్చాం. నా భర్త ఇక్కడే ఉన్నాడు. మేము పిల్లలతో అనంతవరం వెళ్లాం. ఏం జరిగిందో తెలియదు ఆదివారం ఆయన ఉరి వేసుకొని చనిపోయాడు.

– మేకల రాజేశ్వరి, మృతుడి గోపి భార్య

నేడు కిసాన్ దివస్

వ్యవసాయంలో స్త్రీలు సాధిస్తున్న విజయాలు అందరూ చూస్తున్నవే. అయితే పంట నిల్వలో, వ్యవసాయ పనిముట్లలో ఆవిష్కరణలు చేస్తున్న మహిళలు తక్కువ. నాసిక్‌లో తండ్రి పండిస్తున్న ఉల్లిపాయ నిల్వ చేస్తే పాడవుతోందని గమనించిన కుమార్తె సొంతగా పరికరాన్ని కనిపెట్టి నిల్వలను కాపాడింది. అంతే కాదు నాసిక్, మహారాష్ట్రల్లో ఉల్లిపాయ గోదాముల నిర్వహణను పూర్తిగా మార్చేసింది. కిసాన్ దివస్ సందర్భంగా ఈనాటి రైతుబిడ్డ కల్యాణి షిండే పరిచయం.

ఆనియన్ క్వీన్

‘ఉల్లిపాయలు పాడయ్యాయన్న సంగతి చాలా నష్టపోయాకే తెలుస్తుంది’ అంటుంది కల్యాణి షిండే. 26 ఏళ్ల ఈ రైతుబిడ్డ నాసిక్, మహారాష్ట్రలలో ఉల్లిపాయల నిల్వకు విశేషమైన సహకారం అందించే పరికరాన్ని తయారు చేసి రైతులకు అందుబాటులోకి తెచ్చింది.

‘నాసిక్ దగ్గర ఉన్న లాసన్‌గావ్ మా ఊరు. అది ఆసియాలోనే అతి పెద్ద ఉల్లిపాయల కేంద్రం. మా తాత తండ్రులు, బంధువులు రైతులే. ఉల్లిపాయలు ప్రధానంగా పండిస్తారు. చిన్నప్పటి నుంచి ఆ పంట చేతికి రావడం మార్కెట్ అయ్యేలోపు పాడైతే నష్టం రావడం వింటూనే పెరిగాను. మా ఇళ్లలో నేనే మొదటిసారి బి.టెక్‌కు వచ్చాను. సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ చదువుతూ ఇంటికి ఫోన్ చేస్తే ఉల్లిపాయలు కుళ్లిపోయి నష్టం వచ్చిందని చెప్పేవారు. దీనిని ఆపలేమా... అని రీసెర్చ్‌లో దిగాను’ అని తెలిపింది ఆమె.

కల్యాణి షిండే రీసెర్చ్‌లో మహారాష్ట్రలోనే కాదు... దేశంలోనే ఉల్లిపాయలకు సరైన గిడ్డంగులు లేవని తెలిసింది. చాలా కేంద్రాల్లో ఓపెన్ గోదాముల్లోనే ఉల్లిపాయలను నిల్వ ఉంచుతారు. ఆధునిక గోదాములు ఉన్నవి తక్కువ. ‘ఉల్లిపాయలు పాడయ్యాయని ఎలా తెలుసుకుంటారని రైతులను అడిగితే దుర్వాసన ద్వారా అని చెబుతారు. కాని దుర్వాసన మొదలయ్యే సమయానికి క్వింటాల్‌కు 20 శాతం పాడైపోయి ఉంటాయి. ఉల్లిపాయలకు ఆరడుగుల ఎత్తు అరలో నిల్వ చేస్తే ఎత్తు తగ్గి ఐదు అడుగులకు చేరినా ఉల్లిపాయలు పాడయ్యాయని అర్థం. ఈ దశలో 40 శాతం పాడైపోయి ఉంటాయి. మనుషులు దృష్టి, వాసన ద్వారా మాత్రమే ఉల్లిపాయల నిల్వలో నష్టాన్ని తెలుసుకుంటున్నారని నాకు అర్థమైంది. అప్పుడే ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇన్నోవేటర్‌లుగా తర్ఫీదు ఇచ్చే ఒక సంస్థ గురించి తెలిసింది. అందులో చేరాను. అలా గాలిలోని ఉష్ణోగ్రత, తేమ ఆధారంగా గిడ్డంగిలో ఏ వైపున పంట నష్టం మొదలయ్యిందో తెలుసుకునే పరికరం కనిపెట్టాను. దీనివల్ల ఒక శాతం నష్టం ఉండగానే నిల్వను కాపాడుకోవచ్చు’ అని చెప్తుంది కల్యాణి షింగ్.

> ఆమె తయారు చేసిన పరికరం పది మెట్రిక్ టన్నుల నిల్వకు ఒకటి చొప్పున అమరిస్తే నిల్వను పూర్తిగా సురక్షితం చేసినట్టే. నిల్వలో ఏ తేడా వచ్చినా ఆ పరికరం పసిగట్టి ఎలర్ట్ మెసేజెస్ పంపుతుంది.

ఆమె తయారు చేసిన పరికరం పది మెట్రిక్ టన్నుల నిల్వకు ఒకటి చొప్పున అమరిస్తే నిల్వను పూర్తిగా సురక్షితం చేసినట్టే. నిల్వలో ఏ తేడా వచ్చినా ఆ పరికరం పసిగట్టి ఎలర్ట్ మెసేజెస్ పంపుతుంది. ఈ పరికరాన్ని పదివేల రూపాయలకే తయారు చేసి రైతులకు చేరవేస్తోంది కల్యాణి. అంతేకాదు ఆధునిక గిడ్డంగుల ఏర్పాటులో ప్రయివేటు సంస్థలకు సూచనలు సలహాలు ఇస్తోంది. అందుకే అందురూ ఆమెను ‘ఆనియన్ క్వీన్’ అని పిలుస్తూ ఉన్నారు.

రైతు కోసం రైతు బిడ్డలే కాదు ప్రతి విద్యార్థి, సాంకేతిక నిపుణుడు ఆలోచిస్తే మన దేశం మరింత సస్యశ్యామలం అవుతుంది.

లైమ్ లైట్‌లో...

Rewind 2025

పాయల్ కపాడియా కాన్స్ విజయం ప్రముఖ వార్తగానే మిగిలిపోలేదు. భారతీయ చిత్రాలను ప్రపంచం చూసే దృష్టిని మార్చివేసింది. ఆమె ‘ఆల్ వి ఇమేజిన్ యాజ్ లైట్’ గ్రాండ్ ప్రిక్స్ అవార్డ్ గెల్చుకున్న తొలి భారతీయ చిత్రంగా నిలిచింది. మూడు దశాబ్దాల నిరీక్షణకు తెరదించి ఒక కొత్త అధ్యయనాన్ని సృష్టించింది. రోటర్‌డ్యామ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ‘లైమ్‌లైట్’ విభాగంలో జనవరి 30, 2025న ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. పాయల్ సృజనాత్మక ప్రయాణం పుణేలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టిఐఐ)లో ప్రారంభమైంది. ఆమె సాధించిన అద్భుత విజయం మన దేశంలోని యువ సినీ నిర్మాతలకు, ముఖ్యంగా మహిళలకు ఉత్సాహాన్ని, స్ఫూర్తిని ఇచ్చింది. వారు చెప్పబోయే కథలకూ ప్రపంచ వేదికపై చోటు ఉందని సంకేతం పంపించింది.

మీ ఆతిథ్యాన్ని మరవలేను..!



మన దేశవాసులెప్పుడూ ‘అతిథి దేవో భవ’ అంటూ ఇంటికొచ్చిన చుట్టాన్ని కూడా దేవుడిలా గౌరవించారు. మనలోని ఆ గుణమే ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా మన్ననలు పొందుతోంది.

ఇటీవల ఓ హోటల్‌లో దిగిన ఓ విదేశీ మహిళ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియో తెగ వైరల్ అయ్యింది. దాన్ని చూసినవారు మన భారతీయుల మంచితనాన్ని వేనోళ్లా కొనియాడుతున్నారు. ఆ వీడియోలో ఉన్న సమాచారాన్ని బట్టి... ఈమధ్యే మన దేశానికి టూరిస్ట్‌గా వచ్చిన ఓ మహిళ ఓ హోటల్‌లో దిగింది. అయితే అర్ధరాత్రి వేళ ఆమెకు జ్వరం వచ్చింది. జొన్నలు జల్లితే పేలాలయ్యేంత తీవ్ర జ్వరంతో ఉన్న ఆమెను హోటల్ సిబ్బంది చాలా జాగ్రత్తగా చూసుకున్నారు. దగ్గరుండి టాబ్లెట్లూ, మందులూ తెచ్చిచ్చారు. ఆమె దారిన ఆమెనలా వదిలేయకుండా జ్వరం తగ్గేవరకూ రాత్రంతా కంటికి రెప్పలా కాపాడుకున్నారు.

అలా హోటల్ సిబ్బంది చేసిన సపర్యలు ఆమె హృదయాన్ని తాకాయి. దాంతో భారతీయులు తననెలా చూసుకున్నారో, జ్వరంలో తననెలా ఆదుకున్నారో చెబుతూ ఇన్‌స్టాలో పోస్ట్ చేసిన వీడియో ప్రపంచవ్యాప్తంగా వైరలయ్యింది.

దాన్ని చూసినవారంతా మన మంచితనాన్ని కొనియాడుతున్నారు. ‘భారతీయుల రక్తంలోనే ఆతిథ్య గుణం ఉంది’ అని ఒక నెటిజెనుడు వ్యాఖ్యానిస్తే... ‘ఇందులో విచిత్రమేముంది... అతిథిని జాగ్రత్తగా చూసుకోవడమనేది భారతీయుల డీఎన్ఏలోనే ఉందని మరో నెటిజన్ అన్నాడు.

● నయా వంచన

ఓపెన్ చేస్తే ఎకౌంట్ క్లోజ్!

ట్రెండే కదా అని సరదా పడితే దుఃఖమే మిగులుతుంది. గత కొన్ని వారాలుగా సోషల్ మీడియాలో ‘19–మినిట్ వైరల్ వీడియో’ బాగా పాపులర్ అయింది.

ఒక యువ జంట సన్నిహితంగా ఉన్న వీడియో ఇది.

యూజర్‌ల బలహీనతను సొమ్ము చేసుకోవడానికి మోసగాళ్లు రంగంలోకి దిగడంతో జాగ్రత్తగా ఉండాలని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ వీడియోపై ఆసక్తి చూపుతున్న యూజర్‌లను ట్రాప్ చేయడానికి ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్...ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో స్కామర్లు నకిలీ లింక్‌లను పోస్ట్ చేస్తున్నారు. ఎవరైనా లింక్‌పై క్లిక్ చేస్తే మాల్వేర్ వారి ఫోన్‌లో రహస్యంగా ఇన్‌స్టాల్ అవుతుంది.

ఈ ప్రమాదకరమైన మాల్వేర్ ఏంచేస్తుందంటే...

● మీకు వచ్చే మెసేజ్‌ల గురించి తెలుసుకుంటుంది. ● యాక్టివిటీని ట్రాక్ చేస్తుంది. ● సేవ్ చేసిన పాస్‌వర్డ్స్‌ను దొంగిలిస్తుంది.
● బ్యాంక్ లాగిన్ వివరాలు, ఓటీపీ, ఇతర సెన్సిటివ్ డేటాను కాప్చర్ చేస్తుంది.

లింక్‌లను నిజమైనవిగా చూపించడానికి స్కామర్‌లు నకిలీ సోషల్ మీడియా ప్రొఫైల్‌లను కూడా సృష్టిస్తున్నారు. వైరల్ వీడియోకు సంబంధించి ‘ఎక్స్‌క్లూజివ్ యాక్సెస్’లాంటి ఫిషింగ్ ట్రిక్స్‌ను కూడా స్కామర్‌లు ఉపయోగిస్తారు. ఆర్థిక సమాచారాన్ని దొంగిలించడానికే ఈ మాల్వేర్‌ను ప్రత్యేకంగా డిజైన్ చేసినట్లు సైబర్ సెక్యూరిటీ బృందాలు చెబుతున్నాయి. ఒక్కసారి ఆ మాల్వేర్ ఫోన్‌లోకి జొరబడితే....బ్యాంక్ ఎకౌంట్‌ను సులభంగా యాక్సెస్ చేయడానికి హ్యాకర్‌లకు అవకాశం కల్పిస్తుంది. ఈ ప్రమాదకరమైన మాల్వేర్ వల్ల బ్యాంకు ఖాతా ఖాళీ అయ్యే ప్రమాదం ఉందని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

● ముగ్గు ముచ్చట

18 చుక్కలు, 6 వరసలు, అటు ఇటు వదిలి 6 వచ్చేవరకు

సాయి శరణ్య
కె.ఆర్.ఆర్. హిల్స్, హైదరాబాద్

27 చుక్కలు, చుక్క వదిలి చుక్క 1 వచ్చేవరకు

జయశ్రీ యాదవ్
శారదానగర్, అనంతపూర్

ముగ్గులకు ఆహ్వానం



ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు–ముచ్చట,
సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్–34.
ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) డిసెంబర్ 22న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,36,910	1,38,040	1,35,280	1,38,040	1,35,400	1,36,140
బంగారం (22 క్యారెట్లు)	1,18,560	1,24,000	1,24,000	1,27,720	1,24,570	1,24,800
వెండి	2,13,000	2,14,800	2,31,000	2,18,400	2,08,000	2,31,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

జననేత అభిమానులపై అక్కసు

భానుకోటలో అరెస్టు చేసిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ధర్మవరం కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

అనంతపురం జిల్లా బొమ్మగానిపల్లెలో సర్పంచ్ ఆదినారాయణరెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు

కుప్పం నియోజకవర్గంలోని చిన్నారిదొడ్డి గ్రామంలో వైఎస్సార్‌సీపీ బ్యానర్ తొలగించాలని పోలీసుల హుకుం

● ఆరాధ్యనేత పుట్టిన రోజు చేశారని కేసులు, అరెస్టులు
● అధికార కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన పోలీసులు
● అన్నదానంలో మాంసం పెట్టారని జీవహింస కింద కేసు నమోదు

సాక్షి, నెట్‌వర్క్: చంద్రబాబు సర్కారు మరోమారు తన అల్పబుద్ధిని చాటుకుంది. వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజును వేడుకగా చేశారనే అక్కసు, అసూయతో అక్రమ కేసులు పెట్టింది. అడ్డగోలుగా అరెస్టులకు తెగబడింది. పోలీసులను పావులుగా చేసుకుని రాష్ట్రవ్యాప్తంగా అరాచకం సృష్టించింది.

➡ శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం భానుకోటలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులపై పోలీసులు అక్రమంగా కేసులు పెట్టారు. ఆదివారం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించడాన్ని ఓర్వలేని స్థానిక టీడీపీ ఎమ్మెల్యే పరిటాల సునీత, మండల నాయకులు.. జగన్ బర్త్‌డే వేడుకల్లో పాల్గొన్న వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసులకు హుకుం జారీ చేయడంతో 12 మందిపై కేసులు నమోదు చేశారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు గంగుల సుధీర్‌రెడ్డి, మామిళ్లపల్లి అమరనాథరెడ్డిపైనా అక్రమ కేసులు బనాయించారు. వీరిలో ఏడుగురిని సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చగా.. న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేశారు.

➡ ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం కీసరలో వైఎస్ జగన్ పుట్టిన రోజును ఘనంగా నిర్వహించడాన్ని ఓర్వలేని టీడీపీ నేతలు పోలీసులను రెచ్చగొట్టి తమ పార్టీ ఫ్లెక్సీని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు చింపి వేశారనే నెపంతో కర్ల ఆనందరావుపై కేసు నమోదు చేయించారు. ఉప సర్పంచి చలమల ప్రభాకర్, వార్డు సభ్యుడు అచ్చారావునీ అదుపులోకి తీసుకుని తెల్లవార్లూ స్టేషన్‌లోనే ఉంచారు.

➡ ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ప్రభుత్వాస్పత్రిలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించడంతో పోలీసులు అక్రమంగా కేసు నమోదు చేశారు.

➡ చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు జరిపినందుకు పోలీసులు వైఎస్సార్‌సీపీ నేతలకు హెచ్చరికలు జారీ చేశారు. స్టేషన్‌కు పిలిచి బెదిరించారు. వీర్నమలకు చెందిన 16 మందిపై కేసులు నమోదు చేశారు. అన్నదానంలో మాంసాహారం వడ్డించారని, ఇందుకోసం జీవహింసకు పాల్పడ్డారని కేసు నమోదు చేయడం గమనార్హం.

➡ అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గం బొమ్మగానిపల్లిలో పోలీసులు అర్ధరాత్రి సమయంలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తల ఇళ్లల్లోకి చొరబడి అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బొమ్మగానిపల్లి సర్పంచ్ పాటిల్ ఆదినారాయణరెడ్డితో పాటు రంగస్వామి, దొనతిమ్మ, నాగార్జున, ప్రసాద్ శీనులను అక్రమంగా అరెస్టు చేశారు. స్టేషన్‌కు తరలించే సమయంలో మార్గంమధ్యలో పోలీసులు వాహనాలు ఆపి సర్పంచ్ ఆదినారాయణరెడ్డిపై చేయిచేసుకోవడంతోపాటు, వైఎస్సార్‌సీపీ నాయకులనూ తీవ్రంగా కొట్టారు. వీరికోసం సోమవారం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన పలువురు ప్రజాప్రతినిధులపైనా పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. వంద మందికి పైగా స్పెషల్ ఫోర్స్ పోలీసులను రంగంలోకి దింపి పోలీస్ స్టేషన్ ఎదుట వైఎస్సార్‌సీపీ నేతలు లేకుండా చెదరగొట్టారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలకు
కూటమి అడ్డంకులు

● వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనా గేట్‌కు తాళం వేసిన పోలీసులు
● రోడ్డు మీదే టీడీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి 1,400 మంది వైఎస్సార్‌సీపీలో చేరిక

సాక్షి, విశాఖపట్నం: పోలీసులను అడ్డుపెట్టుకొని వైఎస్సార్‌సీపీపై చంద్రబాబు సర్కార్ కుట్రలు చేస్తోంది. సోమవారం విశాఖలోని సిరిపురం సమీపంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీలో చేరికల కార్యక్రమాన్ని అడ్డుకుంది. చేరికల కార్యక్రమం నిర్వహణకు వీఎంఆర్‌డీఏకు వైఎస్సార్‌సీపీ రూ.71,300 చెల్లించి అధికారికంగా అనుమతి తీసుకుంది. ఈ కార్యక్రమానికి వందలాది మంది ప్రజలు, పార్టీ నేతలు వుడా చిల్డ్రన్ థియేటర్ వద్దకు చేరుకోగా.. దీన్ని చూసి ఓర్వలేకపోయిన కూటమి నేతలు ఈ కార్యక్రమానికి అనుమతి లేదంటూ పోలీసులు, చిల్డ్రన్స్ ఎరీనా సిబ్బందితో గేటుకు తాళం వేయించారు. దీన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షులు కేకే రాజు ఆధ్వర్యంలో చిల్డ్రన్ థియేటర్ గేటు వద్ద మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, విశాఖ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు తదితరులు నిరసన తెలిపారు. అనంతరం గేటు వద్ద నగర ప్రముఖుడు ధర్మాన ఆనంద్‌తో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన 1,400 మంది కార్యకర్తలకు కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు.



విశాఖ చిల్డ్రన్ ఎరీనా వద్ద బైఠాయించిన పార్టీ నేతలు

క్లుప్తంగా...

విద్యుత్ పునరుద్ధరణకు ఆదేశాలివ్వలేం

● గీతం యూనివర్సిటీకి స్పష్టం చేసిన తెలంగాణ హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: టీడీపీ ఎంపీ, నటుడు నందమూరి బాలకృష్ణ చిన్న అల్లుడికి చెందిన గీతం యూనివర్సిటీకి విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరించేలా ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. రూ.118 కోట్ల పెండింగ్ బిల్లులో సగమైనా చెల్లిస్తే పునరుద్ధరణకు ఆదేశాలు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపింది. ఈ సందర్భంగా కోర్టు.. వీబీసీ కంపెనీతో సంబంధం లేదంటే ఎలా ? అది పిటిషనర్ తాతదే కదా? అని ప్రశ్నించింది. పెండింగ్ బకాయిలను చెల్లించాలని లేదా విద్యుత్ కనెక్షన్‌ను నిలిపివేస్తామని సెప్టెంబర్ 12న ఎస్ఈ జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ గీతం వర్సిటీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం విదితమే. రూ.118 కోట్ల బకాయి ఉన్నా చర్యలు చేపట్టని అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు రావడంతో ఈ నెల 20న అధికారులు వర్సిటీకి విద్యుత్ కనెక్షన్ తొలగించారు. దీంతో తమకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ గీతం వర్సిటీ మధ్యంతర అప్లికేషన్(ఐఏ) దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. టీఎస్ఎస్‌పీడీసీఎల్ తరఫు న్యాయవాది ఎన్.శ్రీధర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 15 రోజుల్లో బకాయిలు చెల్లించాలని నోటీసులు జారీ చేశామని, అయినా చెల్లించపోవడంతో కనెక్షన్ తొలగించామని తెలిపారు. పిటిషనర్ కోర్టును ఆశ్రయించినా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేదని చెప్పారు. గతంలోనూ ఇలా పిటిషన్ వేసి ఉపసంహరించుకున్నారన్నారు. కాగా, ‘వీబీసీ’కంపెనీతో తమకు ఎలాంటి సంబంధం లేదని పిటిషనర్ న్యాయవాది తెలిపారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ.. వీబీసీ కంపెనీ పిటిషనర్ తాతదే కదా? అని ప్రశ్నించారు. సగమైనా బిల్లు చెల్లించనిదే కనెక్షన్ పునరుద్ధరణకు ఆదేశాలు ఇవ్వలేమని తేల్చిచెప్పారు. విచారణ ఈ నెల 24కు వాయిదా వేశారు.

సోలార్ ప్రాజెక్టులకు 84.03 ఎకరాల దేవుడి భూమి

సాక్షి, అమరావతి: అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం బలిఘట్టం గ్రామ పరిధిలో దేవదాయ శాఖ అధీనంలో ఉండే బ్రహ్మానంద ఆశ్రమానికి చెందిన 84.03 ఎకరాల దేవుడి భూములను సోలార్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు నెడ్‌క్యాప్‌నకు దీర్ఘకాలిక లీజుకిచ్చేందుకు అనుమతిస్తూ చంద్రబాబు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఒక్కో ఎకరాకు ఏడాదికి రూ.30 వేల చొప్పున (ప్రతి రెండేళ్లకు 5శాతం చొప్పున పెంచుతూ) 30 ఏళ్ల కాలానికి లీజు పద్ధతిన కేటాయించింది.

‘మద్యం’ లాటరీ విధానంపై పునఃసమీక్ష

● మద్యం షాపుల యజమానులకు మార్జిన్ పెంపుపై కసరత్తు చేయండి
● మద్యం దుకాణాలపై ఏఆర్ఈటీ మినహాయింపుపై పరిశీలించండి
● ఎక్సైజ్ శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: లాటరీ విధానంలో మద్యం దుకాణాలు, బార్లకు లైసెన్సుల కేటాయింపుపై పునఃసమీక్షించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మద్యం దుకాణాలపై విధిస్తున్న అదనపు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్(ఏఆర్ఈటీ) మినహాయింపు విషయాన్ని పరిశీలించాలని చెప్పారు. వెలగపూడిలోని సచివాలయంలో సోమవారం ఎక్సైజ్ శాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర ఉత్పత్తుల మాదిరిగానే మద్యాన్ని కూడా పరిగణించాలన్నారు. మద్యం షాపుల యజమానులకు మార్జిన్ పెంపు, లిక్కర్ ఐడెంటిఫికేషన్ నంబరు తదితర అంశాలపై మరింత కసరత్తు చేయాలన్నారు. బెల్ట్ దుకాణాల నియంత్రణకు హరియాణ అనుసరిస్తున్న విధానాన్ని పరిశీలించాలని సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పియూష్‌కుమార్, ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ శ్రీధర్, ఈడీ రాహుల్‌దేవ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

రాజధానిలో కల్చరల్ సెంటర్ ఏర్పాటు: సీఎం

రాజధాని అమరావతిలో కల్చరల్ సెంటర్ ఏర్పాటు చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. సోమవారం సచివాలయంలో సీఆర్‌డీఏ అథారిటీ 56వ సమావేశం జరిగింది. రాజధాని నిర్మాణ పనులపై క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సీఆర్‌డీఏ), అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏడీసీ) అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా కల్చరల్ సెంటర్ నిర్మాణం చేపట్టాలని సూచించారు. గడువులోగా అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణం పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉండవల్లి వద్ద కొండవీటివాగు వరద జలాలు 8,400 క్యూసెక్కులను ఎత్తిపోసేలా రూ.444 కోట్లతో ఎత్తిపోతల నిర్మాణానికి, ఎల్పీఎస్ జోన్–8లో లే-అవుట్‌ల అభివృద్ధికి రూ.1,358 కోట్ల కేటాయింపునకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ, సీఎస్ విజయానంద్, సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు, సీఆర్‌డీఏ, ఏడీసీ అధికారులు పాల్గొన్నారు.

189 టన్నుల గోమాంసం పూడ్చివేతకు సిద్ధం

● నవంబర్ 3న విశాఖ శివారులో శ్రీమిత్ర మెరైన్ ఏజెన్సీస్ కోల్డ్ స్టోరేజీలో భారీగా మాంసం గుర్తింపు
● శాంపిళ్లు పరిశీలించగా గోమాంసం ఉన్నట్లు నిర్ధారణ
● విదేశాలకు ఎగుమతి చేస్తున్న మహమ్మద్ ఫర్హాన్‌తోపాటు మరో ఇద్దరి అరెస్ట్
● వివరాలు వెల్లడించిన లా అండ్ ఆర్డర్ డీసీపీ – 1 వీఎస్ మణికంఠ

కోల్డ్ స్టోరేజీ నుంచి గో మాంసాన్ని లారీలోకి లోడ్ చేస్తుండగా పరిశీలిస్తున్న డీసీపీ

తగరపువలస (విశాఖపట్నం): విశాఖ జిల్లా ఆనందపురం మండలం శొంఠ్యాం పంచాయతీ శ్రీమిత్ర మెరైన్ ఏజెన్సీస్ కోల్డ్ స్టోరేజీలో పట్టుబడిన 189 టన్నుల గో మాంసాన్ని న్యాయస్థానం ఆదేశాల మేరకు జీవీఎంసీ, కాలుష్య నియంత్రణ బోర్డు, పశు సంవర్ధకశాఖ, రెవెన్యూ, పోలీసుల పర్యవేక్షణలో పూడ్చివేయనున్నట్టు లా అండ్ ఆర్డర్ డీసీపీ – 1 వి.ఎస్.మణికంఠ చందోలు తెలిపారు. సోమవారం ఆయన ఆనందపురంలో మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున గోవులను వధించి వాటి మాంసాన్ని అక్రమంగా ఇతర దేశాలకు తరలిస్తున్న నేపథ్యంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్ ఇటీవల గుజరాత్, కోల్‌కతా, విశాఖ పోర్టుల్లో తనిఖీ చేసిన సమయంలో శొంఠ్యాం శ్రీమిత్ర కోల్డ్ స్టోరేజీని కూడా తనిఖీ చేశారని తెలిపారు. నవంబరు 3న విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ, ఆనందపురం పోలీసులు కోల్డ్ స్టోరేజీకి వెళ్లేసరికి గేదె మాంసం పేరుతో మిస్టర్ మిష్ ఓవర్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ విదేశాలకు పంపించడానికి సిద్ధంగా ఉన్న వాటి నుంచి ఆరు శాంపిళ్లు తీసి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించారన్నారు. 87,945 కిలోల నుంచి తీసిన మూడు శాంపిళ్లలో ఆవు మాంసం, 37,656 కిలోల నుంచి తీసిన రెండు శాంపిళ్లలో ఎద్దు మాంసం, 18,720 కిలోల నుంచి తీసిన ఒక శాంపిల్‌లో గేదె మాంసం ఉన్నట్టు తేలిందన్నారు. మిగిలిన 45,416 కిలోల మాంసం నుంచి ఎనిమిది శాంపిళ్లను కూడా ల్యాబ్‌కు పంపించినట్టు తెలిపారు. ప్రాథమిక పరీక్షల్లో ఎక్కువ భాగం ఆవు మాంసం ఉండడంతో... ఆవులను వధించడం చట్టరీత్యా నేరమైనందున అదే రోజు ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి మొత్తం 189 టన్నుల మాంసాన్ని సీజ్ చేశారని పేర్కొన్నారు.

ఎగుమతిదారుడు, ఇద్దరు సరఫరాదారుల అరెస్ట్

విచారణలో భాగంగా గో మాసం ఎగుమతిదారుడైన మిస్టర్ మిష్ ఓవర్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ యజమాని మహమ్మద్ ఫర్హాన్‌ను అరెస్ట్ చేశామని, ఆవు మాంసం పెద్ద ఎత్తున విదేశాలకు ఎగుమతి చేసే రాకెట్‌లో ఉన్నవారిని కూడా గుర్తించామన్నారు. మహారాష్ట్రలోని లోనావాలాకు చెందిన గోమాంసం సరఫరాదారుడు మన్సూర్ ఆలీని ప్రధాన నిందితుడిగా, ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన మరో సరఫరాదారుడు రషీద్ ఖురేషీని అరెస్ట్ చేసి జ్యుడిషియల్ విచారణ చేపట్టామన్నారు. ఈ ముఠా దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఆవులను వధించి తప్పుడు ఇన్వాయిస్‌లు, వే బిల్లులు, హెల్త్ సర్టిఫికెట్లు సృష్టించి గేదె మాంసం పేరుతో విశాఖ పోర్టు ద్వారా ముఖ్యంగా గల్ఫ్ దేశాలకు ఎగుమతి చేస్తున్నారన్నారు. ఈ నెట్‌వర్క్‌లో మొత్తం 9 మంది వున్నారని, మిగిలిన నేరస్తులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.



సింధు

ఫైనల్లో ఆంధ్రప్రదేశ్ మహిళల బ్యాడ్మింటన్ జట్టు

సాక్షి, విజయవాడ: జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టీమ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ మహిళల జట్టు ఫైనల్లోకి దూసుకెళ్లింది. విజయవాడలో సోమవారం ఈ మెగా ఈవెంట్ మొదలైంది. పీవీ సింధు, సూర్య చరిష్మా తామిరి, నవ్య కందేరి, తనిష్క్, దీపిక దేవన బోయిన, కవిప్రియలతో కూడిన ఆంధ్రప్రదేశ్ జట్టు సెమీఫైనల్లో 3–2తో గుజరాత్ జట్టును ఓడించింది. ఉత్తరాఖండ్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో సింగిల్స్, డబుల్స్ మ్యాచ్‌ల్లో ఆడిన సింధు సెమీఫైనల్లో మాత్రం బరిలోకి దిగలేదు. సెమీఫైనల్ తొలి మ్యాచ్‌లో నవ్య 15–21, 6–21తో తస్నిమ్ మీర్ చేతిలో ఓడిపోయింది. రెండో మ్యాచ్‌లో సూర్య చరిష్మా 21–14, 21–9తో అదిత రావుపై గెలిచింది. మూడో మ్యాచ్‌లో నవ్య–సూర్య చరిష్మా జోడీ 21–15, 21–13తో పెనాన్ క్రిస్టియన్–బృందా పిండే జంటను ఓడించింది. నాలుగో మ్యాచ్‌లో తనిష్క్ 11–21, 9–21తో శ్రేయ లెలె చేతిలో ఓడిపోవడంతో స్కోరు 2–2తో సమమైంది. నిర్ణాయక ఐదో మ్యాచ్‌లో దీపిక–కవిప్రియ ద్వయం 21–15, 21–19తో తస్నిమ్ మీర్–అదిత రావు జంటను ఓడించి ఆంధ్రప్రదేశ్‌కు ఫైనల్ బెర్త్‌ను అందించింది. నేడు జరిగే ఫైనల్లో హరియాణాతో ఆంధ్రప్రదేశ్ తలపడుతుంది. రెండో సెమీఫైనల్లో హరియాణా 3–1తో అస్సాం జట్టుపై గెలిచింది. పురుషుల విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్టు క్వార్టర్ ఫైనల్లో 0–3తో తమిళనాడు చేతిలో ఓడిపోయింది.

‘షాన్‌దార్’గా మళ్లీ జట్టులోకి...

భారత క్రికెట్ జట్టులో ఒక్కసారి స్థానం కోల్పోయిన తర్వాత పునరాగమనం చేయడం అంత సులువు కాదు. పైగా కేవలం ప్రదర్శన బాగా లేక చోటు దక్కకపోతే దేశవాళీలో పరుగుల వరద పారించైనా తిరిగి రావచ్చు. కానీ ప్రవర్తన బాగా లేదనే పేరు వస్తే మాత్రం అందరి దృష్టిలో అతనికి నెగెటివ్ మార్కులు పడినట్లే. రాహుల్ ద్రవిడ్‌లాంటి సౌమ్యుడికి కూడా తన క్రమశిక్షణారాహిత్యంతో కోపం తెప్పించాడంటే ఆ ఆటగాడు శాశ్వతంగా చెడ్డ పేరు సంపాదించుకున్నట్లే. అయితే ఇషాన్ వీటన్నింటిని అధిగమించాడు. జట్టులో స్థానం కోల్పోయి, ఆపై బీసీసీఐ కాంట్రాక్ట్ కోల్పోయి అన్ని అవకాశాలు కోల్పోయాడని అనిపించిన దశలో మళ్లీ పైకి లేచాడు. క్రికెట్ మైదానంలోనే సత్తా చాటి అనూహ్యంగా ప్రపంచ కప్‌లో పాల్గొనే భారత టి20 టీమ్‌లో స్థానం సంపాదించుకున్నాడు.

సాక్షి క్రీడా విభాగం

- ఇషాన్ కిషన్ అసాధారణ పునరాగమనం
- క్రమశిక్షణారాహిత్యంతో కోల్పోయిన స్థానం
- రెండేళ్ల తర్వాత టీమిండియాలోకి

‘వ్యక్తిగత కారణాలతో’ భారత జట్టుకు దూరమైన తర్వాత 2024 ఐపీఎల్‌లో ఇషాన్ కిషన్ ముంబై ఇండియన్స్ తరఫున బరిలోకి దిగి రాణించాడు. ఆ సమయంలో 2024 టి20 వరల్డ్ కప్ కోసం జట్టు ఎంపిక జరగాల్సి ఉంది. తన అవకాశాలపై స్పందిస్తూ... ‘నేను అసలు ఇప్పుడు వరల్డ్ కప్ గురించి ఏమాత్రం ఆలోచించడం లేదు. దేనినీ సీరియస్‌గా తీసుకోకుండా ప్రశాంతంగా ఉన్నాను. ఒక్కసారి ఆట నుంచి విరామం తీసుకుంటే జనం మన గురించి చాలా తప్పుడు మాటలు మాట్లాడతారు. అయితే ప్రతీది ఆటగాళ్ల చేతుల్లో ఉండదనే విషయం వారికి అర్థం కాదు’... అని అతను వ్యాఖ్యానించాడు. అప్పటికి రెండు నెలల క్రితమే బీసీసీఐ కూడా తమ కాంట్రాక్ట్ జాబితా నుంచి కిషన్ పేరును తొలగించింది. గత కొంత కాలంగా జరిగిన పరిణామాలతో ఆవేదన చెందిన అతను తన అసంతృప్తిని ఈ రకంగా వ్యక్తపర్చినట్లుంది. అయితే ఇంతటి తీవ్ర నిరాశ మధ్య అతను ఆగిపోలేదు. తనకు తెలిసిన బ్యాటింగ్‌తోనే తనను తాను నిరూపించుకోవాలని భావించిన ఇషాన్ దేశవాళీ క్రికెట్‌పై దృష్టి పెట్టాడు. గతి తప్పినట్లు కనిపించిన కెరీర్‌ను సరైన దిశలో మార్చుకున్నాడు.

ఇషాన్ కిషన్ కెరీర్ ఆరంభం నుంచి సంచలనాలతో సాగింది. భారీ హిట్టింగ్ సామర్థ్యం ఉన్న ఎడంచేతి వాటం వికెట్ కీపర్, అదీ ఓపెనర్‌గా ఉండటం అంటే అరుదైన కాంబినేషన్‌గా చెప్పవచ్చు. అలాంటి అరుదైన ప్రతిభతోనే ఈ జార్ఖండ్ కుర్రాడు మొదటి నుంచి అందరి దృష్టిలో పడ్డాడు. 16 ఏళ్లకే రంజీ ట్రోఫీ బరిలోకి దిగిన అతను అండర్–19 వరల్డ్ కప్‌లో పంత్, సర్ఫరాజ్, సుందర్ సభ్యులుగా ఉన్న జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. భారత జట్టు తరఫున ప్రదర్శనకంటే ఐపీఎల్ ద్వారా ముందుగా గుర్తింపు తెచ్చుకున్న ఆటగాళ్లలో ఒకడైన ఇషాన్ కిషన్ ముంబై తరఫున కీలక విజయాలలో భాగమై ఏడు సీజన్ల పాటు ఆడాడు. 23 ఏళ్ల వయసులో టీమిండియా తరఫున అరంగేట్రం చేసి మూడు ఫార్మాట్లలోనూ ఆడే అవకాశం దక్కించుకున్నాడు. వన్డేల్లో డబుల్ సెంచరీ సాధించిన అరుదైన ఆటగాళ్ల జాబితాలో ఇషాన్ కిషన్ పేరు కూడా చేరింది.

క్రమశిక్షణ తప్పి...

2023 దక్షిణాఫ్రికా పర్యటన సమయంలో ఇషాన్ కిషన్ కెరీర్ ఒక్కసారిగా మారిపోయింది. ‘మానసిక సమస్యల’ కారణంగా సిరీస్ మధ్యలోనే తప్పుకున్న అతను కొంత కాలం పాటు ఆటకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. అయితే క్రమశిక్షణ తప్పడంతో టీమ్ మేనేజ్‌మెంటే అతడిని తప్పించినట్లు వార్తలు వచ్చాయి. స్వదేశంలో ఫిట్‌గా మారిన తర్వాత కూడా దేశవాళీ క్రికెట్‌ను పట్టించుకోకుండా ప్రయివేట్ టోర్నీ డీవై పాటిల్‌లో ఆడటం కూడా బోర్డుకు ఆగ్రహం కలిగించింది. దాంతో 2024 ఫిబ్రవరిలో అతడి కాంట్రాక్ట్ రద్దయింది. అప్పటి నుంచి కిషన్‌ను ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు. పంత్ కోలుకొని రావడం, ధ్రువ్ జురేల్ టెస్టుల్లో నిరూపించుకోవడంతో పాటు వన్డేల్లో కేఎల్ రాహుల్ కీపింగ్ చేయడం, టి20ల్లో సంజూ సామ్సన్, జితేశ్ శర్మ అందుబాటులో ఉండటంతో ఇప్పట్లో కిషన్ తిరిగి వచ్చే అవకాశాలు కనిపించలేదు. కానీ 27 ఏళ్ల ఈ జార్ఖండ్ కుర్రాడు పోరాడేందుకు సిద్ధమయ్యాడు.

జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌తో ఇషాన్

దేశవాళీలో చెలరేగి...

ముందుగా 2024–25 సీజన్ దేశవాళీ క్రికెట్‌లో బరిలోకి దిగడం తప్పనిసరి అనే విషయాన్ని కిషన్ గుర్తించాడు. గత ఏడాది ఐపీఎల్ ముగిసిన తర్వాత జార్ఖండ్ తరఫున రంజీ ట్రోఫీలో బరిలోకి దిగాడు. ఆ తర్వాత ఎక్కడ అవకాశం లభించినా దానిని వదులుకోకుండా ప్రతీ మ్యాచ్‌లో బరిలోకి దిగేందుకు ప్రయత్నించాడు. దులీప్ ట్రోఫీ, చాలెంజర్ టోర్నీలలో కూడా సత్తా చాటాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో సన్‌రైజర్స్ తరఫున తొలి మ్యాచ్‌లోనే సెంచరీతో అదరగొట్టి తనేంటో చూపించాడు. అక్కడితో ఆగిపోకుండా అసలు లక్ష్యం ముస్తాక్ అలీ ట్రోఫీ కోసం సిద్ధమయ్యాడు. అంచనాలకు అనుగుణంగా చెలరేగుతూ ఏకంగా 197 స్ట్రయిక్ రేట్‌తో 517 పరుగులు సాధించడమే కాదు... కెప్టెన్‌గా జార్ఖండ్‌ను తొలిసారి విజేతగా నిలిపాడు. ‘గీతాపఠనం’ ద్వారా మానసికంగా మరింత దృఢంగా మారి పరిణతి చెందిన ఆటగాడిగా తనను తాను మలచుకున్నాడు. 2025 ఏప్రిల్‌లో ప్రకటించిన బీసీసీఐ కొత్త కాంట్రాక్ట్‌లో మళ్లీ చోటు లభించింది. ఇప్పుడు అనూహ్యంగా భారత జట్టులో తిరిగి అవకాశం దక్కడం అతని అరంగేట్రంకంటే గొప్ప ఘనత అనడంలో సందేహం లేదు.

మరో విజయం లక్ష్యంగా...

నేడు శ్రీలంకతో భారత మహిళల రెండో టి20

- రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

సాక్షి, విశాఖపట్నం: వన్డే ప్రపంచకప్ గెలుచుకొచ్చిన ఉత్సాహంతో ఉన్న భారత మహిళల జట్టు శ్రీలంకతో మొదలైన టి20 సిరీస్‌లో శుభారంభం చేసింది. ఇప్పుడు ఇదే జోరుతో వరుస విజయాలతో ఆధిక్యాన్ని పెంచుకోవాలని ఆశిస్తోంది. తద్వారా సిరీస్‌లో పట్టు సాధించాలని చూస్తోంది. మరోవైపు లంక అమ్మాయిలు పటిష్టమైన భారత్‌కు ఎలాగైనా కళ్లెం వేయాలని, ఈ మ్యాచ్‌లో గెలిచి 1–1తో సమం చేయాలని పట్టుదలతో ఉన్నారు. గట్టి ప్రత్యర్థిని ఓడించేందుకు పకడ్బందీ ఎత్తుగడలను అమలు చేయాలని లంక జట్టు కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో విశాఖ తీరంలోనే జరిగే ఈ రెండో టి20 ఆసక్తికరంగా జరిగే అవకాశముంది.

ఫీల్డింగ్‌తోనే సమస్య

హర్మన్‌ప్రీత్ బృందం మొదటి మ్యాచ్‌లో బాగానే ఆడింది. ప్రత్యర్థిని ఓడించింది. ఐదు టి20ల సిరీస్‌లో శుభారంభం చేసింది. అంతమాత్రాన భారత జట్టు అన్ని విభాగాల్లోనూ ప్రత్యర్థికంటే అగ్రగామిగా ఉందనుకుంటే పొరపాటు. బౌలింగ్, బ్యాటింగ్ బాగున్నప్పటికీ ఫీల్డింగ్ చాలా ఘోరంగా ఉంది. తొలి మ్యాచ్‌లో చెత్త ఫీల్డింగ్‌తో విసుగు తెప్పించింది. సులువైన క్యాచుల్ని నేలపాలు చేసింది. అంతిమంగా విజయమే ముఖ్యమైనా... ఘోరమైన ఫీల్డింగ్‌ను అది మూసి పెట్టలేదు. ఇదే విషయాన్ని కెప్టెన్ హర్మన్ సైతం అంగీకరించింది. తప్పకుండా ఫీల్డింగ్ లోపాలపై దృష్టి పెడతామని, నెట్స్‌లో క్యాచింగ్‌పైనే అతిగా ప్రాక్టీస్ చేశామని కూడా చెప్పింది. బ్యాటింగ్‌లో స్మృతి మంధాన మెరుగ్గా ఆడింది. జెమీమా రోడ్రిగ్స్ విలువైన అర్ధసెంచరీతో అజేయంగా నిలిచింది. వీరితో పాటు షఫాలీ వర్మ కూడా రాణిస్తే పరుగులకు, భారీస్కోరుకు ఏమాత్రం ఇబ్బంది వుండదు. బౌలింగ్‌లో క్రాంతి గౌడ్, అరుంధతి రెడ్డి, దీప్తి శర్మ, శ్రీచరణి ఆకట్టుకున్నారు. కొత్తమ్మాయి వైష్ణవి శర్మ అరంగేట్రంలోనే అదరగొట్టింది. వికెట్ తీయలేకపోయినా కట్టుదిట్టంగా బౌలింగ్ చేసింది.

సమం చేసే పనిలో...

సొంతగడ్డపై భారత్ పైచేయిగా ఉన్నప్పటికీ... ఆతిథ్య జట్టులోని లోపాలను సొమ్ము చేసుకొని సిరీస్ రేసులో నిలవాలని శ్రీలంక చూస్తోంది. భారత్ ఆధిక్యాన్ని ఇక్కడే సమం చేయాలనే పట్టుదలతో ఉంది. బ్యాటింగ్‌లో కెప్టెన్ చమరి ఆటపట్టు, నీలాక్షికల వైఫల్యం కూడా జట్టుకు ప్రతికూలంగా మారింది. ఈ 20 ఓవర్ల మ్యాచ్‌లో రెండు, మూడు ఓవర్లు చాలు మ్యాచ్‌గతినే మార్చడానికి. అందరు ఆడాల్సిన పనిలేదు. ఏ ఇద్దరు దంచేసినా చాలు ఆతిథ్య జట్టుకు గట్టి బదులు ఇవ్వొచ్చని శ్రీలంక ఆశిస్తోంది.

తుది జట్లు (అంచనా)

భారత్: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), షఫాలీ, స్మృతి మంధాన, జెమీమా, రిచా ఘోష్, దీప్తి శర్మ, అమన్‌జోత్, అరుంధతి, క్రాంతి గౌడ్, వైష్ణవి, శ్రీచరణి. **శ్రీలంక:** చమరి ఆటపట్టు (కెప్టెన్), విష్మి గుణరత్నే, హాసిని, హర్షిత, కవీషా, ఇమేశ దులాని, నీలాక్షిక, కౌశిని, ఇనోక రణవీర, మాల్కి మదర, కావ్య, శశిని.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

మాస్ రౌడీ జనార్ధన

విజయ్ దేవరకొండ హీరోగా రవి కిరణ్ కోలా దర్శకత్వంలో రూపొందుతున్న రూరల్ యాక్షన్‌డ్రామా సినిమాకు ‘రౌడీ జనార్ధన’ అనే టైటిల్ ఖరారైంది. ఈ చిత్రంలో కీర్తీసురేష్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ‘దిల్’ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా 2026 డిసెంబరులో విడుదల కానుంది. ఈ సినిమా టైటిల్ గ్లింప్స్ లాంచ్ ఈవెంట్‌ని సోమవారం నిర్వహించారు. ‘దిల్’ రాజు మాట్లాడుతూ–‘‘రౌడీ జనార్ధన’ కోసం విజయ్‌తో తొలిసారిగా ఈస్ట్ గోదావరి యాసలో మాట్లాడిస్తున్నాం. 1980 దశకం నేపథ్యంతో ఈ సినిమా కథనం ఉంటుంది. ఔట్ అండ్ ఔట్ మాస్ క్యారెక్టర్‌లో విజయ్ కనిపించబోతున్నాడు. తను ఇప్పటి వరకు ఇంత మాస్, బ్లడ్ షెడ్ ఉన్న క్యారెక్టర్ చేయలేదు. వచ్చే ఏడాది ఈ సినిమాని రిలీజ్ చేస్తాం’’ అని చెప్పారు. ‘‘నేను కూడా విజయ్ దేవరకొండ అభిమానినే. నేను అభిమానించే కీర్తి సురేష్, ‘దిల్’ రాజుగార్లతో సినిమా చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఈ చిత్ర కథ ఎంత బాగుందో, ఈస్ట్ గోదావరి యాసలో విజయ్ మాట్లాడటం కూడా అంతే బాగుందని రాజుగారు అనేవారు’’ అని తెలిపారు రవికిరణ్ కోలా. శిరీష్, ప్రొడక్షన్ డిజైనర్ డినో శంకర్, కెమెరామేన్ ఆనంద్ సి. చంద్రన్ మాట్లాడారు.



- విజయ్ దేవరకొండ

మన జీవితాన్ని మనమే బతకాలి

- శర్వానంద్

- రామ్ అబ్బరాజు, శర్వానంద్

శర్వానంద్ హీరోగా, సంయుక్త, సాక్షీ వైద్య హీరోయిన్లుగా నటించిన లవ్ అండ్ ఫ్యామిలీ డ్రామా ‘నారీ నారీ నడుమ మురారి’. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మించారు. సంక్రాంతి సందర్భంగా జనవరి 14న సాయంత్రం 5:49 ఫస్ట్ షో నుంచి ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. సోమవారం హైదరాబాద్‌లోని సీఎమ్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా శర్వానంద్ మాట్లాడుతూ–‘‘మనం అనుకున్నది సాధించే శక్తి మన అందరిలోనూ ఉంటుంది. ఎవరి అభిప్రాయాలపైనా ఆధార పడకండి. ఎందుకంటే మన జీవితాన్ని మనమే బతకాలి. కష్టపడి చదవండి. అనుకున్నది సాధించండి. ‘నారీ నారీ నడుమ మురారి’ సినిమా గురించి చెప్పాలంటే.. ప్రేక్షకులు పొట్టచెక్కలయ్యేలా నవ్వేలా ఉంటుంది. థియేటర్స్‌లో ఈ సినిమాను చూడండి.. ఎంజాయ్ చేస్తారు’’ అని చెప్పారు.

శంబాలపై పాజిటివ్ వైబ్ ఉంది

- కిరణ్ అబ్బవరం

- అశ్విన్, తమన్, ప్రియదర్శి, ఆది సాయికుమార్, కిరణ్ అబ్బవరం, అనిల్ రావిపూడి

‘‘ఎస్‌ఆర్ కళ్యాణ మండపం’ సినిమాలో ధర్మ పాత్ర కోసం సాయి కుమార్‌గారిని కలిసినప్పుడు ఆయన మాకు చేసిన సపోర్ట్‌ని ఎప్పటికీ మర్చిపోలేను. ఆయన వల్లే నా కెరీర్ బాగుందనుకుంటూ ఉంటాను. ‘శంబాల’ చిత్రంపై ముందు నుంచి పాజిటివ్ వైబ్ ఉంది.. తప్పకుండా అందరికీ నచ్చుతుంది. ఈ మూవీతో ఆదిగారికి మంచి విజయం రావాలి’’ అని కిరణ్ అబ్బవరం తెలిపారు. ఆది సాయికుమార్, అర్చనా అయ్యర్ జోడీగా నటించిన చిత్రం ‘శంబాల’. యుగంధర్ ముని దర్శకత్వంలో షైనింగ్ పిక్చర్స్‌పై రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి హీరోలు మంచు మనోజ్, కిరణ్ అబ్బవరం, ప్రియదర్శి, అశ్విన్ బాబు, డైరెక్టర్ అనిల్ రావిపూడి, సంగీత దర్శకుడు తమన్, నిర్మాతలు నవీన్ యెర్నేని, టీజీ విశ్వ ప్రసాద్, మైత్రి శశిధర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మంచు మనోజ్ మాట్లాడుతూ–‘‘చిన్న సినిమా పెద్ద సినిమా అని ఉండదు.. మంచి చిత్రాల్ని ప్రేక్షకులు ఆదరిస్తూనే ఉంటారు’’ అన్నారు. ‘‘సాయికుమార్‌గారి కొడుకుని అని చెప్పుకోవడాన్ని గర్వంగా భావిస్తాను’’ అని ఆది సాయికుమార్ తెలిపారు. ‘‘ఈ చిత్రంతో ఆదికి మంచి విజయం దక్కాలి’’ అన్నారు అనిల్ రావిపూడి. ‘‘శంబాల’తో ఆదికి చిత్రోత్సాహం, నాకు పుత్రోత్సాహం, టీమ్‌కి విజయోత్సాహం రావాలని కోరుకుంటున్నాను’’ అని నటుడు సాయికుమార్ చెప్పారు. ‘‘నా టీమ్ సపోర్ట్ వల్లే సినిమాను ఇంత గొప్పగా తీశాను’’ అని యుగంధర్ ముని పేర్కొన్నారు.

అక్టోబరులో దృశ్యం 3



- అజయ్ దేవగన్

హీరో మోహన్‌లాల్, దర్శకుడు జీతూజోసెఫ్ కాంబినేషన్‌లో రూపొందిన మలయాళ ‘దృశ్యం’ ఫ్రాంచైజీకి ఆడియన్స్‌లో మంచి క్రేజ్ ఉంది. ఇటీవలే వీరి కాంబినేషన్‌లోనే ‘దృశ్యం 3’ సినిమా చిత్రీకరణ పూర్తయింది. వచ్చే ఏడాది ఈ చిత్రం విడుదల కానుంది. అయితే ‘దృశ్యం’ ఫ్రాంచైజీలోని సినిమాలు ఇతర భాషల్లోనూ రీమేక్ అవుతున్న సంగతి తెలిసిందే. హిందీలో అజయ్ దేవగన్ హీరోగా నటిస్తున్నారు. కాగా, హిందీ వెర్షన్ ‘దృశ్యం 3’ షూటింగ్ మొదలైంది. అజయ్ దేవగన్ హీరోగా నటిస్తున్న ఈ ‘దృశ్యం 3’ చిత్రానికి అభిషేక్ పాఠక్ డైరెక్టర్. టబు, శ్రియా శరణ్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. అలోక్ జైన్, అజిత్ అంధారే నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది అక్టోబరు 2న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. ‘దృశ్యం 3’ తెలుగు వెర్షన్‌లో వెంకటేశ్ హీరోగా నటించనున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కావాల్సి ఉంది.

ఇలాంటి సినిమాలు తప్పక ఆడాలి

- మారుతి

- ఫణి ప్రదీప్, మారుతి

‘‘సినిమా టైటిల్ మాత్రమే ‘బ్యాడ్ గాళ్స్’. కానీ, మూవీ అంతా పాజిటివ్‌గా ఉంటుంది. నేటితరం అమ్మాయిలు ఎలా ఉన్నారు? వాళ్ల ఆలోచనా విధానం ఏంటి? వాళ్లు ఏమి కోరుకుంటున్నారు? వంటి మంచి కాన్సెప్ట్‌తో, మహిళలకు ప్రాధాన్యం ఇచ్చేలా రూపొందిన ‘బ్యాడ్ గాళ్స్’తప్పక ఆడాలి’’ అని డైరెక్టర్ మారుతి ఆకాంక్షించారు. ఆంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి, యష్ణ, మోయిన్, రోహన్ సూర్య ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం ‘బ్యాడ్ గాళ్స్’. ‘కానీ చాలా మంచోళ్లు’ అనేది ట్యాగ్ లైన్. ఫణి ప్రదీప్ ధూళిపూడి(మున్నా) దర్శకత్వం వహించారు. ప్రశ్విత ఎంటర్‌టైన్‌మెంట్, నీలి నీలి ఆకాశం క్రియేషన్స్, ఎన్‌వీఎల్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై శశిధర్ నల్ల, ఇమ్మడి సోమ నర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేష్ నిర్మించిన ఈ సినిమా నెల 25న విడుదల కానుంది. ఈ మూవీ ట్రైలర్‌ను మారుతి విడుదల చేసి, ‘‘ఫణి ప్రదీప్ నాకు మిత్రుడు. ‘బ్యాడ్ గాళ్స్’ చిత్రం విజయం సాధించాలి’’ అని పేర్కొన్నారు.

ఆరంభం మాత్రమే!

‘వినోద్ ఫిల్మ్ అకాడమీ’ సంస్థ నిర్మాణ రంగంలోకి ప్రవేశించింది. వినోద్ నువ్వుల హీరోగా నటిస్తున్నారు. తల్లాడ సాయికృష్ణ దర్శకత్వ పర్యవేక్షణలో ప్రణయ్ రాజ్ వంగరి దర్శకత్వం వహిస్తున్నారు. వినోద్ ఫిల్మ్ అకాడమీ అండ్ స్టూడియోస్‌పై వినోద్ నువ్వుల నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రారంభం అయింది. ముహూర్తపు సన్నివేశానికి డైరెక్టర్ సునీల్ కుమార్ రెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, నటుడు ఎల్బీ శ్రీరామ్ క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా వినోద్ నువ్వుల మాట్లాడుతూ– ‘‘వినోద్ ఫిల్మ్ అకాడమీ’ ఐదేళ్ల ప్రయాణంలో నాకు అండగా నిలిచిన వారికి ధన్యవాదాలు. మా సంస్థ 6వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా వేడుకలు నిర్వహించుకోవడం, నిర్మాణ రంగం లోకి ప్రవేశించి, కొత్త సినిమా ప్రారంభించడం హ్యాపీ. శిక్షణ ఇవ్వడమే కాకుండా, నా విద్యార్థుల ప్రతిభను వెండితెరపై చూపించాలనే ఉద్దేశంతోనే ‘వినోద్ ఫిలిం అకాడమీ అండ్ స్టూడియోస్’ బ్యానర్‌ను ప్రారంభించాను. ఇది ఆరంభం మాత్రమే.. భవిష్యత్తులో మరిన్ని సినిమాలు తీస్తాను’’ అని తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: నిక్కీ, సంగీతం: లలిత్.

- వినోద్, స్వప్న, పృథ్వీ

చిన్న సినిమాల మనుగడ కష్టంగా ఉంది

- తుమ్మల ప్రసన్న కుమార్



- రామకృష్ణ గౌడ్, ఆక్సా ఖాన్, ప్రసన్న కుమార్

‘‘ప్రస్తుతం చిన్న సినిమాల మనుగడ చాలా కష్టంగా ఉంది. దాసరి నారాయణరావుగారు చిన్న సినిమాలను సపోర్ట్ చేస్తూ, టికెట్ ధరలు తక్కువగా ఉండాలని కోరుకునేవాళ్లు. ప్రస్తుతం ఆ పరిస్థితులు కనిపించడం లేదు. అందరూ బాగుండాలి.. అందులో మనం ఉండాలి అనుకోవాలి. డిజిటల్ కంటెంట్ ప్రొవైడర్స్ అధిక ధరల వల్ల పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లోనూ రామకృష్ణగారు తీసిన ‘ఆర్‌కే దీక్ష’ సినిమా విజయం సాధించాలి’’ అని తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి కార్యదర్శి తుమ్మల ప్రసన్న కుమార్ కోరారు. కిరణ్ హీరోగా, అలేఖ్య రెడ్డి, ఆక్సా ఖాన్ హీరోయిన్లుగా నటించిన చిత్రం ‘దీక్ష’. డీఎస్ రెడ్డి సమర్పణలో ఆర్‌కే ఫిలిమ్స్, సిద్ధ క్రియేషన్స్‌పై ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. సోమవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ– ‘‘ఎన్టీఆర్‌గారు 50 ఏళ్ల క్రితం చేసిన ‘దీక్ష’ అనే టైటిల్‌తో ఇప్పుడు మేము సినిమా తీయడం గర్వంగా ఉంది. మా చిత్రాన్ని ఆదరించాలి’’ అన్నారు. డి.ఎస్.రెడ్డి, నటీనటులు తులసి, కిరణ్, నిర్మాతలు ఎత్తరి గురురాజ్, సాయి వెంకట్ మాట్లాడారు.

పవర్‌ఫుల్ వృషభ

- నయన్ సారిక, సమర్జీత్

మోహన్‌లాల్ హీరోగా నటించిన హిస్టారికల్ యాక్షన్ సినిమా ‘వృషభ’. సమర్జీత్ లంకేష్, నయన్‌సారిక, రాగిణి ద్వివేది, అజయ్, నేహా సక్సేనా, గరుడ రామ్ ఇతర పాత్రల్లో నటించారు. నందకిషోర్ దర్శకత్వంలో శోభా కపూర్, ఏక్తా ఆర్ కపూర్, సి.కె. పద్మ కుమార్, వరుణ్ మాథుర్, సౌరభ్ మిశ్రా, అభిషేక్ ఎస్ వ్యాస్, ప్రవీర్ సింగ్, విశాల్ గుర్నాని, జూహి పరేఖ్ మెహతా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. ఈ సినిమాని తెలుగులో గీతా ఫిలిం డిస్ట్రిబ్యూషన్ సంస్థ రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సమర్జీత్ లంకేష్ మాట్లాడుతూ–‘‘వృషభ’ బిగ్గెస్ట్ యాక్షన్ ఫిల్మ్. తండ్రీ కొడుకుల ఎమోషన్ బాగుంటుంది’’ అని చెప్పారు. ‘‘వృషభ’ ఓ పవర్‌ఫుల్ మూవీ’’ అని పేర్కొన్నారు నయన్ సారిక. ‘‘ఈ నెల 25న ఏడు సినిమాలు వస్తున్నాయి. ‘వృషభ’ డబ్బింగ్ సినిమా కాదు. పాన్ ఇండియా చిత్రం. తెలుగులోనూ చిత్రీకరించారు. మోహన్‌లాల్ గారి చిత్రం రిలీజ్ చేసే అవకాశం రావడాన్ని అదృష్టంగా భావిస్తున్నాం’’ అన్నారు బన్నీ వాసు. నటులు అలీ, ‘బలగం’ సంజయ్ మాట్లాడారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
23-12-2025

స్టాక్‌ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
638	206
85,567	26,172

విదేశీ సూచీలు

నాస్‌డాక్	23,438	▲	130
డోజోన్స్	48,398	▲	263
ఎఫ్‌టీఎస్ఈ 100	9,867	▼	30
డాక్స్	24,383	▲	95
షాంఘై	3,917	▲	27
నికాయ్	50,402	▲	895

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్‌ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	89.30	90.32
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	118.80	121.84
€	యూరో	ఎస్‌బీఐ	103.80	106.65
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	56.41	57.78
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	58.35	60.65
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.77	70.46
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.91	24.42
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.41	24.67
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.80	13.62

వరుణ్‌ బెవరేజెస్‌ గూటికి ట్వీజా

డీల్‌ విలువ రూ. 1,119 కోట్లు

న్యూఢిల్లీ: గ్లోబల్‌ పానీయాల దిగ్గజం పెప్సీకోకు అతిపెద్ద ఫ్రాంచైజీగా వ్యవహరిస్తున్న వరుణ్‌ బెవరేజెస్‌ తాజాగా దక్షిణాఫ్రికా కంపెనీ ట్వీజాను కొనుగోలు చేసింది. స్థానిక సొంత అనుబంధ సంస్థ బెవరేజెస్‌ కంపెనీ ప్రొప్రయిటరీ లిమిటెడ్‌(బెవ్‌కో) ద్వారా పూర్తి వాటాను చేజిక్కించుకున్నట్లు వరుణ్‌ వెల్లడించింది. ట్వీజా.. నాన్‌ఆల్కహాలిక్‌ పానీయాలను సొంత బ్రాండుతో తయారు చేసి విక్రయిస్తోంది. కేప్‌ టౌన్, క్వీన్స్‌టౌన్, మిడిల్‌బర్గ్‌లలో తయారీ కేంద్రాలను కలిగి ఉంది. వార్షికంగా వీటి ఉమ్మడి ఉత్పత్తి సామర్థ్యం 10 కోట్ల కేసులు కాగా.. స్థానిక కరెన్సీ 209.5 కోట్ల ర్యాండ్స్‌(దాదాపు రూ. 1,119 కోట్లు) ఎంటర్‌ప్రైజ్‌ విలువలో సొంతం చేసుకున్నట్లు వరుణ్‌ బెవరేజెస్‌ వెల్లడించింది. నగదు రూపేణా చెల్లించనున్నట్లు తెలియజేసింది. ట్వీజాలో 100 శాతం వాటా కొనుగోలుకి బోర్డు తాజాగా ఆమోదముద్ర వేసినట్లు వెల్లడించింది. డీల్‌కు నియంత్రణ సంస్థల అనుమతులు పొందవలసి ఉన్నట్లు పేర్కొంది. 2026 జూన్‌ 30లోగా లావాదేవీని పూర్తి చేసే వీలున్నట్లు తెలియజేసింది. గతేడాది(2024–25) ట్వీజా 168.9 కోట్ల ర్యాండ్స్‌(రూ. 901 కోట్లు) ఆదాయం సాధించింది. తాజా కొనుగోలుతో దక్షిణాఫ్రికా మార్కెట్లో మరింత లోతుగా విస్తరించనున్నట్లు వరుణ్‌ తెలియజేసింది. **తాజా వార్తల నేపథ్యంలో వరుణ్‌ బెవరేజెస్‌ షేరు బీఎస్‌ఈలో 3.4 శాతం జంప్‌చేసి రూ. 486 వద్ద ముగిసింది.**

పసిడి @ 1.38 లక్షలు

కిలో వెండి రూ. 2,14,500



న్యూఢిల్లీ: అంతర్జాతీయ మార్కెట్లకు అనుగుణంగా దేశీయంగా పుత్తడి, వెండి రేట్లు కొత్త రికార్డు స్థాయిలకు దూసుకెళ్తున్నాయి. ఆలిండియా సరాఫా అసోసియేషన్‌ ప్రకారం సోమవారం న్యూఢిల్లీ బులియన్‌ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత గల 10 గ్రాముల పసిడి రేటు రూ. 1,685 మేర పెరిగింది. రూ. 1,38,200కి ఎగిసింది. అటు వెండి ధర కూడా కిలోకి రూ. 10,400 మేర పెరిగి మరో కొత్త ఆల్‌టైమ్‌ గరిష్ట స్థాయి రూ. 2,14,500కి చేరింది. అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గుతుండటం, అక్కడి ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితి పెరుగుతుండటంతో ఇన్వెస్టర్లు మరింతగా పసిడి, వెండివైపు మళ్లుతున్నారని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్‌ సీనియర్‌ అనలిస్ట్‌ (కమోడిటీస్‌) సౌమిల్‌ గాంధీ తెలిపారు. భౌగోళిక–రాజకీయ ఉద్రిక్తతలు కూడా ఇందుకు కారణమని పేర్కొన్నారు. ఇటు పరిశ్రమల నుంచి అటు ఇన్వెస్ట్‌మెంట్‌ కోణం నుంచి డిమాండ్‌ నెలకొనడంతో వెండి రేట్లు పరుగులు తీస్తున్నట్లు కోటక్‌ మ్యూచువల్‌ ఫండ్‌కి చెందిన ఫండ్‌ మేనేజర్‌ సతీష్‌ దొండపాటి చెప్పారు. అంతర్జాతీయంగా స్పాట్‌ మార్కెట్లో పుత్తడి ధర ఔన్సుకి (31.1 గ్రాములు) ఒక దశలో 80.85 డాలర్లు పెరిగి 4,420.35 డాలర్లకు ఎగిసింది. వెండి సైతం 2.31 డాలర్లు పెరిగి ఔన్సుకి 69.45 డాలర్లు తాకింది.

మదర్‌సన్‌ చేతికి నెక్సాన్స్‌ ఆటోఎలక్ట్రిక్‌

రూ. 2,175 కోట్ల విలువలో 100 శాతం వాటా

న్యూఢిల్లీ: ఆటో విడిభాగాల దేశీ దిగ్గజం సంవర్ధన మదర్‌సన్‌ ఇంటర్నేషనల్‌.. జర్మన్‌ కంపెనీ నెక్సాన్స్‌ ఆటోఎలక్ట్రిక్‌ జీఎంబీహెచ్‌(ఆటోఎలక్ట్రిక్‌) నుంచి గ్లోబల్‌ వైరింగ్‌ ప్రొడక్టుల బిజినెస్‌ను కొనుగోలు చేయనుంది. ఇందుకు ప్రధాన అనుబంధ సంస్థ మదర్‌సన్‌ గ్లోబల్‌ ఇన్వెస్ట్‌మెంట్స్‌ బీవీ ద్వారా నెక్సాన్స్‌తో ప్రత్యేక చర్చలకు తెర తీసినట్లు పేర్కొంది. తద్వారా ఆటోఎలక్ట్రిక్‌కు చెందిన గ్లోబల్‌ వైరింగ్‌ సంబంధ విభాగంలో 100 శాతం వాటా కొనుగోలు చేయనున్నట్లు తెలియజేసింది. పూర్తి వాటాను 20.7 కోట్ల యూరోల(రూ. 2,175 కోట్లు) ఎంటర్‌ప్రైజ్‌ విలువలో సొంతం చేసుకోనున్నట్లు వెల్లడించింది. అయితే ఇందుకు ఉద్యోగులు, నియంత్రిత అనుమతులు లభించాక నగదు, రుణరహిత పద్ధతిలో వాటా కొనుగోలు చేయనున్నట్లు వివరించింది. తాజా కొనుగోలు కంపెనీకి కీలకమైలురాయిగా నిలవనున్నట్లు మదర్‌సన్‌ గ్రూప్‌ చైర్మన్‌ వివేక్‌ చాంద్‌ సెహగల్‌ పేర్కొన్నారు. విభిన్న వైరింగ్‌ ప్రొడక్టుల ద్వారా తమ కీలక కస్టమర్లకు మరిన్ని సర్వీసులు అందించడంతోపాటు.. ప్రపంచస్థాయిలో అదనపు ప్రాంతాలలోనూ కార్యకలాపాలు విస్తరించనున్నట్లు తెలియజేశారు. ఆటోఎలక్ట్రిక్‌ ఆరు దశాబ్దాలుగా ప్రయాణికుల(పీవీ), వాణిజ్య వాహన(సీవీ) విభాగంలో వినియోగించే ఆటోమోటివ్‌ వైరింగ్‌ సంబంధ ప్రొడక్టుల తయారీలో ఉన్నట్లు పేర్కొంది. వెరసి పీవీ, సీవీల విభిన్న పవర్‌ట్రెయిన్స్‌లో కొత్త ఆవిష్కరణలకు తెరతీయనున్నట్లు వివరించారు. **సంవర్ధన షేరు బీఎస్‌ఈలో యథాతథంగా రూ. 121 వద్ద ముగిసింది.**

మౌలిక పరిశ్రమల వృద్ధి 1.8 శాతం

న్యూఢిల్లీ: దేశీయంగా ఎనిమిది కీలక మౌలిక పరిశ్రమల గ్రూప్‌ నవంబర్‌లో వార్షిక ప్రాతిపదికన 1.8 శాతం మేర వృద్ధి చెందింది. గతేడాది నవంబర్‌లో ఇది 5.8 శాతంగా నమోదైంది. తాజాగా ముడిచమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, విద్యుత్‌ ఉత్పత్తి క్షీణించినట్లు సోమవారం కేంద్రం విడుదల చేసిన గణాంకాల్లో వెల్లడైంది. అయితే, నెలవారీగా చూస్తే ఈ రంగాల పనితీరు మెరుగ్గా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌–నవంబర్‌ మధ్య కాలంలో ఈ గ్రూప్‌ వృద్ధి 4.4 శాతం నుంచి 2.4 శాతానికి నెమ్మదించింది.

త్వరలో ద్రవ్యోల్బణం, జీడీపీ డేటా కొత్త సిరీస్‌

న్యూఢిల్లీ: మార్చిన బేస్‌ ఇయర్‌తో వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి రిటైల్‌ ద్రవ్యోల్బణం, స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) డేటా సిరీస్‌ని విడుదల చేయనున్నట్లు కేంద్ర గణాంకాలు, పథకాల అమలు శాఖ వెల్లడించింది. అలాగే పారిశ్రామికోత్పత్తి కొత్త సిరీస్‌ను మే నెల నుంచి ప్రకటించనున్నట్లు ఒక ప్రకటనలో వివరించింది. దీని ప్రకారం 2024 బేస్‌ ఇయర్‌గా (100కు సమానం) రిటైల్‌ ద్రవ్యోల్బణం కొత్త సిరీస్‌ 2026 ఫిబ్రవరి 12న విడుదల అవుతుంది. అలాగే, 2022–23 ఆర్థిక సంవత్సరం బేస్‌ ఇయర్‌గా నేషనల్‌ అకౌంట్స్‌ డేటాను వచ్చే ఏడాది ఫిబ్రవరి 27న, ఐఐపీ డేటా మే 28న విడుదల చేస్తారు.

సెన్సెక్స్‌ 638 పాయింట్లు ర్యాలీ

- 26,150 స్థాయిపైకి నిఫ్టీ
- కలిసొచ్చిన ప్రపంచ సానుకూలతలు

ముంబై: ఐటీ, మెటల్, ఆటో రంగాల షేర్లు రాణించడంతో దేశీయ స్టాక్‌ మార్కెట్‌ సోమవారం దాదాపు 1% మేర లాభపడింది. ఫెడరల్‌ రిజర్వ్‌ వడ్డీ రేట్ల తగ్గింపు అంచనాలు, ఫారెక్స్‌ మార్కెట్లో రూపాయి స్థిరమైన ప్రదర్శన, విదేశీ ఇన్వెస్టర్లు(ఎఫ్‌ఐఐలు) తిరిగి కొనుగోళ్లు చేపట్టడం అంశాలు సెంటిమెంట్‌ను బలపరిచాయి. భారత్‌–న్యూజిలాండ్‌ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరడం మార్కెట్‌ వర్గాలకు మరింత ఉత్సాహాన్నిచ్చింది. ఫలితంగా సెన్సెక్స్‌ 638 పాయింట్లు పెరిగి 85,567 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 206 పాయింట్లు బలపడి 26,172 వద్ద నిలిచింది. సూచీలకిది రెండోరోజూ లాభాల ముగింపు. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయమే లాభాల్లో మొదలయ్యాయి. ఇంట్రాడేలో కీలక రంగాల కొనుగోళ్ల మద్దతు లభించింది. డెరివేటివ్స్‌ విభాగాల్లో షార్ట్‌ కవరింగ్‌ జరిగింది. ఫలితంగా ఒక దశలో 672 పాయింట్లు బలపడి 85,601 వద్ద, నిఫ్టీ 214 పాయింట్లు ఎగసి 25,966 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. క్రూడాయిల్‌ ధరల రికవరీతో డాలర్‌ మారకంలో రూపాయి విలువ 3 పైసలు బలహీనపడి 89.70 వద్ద స్థిరపడింది. అమెరికాలో ద్రవ్యోల్బణం దిగిరావడం కారణంగా వచ్చే ఏడాదిలో ఫెడరల్‌ రిజర్వ్‌ వడ్డీరేట్ల తగ్గింపు నిర్ణయంపై ఆశలు మెరుగయ్యాయి. ఆసియాలో జపాన్, కొరియా ఇండెక్సులు 2%, చైనా, హాంగ్‌కాంగ్‌ సూచీలు 1% లాభపడ్డాయి. యూరప్‌ మార్కెట్లు అరశాతం పెరిగాయి. అమెరికా స్టాక్‌ సూచీలు స్వల్ప లాభాల్లో ట్రేడవుతున్నాయి.

➡ అన్ని రంగాల షేర్లకూ డిమాండ్‌ నెలకొంది. బీఎస్‌ఈలో రంగాల వారీగా ఇండెక్సుల్లో ఐటీ 2%, క్యాపిటల్‌ గూడ్స్‌ 1.65%, ఇండస్ట్రియల్స్‌ 1.33%, మెటల్‌ 1.32%, కమోడిటీస్‌ 1.05% రాణించాయి. బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్‌ 1.12%, మిడ్‌క్యాప్‌ 0.86% పెరిగాయి.

➡ రక్షణ రంగ షేర్లలో వాల్యు బయింగ్‌ చోటు చేసుకుంది. కొచ్చిన్‌ షిప్‌యార్డ్, ఎంటార్‌ టెక్, గార్డెన్‌ రీచ్‌ షిప్‌యార్డ్స్‌ 6% ర్యాలీ చేశాయి. మజగావ్‌ డాక్, బీఈఎంఎల్, సోలార్‌ ఇండస్ట్రీస్‌ 4.5% లాభపడ్డాయి. హిందుస్తాన్‌ ఏరోనాటిక్స్‌ 2%, భారత్‌ ఎలక్ట్రానిక్స్‌ 1.55% పెరిగాయి. ➡ జపనీస్‌ దిగ్గజం మిత్సుబిషీ యూఎఫ్‌జే ఫైనాన్షియల్‌ గ్రూప్‌(ఎంయూఎఫ్‌జీ) 20% వాటా కొనుగోలు ఒప్పందం తర్వాత శ్రీరామ్‌ ఫైనాన్స్‌ షేరు రెండు ట్రేడింగ్‌ సెషన్లలో 9% ర్యాలీ చేసింది. బీఎస్‌ఈలో సోమవారం 4% పెరిగి రూ.935 వద్ద స్థిరపడింది. ➡ ట్రేడింగ్‌లో అశోక్‌ లేలాండ్‌(2%), ఇండియా సిమెంట్స్‌(4%), లారస్‌ ల్యాబ్స్‌(2%), ఎంసీఎక్స్‌(5%), ఫెడరల్‌ బ్యాంక్‌(0.50%), ఎంఅండ్‌ఎం ఫైనాన్షియల్‌ సర్వీసెస్‌(5%), శ్రీరామ్‌ ఫైనాన్స్‌(4%), నాల్కో(4%), వేదాంత(1%) షేర్లు ఏడాది గరిష్టాన్ని అందుకున్నాయి.

బొండాడ ఇంజనీరింగ్‌కు రూ. 945 కోట్ల ఆర్డరు

హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: ఎన్‌ఎల్‌సీ ఇండియా తరఫున ఎన్‌ఎల్‌సీ ఇండియా రెన్యువబుల్స్‌ (ఎన్‌ఐఆర్‌ఎల్‌) నుంచి సుమారు రూ. 945.10 కోట్ల విలువ చేసే ఆర్డర్‌ లభించినట్లు బొండాడ ఇంజనీరింగ్‌ వెల్లడించింది. దీని ప్రకారం రాజస్తాన్‌లోని ఆర్‌వీయూఎన్‌ఎల్‌ సోలార్‌ పార్క్‌లో 810 మెగావాట్ల సౌర విద్యుత్‌ ప్రాజెక్టులకు సంబంధించి బ్యాలెన్స్‌ ఆఫ్‌ సిస్టం (బీవోఎస్‌) పనులు చేయాల్సి ఉంటుందని ఉంటుందని గ్రూప్‌ సీఎండీ బొండాడ రాఘవేంద్ర రావు పేర్కొన్నారు. ఇందులో భాగంగా డిజైన్‌ ఇంజనీరింగ్, ఇన్‌స్టాలేషన్, టెస్టింగ్‌ తదితర పనులతో పాటు మూడేళ్ల పాటు నిర్వహణ సేవలు కూడా అందించాల్సి ఉంటుంది. లెటర్‌ ఆఫ్‌ అవార్డ్‌ (ఎల్‌వోఏ) స్వీకరించిన నాటి నుంచి 15 నెలల్లోగా పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

ఆర్‌బీఐలో 93 పోస్టులు

రిజర్వ్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా(ఆర్‌బీఐ) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో గ్రేడ్‌–సీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 93.
» **పోస్టుల వివరాలు:** డేటా సైంటిస్ట్‌–02, డేటా ఇంజనీర్‌–02, ఐటీ సెక్యూరిటీ ఎక్స్‌పర్ట్‌–07, ఐటీ సిస్టమ్‌ అడ్మినిస్ట్రేటర్‌–05, ఐటీ ప్రాజెక్ట్‌ అడ్మినిస్ట్రేటర్‌–03, ఏఐ/ఎంఎల్‌ స్పెషలిస్ట్‌–03, ఐటీ–సైబర్‌ సెక్యూరిటీ అనలిస్ట్‌–05, నెట్‌వర్క్‌ అడ్మినిస్ట్రేటర్‌–03, ప్రాజెక్ట్‌ మేనేజర్‌–05, మార్కెట్‌–లిక్విడిటీ రిస్క్‌ స్పెషలిస్ట్‌–01, ఐటీ–సైబర్‌ సెక్యూరిటీ అనలిస్ట్‌–13, ఆపరేషనల్‌ రిస్క్‌ అనలిస్ట్‌–02, అనలిస్ట్‌(క్రెడిట్‌ రిస్క్‌)–02, అనలిస్ట్‌(మార్కెట్‌ రిస్క్‌)–02, రిస్క్‌ అనలిస్ట్‌–05, అకౌంట్స్‌ స్పెషలిస్ట్‌–05, రిస్క్‌ అసెస్‌మెంట్‌–డేటా అనలిస్ట్‌–02, పాలసీ రీసెర్చ్‌ అనలిస్ట్‌–02, బిజినెస్‌–ఫైనాన్షియల్‌ రిస్క్‌ అనలిస్ట్‌–06, డేటా ఇంజనీర్‌ 1–01, డేటా ఇంజనీర్‌2–01, డేటా అనలిస్ట్‌ (మైక్రో డేటా అనలిటిక్స్‌)–01, బ్యాంకింగ్‌ డొమైన్‌ స్పెషలిస్ట్‌–01, డేటా సైంటిస్ట్‌(డేటా మోడలింగ్‌)–02, బ్యాంక్‌ ఎగ్జామినర్‌(లిక్విడిటీ రిస్క్‌)–01, సీనియర్‌ బ్యాంక్‌ ఎగ్జామినర్‌(లిక్విడిటీ రిస్క్‌)–01, డేటా సైంటిస్ట్‌ (అడ్వాన్స్‌డ్‌ అనలిటిక్స్‌)–04, క్రెడిట్‌ రిస్క్‌ స్పెషలిస్ట్‌–04, ప్రోగ్రామ్‌ కోఆర్డినేటర్‌–02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీబీఏ, బీఎస్సీ, బీటెక్‌/బీఈ, ఎల్‌ఎల్‌బీ, సీఏ, ఎల్‌ఎల్‌ఎం, ఎంఎస్సీ, ఎంఈ/ఎంటెక్, ఎంబీఏ/పీజీడీఎం, ఎంసీఏ, పీజీడీబీఏలో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 21 ఏళ్ల నుంచి 62 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.3,10,000 నుంచి రూ.6,00,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తు ప్రారంభతేది:** 17.12.2025
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:**06.02.2026
» **వెబ్‌సైట్:** https://opportunities.rbi.org.in

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో 36 ఉద్యోగాలు

రామగుండం ఫెర్టిలైజర్స్‌ అండ్‌ కెమికల్స్‌ లిమిటెడ్‌(ఆర్‌ఎఫ్‌సీఎల్‌) తెలంగాణ రాష్ట్రం రామగుండం, నోయిడా కార్పొరేట్‌ కార్యాలయాల్లో మేనేజర్‌ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 36.
» **విభాగాల వారీగా ఖాళీలు:** ఆపరేషన్‌ అండ్‌ మెయింటెనెన్స్‌–01, కెమికల్‌–10, మెకానికల్‌–03, ఇన్‌స్ట్రుమెంటేషన్‌–04, సివిల్‌–01, కెమికల్‌ ల్యాబ్‌–02, మెటీరియల్స్‌–05, ట్రాన్స్‌పోర్టేషన్‌–01, హ్యూమన్‌ రిసోర్సెస్‌–05, ఫార్మసీ–01, ఫైనాన్స్‌ అండ్‌ అకౌంట్స్‌–02, ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీ–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో బీఈ/బీటెక్‌/బీఎస్సీ, ఎంబీఏ, సీఏ/సీఎంఏ, ఎంఎస్సీ, పీజీ డిప్లొమా, బీఫార్మసీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు సంబంధిత ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** అసిస్టెంట్‌/డిప్యూటీ మేనేజర్‌కు 40 ఏళ్లు, మేనేజర్‌/సీనియర్‌ మేనేజర్‌కు 45 ఏళ్లు, చీఫ్‌ మేనేజర్‌/డీజీఎంకు 50 ఏళ్లు, జనరల్‌ మేనేజర్‌కు 55 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** అసిస్టెంట్‌ మేనేజర్‌కు రూ.50,000 నుంచి రూ.1,60,000, డిప్యూటీ మేనేజర్‌కు రూ.60,000 నుంచి రూ.1,80,000, మేనేజర్‌కు రూ.70,000 నుంచి రూ.2,00,000, సీనియర్‌ మేనేజర్‌కు రూ.80,000 నుంచి రూ.2,20,000, చీఫ్‌ మేనేజర్‌కు రూ.90,000 నుంచి రూ.2,40,000, డిప్యూటీ జనరల్‌ మేనేజర్‌కు రూ.1,00,000 నుంచి రూ.2,60,000, జనరల్‌ మేనేజర్‌కు రూ.1,20,000 నుంచి రూ.2,80,000.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, సీబీటీ, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌/ఆఫ్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తు ప్రారంభతేది:**17.12.2025.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:**15.01.2026
» **ఆఫ్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:**22.01.2026
» **వెబ్‌సైట్:** https://www.rfcl.co.in

డిగ్రీతో.. ‘డిఫెన్స్‌’ కొలువులు

» సీడీఎస్‌ఈ(1)–2026 నోటిఫికేషన్‌ విడుదల
» త్రివిధ దళాల్లో పలు విభాగాల్లో 451 పోస్టులకు సీడీఎస్‌ పరీక్ష
» డిగ్రీ, బీటెక్‌ అర్హతలతో పోటీ పడే అవకాశం
» శిక్షణ సమయంలోనే నెలకు రూ.56,100 స్టయిఫండ్‌

డిగ్రీతోనే త్రివిధ దళాల్లో ఆఫీసర్‌ కొలువు సొంతం చేసుకోవచ్చు. కెరీర్‌లో సవాళ్లతోపాటు దేశ సేవలో సంతృప్తిని పొందొచ్చు. అందుకు మార్గం.. యూపీఎస్సీ ప్రతి ఏటా రెండుసార్లు నిర్వహించే సీడీఎస్‌ పరీక్ష. కమిషన్‌ తాజాగా సీడీఎస్‌ఈ(1)–2026 నోటిఫికేషన్‌ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్‌ ద్వారా త్రివిధ దళాల్లోని నాలుగు విభాగాల్లో మొత్తం 451 పోస్ట్‌లను భర్తీ చేయనుంది. ఈ నేపథ్యంలో... సీడీఎస్‌ఈ(1)–2026 నోటిఫికేషన్‌ వివరాలు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్‌ అంశాలు, ప్రిపరేషన్‌ తదితర వివరాలు..

మొత్తం 451 పోస్టులు

యూపీఎస్సీ.. కంబైన్డ్‌ డిఫెన్స్‌ సర్వీసెస్‌ ఎగ్జామినేషన్‌ ద్వారా త్రివిధ దళాలకు చెందిన నాలుగు అకాడమీల్లోని అయిదు విభాగాల్లో 451 పోస్ట్‌లను భర్తీ చేయనున్నారు. ఇందులో ఇండియన్‌ మిలటరీ అకాడమీ(డెహ్రాడూన్‌)–100 పోస్టులు, ఇండియన్‌ నేవల్‌ అకాడమీ(ఎజిమలా)–26 పోస్టులు, ఎయిర్‌ ఫోర్స్‌ అకాడమీ(హైదరాబాద్‌)–32 పోస్టులు, ఆఫీసర్స్‌ ట్రైనింగ్‌ అకాడమీ (చెన్నై)(పురుషులు)–275 పోస్టులు, ఆఫీసర్స్‌ ట్రైనింగ్‌ అకాడమీ (చెన్నై)(మహిళలు)–18 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు వేర్వేరుగా

- **ఇండియన్‌ మిలటరీ అకాడమీ: అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్‌ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. వయసు: జనవరి 2, 2003–జనవరి 1, 2008 మధ్య జన్మించి ఉండాలి.
- **నేవల్‌ అకాడమీ: అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీటెక్‌/బీఈ ఉత్తీర్ణత ఉండాలి. వయసు: జనవరి 2, 2003–జనవరి 1, 2008 మధ్య జన్మించి ఉండాలి.
- **ఎయిర్‌ఫోర్స్‌ అకాడమీ: అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్‌ డిగ్రీ లేదా బీఈ/బీటెక్‌ ఉత్తీర్ణత ఉండాలి. అభ్యర్థులు ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ గ్రూప్‌ చదివుండాలి. వయసు: జనవరి 2, 2003– జనవరి 1, 2007 మధ్య జన్మించి ఉండాలి. డీజీసీఏ జారీచేసిన కమర్షియల్‌ పైలట్‌ లైసెన్స్‌ ఉన్నవారికి రెండేళ్ల సడలింపు లభిస్తుంది. వీరు జనవరి 2, 2001–జనవరి 1, 2007 మధ్యలో జన్మించి ఉండాలి.
- **ఆఫీసర్స్‌ ట్రైనింగ్‌ అకాడమీ: అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్‌ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. **వయసు:** జనవరి 2, 2002 – జనవరి 1, 2008 మధ్య జన్మించి ఉండాలి
- చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తుకు అర్హులే. అయితే ఇప్పటి వరకు పూర్తయిన పరీక్షల్లో ఎలాంటి బ్యాక్‌లాగ్‌ సబ్జెక్టులు ఉండరాదు.

రెండు దశల్లో ఎంపిక

కంబైన్డ్‌ డిఫెన్స్‌ సర్వీసెస్‌ ద్వారా త్రివిధ దళాల్లో ఆఫీసర్‌ కేడర్‌ పోస్ట్‌ల భర్తీకి రెండు దశలుగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. వీటిలో మొదటిది యూపీఎస్సీ జరిపే సీడీఎస్‌ రాత పరీక్ష. ఇందులో నిర్దిష్ట కటాఫ్‌ మార్కులు సాధించి.. మెరిట్‌ జాబితాలో నిలిస్తే.. మలి దశలో ఆయా సర్వీస్‌ సెలక్షన్‌ బోర్డులు నిర్వహించే ఎస్‌ఎస్‌బీ ఇంటర్వ్యూకు పిలుస్తారు. ఈ ప్రక్రియలోనూ ప్రతిభ చూపితే ఆయా విభాగంలో శిక్షణకు ఎంపిక చేస్తారు.

రాత పరీక్ష విధానం

- సీడీఎస్‌ఈ రాత పరీక్ష రెండు విధాలుగా ఉంటుంది. ఇండియన్‌ మిలటరీ అకాడమీ, ఇండియన్‌ నేవల్‌ అకాడమీ, ఎయిర్‌ఫోర్స్‌ అకాడమీ అభ్యర్థులకు 300 మార్కులకు; ఆఫీసర్స్‌ ట్రైనింగ్‌ అకాడమీ అభ్యర్థులకు 200 మార్కులకు పరీక్ష జరుగుతుంది.
- ఇండియన్‌ మిలటరీ, నేవల్, ఎయిర్‌ఫోర్స్‌ అకాడమీ కోర్సులకు నిర్వహించే పరీక్షలో.. ఇంగ్లిష్‌ వంద మార్కులకు, జనరల్‌ నాలెడ్జ్‌ వంద మార్కులకు, ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్‌ వంద మార్కులకు ఉంటాయి. ప్రతి విభాగానికి పరీక్ష సమయం 2 గంటలు చొప్పున ఉంటుంది.
- ఆఫీసర్స్‌ ట్రైనింగ్‌ అకాడమీకి సంబంధించి నిర్వహించే పరీక్షలో.. ఇంగ్లిష్‌ వంద మార్కులకు, జనరల్‌ నాలెడ్జ్‌ వంద మార్కులకు ఉంటాయి. ప్రతి విభాగానికి పరీక్ష సమయం 2గంటలు చొప్పున ఉంటుంది.
- పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్‌ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలతో నిర్వహిస్తారు. రాత పరీక్షలో నెగెటివ్‌ మార్కింగ్‌ నిబంధన అమల్లో ఉంది. ప్రతి తప్పు సమాధానానికి మూడో వంతు మార్కులు తగ్గిస్తారు.
- రాత పరీక్షలో నిర్దేశిత కటాఫ్‌ మార్కులు పొందిన అభ్యర్థులకు సర్వీస్‌ సెలక్షన్‌ బోర్డ్‌(ఎస్‌ఎస్‌బీ) ఆధ్వర్యంలో ఇంటెలిజెన్స్‌ అండ్‌ పర్సనాలిటీ టెస్ట్‌ నిర్వహిస్తారు.

ఇది అన్ని అకాడమీల అభ్యర్థులకు ఉమ్మడిగా అయిదు రోజులపాటు జరుగుతుంది. ఎయిర్‌ఫోర్స్‌ అకాడమీకి టెస్టులను 6 రోజులపాటు నిర్వహిస్తారు.

మలి దశలో ఎస్‌ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ

- రాత పరీక్షలో విజయం సాధించిన వారికి మలి దశలో ఆయా సర్వీస్‌ సెలక్షన్‌ బోర్డ్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. దీనికి కేటాయించిన మార్కులు 300. ఈ ఎంపిక ప్రక్రియలో భాగంగా పలు రకాల పరీక్షలు, చివరగా పర్సనల్‌ ఇంటర్వ్యూ ఉంటుంది. వీటి ద్వారా ఆఫీసర్‌ స్థాయి ఉద్యోగాలకు సరిపోయే నైపుణ్యాలున్న అభ్యర్థులను ఖరారు చేస్తారు.
- స్టేజ్‌–1లో స్క్రీనింగ్‌ టెస్ట్‌ ఉంటుంది. ఇందులో ఉత్తీర్ణత సాధిస్తే స్టేజ్‌–2కు అనుమతిస్తారు. స్టేజ్‌–1లో ఆఫీసర్‌ ఇంటెలిజెన్స్‌ రేటింగ్‌(ఓఆర్‌) టెస్ట్‌లు, స్టేజ్‌–2లో సైకాలజీ టెస్ట్‌లు, గ్రూప్‌ టెస్టింగ్‌ ఆఫీసర్‌ టాస్కులు, ఇంటర్వ్యూలు, కాన్ఫరెన్స్‌లు ఉంటాయి. వీటిని నాలుగు రోజుల పాటు నిర్వహిస్తారు. తర్వాత వర్డ్‌ అసోసియేషన్‌ టెస్ట్‌(డబ్ల్యూఏటీ), సిట్యుయేషన్‌ రియాక్షన్‌ టెస్ట్‌ (ఎస్‌ఆర్‌టీ)ల ద్వారా విద్యార్థుల సమయస్ఫూర్తిని పరీక్షిస్తారు. చివరగా సెల్ఫ్‌ డిస్క్రిప్షన్‌ టెస్ట్‌(ఎస్‌డీ)లో అభ్యర్థి తన కుటుంబం, స్నేహితులు, కాలేజీ, ఉపాధ్యాయుల గురించి రాయాలి. ఈ టెస్టుల తర్వాత రెండు రోజుల పాటు 9 రకాల గ్రూప్‌ టాస్కులు నిర్వహిస్తారు.

చివరగా ఇంటర్వ్యూ

సర్వీస్‌ సెలక్షన్‌ బోర్డ్‌ ఎంపిక ప్రక్రియలో ఫిజికల్‌ టెస్ట్‌లు పూర్తయ్యాక చివరగా.. బోర్డ్‌ ప్రెసిడెంట్‌ లేదా సీనియర్‌ సభ్యుడి ఆధ్వర్యంలో పర్సనల్‌ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఆ తర్వాత కూడా చివరగా కాన్ఫరెన్స్‌ ఉంటుంది. ప్యానెల్‌ ముందు అభ్యర్థులు వేర్వేరుగా హాజరవ్వాలి. ఫ్లయింగ్‌ బ్రాంచ్‌ వారికి పీఏబీటీ ఉంటుంది. వీటిలో చూపిన ప్రతిభ ఆధారంగా మెరిస్ట్‌ లిస్ట్‌ రూపొందిస్తారు. ఈ జాబితాలో చోటు దక్కించుకున్న విద్యార్థులకు మరోసారి శారీరక, వైద్య పరీక్షలు నిర్వహించి.. రాత పరీక్ష, ఎస్‌ఎస్‌బీ టెస్టుల్లో ప్రతిభ ఆధారంగా ఫైనల్‌ మెరిట్‌ లిస్ట్‌ విడుదల చేస్తారు.

శిక్షణ.. స్టయిఫండ్‌

అన్ని దశల ఎంపిక ప్రక్రియలో విజయం సాధించి ఆయా విభాగాల్లో శిక్షణకు ఎంపికైన వారిని జెంటిల్‌మెన్‌ క్యాడెట్, లేడీ క్యాడెట్స్‌గా పిలుస్తారు. ఇలా శిక్షణ సమయంలో వీరికి నెలకు రూ.56,100 స్టైపెండ్‌ అందిస్తారు. నిర్దేశిత వ్యవధిలో ఉండే శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత లెఫ్టినెంట్‌ హోదాలో పర్మనెంట్‌ కొలువు సొంతమవుతుంది. ఇండియన్‌ మిలటరీ అకాడమీ(డెహ్రాడూన్‌)లో 18 నెలలు, నేవల్‌ అకాడమీలో సుమారు 17 నెలలు, ఎయిర్‌ఫోర్స్‌ అకాడమీలో 18 నెలలు, ఆఫీసర్స్‌ ట్రైనింగ్‌ అకాడమీలో 11 నెలలు శిక్షణ ఉంటుంది. ఈ శిక్షణ పూర్తయ్యాక త్రివిధ దళాల్లో లెఫ్టినెంట్‌ హోదాలో ప్రవేశించవచ్చు. నేవీలో మాత్రం ప్రారంభంలో సబ్‌–లెఫ్టినెంట్‌ హోదా లభిస్తుంది. ఎయిర్‌ఫోర్స్‌లో శిక్షణ పొందిన వారు ప్రారంభంలో ఫ్లయింగ్‌ ఆఫీసర్‌గా విధులు చేపడతారు. ఇలా ఆయా హోదాల్లో సంబంధిత విభాగాల్లో అడుగుపెట్టిన వారికి ప్రొబేషన్‌ పీరియడ్‌ ఉంటుంది.

సీడీఎస్‌ఈ(1)-2026

ప్రిపరేషన్‌ ఇలా

ఇంగ్లిష్‌

ఈ విభాగంలో ఇంగ్లిష్‌ భాషపై పట్టును, ఇంగ్లిష్‌ కమ్యూనికేషన్‌ స్కిల్స్‌ను పరిశీలిస్తారు. యాంటానిమ్స్, సినానిమ్స్, స్పాటింగ్‌ ద ఎర్రర్స్, ఆర్డరింగ్‌ ఆఫ్‌ సెంటెన్సెస్, సెంటెన్సెస్‌లో పదాల ఆర్డరింగ్, ప్యాసేజ్‌లు, సెంటెన్స్‌ ఇంప్రూవ్‌మెంట్స్, ఇడియమ్స్, ఫ్రేజెస్, క్లోజ్‌ టెస్టు, ఫిల్‌అప్స్, అనాలజీస్‌ సెక్షన్ల నుంచి ప్రశ్నలు అడుగుతారు. సెంటెన్స్‌ ఇంప్రూవ్‌మెంట్, స్పాటింగ్‌ ద ఎర్రర్స్‌ విభాగాల్లో మార్కులు సాధించేందుకు గ్రామర్‌ రూల్స్‌ తెలుసుకోవాలి. అలాగే ఇడియమ్స్‌ అండ్‌ ఫ్రేజెస్‌ కోసం సాధ్యమైనంత ఎక్కువగా ప్రాక్టీస్‌ చేయాలి.

జనరల్‌ నాలెడ్జ్‌

అభ్యర్థుల్లో సామాజిక అంశాల పట్ల ఉన్న అవగాహనని పరీక్షించే విభాగమిది. ఇందులో కరెంట్‌ అఫైర్స్, జాగ్రఫీ, హిస్టరీ, ఇండియన్‌ పాలిటీ, ఎకనామిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ తదితర సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతున్నారు. డిఫెన్స్‌కు సంబంధించిన ప్రధాన కార్యాలయాలు, ప్రాముఖ్యం ఉన్న అంశాలు, అవార్డులు, జాయింట్‌ మిలిటరీ ఎక్సర్‌సైజెస్‌–అందులో పాల్గొన్న దేశాలు, ఆయా ఉమ్మడి సైనిక విన్యాసాల పేర్లు మొదలైన వాటిని తెలుసుకోవడం మేలు. కరెంట్‌ అఫైర్స్‌ నుంచి ఎక్కువగా ప్రశ్నలు అడుగుతున్నారు.

ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్‌

ఆఫీసర్‌ ట్రైనింగ్‌ అకాడమీకి మినహా మిగతా పోస్టులకు మ్యాథమెటిక్స్‌ విభాగం ఉంటుంది. పదో తరగతి స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి. టైమ్‌ అండ్‌ డిస్టెన్స్, స్టాటిస్టిక్స్‌ అండ్‌ ప్రాబబిలిటీ, వాల్యూమ్‌ అండ్‌ సర్ఫేస్‌ ఏరియా, లీనియర్‌ అండ్‌ క్వాడ్రాటిక్‌ ఈక్వేషన్స్, ట్రిగనామెట్రీ, ఫ్యాక్టరైజేషన్‌ తదితర చాప్టర్ల నుంచి ప్రశ్నలు అడుగుతున్నారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా.
- **దరఖాస్తు చివరి తేదీ:** 2025, డిసెంబర్‌ 30
- **రాత పరీక్ష తేదీ:** 2026, ఏప్రిల్‌ 12
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, అనంతపురం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం.
- **వివరాలకు వెబ్‌సైట్:** www.upsc.gov.in

కెరీర్‌ కౌన్సెలింగ్‌
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్‌ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: ఇండియన్‌ పాలిటీ » టెట్‌/డీఎస్సీ ప్రత్యేకం: తెలంగాణ జాగ్రఫీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ » బ్యాంక్‌ ఎగ్జామ్స్‌ ప్రత్యేకం: కంప్యూటర్‌ అవేర్‌నెస్‌

క్లుప్తంగా

స్పెషల్ స్ట్రే వేకెన్సీ కౌన్సెలింగ్‌కు వెబ్‌ఆప్షన్‌ల నమోదు

సాక్షి, అమరావతి: ఎంబీబీఎస్ యాజమాన్య కోటా స్పెషల్ స్ట్రే వేకెన్సీ రౌండ్ కౌన్సెలింగ్‌కు వెబ్ ఆప్షన్‌లు నమోదు చేసుకోవాలని విద్యార్థులను ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆదేశించింది. రాష్ట్రంలోని మూడు ప్రైవేట్ వైద్య కళాశాలల్లో 14 ఎన్‌ఆర్‌ఐ కోటా సీట్లు ఖాళీగా ఉన్నట్టు వెల్లడించింది. ఈ సీట్లలో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థులు మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఈ నెల 26న మధ్యాహ్నం 2 గంటల్లోపు ఆప్షన్‌లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి వెల్లడించారు. నీట్ యూజీ మెరిట్ ఆధారంగానే సీట్ల కేటాయింపు ఉంటుందని స్పష్టం చేశారు.

మరో ఆశ్రమ పాఠశాల విద్యార్థి బలి

తెల్లం గౌతమ్ మృతదేహం

ఎటపాక (అల్లూరి జిల్లా): అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలంలోని కె.ఎన్.పురం గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఎటపాక మండలం కృష్ణవరం పంచాయతీలోని తెల్లంవారిగుంపు గ్రామానికి చెందిన తెల్లం సత్యనారాయణ, సుశీల దంపతుల కుమారుడు గౌతమ్ (16) కె.ఎన్.పురం ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడడంతో కుటుంబ సభ్యులు రెండు సార్లు చికిత్స చేయించారు. విద్యార్థికి బ్లడ్ ఇన్‌ఫెక్షన్, కిడ్నీ సమస్య ఉందని వైద్యులు చెప్పారు. ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మరణించాడు. బాలుడి మృతిపై పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు.

కొత్త వైద్య కళాశాలలకు దరఖాస్తుల ఆహ్వానం

- ఎంబీబీఎస్ సీట్ల పెంపునకూ దరఖాస్తులు ఆహ్వానించిన ఎన్‌ఎంసీ
- 29 నుంచి వచ్చే నెల 28 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం
- 10 లక్షల జనాభాకు 100 సీట్ల నిబంధన నిలుపుదల

సాక్షి, అమరావతి: వచ్చే విద్యా సంవత్సరం (2026–27)లో దేశంలో కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు, ఇప్పటికే ఉన్న కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్ల పెంపు కోసం నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్‌ఎంసీ) దరఖాస్తులు ఆహ్వానించింది. అనుమతుల కోసం ఈ నెల 29 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎన్‌ఎంసీ కార్యదర్శి డాక్టర్ ఎల్.రాఘవ్ సోమవారం అన్ని వైద్య కళాశాలల ప్రిన్సిపాల్స్, డీఎంఈలకు లేఖ రాశారు. వచ్చే నెల 28వ తేదీ సాయంత్రం 6 గంటల్లోపు దరఖాస్తులు సమర్పించాలని లేఖలో స్పష్టం చేశారు. ఎన్‌ఎంసీ అధికారిక వెబ్‌పోర్టల్ ద్వారా వచ్చిన ఆన్‌లైన్ దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. దేశంలో కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు, అదనపు సీట్ల పెంపుపై 2023లో ఎన్‌ఎంసీ అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ)–మినిమమ్ స్టాండర్డ్ రిక్వైర్‌మెంట్(ఎంఎస్‌ఆర్) మార్గదర్శకాలను జారీ చేసింది. దీని ప్రకారం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 10 లక్షల జనాభాకు 100 ఎంబీబీఎస్ సీట్ల నిష్పత్తి ప్రాతిపదికన అనుమతులు లభిస్తాయి. అదేవిధంగా కళాశాలల్లో గరిష్టంగా 150 సీట్లు దాటకూడదని అప్పట్లో షరతు విధించారు. ఈ నిబంధనలను 2026–27 విద్యా సంవత్సరానికి నిలుపుదల చేసినట్టు ఎన్‌ఎంసీ స్పష్టం చేసింది.

వచ్చే ఏడాది లేనట్టే

మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన 17 వైద్య కళాశాలల్లో 10 కళాశాలలను చంద్రబాబు సర్కారు ప్రైవేట్‌కు కట్టబెడుతోంది. గత ప్రభుత్వ ప్రణాళిక ప్రకారం ఇప్పటికే అన్ని కళాశాలల్లో తరగతులు ప్రారంభమై ఉండాలి. అయితే, చంద్రబాబు నిర్ణయాలతో తరగతులు ప్రారంభం కాలేదు. 2026–27 విద్యా సంవత్సరానికి వచ్చే నెల 28తో కళాశాలలు ప్రారంభించేందుకు దరఖాస్తు గడువు ముగియనుంది. ఇదిలా ఉండగా తొలి దశలో పులివెందుల, మదనపల్లె, మార్కాపురం, ఆదోని వైద్య కళాశాలలకు వైద్య శాఖ టెండర్లు పిలిచింది. ఆ ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. దరఖాస్తుల గడువు ముగిసే నాటికి టెండర్ ప్రక్రియ ముగిసే అవకాశం లేదు. ఈ లెక్కన వచ్చే విద్యా సంవత్సరం కూడా వైద్య కళాశాలలు అందుబాటులోకి రావు. ఇప్పటికే చంద్రబాబు చేసిన కుట్రలతో 2024–25లో 700 ఎంబీబీఎస్ సీట్లు, 2025–26లో 1,750 కలిపి మొత్తం 2,450 సీట్లను మన విద్యార్థులు కోల్పోయారు.

విద్యార్థుల్లో ఒత్తిడి నివారణకు యోగా

- పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా అమలు చేయాలి
- మార్గదర్శకాలు విడుదల చేసిన పాఠశాల విద్యాశాఖ

సాక్షి, అమరావతి: విద్యార్థుల్లో ఒత్తిడి నివారించేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఇప్పటికీ సిలబస్ పూర్తి కాకపోవడంతోపాటు బోధన కుంటుపడడంతో పదో తరగతి విద్యార్థులు ఆందోళనలో ఉన్నారు. మరోవైపు 100 రోజుల ప్రణాళిక పేరుతో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. సాధారణంగా పాఠశాలలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహిస్తారు. కానీ పదో తరగతి విద్యార్థులకు ఉదయం 8నుంచి సాయంత్రం 5 గంటల వరకు... అంటే రోజూ రెండు గంటలు అదనంగా క్లాసులు నిర్వహిస్తున్నారు. సెలవు రోజుల్లో సైతం ఈ తరగతులు కొనసాగుతున్నాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. ఈ నేపథ్యంలో ఒత్తిడి నివారణకు ఉన్నతాధికారులు ప్రత్యేకంగా మార్గదర్శకాలు విడుదల చేశారు. రోజూ ఉదయం మొదటి పీరియడ్‌లో తొలి 10 నిమిషాలు యోగా లేదా ధ్యానం, మధ్యాహ్నం మొదటి పీరియడ్‌లో మొదటి 10 నిమిషాలపాటు విశ్రాంతినివ్వాలని... రోజూ చివరి పీరియడ్‌లో విద్యార్థులు ఆటల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. విద్యార్థులు తమ సమస్యలను గోప్యంగా పంచుకోవడానికి వీలుగా 'సహాయ పెట్టె'ను ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు గెస్ట్ లెక్చర్స్ ఇప్పించాలని, ఇందుకోసం జిల్లాస్థాయి అధికారులను ఆహ్వానించి లైఫ్ స్కిల్స్‌పై సదస్సులు నిర్వహించాలని, సురక్షితమైన తాగునీరు, పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనం, స్నాక్స్ అందించాలన్నారు. వీటి అమలుకు ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ విజయ్ రామరాజు ఆదేశించారు.

87వ జాతీయ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోస్టర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): రాష్ట్ర ప్రభుత్వం అమరావతిలో స్పోర్ట్స్ యూనివర్సిటీని నిర్మించనుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య మున్సిపల్ కార్పొరేషన్ ఇండోర్ స్టేడియంలో 78వ అంతర్రాష్ట్ర, 87వ జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ నెల 28 వరకు పోటీలు జరుగుతాయని తెలిపారు. విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, శాప్ చైర్మన్ రవినాయుడు పాల్గొన్నారు. అనంతరం ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో సే నో డ్రగ్స్ పోస్టర్లను ఆవిష్కరించారు.

హైకమాండ్ నిర్ణయమే ఫైనల్

కర్ణాటక సీఎం సిద్ధరామయ్య

మైసూరు: ముఖ్యమంత్రి మార్పు విషయంలో కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయమే ఫైనల్ అని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య అన్నారు. ఆయన సోమవారం మైసూరులోని టీకే లే అవుట్‌లో తన ఇంటి వద్ద మీడియాతో మాట్లాడారు. 'సీఎం మార్పు అంశంలో పార్టీ నాయకత్వం నిర్ణయమే అంతిమం. నేను హైకమాండ్‌తో మాట్లాడాను. నిర్ణయం తీసుకుంటామని చెప్పింది. హైకమాండ్ త్వరలో నిర్ణయాన్ని ప్రకటిస్తుంది. ముఖ్యమంత్రి మార్పు గురించి ఎక్కువగా చర్చిస్తున్నది మీడియానే. నేను అసెంబ్లీలో మాట్లాడిన తర్వాత కూడా మీరు ఈ అంశంపై ఎందుకు ప్రశ్నలు అడుగుతున్నారు?' అని సిద్ధరామయ్య అన్నారు. అదేవిధంగా మాజీ మంత్రి కేఎన్ రాజన్న, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సమావేశం కావడంలో తప్పేమీ లేదన్నారు. డీకే శివకుమార్ కేపీసీసీ అధ్యక్షుడని, ఆయనను మాజీ మంత్రి కలవకూడదని ఏమైనా ఉందా? అని ప్రశ్నించారు. నాయకుల కంటే పార్టీ పెద్దదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పిన మాట నిజమని, మొదటి నుంచి తాను అదే మాట చెబుతున్నానని సిద్ధరామయ్య పేర్కొన్నారు.

విశాఖ జూలో సింహం పిల్ల మృతి

ఆరిలోవ (విశాఖ): నగరంలోని జూలో ఓ సింహానికి పుట్టిన పిల్ల మృతిచెందింది. జూలో జత సింహాలు సందర్శకులను అలరిస్తున్నాయి. వాటిలో ఆడ సింహానికి ఈ ఏడాది అక్టోబరు ఒకటో తేదీన రెండు పిల్లలు (ఒకటి మగ, మరొకటి ఆడ) పుట్టాయి. అవి ఇంతవరకు తల్లి సంరక్షణలో పెరిగాయి. వాటిని జూ యానిమల్ కీపర్లు, వైద్యులు పర్యవేక్షిస్తున్నారు. ఆడ సింహం పిల్ల అనారోగ్యానికి గురై సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. ఈ పిల్ల పుట్టి 83 రోజులైందని విశాఖ జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. ఆడ సింహం పిల్ల ఐదు రోజులుగా నీరసించి ఆహారం తినడం మానేసిందన్నారు. దీనికి జూ పశు వైద్య బృందం చికిత్స అందించినా ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, సుమారు ఏడాది క్రితం ఇదే తల్లి సింహానికి పుట్టిన రెండు పిల్లలు వారం వ్యవధిలో మృత్యువాత పడ్డాయి. ఇప్పుడు పుట్టిన రెండింటిలో ఒకటి మరణించింది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



● బ్రెయిన్‌కు మేలు చేసే ఆహారాలు!

మెదడుకు మేత!

మెదడు ఎంతటి కీలకమైనదంటే...
మన శరీరం బరువులో దాని బరువు కేవలం 2 శాతం మాత్రమే.
కానీ మొత్తం దేహానికి అందే ఆక్సిజన్‌లో 20 శాతం దానికే కావాలి.
దేహం మొత్తం వినియోగించే శక్తిలో 20 శాతం దానికే చెందాలి.
ఇక అదెంతటి అద్భుతమో చూద్దాం...
దాదాపు 1.3 కిలోల నుంచి 1.4 కిలోల బరువుండే
మెదడులో 85 శాతం నీళ్లే. అన్నీ కొవ్వు కణాలే.
అంటే మెదడు కణాలన్నీ కొవ్వుతో నిర్మితమైనవే.
కొవ్వు లేకపోతే మెదడే లేదు. అంటే...
శరీరంలోని 25 శాతం కొలెస్ట్రాల్
మెదడులోనే ఉంటుంది. మన ఆలోచనలకూ,
పనులకూ, తెలివితేటలకూ అదే మూలం.
కొన్ని రకాల ఆహారాలు తీసుకుంటే
అది మందకొడిగానూ, మరికొన్ని ఆహారాలతో
అది చురుగ్గానూ ఉంటుంది. అది చురుగ్గా
పనిచేయడానికి ఎలాంటి ఆహారం కావాలో తెలిపే కథనం.

మెదడు మేలు చేసే ఆహారాలు...

మెదడు చురుగ్గా పనిచేయాలనుకుంటే మనం తీసుకునే ఆహారాల్లో ఈ కింద పేర్కొన్నవి సమృద్ధిగా ఉండేలా చూసుకోవాలి.

ఆకుకూరలతో పాటు కూరగాయల్లో...
పాలకూర మెదడును చురుగ్గా ఉంచుతుంది. ఇక బీట్‌రూట్, చిక్కుళ్లు వంటి వాటిల్లో ఉండే యాంటీ–ఆక్సిడెంట్స్ మెదడు కణాలను చాలాకాలం పాటు ఆరోగ్యంగా ఉంచడంతో పాటు అనేక వ్యాధులనుంచి రక్షణ కల్పిస్తాయి. వీటితో పాటు చాకొలెట్, గ్రీన్ టీ కూడా మెదడుకు మేలు చేస్తాయి.

చేపలు...
పండుగప్ప / పండు చేప, వంజరం, కనగర్తలు (మాకరెల్), సాల్మన్, హెర్రింగ్ వంటి చేపల్లో మెదడు చురుకుదనానికి సహాయపడే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువ.

నూనెల్లో...
మెదడు చురుకుదనానికి దోహదం చేసే నూనెల్లో ఆలివ్ ఆయిల్ చాలా మంచిది. ఇది రక్తపోటును కూడా తగ్గిస్తుంది. రక్తంలో కొలెస్ట్రాల్, కొవ్వులను అరికడుతుంది. కాబట్టి మెదడుకు వచ్చే పక్షవాతం (స్ట్రోక్), అల్జైమర్స్ వ్యాధులను ఆలివ్ ఆయిల్ కొంత మేరకు నివారిస్తుందని చెప్పవచ్చు.

పండ్లు...
మెదడుకు మేలు చేసే పండ్లలో బెర్రీ పండ్లు చాలా మంచివి. స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ, నేరేడు వంటివి మెదడుకు మేలు చేస్తాయి.

మెదడుక్కు హాని చేసే ఆహారాలు

✗ నిల్వ ఉంచిన ఉప్పు కలిపిన పదార్థాలైన చిప్స్, టిన్న్‌డ్ సూప్స్‌తో పాటు ప్రిజర్వేటివ్స్ కలిపిన ఆహార పదార్థాలు మెదడుకు హానికరం. కాబట్టి వాటిని చాలా పరిమితంగా తీసుకోవాలి.

✗ మనం తీసుకునే ఉప్పు రోజుకు 6 గ్రాములకు మించితే అది ఆరోగ్యానికే కాదు... మెదడుకూ చేటు చేస్తుంది.

✗ కొవ్వుల్లో డాల్డా వంటి ట్రాన్స్ ఫ్యాట్స్, అలాగే మాంసాహారంలో ఉండే కొవ్వులు మెదడుకు అంత మంచిది కాదు. అందుకే మాంసాహారం తినేవారు కొవ్వు తక్కువగా ఉండే చికెన్, చేపలే తీసుకోవాలి. బటర్, క్రీమ్ వంటి కొవ్వులనూ చాలా పరిమితంగానే (అరుదుగా కేవలం రుచి కోసమే) వాడాలి.

✗ ఆల్కహాల్ మెదడుకు హాని చేస్తుంది. ఇది తీసుకున్నప్పుడు తక్షణ ప్రభావంగా మెదడు స్తబ్ధుగా ఉంచుతుంది. ఇక దీర్ఘకాలంలో డిమెన్షియా (మతిమరపు) వంటి మెదడు సమస్యలకు దారి తీస్తుంది. కాబట్టి దీన్ని పూర్తిగా మానేయాలి. అలాగే మెదడును ఉత్తేజపరచడానికి తాగే సిగరెట్ లాంటి పొగతాగే అలవాటు కూడా దీర్ఘకాలంలో మెదడు పనితీరును మందకొడిగా మారుస్తుంది. మెదడుకు అందే ఆక్సిజన్ మోతాదులనూ తగ్గిస్తుంది. అందుకే మెదడు చురుగ్గా పనిచేయాలనీ, మెదడుకు సంబంధించిన అల్జైమర్స్ వంటి జబ్బులు నివారించడానికి మద్యం, పొగతాగడం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి.

ఈ లోకంలోని జీవులన్నింటిలోకెల్లా అత్యంత తెలివైన మెదడు మానవులని పిలుచుకునే మన హోమో సేపియన్ జీవులదే. ఈ మొత్తం కాస్మోస్‌లో ఇంకా తెలివిగల జీవం ఇంకెక్కడుందో ఇప్పటికీ తెలియదు కాబట్టి... ప్రస్తుతానికి ఈ సమస్త విశ్వంలో ఇంతటి సంక్లిష్టమైన మెదడు, అత్యంత అద్భుతమైన మెదడు మానవులది మాత్రమే. అందులో ఎన్ని కణాలు ఉన్నాయనేదానికి నిర్దిష్టమైన లెక్క లేదు. కానీ దాదాపు 1,000 కోట్ల కణాలు ఉన్నాయని ఒక అంచనా. ప్రతి కణాన్నీ న్యూరాన్ అంటారు. ఒక్కో కణం 40,000 ఇతర కణాలతో అనుసంధానితమై ఉంటుంది. ఇలా అనుసంధానితమై ఉండటాన్ని 'సైనాప్స్' అంటారు. కేవలం ఇసుక రేణువంత భాగంలో కనీసం లక్ష న్యూరాన్లు, పొరుగు కణాలతో అనుసంధానితమైన ఉన్న కనెక్షన్లు 100 కోట్ల వరకు ఉన్నందువల్లనే బహుశా ఇంతటి సంక్లిష్టమైన నిర్మాణం విశ్వంలోనే మరొకటి లేదనేది ఒక భావన.

ఎదుగుదలలోనే అద్భుతాలు...

తల్లికడుపులో బిడ్డ ఉండగానే మెదడు ప్రతి నిమిషానికీ 2,50,000 కొత్త కణాలు పుడుతూ ఉంటాయి. ఇలా ఆ బిడ్డ... ఈ లోకాన్ని చూసే నాటికి అతడు 1000 కోట్ల కణాలతో పుడతాడు. పన్నెండు నెలల వయసప్పుడు తీసిన మెదడు స్కాన్, దాదాపు యుక్త వయసులో ఉన్నప్పటి మెదడు స్కాన్ దాదాపు ఒకేలా ఉంటాయి. కాకపోతే ట్రిలియన్ల కొద్దీ సైనాప్స్‌లు ఏర్పడుతూ ఉంటాయి. పదేళ్ల వయసు నుంచి చాలా వేగంగా సామాజిక, ఉద్వేగపూరితమైన, బుద్ధికి సంబంధించిన ఎదుగుదల జరుగుతుంది. మనం ఏయే అంశాలపై దృష్టి పెడతామో అవి పెరగడం, దృష్టి పెట్టని అంశాలు తగ్గడం జరుగుతాయి. 'దీన్నే యూజ్ ఇట్... ఆర్ లూజ్ ఇట్'గా పేర్కొంటారు. మనకు ఆనందం ఇచ్చే అంశాలనూ ఈ సమయంలోనే అభివృద్ధి చేసుకుంటాం. దాదాపు 18 నుంచి 20 ఏళ్ల వయసు వచ్చేనాటికి మన వికాసం దాదాపుగా పూర్తవుతుంది.

ఈ వికాస క్రమంలోనూ,

అటు తర్వాత మెదడు బాగా చురుగ్గా పనిచేయడానికి కొన్ని ఆహారాలు దోహదపడుతుంటాయి. మెదడు చురుగ్గా ఉండటానికి, చాలా కాలం పాటు దాని ఆరోగ్యం చక్కగా ఉంచడానికి తీసుకోవాల్సిన ఆహారపదార్థాలేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

పిండదశలో...

పిండ దశ నుంచీ మెదడు ఎదుగుదలకు ఉపయోగపడే కీలకమైన పోషకమే 'ఫోలిక్ యాసిడ్'. అందుకే ఓ మహిళ గర్భం దాల్చగానే లేదా దంపతులు ప్రెగ్నెన్సీ కోసం ప్లాన్ చేసుకుంటూ ఉన్నప్పుడు గర్భం దాల్చకముందు నుంచే మహిళలకు 'ఫోలిక్ యాసిడ్' పోషకాన్ని డాక్టర్లు సిఫార్సు చేస్తుంటారు.

ఈ ఫోలిక్ యాసిడ్ పోషకం మహిళ గర్భవతిగా ఉన్నప్పట్నుంచే మెదడు తాలూకు మంచి ఎదుగుదలకూ, పిండంలో న్యూరల్ ట్యూబ్‌కు సంబంధించిన సమస్యల నివారణకూ తోడ్పడుతుంటుంది. ఫోలిక్ యాసిడ్ అనే ఈ పోషకం అన్ని రకాల ఆకుకూరల్లోనూ పుష్కలంగా ఉంటుంది. ఫోలియేజ్ అంటే ఆకులు. అందుకే పాలకూర వంటి అన్ని ఆకుకూరల్లో సమృద్ధిగా లభ్యమవుతుంది కాబట్టే దీనికి 'ఫోలిక్ యాసిడ్' అని పేరు.

బిడ్డ పుట్టాక...

ఇక బిడ్డ పుట్టి నేల మీద పడ్డాక... ఆ చిన్నారి మెదడు ఆరోగ్యంగా ఎదగాడానికి అవసరమైనది 'డొకోజా హెగ్జాయినోయిక్ యాసిడ్' (సంక్షిప్తంగా 'డీహెచ్ఏ') అనే మరో రకం పోషకం అవసరం. ఇది ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్‌లో ఒక రకం. ఈ పోషకం తల్లిపాలలో సమృద్ధిగా లభిస్తుంది. బిడ్డలు పెరిగి పెద్దయ్యా వారికి ఇదే పోషకం కావాలంటే చేపల్లో సమృద్ధిగా దొరుకుతుంది.

ఇక బిడ్డల పెరుగుదల తర్వాత, వారు యుక్తవయస్కులుగా మారాక... అటు పిమ్మట కూడా ఆ మెదడు ఆరోగ్యం సక్రమంగా నిర్వహితం కావాలంటే అవసరమైన పోషకాలు ఇవి...

సంక్లిష్టమైన పిండిపదార్థాలు (కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్స్)...

మెదడు చురుగ్గానూ, అలాగే సక్రమంగానూ పనిచేస్తూ... అది చేసే పనిలో సునిశితత్వం, వేగం, చురుకుదనం ఉండాలంటే ముందుగా మొత్తం శరీరానికి శరీరం తీసుకునే శక్తిలో 15 శాతం దానికే కావాలి. అంటే మొత్తం శరీరానికి శక్తినిచ్చే గ్లూకోజ్‌లో 15 శాతానికి తగ్గకుండా మెదడుకు సమృద్ధిగా అందుతూ ఉండాలి. అందుకోసం... ఆ శక్తిని సమకూర్చేందుకు తీసుకోవాల్సిన ఆహార పదార్థాల్లో మొదటివి కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్స్.

మనకివి పొట్టు తీయని కాయధాన్యాల నుంచి లభ్యమవుతాయి. ఉదాహరణకు దంపుడు బియ్యం లేదా ముడిబియ్యం, పొట్టుతీయకుండా పిండి పట్టించిన గోధుమలు మొదలుకొని పొట్టు తీయని అనేక ముడిధాన్యాల నుంచి ఈ కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు అందుతాయి. శక్తి కోసం మనం తీసుకోదగ్గ వాటిలో ఇవి ప్రధానమైనవి. పొట్టుతీయకపోవడం వల్ల కలిగే ప్రయోజనం ఏమిటంటే... పొట్టుతీసిన ఆహారం నుంచి దొరికే గ్లూకోజ్ దేహంలోకి చేరగానే తక్షణం వినియోగితమైపోతుంది. ఆ తర్వాత వెంటనే మళ్లీ గ్లూకోజ్ అవసరమవుతుంది. కానీ పొట్టు తీయని ఆహారం ద్వారా అందిన గ్లూకోజ్ ఒక క్రమమైన పద్ధతిలో చాలాసేపు పాటు మెదడుకు అందుతూ ఉంటుంది.

అత్యవసరమైన కొవ్వులు (ఎసెన్షియల్ ఫ్యాటీ ఆసిడ్స్)...

మెదడు చురుగ్గా పనిచేయడానికి అవసరమయ్యే అత్యంత కీలకమైన కొవ్వు పదార్థాలు ఇవి. అందుకే మెదడుకు అవసరమైన ఈ కొవ్వులను 'ఎసెన్షియల్ ఫ్యాటీ యాసిడ్స్' (ఈఎఫ్ఏ) అంటారు. ఇవే ప్రధాన ఒమెగా –3 ఫ్యాటీ యాసిడ్ అయిన అల్ఫా లినోలినిక్ యాసిడ్ (ఏఎల్ఏ), ఇకోజా పెంటాయినిక్ యాసిడ్ (ఈపీఏ), డొకాజో హెగ్జాయినిక్ యాసిడ్ (డీహెచ్ఏ) వంటివి. ఇక్కడ గుర్తుంచుకోవాల్సిందేమిటంటే...

మెదడు కణాలన్నీ కేవలం కొవ్వు కణాలే. ఒకరకంగా చూస్తే... మెదడు బరువులో 60 శాతం పూర్తిగా కొవ్వే. ఇక మిగతా దానిలోనూ మరో 20 శాతం ఎసెన్షియల్ ఫ్యాటీ యాసిడ్స్‌ను నుంచి తయారైన పదార్థాలే. ఈ ఎసెన్షియల్ ఫ్యాటీ యాసిడ్స్‌ను దేహం తనంతట తాను తయారు చేసుకోలేదు. కాబట్టి వాటిని ఆహారం నుంచి తీసుకోవాలి. ఆ ఎసెన్షియల్ కొవ్వుల సాయంతోనే మెదడుకు అవసరమైన కీలక కొవ్వు కణాల మెయింటెనెన్స్ జరుగుతూ ఉంటుంది.

ఎసెన్షియల్ ఫ్యాటీ ఆసిడ్స్ అంటే...

మనం తీసుకునే ఆహారంలో ఒమెగా 3 ఫ్యాటీ ఆసిడ్స్, ఒమెగా 6 ఫ్యాటీ ఆసిడ్స్ వంటి వాటితో పాటు మరికొన్ని పోషకాలను ఎసెన్షియల్ ఫ్యాటీ ఆసిడ్స్ అనుకోవచ్చు. అవి మనకు చేపలు, ముఖ్యంగా సాల్మన్, మెకరెల్స్, సార్డిన్ వంటి చేపల నుంచి... ఇంకా గుడ్లు, నట్స్, అవిశెనూనె నుంచి లభ్యమవుతాయి.

మెదడుకు మేలు చేయని కొవ్వులు...

మెదడు సక్రమంగా చురుగ్గా పనిచేయడానికి కొవ్వులు కావలసినా, మళ్లీ అన్ని రకాల కొవ్వులూ మెదడుకు మంచి చేయవు. కొన్ని కొవ్వులు దాన్ని మందకొడిగా మారుస్తాయి. అవి ఏవంటే... ట్రాన్స్‌ఫ్యాట్స్ అని పిలిచే హైడ్రోజనేటెడ్ కొవ్వులు. ఇవి మెదడు ఆరోగ్యానికి అంత మంచిది కాదు. అవి మెదడు చురుగ్గా పనిచేయడానికి అవసరమైన ఎసెన్షియల్ ఫ్యాటీ ఆసిడ్స్‌ను అడ్డుకుంటాయి. తేలిగ్గా అర్థమయ్యేలా చెప్పుకోవాలంటే... ఈ హైడ్రోజనేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్ కృత్రిమ నెయ్యిలో (వనస్పతిలో) ఎక్కువగా ఉంటాయి. వీటితో తయారు చేసే కేక్‌లు, బిస్కెట్, తీపి పదార్థాలు మెదడును చురుగ్గా ఉంచలేవు. అవి మెదడును కాస్త మందకొడిగా చేయడంతో పాటు ఆరోగ్యానికీ అంతగా మేలు చేయవు. అందుకే చాలా పాశ్చాత్య దేశాల్లో ఈ ట్రాన్స్‌ఫ్యాట్స్‌ను నిషేధించారు.

తినుబండారాలు కొంటున్నారా... తస్మాత్ జాగ్రత్త...

మనం మార్కెట్‌లో కొనే తినుబండారాల ప్యాకెట్లపై ఉండే పదార్థాల జాబితాను తప్పక పరిశీలించాలి. ఒకవేళ అందులో హైడ్రేజనేటెడ్ ఫ్యాట్స్/ఆయిల్స్ ఉంటే వాటిని కేవలం రుచికోసం పరిమితంగానే తీసుకోవాలి. అదికూడా అరుదుగానే ఎప్పుడైనా తీసుకోవడం మంచిది. మెదడుకు అవసరమైన కొవ్వులు (అసెన్షియల్ ఫ్యాటీ యాసిడ్స్) కోసం చేపలు ఎక్కువగా తినడం అన్ని విధాలా మెదడుకు మేలు చేస్తుంది. ఎందుకంటే చేపల్లో మెదడును చురుగ్గా ఉంచడానికి అవసరమైన ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్, ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి.

డాక్టర్
హరిత శ్యామ్ .బి
సీనియర్ డైటీషియన్

అమైనో యాసిడ్స్...

మెదడులోని అనేక కణాల్లో ఒకదాని నుంచి మరోదానికి సమాచారం ఇచ్చిపుచ్చుకునేందుకు దోహదపడే అంశాలను న్యూరోట్రాన్స్‌మిటర్స్ అంటారు. ఈ న్యూరోట్రాన్స్‌మిటర్స్ సహాయంతో సమాచారం తాలూకు ట్రాన్స్‌మిషన్ ఎంత వేగంగా జరిగితే మెదడు అంత చురుగ్గా పనిచేస్తుంది. ఇందుకు సహాయపడేవే 'అమైనో ఆసిడ్స్'. ఇవి మనకు ప్రోటీన్స్‌నుంచి లభ్యమవుతాయి.

మన మూడ్స్ కూడా న్యూరో ట్రాన్స్‌మిటర్స్‌పైనే...

మనకు కలిగే రకరకాల మూడ్స్ కూడా ఈ న్యూరోట్రాన్స్‌మిటర్స్‌పైనే ఆధారపడి ఉంటాయి. ఉదాహరణకు మనకు హాయిగా, గాఢమైన నిద్ర పట్టాలంటే సెరటోనిన్ అనే జీవరసాయనం కావాలి. దానికి ట్రిప్టొఫాన్ అనే అమైనో యాసిడ్ అవసరం. ఈ ట్రిప్టొఫాన్ పాలలో పుష్కలంగా ఉంటుంది. అందుకే మంచి నిద్రపట్టాలంటే నిద్రకు ఉపక్రమించేముందు గోరువెచ్చని పాలు తాగాలంటూ డాక్టర్లు సూచిస్తుంటారు.

విటమిన్లు / మినరల్స్ (ఖనిజలవణాలు)...

మెదడు పనితీరు బాగా చురుగ్గా కొనసాగడానికి అవసరమైన పోషకాల్లో అత్యంత ముఖ్యమైనవి విటమిన్లు, ఖనిజలవణాలు చాలా ప్రధానమైనవి. ఇవి అమైనో యాసిడ్స్‌ను న్యూరోట్రాన్స్‌మిటర్లుగా మార్చడంలోనూ, కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లను గ్లూకోజ్‌లో మార్చడంలోనూ తోడ్పడతాయి. మెదడు చురుకుదనానికి విటమిన్ బీ–కాంప్లెక్స్‌లోని బి–1, బి–6, బి–12 ప్రధానంగా అవసరమైవుతాయి. మళ్లీ వీటిన్నింటోనూ విటమిన్ బి–12 ఇంకా కీలకం. ఈ విటమిన్లు తాజా కూరగాయల్లో, ముదురాకుపచ్చటి ఆకుకూరల్లో, పాలలో సమృద్ధిగా దొరుకుతాయి. అయితే వీటన్నింటిలోనూ మెదడు చురుకుదనానికి దోహదం చేసే బి–12 మాంసాహారంలోనే ఎక్కువ. అందుకే... ఇటీవల చాలా మంది స్ట్రిక్ట్ వెజిటేరియన్స్ (వీగన్స్)లోనూ, ఎండ అంతగా సోకనివారిలో (ఎండకు ఎక్కువగా ఎక్స్‌పోజ్ కానివారిలో) విటమిన్ 'డి'.. ఈ రెండు రకాల విటమిన్ల లోపం కారణంగా వాళ్లలో మెదడు చురుగ్గా పనిచేయని స్థితి ఏర్పడుతుంది. ఈ పరిస్థితి కారణంగా ఒక్కోసారి వారు అకస్మాత్తుగా అపస్మారక స్థితిలోకి వెళ్లే ప్రమాదం ఎదురవుతుంది. ఇలా జరగడాన్ని వైద్య పరిభాషలో 'సింకోప్' / 'సింకోపీ' అంటారు ఇటీవల ఆధునిక జీవనశైలిలో భాగంగా ఇప్పుడీ కండిషన్ చాలామందిలో కనిపిస్తోంది. ఇలాంటివారంతా డాక్టర్ల సూచన మేరకు విటమిన్–డి సప్లిమెంట్లతో పాటు దేహంలో విటమిన్ బి–12 మోతాదులను పెంచే సప్లిమెంట్లను బయటి నుంచి తీసుకోవాలి. ఇక విటమిన్–ఈ కూడా మనలో విద్యలూ–నైపుణ్యాలు నేర్చుకునే ప్రక్రియను చురుగ్గా జరిగేలా చేస్తుంది.

నీళ్లు...

మెదడులోని ఘనపదార్థంలో చాలావరకు కొవ్వులే కాగా... ఇక మొత్తం మెదడులో 80 శాతం వరకు నీళ్లే ఉంటాయి. మెదడులోని న్యూరోట్రాన్స్‌మిటర్స్ చురుగ్గా పనిచేయడానికి నీళ్ల ఎక్కువ మోతాదులో తీసుకోవడం అవసరం. మనం మన మూత్రం రూపంలోనూ, అలాగే మనం ఊపిరి వదులుతున్నప్పుడు (ఉచ్ఛ్వాసనిశ్వాసల్లో) రోజులో కనీసం 2.5 లీటర్ల నీటిని బయటకు విసర్జిస్తాం. ఇలా బయటకు పోయే నీటిని ఎప్పటికప్పుడు మళ్లీ భర్తీ చేసుకోవడం అవసరం. దీనికోసం అదేమొత్తంలో మళ్లీ నీటినీ తీసుకోవాలి. అనేక కారణాల వల్ల కొంతమంది నీళ్లు ఎక్కువగా తాగరు. ఎంతటి తక్కువ మోతాదులో నీళ్లు తాగేవారైనా రోజులో కనీసం 1.5 లీటర్లను తప్పక తీసుకోవాలి. (మిగతా నీళ్ల మోతాదు కాస్తా మనం రోజూ తీసుకునే ఘనాహారం నుంచి, మన శరీరంలో జరిగే జీవక్రియల్లో విడుదలయ్యే నీటి నుంచి భర్తీ అవుతుంటుంది. ఎవరిలోనైనా వారు రోజులో తీసుకునే నీళ్లు 1.5 లీటర్ల కంటే తగ్గాయంటే వాళ్ల మెదడు పనితీరులో చురుకుదనం ఎంతో కొంత తగ్గుతుందని గుర్తుంచుకోవాలి. ఆ మేరకు నీరు తగ్గిందంటే అది వాళ్ల వాళ్ల మూడ్స్‌పై కూడా ప్రభావం చూపేందుకు అవకాశాలు ఎక్కువ. అందుకే ప్రతిఒక్కరూ రోజూ 6–8 గ్లాసుల నీళ్లతో పాటు, పాలు, మజ్జిగ, పండ్లరసాలు, రాగిజావ, వంటివి తీసుకుంటూ ఉండటం మంచిది. అప్పుడు... నీటితో పాటు తీసుకునే ఆ ద్రవాహారాలు మెదడును చురుగ్గా ఉంచడంలో సహాయపడతాయి.

ఇక ద్రవాహారాల్లో టీ, కాఫీల వంటివి డీహైడ్రేషన్‌ను వేగవంతం చేస్తాయి. అంటే శరీరం నుంచి నీళ్లను తొలగించే పనిని చేస్తుంటాయి. అందుకే టీ, కాఫీలూ, కెఫిన్ ఉండే పానీయాలను చాలా పరిమితంగా (అంటే రోజుకు రెండు కప్పులకు మించకుండా) మాత్రమే తీసుకోవడం మంచిది. అంతకు మించితే ఆ పానీయాలు తొలుత మెదడును చురుగ్గా చేసినప్పటికీ... ఇలా వేగంగా పనిచేయించడం వల్ల మెదడు అంతే వేగంగా అలసిపోతుంది. చక్కెర కలిపిన పానీయాలు, కార్బొనేటెడ్ సాఫ్ట్‌డ్రింక్స్‌వల్ల కూడా ఇదే హాని జరుగుతుంది.

నిర్వహణ: యాసీన్

323 పరుగుల తేడాతో...

మూడో టెస్టులో న్యూజిలాండ్ ఘనవిజయం

సిరీస్ 2-0తో సొంతం ● రెండో ఇన్నింగ్స్‌లో కుప్పకూలిన వెస్టిండీస్
87/0 నుంచి 138 ఆలౌట్ ● జేకబ్ డఫీకి 5 వికెట్లు

మౌంట్ మాంగనుయ్: తొలి నాలుగు రోజులు పరుగుల వరద పారిన న్యూజిలాండ్, వెస్టిండీస్ మూడో టెస్టులో ఆఖరి రోజు బౌలర్ల హవా నడిచింది. ఫలితంగా న్యూజిలాండ్ 323 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించి మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2–0తో సొంతం చేసుకుంది. బ్యాటింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై... చివరి రోజు వెస్టిండీస్ బ్యాటర్లు క్రీజులో నిలదొక్కుకుంటే 'డ్రా'తో గట్టెక్కగలరేమో అనిపించింది. 462 పరుగుల భారీ లక్ష్యంతో ఓవర్‌నైట్ స్కోరు 43/0తో ఆట కొనసాగించిన వెస్టిండీస్ ఒకదశలో 87/0తో పటిష్టంగానే కనిపించింది. కానీ ఇన్నింగ్స్ 33వ ఓవర్‌లో ఓపెనర్ బ్రాండన్ కింగ్ (96 బంతుల్లో 67; 13 ఫోర్లు)ను జేకబ్ డఫీ అవుట్ చేశాక పరిస్థితి మారిపోయింది. బ్రాండన్ కింగ్ నిష్క్రమించాక వచ్చిన బ్యాటర్లెవరూ న్యూజిలాండ్ బౌలర్ల ముందు నిలువలేకపోయారు. వెరసి వెస్టిండీస్ 51 పరుగుల తేడాలో మొత్తం 10 వికెట్లు కోల్పోయింది. చివరకు 80.3 ఓవర్లలో కరీబియన్ జట్టు 138 పరుగులకు ఆలౌటైంది. న్యూజిలాండ్ పేసర్ జేకబ్ డఫీ 42 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టి విండీస్‌ను కుప్పకూల్చాడు. స్పిన్నర్ ఎజాజ్ పటేల్ 23 పరుగులిచ్చి 3 వికెట్లు తీయగా... గ్లెన్ ఫిలిప్స్, రచిన్ రవీంద్ర ఒక్కో వికెట్ దక్కింది. న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌ను 575/8 స్కోరు వద్ద డిక్లేర్ చేయగా... వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 420 పరుగులకు ఆలౌటైంది. న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌ను 306/2 వద్ద డిక్లేర్ చేసి వెస్టిండీస్‌కు 462 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ, రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన న్యూజిలాండ్ ఓపెనర్ డెవాన్ కాన్వేకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఓవరాల్‌గా 42 పరుగులు చేయడంతోపాటు 23 వికెట్లు పడగొట్టిన డఫీకి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' పురస్కారం దక్కింది.

ఉమామహేశ్‌కు ఏడో స్థానం

భోపాల్: జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్ జూనియర్ పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ షూటర్ మద్దినేని ఉమామహేశ్ ఏడో స్థానంలో నిలిచాడు. ఎనిమిది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో సోమవారం జరిగిన ఫైనల్లో ఉమామహేశ్ 145.3 పాయింట్లు స్కోరు చేసి పతకానికి దూరమయ్యాడు. హరియాణా షూటర్ హిమాన్షు 123 పాయింట్లతో ఎనిమిదో స్థానాన్ని దక్కించుకున్నాడు. 254.3 పాయింట్లతో మొహమ్మద్ ముర్తజా వానియా (గుజరాత్) పసిడి పతకాన్ని సొంతం చేసుకున్నాడు. అభినవ్ షా (పశ్చిమ బెంగాల్; 251.6 పాయింట్లు) రజతం, ఓంకార్ వికాస్ వాఘమరె (కర్ణాటక; 230.1 పాయింట్లు) కాంస్యం గెల్చుకున్నారు. సీనియర్ పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో కిరణ్ అంకుశ్ జాదవ్ (నేవీ; 252.1 పాయింట్లు) బంగారు పతకాన్ని సాధించాడు. ఒలింపియన్ అర్జున్ బబూటా (251.4 పాయింట్లు) రజతం, ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ (229.8 పాయింట్లు) కాంస్యం గెలిచారు.

కృష్ణప్ప గౌతమ్ వీడ్కోలు

● టీమిండియా తరఫున ఏకైక వన్డే ఆడిన కర్ణాటక క్రికెటర్
● 2021 ఐపీఎల్‌లో రూ.9.25 కోట్ల జాక్‌పాట్‌తో అందరి దృష్టిలోకి

బెంగళూరు: కర్ణాటక మాజీ ఆల్‌రౌండర్ కృష్ణప్ప గౌతమ్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఫ్రాంచైజీ, క్లబ్ సహా అన్ని ఫార్మాట్లకు గుడ్‌బై చెప్పాడు. ఆఫ్ స్పిన్నర్ అయిన 37 ఏళ్ల వెటరన్ క్రికెటర్ గౌతమ్‌కు హిట్టర్‌గా పేరుంది. ఆటగాడిగా ఏనాడు కూడా ఆటతీరుతో పతాక శీర్షికల్లో ఎక్కలేకపోయిన గౌతమ్ ఐపీఎల్ జాక్‌పాట్ రూ.9.25 కోట్లతో అందరికంట పడ్డాడు. స్వరాష్ట్రం తరఫున 59 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లాడి 224 వికెట్లు, 68 లిస్ట్ 'ఎ' మ్యాచ్‌ల్లో 96 వికెట్లు తీసిన ఈ కన్నడ ఆటగాడికి ఏకైక అంతర్జాతీయ వన్డే భాగ్యం కూడా దక్కింది. 2021, జూలైలో కొలంబో వేదికగా జరిగిన ఆ మ్యాచ్‌లో శ్రీలంకతో తలపడిన టీమిండియా తరఫున బరిలోకి దిగాడు. 92 టి20 మ్యాచ్‌ల్లో 74 వికెట్లు కూడా తీశాడు.

కోటీశ్వరుడిని చేసిన ఐపీఎల్

టీమిండియా తరఫున ఒకటే వన్డే ఆడినా... ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో మెరిపించే అవకాశాలు బోలెడొచ్చాయి. పంజాబ్ కింగ్స్, చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్, లక్నో సూపర్ జెయింట్స్, రాజస్తాన్ రాయల్స్ తరఫున అడపాదడపా ఆకట్టుకున్నాడు. 2021 సీజన్ కోసం చెన్నై రూ. 9.25 కోట్లు పోసి కొనుక్కుంది. అన్‌క్యాప్డ్ కేటగిరీలో ఇదో సంచలనం. అత్యధిక ధర పలికిన ఆటగాడిగా ఘనత వహించాడు కానీ తీరా... ఒక్క మ్యాచ్‌లోనూ చెన్నై ఆడించలేదు. దీంతో 2021 సీజన్ అంతా డగౌట్‌కే పరిమితమయ్యాడు. అన్నట్లు ఆ సీజన్ విజేత సూపర్‌కింగ్సే! మరుసటి సీజన్ అయినా ఆడిస్తుందనుకుంటే మొత్తానికే వదిలేసుకుంది. దీంతో 2022లో లక్నో 90 లక్షలకు కొనుక్కుంది. అంటే ఏడాది... 365 రోజులు గడిచేసరికి అతని విలువ 90 శాతానికి పైగా పడిపోయింది.

వికెట్ దక్కకపోతేనేం... ప్రదర్శన బాగుందిగా!

టీమిండియా బౌలర్ వైష్ణవి వాఖ్య

సాక్షి, విశాఖపట్నం: అరంగేట్రంలోనే ఆకట్టుకున్న భారత మహిళా జట్టు స్పిన్నర్ వైష్ణవి శర్మ తన ఆటతీరు పట్ల సంతృప్తిని వెలిబుచ్చింది. విశాఖ వేదికగా ఆదివారం శ్రీలంకతో జరిగిని తొలి టి20 మ్యాచ్‌లో 20 ఏళ్ల పంజాబీ స్పిన్నర్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో అదరగొట్టింది. పూర్తి కోటా (4 ఓవర్లు) బౌలింగ్ చేసిన ఈ లెఫ్టార్మ్ స్పిన్నర్ 16 పరుగులే ఇచ్చింది. వికెట్ తీయలేకపోయినప్పటికీ టి20లో ఇంత పొదుపుగా బౌలింగ్ చేయడం కూడా గొప్ప విషయం. పైగా ప్రత్యర్థి జట్టును తక్కువ స్కోరుకే కట్టడి చేయడంలో ఆమె స్పెల్ (4–0–16–0) దోహదపడింది. మెయిడిన్ ఓవర్ లేకపోయినా... ఓవర్‌కు 4 పరుగుల ఎకానమీ రేట్ టి20ల్లో కచ్చితంగా ఉత్తమ ప్రదర్శనే అవుతుంది. ఇంత బాగా బౌలింగ్ చేసినప్పటికీ వికెట్ దక్కకపోవడం ఏమాత్రం నిరాశ కలిగించలేదని వైష్ణవి పేర్కొంది. జట్టు సహచరులు, డ్రెస్సింగ్ రూమ్ వాతావరణం అంతా సానుకూల దృక్పథాన్ని అలవర్చిందని చెప్పుకొచ్చింది. మంగళవారం ఇదే వేదికపై భారత్, శ్రీలంక మహిళల జట్ల మధ్య రెండో టి20 జరుగనుంది. సిరీస్‌లో ప్రస్తుతం హర్మన్‌ప్రీత్ కౌర్ సేన 1–0తో ఆధిక్యంలో ఉంది.

హర్మన్ ప్రోత్సహించింది!

'నా ప్రదర్శన పట్ల చాలా సంతోషంగా ఉన్నాను. వికెట్ తీయలేదన్న నిరాశ ఏ మూలన కూడా లేదు. నిజం చెబుతున్నా నేననుకున్న విధంగా నా ప్రణాళికల్ని అమలు చేయగలిగాను. ప్రత్యర్థి బ్యాటర్లను నిలువరించాను. ఒక్క మ్యాచ్‌తోనే అయిపోలేదుగా... ఇంకా నాలుగు మ్యాచ్‌లున్నాయి. మ్యాచ్ మొదలయ్యేందుకు ముందు కాస్త భయపడిన మాట వాస్తవమే! కానీ జాతీయ గీతం ఆలాపించాకా ఆ బెరుకు, భయం తొలగింది. మనసు నిర్మలమైంది. అందువల్లేనేమో నా పని నేను సానుకూల దృక్పథంతో చేసుకోగలిగాను. కెప్టెన్ హర్మన్‌ప్రీత్, జట్టు మేనేజ్‌మెంట్ నన్నెంతగానో ప్రోత్సహించారు' అని వైష్ణవి శర్మ వివరించింది.

'అప్పుడే రిటైర్మెంట్ గురించి ఆలోచించా'

2023 వన్డే వరల్డ్ కప్ ఫైనల్ ఓటమిపై రోహిత్ శర్మ

ముంబై: రెండేళ్ల క్రితం స్వదేశంలో జరిగిన 2023 వన్డే వరల్డ్ కప్ భారత అభిమానుల్లో తీవ్ర నిరాశను నింపింది. లీగ్ దశలో అజేయంగా నిలవడంతో పాటు సెమీస్ సహా వరుసగా 10 మ్యాచ్‌లు గెలిచి అసాధారణ ప్రదర్శన కనబర్చిన జట్టు చివరకు ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. భారత కెప్టెన్‌గా ఉన్న రోహిత్ శర్మ అయితే ఈ ఓటమితో తీవ్రంగా కుంగిపోయాడు. ఈ పరాజయం అతడిలో నిర్వేదాన్ని నింపింది. ఆ సమయంలో తాను ఆటకు గుడ్‌బై చెప్పాలని కూడా భావించానని 'మాస్టర్స్ యూనియన్' కార్యక్రమంలో రోహిత్ వెల్లడించాడు. కెప్టెన్‌గా ఎంపికైనప్పుడు ప్రపంచ కప్ గెలవడం ఒక్కటే లక్ష్యంగా పెట్టుకున్నానని... అది జరగకపోవడంతో నిరాశకు లోనైన తాను కోలుకునేందుకు సమయం పట్టిందని రోహిత్ అన్నాడు. '2023 వరల్డ్ కప్ టైటిల్ కోసం నేను తీవ్రంగా కష్టపడ్డా. కానీ ఫైనల్ తర్వాత నేను మాత్రమే కాదు నాతో పాటు అందరూ చాలా నిరాశ చెందారు. అసలు ఏం జరిగిందో అర్థం కాలేదు. క్రికెట్ నాలో శక్తిని మొత్తం హరించివేసినట్లు, ఇక నాలో ఏమీ మిగిలి లేనట్లు అనిపించింది. అందుకే మళ్లీ బరిలోకి దిగకుండా రిటైర్ కావాలని భావించా. అయితే మెల్లగా వాస్తవంలోకి వచ్చాను. నేను ఎంతో ఇష్టపడే ఆటను అంత తొందరగా వదిలివేయగలనా అనిపించింది. అంతా సాధారణ స్థితికి వచ్చాక నెమ్మదిగా మళ్లీ మైదానంలోకి దిగా' అని రోహిత్ గుర్తు చేసుకున్నాడు. అయితే ఆ తర్వాత ఏడు నెలలకే కెప్టెన్‌గా రోహిత్ తన అత్యుత్తమ విజయాన్ని అందుకుంటూ 2024 టి20 ప్రపంచ కప్‌లో జట్టును చాంపియన్‌గా నిలిపాడు. 'మన అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చిన తర్వాత కూడా అనుకున్నది సాధించకపోతే సహజంగానే నిరాశ కలుగుతుంది. అయితే జీవితం అక్కడితోనే ఆగిపోదని అర్థమైంది. ఆ బాధను పక్కన పెట్టి కొత్తగా మొదలు పెట్టాలని నేను పాఠం నేర్చుకున్నాను. ఇంకా సాధించేందుకు అవకాశం ఉందని నమ్మకం కలగడంతో 2024 టి20 వరల్డ్ కప్‌పై పూర్తిగా దృష్టి పెట్టాను. చివరకు టైటిల్ సొంతమైంది. ఇదంతా ఇప్పుడు చెబుతుంటే మామూలుగానే అనిపించవచ్చు. కానీ ఆ సమయంలో దానిని అధిగమించడం చాలా కఠినంగా అనిపించింది' అని రోహిత్ వ్యాఖ్యానించాడు.

అయూబ్ ఎల్ కాబీ 'బైసైకిల్ కిక్'

మొరాకో శుభారంభం

రబాట్ (మొరాకో): ఆఫ్రికా నేషన్స్ కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఆతిథ్య మొరాకో జట్టు శుభారంభం చేసింది. కొమొరోస్ జట్టుతో జరిగిన గ్రూప్ 'ఎ' తొలి లీగ్ మ్యాచ్‌లో మొరాకో 2–0 గోల్స్ తేడాతో విజయం సాధించింది. ఆట 55వ నిమిషంలో బ్రాహిమ్ డియాజ్ గోల్‌తో మొరాకో ఖాతా తెరిచింది. అంతకుముందు ఆట పదో నిమిషంలో లభించిన పెనాల్టీ కిక్‌ను సూఫియాన్ రహీమి వృథా చేశాడు. ఆట 74వ నిమిషంలో అయూబ్ ఎల్ కాబీ కళ్లు చెదిరే 'బైసైకిల్ కిక్'తో మొరాకో ఖాతాలో రెండో గోల్ జమ చేశాడు.

జనవరి 18వ తేదీ వరకు జరిగే ఈ మెగా టోర్నీలో ఆఫ్రికాకు చెందిన 24 దేశాలు పాల్గొంటున్నాయి. 24 జట్లను ఆరు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ 'ఎ'లో మొరాకో, మాలి, జాంబియా, కొమొరోస్... గ్రూప్ 'బి'లో ఈజిప్ట్, దక్షిణాఫ్రికా, అంగోలా, జింబాబ్వే... గ్రూప్ 'సి'లో నైజీరియా, ట్యునిషియా, ఉగాండా, టాంజానియా... గ్రూప్ 'డి'లో సెనెగల్, డీఆర్ కాంగో, బెనిన్, బోట్స్‌వానా... గ్రూప్ 'ఇ'లో అల్జీరియా, బుర్కినాఫాసో, ఈక్వెటోరియల్ గినియా, సుడాన్.. గ్రూప్ 'ఎఫ్'లో డిఫెండింగ్ చాంపియన్ ఐవరీకోస్ట్, కామెరూన్, గాబోన్, మొజాంబిక్ జట్లున్నాయి.

68 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ టోర్నీలో ఆతిథ్య మొరాకో జట్టు 1976లో ఏకైకసారి చాంపియన్‌గా నిలిచింది. ఈజిప్ట్ అత్యధికంగా ఏడుసార్లు విజేతగా నిలిచింది. కామెరూన్ ఐదుసార్లు, ఘనా నాలుగుసార్లు, నైజీరియా, ఐవరీకోస్ట్ మూడుసార్లు చొప్పున టైటిల్ సాధించాయి. అల్జీరియా, డీఆర్ కాంగో రెండుసార్లు చొప్పున చాంపియన్స్‌గా నిలిచాయి. జాంబియా, ట్యునిషియా, సుడాన్, సెనెగల్, దక్షిణాఫ్రికా, ఇథియోపియా, కాంగో ఒక్కోసారి టైటిల్ అందుకున్నాయి.

పాక్ యువ క్రికెట్ జట్టుకు నజరానా

కరాచీ: అండర్–19 ఆసియా కప్‌లో విజేతగా నిలిచిన పాకిస్తాన్ జట్టుకు ఆ దేశ ప్రభుత్వం ప్రత్యేక బహుమతిని ఇవ్వనుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో పాక్ 191 పరుగుల తేడాతో భారత యువ జట్టును ఓడించి ట్రోఫీని గెలుచుకుంది. విజేతగా నిలిచిన జట్టు సభ్యులకు ఒక్కొక్కరికి రూ.36 వేల డాలర్లు (సుమారు రూ. 32 లక్షలు) చొప్పున నజరానాగా ఇస్తున్నట్లు పాక్ ప్రధాని షహబాజ్ షరీఫ్ ప్రకటించారు. ఇస్లామాబాద్‌లో జట్టు సభ్యులను కలిసి అభినందించిన అనంతరం ఆయన ఈ కానుకను ప్రకటించినట్లు అండర్–19 టీమ్ మెంటార్, సీనియర్ టీమ్ మాజీ కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్ వెల్లడించాడు.

విజయ్ హజారే ట్రోఫీ బరిలో గిల్, అభిషేక్, అర్ష్‌దీప్

చండీగఢ్: వచ్చే ఏడాది జరిగే టి20 ప్రపంచకప్‌లో పాల్గొనే టీమిండియాలో చోటు దక్కించుకోలేకపోయిన భారత టెస్టు, వన్డే జట్టు కెప్టెన్ శుబ్‌మన్ గిల్ దేశవాళీ బాట పట్టాడు. రేపటి నుంచి దేశంలోని నాలుగు నగరాల్లో జరిగే దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో గిల్ బరిలోకి దిగనున్నాడు. ఈ టోర్నీలో పోటీపడే పంజాబ్ జట్టులో గిల్‌ను ఎంపిక చేశారు. జనవరి 11వ తేదీ వరకు భారత జట్టుకు ఎలాంటి అంతర్జాతీయ మ్యాచ్‌లు లేవు. దాంతో టీమిండియా టి20 జట్టు సభ్యులు అభిషేక్ శర్మ, అర్ష్‌దీప్ సింగ్ కూడా విజయ్ హజారే ట్రోఫీలో పోటీపడనున్నారు. గిల్‌తోపాటు అభిషేక్ శర్మ, అర్ష్‌దీప్ పంజాబ్ జట్టులోకి ఎంపికయ్యారు. గ్రూప్ 'సి'లో ఉన్న పంజాబ్ జైపూర్‌లో రేపు జరిగే తమ తొలి మ్యాచ్‌లో మహారాష్ట్ర జట్టుతో ఆడుతుంది. గ్రూప్ 'సి'లో ముంబై, సిక్కిం, ఛత్తీస్‌గఢ్, గోవా, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ జట్లు కూడా ఉన్నాయి.

పంజాబ్ వన్డే జట్టు: శుబ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, అర్ష్‌దీప్ సింగ్, ప్రభ్‌సిమ్రన్ సింగ్, హర్నూర్ పన్ను, అన్‌మోల్‌ప్రీత్ సింగ్, ఉదయ్ సహారణ్, నమన్ ధీర్, సలీల్ అరోరా, సాన్విర్ సింగ్, రమణ్‌దీప్ సింగ్, జషన్‌ప్రీత్ సింగ్, గుర్నూర్ బ్రార్, హర్‌ప్రీత్ బ్రార్, రఘు శర్మ, కృష్ భగత్, గౌరవ్ చౌధరీ, సుఖ్‌దీప్ బాజ్వా.

చైనాలోని జిలిన్ ప్రావిన్స్‌లో ఉన్న సాంగ్‌హువా లేక్ స్కై రిసార్టుపై కప్పకున్న మంచు దుప్పటి

హిమాచల్ ప్రదేశ్‌లోని లాహౌల్ స్పిటి జిల్లాలోని కొక్సార్ కురిసిన మంచులో పర్యాటకుల ఉల్లాసం

మోదీ ప్రభుత్వమే నన్ను కాపాడాలి

ఉక్రెయిన్ సైన్యానికి చిక్కిన గుజరాత్ వాసి వినతి

- రష్యా వచ్చే యువకులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిక

మోర్బి: రష్యా తరఫున యుద్ధంలో పాల్గొని ఉక్రెయిన్ బలగాలకు చిక్కిన గుజరాత్ వాసి తనను కాపాడాలంటూ భారత ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాడు. ఈ మేరకు అతడు తన కుటుంబసభ్యులకు ఒక వీడియో పంపించాడు. గుజరాత్‌లోని మోర్బి పట్టణానికి చెందిన సాహిల్ మహ్మద్ హుస్సేన్ మజోతి(22) రష్యాలో చదువుకునేందుకు వెళ్లాడు. అక్కడ అతడు డ్రగ్స్ కేసులో ఇరుక్కుని, జైలుకు వెళ్లాడు. ఆ తర్వాత రష్యా సైన్యంలో చేరి, ఉక్రెయిన్‌పై యుద్ధానికి వెళ్లాడు. అక్కడ ఉక్రెయిన్ సేనలకు లొంగిపోయాడు. ప్రస్తుతం ఉక్రెయిన్‌లో నిర్బంధంలో ఉన్నాడు. రెండు రోజుల క్రితం మోర్బిలో ఉంటున్న తన తల్లి హసీనా బెన్ సెల్‌ఫోన్‌కు ఒక వీడియో పంపాడు. అందులో తను పడుతున్న కష్టాలను వివరించాడు. తనే తప్పూ చేయకున్నా రష్యా అధికారులు తనను అక్రమ డ్రగ్స్ రవాణా కేసులో ఇరికించారని వాపోయాడు. జైలు పాలు చేసి, ఆపై మాయమాటలు చెప్పి, సైన్యంలో చేరేలా కాంటాక్ట్ ఒప్పందంపై సంతకం చేయించారని చెప్పాడు. యుద్ధానికి వెళ్లి ఉక్రెయిన్ బలగాలకు లొంగిపోయినట్లు ఆ వీడియోలో వివరించాడు. చదువుకునేందుకు రష్యా వచ్చే భారతీయ యువకులు జాగ్రత్తగా ఉండాలంటూ హెచ్చరించాడు. తనను ఈ చెర నుంచి విడిపించాలని కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాడు. కుటుంబంతో తిరిగి కలుసుకునే అవకాశం కల్పించాలని వేడుకున్నాడు. తన కుమారుడి నిర్బంధంపై స్థానిక రాజ్యసభ ఎంపీ కేసరీదేవసిన్హ్ ఝులాకు తెలిపామని హసీనాబెన్ తెలిపారు. మోదీ ప్రభుత్వం తన కుమారుడిని సురక్షితంగా వెనక్కి తీసుకువస్తుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. సాహిల్ అంశంపై విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్‌తో మాట్లాడినట్లు ఎంపీ చెప్పారు. దేశాల మధ్య వ్యవహారం అయినందున కొంత సమయం పడుతుందని అన్నారు. ఇప్పటికే ఈ విషయంలో కొంత పురోగతి సాధించామని చెప్పారు.

గెలిచినా గంప దింపలేదు!

కౌన్సిలర్ అయినా పండ్లమ్ముతున్న భాగ్యశ్రీ!

పుణె జిల్లాలోని అందమైన హిల్ స్టేషన్ లోనావాలా.. పర్యాటకులకు స్వర్గధామం. కానీ ఇప్పుడా ప్రాంతం ఒక సామాన్య మహిళ పోరాటానికి, నిరాడంబరతకు చిరునామాగా మారింది. ముంబైకి కూతవేటు దూరంలోని ఈ పట్టణ మున్సిపల్ కౌన్సిల్ ఎన్నికల్లో భాగ్యశ్రీ జగ్తాప్ అనే మహిళ సాధించిన విజయం.. ఇప్పుడు మహారాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది.

విజయం వరించినా.. వేరు మరువలేదు

సాధారణంగా ఎన్నికల్లో గెలవగానే నాయకులు పూలమాలలు, ఊరేగింపులు, బాణసంచా హడావిడిలో మునిగిపోతారు. కానీ భాగ్యశ్రీ స్టైలే వేరు.. ఆదివారం ఫలితాలు వచ్చాయి.. భారీ మెజారిటీతో ఆమె గెలిచారు. సోమవారం ఉదయాన్నే అందరూ ఆమె ఇంటికి అభినందనలు తెలపడానికి వద్దామనుకుంటే.. ఆమె మాత్రం ఎప్పటిలాగే రోడ్డు పక్కన తన పండ్ల దుకాణం దగ్గర ప్రత్యక్షమైంది. కౌన్సిలర్ హోదాను ప్రదర్శించడం కంటే, తన కుటుంబాన్ని పోషిస్తున్న పండ్ల గంపే ఆమెకు దైవంగా కనిపించింది. 'గెలిచాం కదా అని వ్యాపారాన్ని వదిలేస్తామా?.. మా కుటుంబానికి జీవనాధారం ఇదే'.. అంటూ ఆమె పండ్లను సర్దుతున్న తీరు చూసి స్థానికులు ఆశ్చర్యపోతున్నారు.

హేమాహేమీలను ఓడించి..

మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన భాగ్యశ్రీ, తన సమీప ప్రత్యర్థి అయిన బీజేపీ అభ్యర్థిని ఏకంగా 608 ఓట్ల తేడాతో ఓడించింది. పౌర సమస్యలపై ఆమెకున్న అవగాహన, సామాన్యులతో అనుబంధమే.. ఈ భారీ విజయానికి కారణమని లోనావాలా వాసులు స్పష్టం చేస్తున్నారు.

దేని పని దానిదే..

పదవి గురించి భాగ్యశ్రీ మాటల్లో ఎక్కడా గర్వం కనిపించదు. 'పండ్లమ్మడం మా వంశపారంపర్య వ్యాపారం. కౌన్సిలర్‌గా ప్రజల సమస్యలపై పోరాడతాను, వారి బాధలను కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్తాను. అదే సమయంలో నా పండ్ల దుకాణాన్ని కూడా నడుపుతాను. ఈ వ్యాపారమే నాకు గుర్తింపునిచ్చింది'.. అని ఆమె స్పష్టం చేసింది. భర్త మహదేవ్ జగ్తాప్ కూడా ఆమె నిర్ణయానికి పూర్తి మద్దతు తెలుపుతున్నారు. ఆమె ప్రజా సేవలో నిమగ్నమైతే, తాను వ్యాపార బాధ్యతలు చూసుకుంటానని సగర్వంగా చెబుతోంది.

శభాష్ భాగ్యశ్రీ

రాజకీయాల్లో విజయం సాధించాక నేలమీద నడవని నేతలున్న కాలంలో.. నిరాడంబరతే ఆభరణంగా భాగ్యశ్రీ సాగిపోతోంది. తన కష్టాన్ని, వృత్తిని నమ్ముకున్న ఈ 'పండ్లమ్మే కౌన్సిలర్' ఇప్పుడు సోషల్ మీడియాలో రియల్ హీరోగా నిలిచింది. గెలిచాక వాగ్దానాల 'గంప'దించేసే నాయకుల మధ్య.. గెలిచినా గంపను నమ్ముకున్న ఈ 'భాగ్యశ్రీ' నిజంగా అభినందనీయురాలు.

- సాక్షి, నేషనల్ డెస్క్

డాక్టరా?.. దండపాణా?

రోగిని చావబాదిన వైద్యుడు

సిమ్లా: ప్రాణం పోయాల్సిన చోట.. ప్రాణభయం నీడలా వెంటాడింది. రోగికి అండగా ఉండాల్సిన వైద్యుడే.. యమధర్మరాజులా విరుచుకుపడ్డాడు. సిమ్లా (హిమాచల్ ప్రదేశ్)లోని అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇందిరాగాంధీ వైద్య కళాశాల (ఐజీఎంసీ) ఆసుపత్రి ఒక అమానవీయ ఘటనకు వేదికైంది. ఊపిరి అందక విలవిల్లాడుతున్న రోగికి వైద్యం అందించాల్సింది పోయి, రౌడీలా మారి ముష్టిఘాతా లు కురిపించాడొక వైద్యుడు. ప్రస్తుతం సోష ల్ మీడియాను కుదిపేస్తున్న ఆ వీడియోను చూస్తుంటే ఎవరికైనా ఒళ్లు గగుర్పొడుస్తుంది!

అసలేం జరిగిందంటే..

అర్జున్ పవార్ అనే వ్యక్తి ఎండోస్కోపీ పరీక్ష కోసం ఐజీఎంసీకి వచ్చాడు. పరీక్ష పూర్తయ్యాక అతనికి శ్వాస తీసుకోవడం కష్టమైంది. ఆయాసంతో ఊపిరాడక, కాస్త ఉపశమనం కోసం పక్కనున్న వార్డులోని ఒక ఖాళీ బెడ్‌పై పడుకున్నాడు. అదే అతను చేసిన 'నేరం'. విధి నిర్వహణలో ఉన్న ఒక వైద్యుడు అక్కడికి వచ్చి, 'నా బెడ్ మీద ఎందుకు పడుకున్నావు?' అంటూ రోగితో వాగ్వాదానికి దిగాడు.

వైద్యానికి బదులు.. దెబ్బల వర్షం

రోగి పరిస్థితిని అర్థం చేసుకోవలసింది పోయి, ఆ వైద్యుడు దురుసుగా వ్యవహరించాడు. మాటామాటా పెరగడంతో సహనం కోల్పోయిన సదరు వైద్యుడు, రోగిపై భౌతిక దాడికి దిగాడు. అస్వస్థుడైన ఆ రోగిని కనికరం లేకుండా కొట్టడం అక్కడి వారిని విస్మయానికి గురిచేసింది. ఈ దృశ్యాలన్నీ ఎవరో వీడియో తీయడంతో సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

డాక్టర్ బాధితుడు అర్జున్

కట్టలు తెంచుకున్న ఆగ్రహం

ఈ దాడి వార్త తెలియగానే బాధితుడి బంధువులు, స్థానికులు పెద్ద ఎత్తున ఆసుపత్రి వద్దకు చేరుకుని ధర్నాకు దిగారు. సదరు వైద్యుడిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బాధితుని కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం మరింత తీవ్రరూపం దాల్చింది.

విచారణకు సీఎం ఆదేశం

దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన ఈ సంఘటనను.. హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు తీవ్రంగా పరిగణించారు. వెంటనే నివేదిక సమర్పించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. అటు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ రావు స్పందిస్తూ.. దీనిపై అంతర్గత విచారణ కమిటీని వేశామని, తప్పు తేలితే కఠిన చర్యలు తప్పవని హామీ ఇచ్చారు. ఆ విచారణ నివేదికలో ఏం తేలుతుందో.. ఆ 'ముతక' వైద్యుడికి ఎలాంటి శిక్ష పడుతుందో వేచి చూడాలి.

పేషెంటుపై ముష్టి ఘాతాలు కురిపిస్తున్న డాక్టర్

ముసాయి ఓటరు జాబితాలో ఘోర తప్పిదాలు

ఈసీపై సీఎం మమత ఆగ్రహం

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)ఎన్యుమరేషన్ అనంతరం విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాపై సీఎం మమతా బెనర్జీ మండిపడ్డారు. జాబితాలో మొదట్నుంచి చివరి వరకు ఘోర తప్పిదాలు దొర్లాయంటూ ఆమె ఆరోపించారు. సోమవారం కోల్‌కతాలోని నేతాజీ స్టేడియంలో టీఎంసీ బూత్ లెవల్ ఏజెంట్లతో జరిగిన సమావేశంలో మమత మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తన కార్యాలయంలో బీజేపీ ఏజెంటును పెట్టుకుని, అతడు చెప్పినట్లే ఎన్నికల జాబితాలను తారుమారు చేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే ఈసీ అబ్జర్వర్లను నియమించిందని, కాషాయ పార్టీకి అనుకూలంగా పనిచేస్తోందని మండిపడ్డారు. ముసాయిదా జాబితా నుంచి వేలాదిగా అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించారని ఆరోపించారు.

నేపాల్‌లో 10 లక్షల కొత్త ఓటర్లు

కఠ్మాండు: వచ్చే ఏడాది మార్చిలో జరిగే సాధారణ ఎన్నికలకు 10 లక్షల మంది కొత్త ఓటర్లు జత అయ్యారని నేపాల్ ఎన్నికల కమిషన్ సోమవారం తెలిపింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత 1.16 లక్షల మంది ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారని అధికారులు తెలిపారు. తుది జాబితాను ఈ నెల 27వ తేదీన విడుదల చేస్తామని చెప్పారు. నేపాల్‌లో చివరిసారిగా 2022లో ఎన్నికలు జరిగాయి. అప్పట్లో 1.81 లక్షల మంది రిజిస్టర్డ్ ఓటర్లున్నారు. అప్పట్లో రిజిస్టరైన పార్టీల సంఖ్య 87 కాగా, ఇప్పుడు అవి 114కు చేరాయి.

కేరళ యూడీఎఫ్‌లోకి కొత్తగా మూడు పార్టీలు

కొచ్చి: కేరళ కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్(యునైటెడ్ డెమోక్రాటిక్ ఫోర్స్) మరో మూడు పార్టీలు తమ కూటమిలో చేరినట్లు సోమవారం ప్రకటించింది. ఇందులో తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ), జనాధిపత్య రాష్ట్రీయ పార్టీ(జేఆర్‌పీ), కేరళ కామరాజ్ కాంగ్రెస్(కేకేసీ) ఉన్నాయి. జేఆర్‌పీ, కేకేసీలు ఇటీవలి వరకు బీజేపీ సారథ్యంలోని ఎన్డీయేలో భాగస్వాములుగా ఉన్నాయి. రాష్ట్రంలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే పోరులో యూడీఎఫ్‌తో చేతులు కలుపుతామంటూ ఈ మూడు పార్టీల నేతలు తమకు అభ్యర్థనలు పంపారని కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత వీడీ సతీశన్ చెప్పారు. అయితే, తాము యూడీఎఫ్‌లో చేరేందుకు దరఖాస్తు చేశామంటూ సతీశన్ చేసిన ప్రకటననుకేకేసీ చీఫ్, ఎన్డీయే ఉపాధ్యక్షుడు కూడా అయిన విష్ణుపురం చంద్రశేఖరన్ ఖండించారు. ఎన్డీయేతో విభేదాల మాట వాస్తవమేనంటూ ఆయన.. యూడీఎఫ్‌లో చేరుతామని తాము చెప్పలేదన్నారు.

కంపెనీ, సహచరుల కుట్రే!

- బంగ్లాలో దాస్ హత్యపై పోలీసులు
- కంపెనీ వర్గాల ఉద్దేశపూర్వక ఆలస్యం
- ముందే మాకు ఫోన్ చేస్తే బతికేవాడు
- ప్రీ ప్లాన్డ్ మర్డరేనని స్పష్టీకరణ

బంగ్లాదేశ్‌లో మతోన్మాదుల చేతిలో నిస్సహాయంగా మూక హత్యకు గురైన హిందూ మైనారిటీ వర్గానికి చెందిన దీపూ చంద్రదాస్ ఉదంతానికి సంబంధించి కొత్త కోణాలు వెలుగులోకి వచ్చాయి. ఆయన పని చేసిన కంపెనీ వర్గాలతో పాటు సహచరులే హత్యలో పాత్రధారులుగా మారినట్టు పోలీసులు వెల్లడించారు! దాంతో బంగ్లాదేశ్‌లోని మైనారిటీ వర్గాలన్నీ మరోసారి భగ్గుమంటున్నాయి. బంగ్లాదేశ్‌లో మైమెన్‌సింగ్ పట్టణంలోని ఓ బట్టల ఫ్యాక్టరీలో కార్మికునిగా పని చేస్తున్న 27 ఏళ్ల దాస్ డిసెంబర్ 16న దారుణ హత్యకు గురవడం తెలిసిందే. కంపెనీ ఆవరణ బయటే మతోన్మాద మూక ఆయనను అతి దారుణంగా కొట్టిచంపింది. అంతటితో ఆగకుండా మృతదేహాన్ని ఢాకా–మైమెన్‌గంజ్ హైవే మీదికి లాక్కెళ్లి బాహాటంగా తగలబెట్టింది. మత దూషణకు పాల్పడ్డాడన్నది దాస్‌పై ప్రధాన ఆరోపణ. అయితే అందుకు అసలు ఆధారాలే లేవని పోలీసులు ఇప్పుడు తీరిగ్గా చెబుతున్నారు. పైగా దాస్ హత్య ఆవేశంలో అప్పటికప్పుడు జరిగిన ఘటన కాదని, పక్కా ప్లాన్ ప్రకారమే జరిగిందని యాంటీ క్రైం ర్యాపిడ్ యాక్షన్ బెటాలియన్ (ఆర్ఏబీ) స్పష్టం చేయడం విశేషం. అంతేకాదు, దాస్‌ను దారుణంగా కొట్టిచంపడంలో ఏకంగా ఆయన సహోద్యోగులు కూడా మూకతో చేతులు కలిపినట్టు ఆర్ఏబీతో పాటు స్థానిక మీడియా కూడా స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి ఆర్ఏబీ ఇప్పటి దాకా 10 మందిని అరెస్టు చేసింది. అనంతరం పోలీసులు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

అసలేం జరిగింది?

దాస్ మతదూషణకు పాల్పడుతూ ఫేస్‌బుక్‌లో పోస్టులు పెట్టినట్టు డిసెంబర్ 16న ఉదయం నుంచే జోరుగా పుకార్లు షికారు చేశాయి. విషయం తెలియని ఆయన ఎప్పట్లాగే విధులకు హాజరయ్యాడు. అదే ఆయన పాలిట మృత్యువుగా పరిణమించింది. సాయంత్రానికల్లా సహోద్యోగులే ఆయనను దూషించడం మొదలుపెట్టారు. వారించాల్సిన పై అధికారులు పట్టించుకోకపోగా, దాస్‌తో బలవంతంగా రాజీనామా పత్రంపై సంతకం చేయించారు. మరోవైపు మధ్యాహ్నం నుంచే కంపెనీ బయట ఉన్మాద మూక పోగడం మొదలుపెట్టింది. సాయంత్రానికల్లా దాస్‌పై ఫ్యాక్టరీ ఆవరణలోనే తొలి దాడి జరిగినట్టు ఆర్ఏబీ–14 కమాండర్ నయీముల్ హసన్ వెల్లడించారు! ''ఫ్యాక్టరీ ఫ్లోర్ ఇన్‌చార్జి దాస్‌తో బలవంతంగా రాజీనామా చేయించడమే గాక ఆవేశంతో ఉడికిపోతున్న మూకకు ఆయనను స్వయంగా అప్పగించాడు. రాత్రి 8:30 గంటల వేళ, సరిగ్గా తర్వాతి షిఫ్ట్ కార్మికులు చిన్న గేట్ గుండా లోపలికొస్తున్న సమయంలో, బయట మూగిన మూక చూస్తుండగా దాస్‌ను బలవంతంగా లాక్కెళ్లి ఫ్యాక్టరీ మెయిన్ గేట్ దగ్గరున్న సెక్యూరిటీ రూములో ఉంచాడు. అంతే! ఆ వెంటనే మూక లోనికి దూసుకొచ్చి దాస్‌ను బయటికి లాక్కెళ్లింది. నిమిషాల వ్యవధిలోనే విచక్షణారహితంగా కొట్టిచంపింది. దాస్ సహోద్యోగులు కూడా వారితో చేతులు కలపడం ఈ ఉదంతంలో మరో విషాదం''అని హసన్ వివరించారు. అంతే కాదు, ''ఇంత ఉద్రిక్తత నెలకొన్నా రాత్రి 8 గంటల దాకా ఫ్యాక్టరీ బాధ్యులు తమకు కనీసం ఫోన్ కూడా చేయలేదు. సకాలంలో ఒక్క ఫోన్ కాల్ చేసుంటే దాస్ బతికేవాడే''అని చెప్పుకొచ్చారు. ''ఫోన్ రాగానే మేం హుటాహుటిన బయల్దేరినా కిలోమీటర్ల కొద్దీ విపరీతంగా ట్రాఫిక్ జామై సకాలంలో ఘటనా స్థలికి చేరలేకపోయాం. మేం వెళ్లేసరికే అంతా అయిపోయింది''అన్నారు.

కంపెనీ అంగీకారం!

దాస్ హత్యోదంతంలో ఫ్యాక్టరీ తప్పేమీ లేదని సీనియర్ మేనేజర్ షకీబ్ మహ్మూద్ బుకాయించినా, సహోద్యోగుల్లో కొందరు సాయంత్రానికల్లా దాస్‌కు వ్యతిరేకంగా నిరసనలకు దిగారంటూ వాస్తవాన్ని చెప్పకనే చెప్పాడు! అంతేకాదు, దాస్ దైవదూషణకు పాల్పడ్డట్టు ఎలాంటి రుజువులూ దొరకలేదని కూడా అంగీకరించాడు. ''మూకను శాంతింపజేసేందుకు దాస్‌తో ఉత్తుత్తి రాజీనామా చేయించాం. కానీ ఆ చర్యతో మూక కాదు కదా, సహోద్యోగులు కూడా శాంతించలేదు''అంటూ హంతకుల్లో తమ ఉద్యోగులు కూడా ఉన్నట్టు పరోక్షంగా చెప్పాడు.

- సాక్షి, నేషనల్ డెస్క్

బంగ్లాలో మైనారిటీల నిరసనలు

ఢాకా: బంగ్లాదేశ్‌లో మైనారిటీలు ఆందోళన బాట పట్టారు. నానాటికీ దేశంలో తమకు రక్షణే లేకుండా పోతోందంటూ మండిపడ్డారు. సోమవారం రాజధాని ఢాకాలో భారత దౌత్య కార్యాలయం సమీపంలో వారు భారీ సంఖ్యలో ప్రదర్శన జరిపారు. హిందూ, ఇతర మైనారిటీ సంస్థల నేతలతో పాటు ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో అందులో పాల్గొన్నారు. ముఖ్యంగా హిందూ కార్మికుడు దీపూ చంద్రదాస్‌ను అమానుషంగా కొట్టి చంపి, మృతదేహాన్ని బహిరంగంగా కాల్చి బుగ్గి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. దేశంలో మైనారిటీలకు కనీస భద్రత కల్పించడంలో కూడా యూనుస్ మధ్యంతర సర్కారు ఘోరంగా విఫలమవుతోందని వారంతా ముక్త కంఠంతో మండిపడ్డారు. మానవీయ బంగ్లాదేశ్‌ను సాకారం చేస్తానని యూనుస్ చెప్పిన మాటలకు, రోజూ జరుగుతున్న దారుణ వాస్తవాలకు పొంతనే లేదని మైనారిటీ యూనిటీ ఫ్రంట్ సంయుక్త సమన్వయకర్త మహీంద్రకుమార్ నాథ్ ఆరోపించారు. గతేడాది హింసాత్మక ఆందోళనల నేపథ్యంలో హసీనా సర్కారు కుప్పకూలి, యూనుస్ ప్రధాన సలహాదారుగా మధ్యంతర ప్రభుత్వం గద్దెనెక్కిన నాటినుంచీ బంగ్లాలో మైనారిటీలపై, ముఖ్యంగా హిందువులపై దాడులు పెచ్చరిల్లడం తెలిసిందే.

రూ.8 కోట్లు పోగొట్టుకున్న మాజీ ఐపీఎస్

తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యాయత్నం

పటియాలా: పంజాబ్ మాజీ ఐజీపీ, మాజీ ఐపీఎస్ అమర్ సింగ్ ఛహల్ ఆత్మహత్యకు యత్నించారు. సోమవారం తన సెక్యూరిటీ గార్డు వద్ద ఉన్న రైఫిల్‌తో తనను తాను కాల్చుకున్నారు. విషమ పరిస్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వెల్త్ మేనేజ్‌మెంట్ అడ్వైజర్స్ పేరుతో కొందరు సైబర్ నేరగాళ్లు రూ.8.10 కోట్ల మేర మోసం చేసినట్లు ఆయన వద్ద లభించిన ఒక నోట్‌లో ఉంది. పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్‌ను ఉద్దేశించి ఈ 12 పేజీల నోట్ రాశారు.

తప్పుడు డిక్లరేషన్... ఫోర్జరీ కాదు!

- ఎన్సీపీ నేత కోకాటేకు సుప్రీంకోర్టులో ఊరట..
- దోషిగా నిర్ధారించడంలో మౌలిక లోపం ఉందని వ్యాఖ్య

సాక్షి, న్యూఢిల్లీ: 'ఒక వ్యక్తి తన వివరాల విషయంలో తప్పుడు డిక్లరేషన్ ఇచ్చినంత మాత్రాన.. ఆ పత్రం ఫోర్జరీ డాక్యుమెంట్ అయిపోదు. అసలు ఈ కేసులో దోషిగా నిర్ధారించడంలోనే ప్రాథమికంగా లోపం ఉన్నట్లు కనిపిస్తోంది..'అని సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. 1995 నాటి చీటింగ్ కేసులో ఎన్సీపీ (అజిత్ పవార్ వర్గం) సీనియర్ నేత మాణిక్ రావ్ కోకాటేకు ఊరటనిస్తూ సోమవారం ఈ వ్యాఖ్యలు చేసింది. 1989–1992 మధ్య కాలంలో పేదలకు ఉద్దేశించిన ప్రభుత్వ ప్లాట్ల కోసం తప్పుడు ఆదాయ వివరాలు ఇచ్చారన్న అభియోగంపై కింది కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించడంతో కోకాటే మంత్రి పదవికి రాజీనామా చేశారు. అనంతరం బాంబే హైకోర్టును ఆశ్రయించగా.. డిసెంబర్ 12న హైకోర్టు ఆయన శిక్ష అమలును మాత్రమే నిలిపివేసింది. బెయిలిచ్చింది. కానీ, దోషిగా నిర్ధారణను ఆపేందుకు నిరాకరించింది. దీనిపై ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీల ధర్మాసనం.. 'తప్పుడు డిక్లరేషన్‌ను ఫోర్జరీగా చూడలేం'అని స్పష్టం చేసింది. ఈ సాంకేతిక అంశం ఆధారంగా బాంబే హైకోర్టు తీర్పుపై స్టే విధించింది. అదేవిధంగా, కోకాటే తన ఎమ్మెల్యే పదవికి అనర్హుడు కారని, ఆ పదవిలో కొనసాగడానికి ఎటువంటి ఆటంకం లేదని స్పష్టం చేసింది.దీంతో ఆయనపై ఎమ్మెల్యేగా అనర్హత వేటు పడే ప్రమాదం తప్పింది. అయితే, తదుపరి ఆదేశాల వరకు ఎటువంటి లాభదాయక పదవులు చేపట్టరాదని ధర్మాసనం షరతు విధించింది.

రాహుల్‌కు ఢిల్లీ హైకోర్టు నోటీసు

న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ కేసులో తమ ఛార్జిషీటును ట్రయల్ కోర్టు తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) వేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ తదితరులకు సోమవారం నోటీసులు జారీ చేసింది. ప్రధాన పిటిషన్‌తోపాటు, ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై స్టే కోరుతూ ఈడీ వేసిన పిటిషన్‌పై సమాధానం ఇవ్వాల్సిందిగా వారిని జస్టిస్ రవీందర్ జడేజా ఆదేశించారు. దీనిపై 2026 మార్చి 12వ తేదీన తదుపరి విచారణ ఉంటుందని పేర్కొన్నారు. గాంధీలతోపాటు సుమన్ దుబే, శామ్ పిట్రోడా, యంగ్ ఇండియన్, డోటెక్స్ మెర్చండైజ్ ప్రైవేట్ లిమిటెడ్, సునీల్ భండారీలకు నోటీసులు పంపారు. ప్రైవేట్ ఫిర్యాదు ఆధారంగా వేసిన ఛార్జిషీటు చెల్లదంటూ ఈ నెల 16న విచారణ సందర్భంగా ట్రయల్ కోర్టు కొట్టివేయడం తెల్సిందే.

సజ్జన్ కుమార్‌పై తీర్పు రిజర్వు

న్యూఢిల్లీ: 1984నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో నిందితుడిగా ఉన్న కాంగ్రెస్ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్‌పై తీర్పును ఢిల్లీ కోర్టు రిజర్వు చేసింది. ఈ కేసులో వాదనలు సోమవారంతో ముగియడంతో జనవరి 22వ తేదీన తీర్పు వెలువరిస్తామని స్పెషల్ కోర్టు జడ్జి దిగ్ వినయ్ సింగ్ ప్రకటించారు. వాదనల సందర్భంగా పోలీసులు సజ్జన్ కుమార్ భారీ భద్రత మధ్య కోర్టుకు తీసుకువచ్చారు. 1984 నవంబర్ ఒకటో తేదీన ఢిల్లీలోని జనక్‌పురి, వికాస్‌పురిల్లో జరిగిన అల్లర్ల వెనుక సజ్జన్‌కుమార్ హస్తముందంటూ వచ్చిన ఆరోపణల ఆధారంగా సిట్ పోలీసులు 2015లో ఆయనపై రెండు కేసులు నమోదు చేశారు.

పరిశీలించాకే అత్యవసర కేసుల లిస్టింగ్: సీజేఐ

న్యూఢిల్లీ: అత్యవసరంగా భావించే కేసులను సుప్రీంకోర్టు రిజిస్ట్రీ దృష్టికి తీసుకెళ్లాలని న్యాయవాదులను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కోరారు. రిజిస్ట్రీ వాటిని ఆమూలాగ్రం పరిశీలించిన తర్వాత ప్రాధాన్యతా క్రమంలో లిస్టింగ్ చేస్తారని చెప్పారు. సోమవారం జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చితో కలిసి ఆయన ప్రత్యేక వెకేషన్ బెంచ్‌లో న్యాయవ్యవస్థ జోక్యం అవసరమని భావించిన కొన్ని అత్యవసర కేసుల విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా అత్యవసర కేసులను విచారించాలని కొందరు లాయర్లు కోరడంతో ఆయన పైవిధంగా స్పందించారు. 'కేసులను ప్రస్తావించడానికి బదులుగా, రిజిస్ట్రీకి అత్యవసర విచారణకు అవసరమైన కారణాలు చూపండి. పరిశీలించి, అవసరమని భావిస్తే ఈ నెల 26 లేదా 29వ తేదీల్లో లిస్టింగ్ చేస్తారు'అని చెప్పారు. క్రిస్మస్, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సుప్రీంకోర్టు ఈ నెల 22వ తేదీ నుంచి సెలవులు మొదలయ్యాయి.

బస్సు బోల్తా పడి 16 మంది మృతి

జకార్తా: ఇండోనేసియాలోని ప్రధాన దీవి జావాలో జరిగిన బస్సు ప్రమాదంలో కనీసం 16 మంది ప్రాణాలు కోల్పోయారు. సోమవారం తెల్లవారు జామున సెమరంగ్ నగరంలోని క్రప్యక్ టోల్ ప్లాజా సమీపంలో ఘటన చోటుచేసుకుంది. పురాతన నగరం యోగ్యకర్త నంచి రాజధాని జకార్తాకు వస్తున్న ఈ బస్సులో ప్రమాద సమయంలో 34 మంది ప్రయాణికులున్నారు. వేగంగా వస్తున్న బస్సు మలుపులో అదుపుతప్పి కాంక్రీట్ గోడను ఢీకొని, పల్టీ కొట్టింది. ప్రయాణికుల హాహాకారాలతో ఆ ప్రాంతం ప్రతిధ్వనించింది. దాదాపు 40 నిమిషాలకు పోలీసులు, సహాయక సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. ప్రమాద తీవ్రతకు నుజ్జయిన బస్సులో ప్రయాణికులు చిక్కుకుపోయారు. ఆరుగురు అక్కడికక్కడే చనిపోగా, ఆస్పత్రికి తరలిస్తుండగా మరో 10 మంది తుదిశ్వాస విడిచారు. క్షతగాత్రుల్లో ఐదుగురి పరిస్థితి విషమంగాను, మరో 13 మంది ఆందోళనకరంగాను ఉందని పోలీసులు తెలిపారు. బస్సును నడుపుతున్న అసిస్టెంట్ డ్రైవర్ కూడా క్షతగాత్రుల్లో ఉన్నాడు.

నవతరం శక్తివంత ఇంజిన్‌తో సుఖోయ్-57

విజయవంతంగా పరీక్షించిన రష్యా

మాస్కో: గగనతలంలో తన జాడ తెలీకుండా శత్రు రాడార్లను ఏమార్చి మెరుపు వేగంతో దూసుకెళ్తూ అత్యంత వేగంగా దాడులుచేసే ఐదోతరం అధునాతన సుఖోయ్–57 యుద్ధవిమానాన్ని రష్యా విజయవంతంగా పరీక్షించింది. నవతరం ఈజ్‌దేలియే 177 రకం శక్తివంతమైన ఇంజిన్‌ను అమర్చాక సుఖోయ్–57 స్టెల్త్ ఫైటర్‌జెట్‌ను విజయవంతంగా పరీక్షించామని రష్యా ప్రభుత్వరంగ ఏరోస్పేస్ కంపెనీ 'యునైటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ కార్పొరేషన్(యూఏసీ) సోమవారం ప్రకటించింది. ప్రభుత్వరంగ రాస్‌టెక్ గ్రూప్ అనుబంధ యునైటెడ్ ఇంజిన్ కార్పొరేషన్ రూపొందించిన ఇంజిన్‌ను అమర్చి సుఖోయ్–57 విమానవ్యవస్థ తీరుతెన్నులను సమీక్షించామని యూఏసీ ఒక ప్రకటనలో పేర్కొంది. దాడి చేయడంలో అత్యుత్తమమైన ఐదోతరం విమానం ఇదేనని సంస్థ వ్యాఖ్యానించింది.

అసోంలోని రెండు జిల్లాల్లో నిషేధాజ్ఞలు

దిపు: కర్బి అంగ్‌లాంగ్ అటానమస్ కౌన్సిల్(కేఏఏసీ)చీఫ్ నివాసానికి నిప్పుపెట్టడంతోపాటు ఆందోళన కారులు విధ్వంసం సృష్టించడంతో అధికారులు కర్బి అంగ్‌లాంగ్, వెస్ట్ కర్బి అంగ్‌లాంగ్ జిల్లాల్లో నిషేధాజ్ఞలు విధించారు. వ్యక్తులకు ప్రాణహాని తలపెట్టడంతోపాటు ఆస్తుల విధ్వంసానికి కొందరు ప్రయత్నించవచ్చంటూ వస్తున్న వార్తల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ రెండు జిల్లాల పరిధిలోని ప్రొఫెషనల్ గ్రేజింగ్ రిజర్వు(పీజీఆర్), విలేజ్ గ్రేజింగ్ రిజర్వు(వీజీఆర్)లలో అక్రమంగా తిష్టవేసిన వారిని తొలగించాలంటూ గత 12 రోజులుగా కొన్ని రాజకీయ పార్టీలు, సామాజిక సంస్థల సభ్యులు దీక్షలను కొనసాగిస్తున్నారు. అయితే, తొలగింపులను నిలిపివేయాలని గౌహతి హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీక్షలను భగ్నం చేసేందుకు పోలీసులు యత్నించగా ఘర్షణ చోటుచేసుకుంది. దీక్ష చేపట్టిన వారిని పోలీసులు ఆస్పత్రికి తరలించారు. ఈ వార్త తెలియడంతో కొందరు కేఏఏసీ చీఫ్ ఇంటికి నిప్పుపెట్టారు. వీరిని చెదరగొట్టేందుకు పోలీసులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు గాయపడ్డారు. ఉద్రిక్తత నెలకొనడంతో అధికారులు సభలు, సమావేశాలను నిషేధించారు.

హుమాయూన్ కబీర్ కొత్త పార్టీ

సాధారణ ప్రజల కోసం తమ పార్టీ పనిచేస్తుందని వెల్లడి

బెల్డాంగా: పశ్చిమబెంగాల్‌కు చెందిన శాసనసభ్యుడు హుమాయూన్ కబీర్ సొంతంగా జనతా ఉన్నయన్(జన ఉద్ధరణ) పార్టీ పేరుతో కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. ముర్షిదాబాద్ జిల్లా బాబ్రీ తరహా మసీదుకు పునాదిరాయి వేసినందుకు ఆయన్ను అధికార టీఎంసీ బహిష్కరించడం తెల్సిందే. హుమాయూన్ కబీర్ సోమవారం బెల్డాంగాలో జరిగిన బహిరంగ సభలో పార్టీ ఏర్పాటును ప్రకటించారు. మరో ఆరు నెలల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి మమతా బెనర్జీని గద్దె దించడమే తన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. తన పార్టీ పేరులో కాంగ్రెస్ లేదా తృణమూల్ కాంగ్రెస్‌ల జాడ కనిపించరాదనే జనతా ఉన్నయన్ పేరును ఎన్నుకున్నట్లు వివరించారు.

'రాజకీయ పార్టీ' ఏ షెడ్యూల్‌లో ఉంది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

రాజ్యాంగ సమీక్ష జాతీయ కమిషన్

రాజ్యాంగం పనితీరును సమీక్షించడానికి ఎన్డీఏ ప్రభుత్వం 2000 ఫిబ్రవరి 22న జస్టిస్ ఎం.ఎన్.వెంకటాచలయ్య అధ్యక్షతన 10 మంది సభ్యులతో భారత రాజ్యాంగ సమీక్ష జాతీయ కమిషన్‌ను ఏర్పాటు చేసింది.

ఈ కమిషన్ సభ్యుడు పి.ఎ. సంగ్మా కమిషన్ నివేదిక సమర్పించక ముందే రాజీనామా చేశారు. ఈ కమిషన్‌కు కార్యదర్శిగా డా.రఘువీర్‌సింగ్ వ్యవహరించారు. ఈ కమిషన్ రచనా సంఘం 2001 సెప్టెంబర్‌లో డా.సుభాష్ సి.కశ్యప్ అధ్యక్షతన ఇద్దరు సభ్యులతో ఏర్పడింది. రచనా సంఘంలో కె.పరాశరన్, డా. అబిద్ హుస్సేన్‌లను సభ్యులుగా నియమించారు. ఈ రాజ్యాంగ సమీక్ష సంఘం 18 పర్యాయాలు సమావేశమై 46 రోజులు సంప్రదింపులు జరిపింది. రాజ్యాంగ సమీక్ష కమిషన్ 2002 మార్చి 11న తన అధ్యయన నివేదికను ఆమోదించింది. 2002 మార్చి 31న అధ్యయన నివేదికను నాటి ప్రధానమంత్రి వాజ్‌పేయికి సమర్పించింది. ఈ కమిషన్ 249 సిఫారసులతో 11 శీర్షికలుగా నివేదికను రూపొందించింది.

సూచనలు:

- ఏడాదిలో కనీసం 80 రోజులు వేతనం అందేలా గ్రామాల్లో ఉపాధి పొందే హక్కును కల్పించడం.
- భారత రాజ్యాంగంలోని 4వ భాగం శీర్షిక–రాజ్యాంగ విధాన 'ఆదేశిక సూత్రాలు' అనే చర్యగా సవరించాలి.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గురించి, ప్రాథమిక విధులకు సంబంధించి పౌరులకు తగిన అవగాహన, పరిజ్ఞానం కల్పించే చర్యలు చేపట్టాలి.
- ఎన్నికల ప్రక్రియ, ఎన్నికల వ్యయాన్ని ప్రభుత్వమే భరించేలా సాధ్యమైనంత త్వరగా చర్యలు తీసుకోవాలి.
- రాజకీయ పార్టీలన్నీ మహిళలకు 30 శాతం స్థానాలు కేటాయించాలి.
- పార్లమెంటు ఏడాదికి 120 రోజులు సమావేశం కావాలి. రాజ్యసభ 100 రోజులు సమావేశం కావాలి. రాష్ట్రాల శాసన సభలు కూడా ఏడాదికి 90 రోజులు సమావేశం కావాలి.
- కార్యనిర్వహణ శాఖ, ప్రభుత్వ పాలన, అధికారుల్లో బాధ్యత, జవాబుదారీతనం పెంపొందించడానికి సామాజిక తనిఖీ వ్యవస్థను ప్రవేశపెట్టాలి.
- కేంద్ర, రాష్ట్ర సంబంధాలు బలంగా ఉండాలి, అంతర్రాష్ట్ర మండలి ద్వారా కేంద్ర ప్రభుత్వం వైయుక్తికంగా, సమష్టిగా రాష్ట్రాలతో సంప్రదింపులు జరపాలి.
- న్యాయశాఖలో మార్పులు చేపడుతూ, జాతీయ న్యాయ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి.
- అధికార వికేంద్రీకరణ,స్వావలంబన, గ్రామ పంచాయతీలను స్వయం పాలనా సంస్థలుగా ప్రకటించి వాటికి ప్రత్యేక అధికారాలు కేటాయించాలి.
- వ్యవస్థీకృతమైన మార్పులు జరగాలి. సాంఘిక, ఆర్థిక మార్పులతో పాటు అభివృద్ధి క్రమం విస్తరించాలి. మైనారిటీ వర్గాల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించడానికి చర్యలు చేపట్టాలి.

లక్ష్యాలు

- దేశంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సమర్థవంతమైన, జవాబుదారీతనం, పారదర్శకత, నీతివంతమైన పాలన కోసం ఏ మేరకు రాజ్యాంగపరమైన అంశాలు దోహదపడతాయనే అంశాలను సునిశితంగా పరిశీలించి సూచనలు చేయడం.
- రాజ్యాంగ మౌలిక సూత్రాలకు భంగం కలగకుండా రాజ్యాంగపరమైన అంశాల్లో అవసరమైన క్రమానుగత మార్పులను సూచించడం.
- పార్లమెంటరీ ప్రజాస్వామ్య సంవిధానం మేరకు ఆధునిక భారతదేశ ఆర్థిక, సాంఘిక, రాజకీయ అభివృద్ధి సాధనకు సవివరమైన సూచనలు చేయడం.

జిల్లా కలెక్టర్

దేశంలో జిల్లా కలెక్టర్ పదవిని 1772లో వారన్ హేస్టింగ్స్ గవర్నర్ జనరల్‌గా ఉన్నప్పుడు ప్రవేశపెట్టారు. స్వాతంత్ర్యానంతరం ఐఏఎస్‌కు చెందిన అధికారి జిల్లా కలెక్టర్‌గా నియమితులవుతున్నారు. జిల్లా కలెక్టర్ హోదాను ఫ్రాన్స్ లోని ప్రిఫెక్ట్ అనే పదవితో పోల్చుతారు.

అధికారాలు–విధులు

1) రెవెన్యూ విధులు
2) న్యాయపరమైన విధులు
3) ఎన్నికల నిర్వహణ
4) ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయినవారిని ఆదుకోవడం
5) అభివృద్ధి కార్యక్రమాల అమలు
6) జనాభా లెక్కల సేకరణ
7) స్థానిక సంస్థలపై పర్యవేక్షణ.

నోట్: జిల్లా కలెక్టర్‌కు అనేక అంశాలతో జిల్లా పరిషత్‌లకు సంబంధం ఉంటుంది. జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలకు శాశ్వత ఆహ్వానితుడి హోదాలో కలెక్టర్ హాజరవుతాడు. జిల్లా పరిషత్ పనితీరు గురించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను పంపిస్తాడు. జిల్లా పరిషత్‌లోని వివిధ పదవులకు ఎన్నికలు నిర్వహిస్తాడు.

జాతీయ న్యాయ మండలి

న్యాయమూర్తులను జవాబుదారీ చట్రంలోకి తెచ్చే దిశగా న్యాయ వ్యవస్థలో సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. న్యాయమూర్తులపై వచ్చే ఆరోపణలపై విచారణ చేయడానికి, దోషులుగా తేలిన న్యాయమూర్తులను తొలగించడానికి వీలుగా ఉండే 'The Judges Bill - 2006ను తీసుకురావాలని అప్పట్లో కేంద్ర మంత్రి మండలి నిర్ణయించింది. 2006 నవంబర్ 9న నాటి ప్రధాని అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఒక విధానపరమైన నిర్ణయం తీసుకున్నారు. న్యాయవ్యవస్థ పనితీరులో పారదర్శకత, జడ్జీలను జవాబుదారీ చేయడం ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. న్యాయమూర్తులపై వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదులను విచారించడానికి జాతీయ న్యాయ మండలి (ఎన్‌జేసీ) ఏర్పాటు చేయాలని ఈ బిల్లు పేర్కొంటుంది. దీనికోసం 1968 జడ్జీల చట్టానికి సవరణ తీసుకొస్తారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి మినహా ఇతర జడ్జీల్లో ఎవరిపై ఆరోపణలు వచ్చినా ఎన్‌జేసీ విచారిస్తుంది. జాతీయ న్యాయ మండలిలో భారత ప్రధాన న్యాయమూర్తితో పాటు సుప్రీం కోర్టులోని ఇద్దరు సీనియర్ న్యాయమూర్తులు, మరో ఇద్దరు సీనియర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు సభ్యులుగా ఉంటారు. ఒకవేళ సుప్రీం కోర్టులోని జడ్జిపై ఫిర్యాదును విచారించాల్సివస్తే హైకోర్టు న్యాయమూర్తుల స్థానంలో మరో ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులను ప్రధాన న్యాయమూర్తి నామినేట్ చేస్తారు. జడ్జీలపై తప్పుడు ఆరోపణలు చేస్తే అతడికి ఏడాది జైలు, రూ. 25 వేల వరకు జరిమానా విధిస్తారు. ఈ న్యాయ మండలి నేరుగా లేదా లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్‌పర్సన్ ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తుంది. ఫిర్యాదుదారు, జడ్జి ఎవరనేది రహస్యంగా ఉంచేందుకు ఈ బిల్లు వీలు కల్పిస్తుంది. ఇందులో ఎలాంటి ఉల్లంఘనలు జరిగినా నెల పాటు శిక్ష, రూ. 500 జరిమానా లేదా రెండూ అమలు చేయవచ్చు. ఫిర్యాదులను ఎన్‌జేసీ రహస్యంగా విచారిస్తుంది. జడ్జి దుష్ప్రవర్తన, అసమర్థతతో వ్యవహరించినట్లు రుజువైతే.. అతడ్ని తొలగించాల్సిన అవసరం లేదని న్యాయ మండలి భావిస్తే, ఈ కింది చర్యలు తీసుకోవచ్చు.

- సలహాలు ఇవ్వడం.
- హెచ్చరికలు చేయడం
- స్వచ్ఛంద పదవీ విరమణ చేయాలని కోరడం.
- బహిరంగంగా లేదా రహస్యంగా మందలించడం లేదా అభిశంసించడం చేస్తుంది.

ఒకవేళ న్యాయమూర్తి తొలగింపు తప్పదని భావిస్తే, ఆ మేరకు రాష్ట్రపతికి న్యాయ మండలి సిఫారసు చేస్తుంది. దీన్ని స్వీకరించిన రాష్ట్రపతి మండలి గుర్తించిన అంశాలు, సంబంధిత నివేదికలను, సిఫారసులను పార్లమెంటు ఉభయసభల్లో ప్రవేశపెట్టాలని కోరతాడు. అప్పుడు జడ్జి తొలగింపు కోసం రాష్ట్రపతికి అభ్యర్థన చేస్తూ సభలో ప్రభుత్వం తీర్మానం ప్రవేశ పెడుతుంది. ఆ తీర్మానం ఆమోదం ద్వారా తొలగింపునకు గురైన న్యాయమూర్తి వివిధ రకాల విధులకు అనర్హుడవుతారు. లా కమిషన్ 195వ నివేదికలో చేసిన సిఫారసుల ప్రాతిపదికన ఈ నూతన బిల్లును రూపొందించారు. జస్టిస్ వెంకటాచలయ్య కమిటీ, జాతీయ లా కమిషన్‌లు న్యాయమూర్తులను జవాబుదారీ చట్రంలోకి తీసుకురావాలని సిఫారసు చేశాయి.

పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం

పదవి, డబ్బులకోసం సభ్యులు పార్టీలు మారడం 1967 తర్వాత ఎక్కువగా జరిగాయి. దీన్నే ఫ్లోర్ క్రాసింగ్ అంటారు. పార్టీ ఫిరాయింపులను నివారించడానికి 1985లో 52వ రాజ్యాంగ సవరణ చేశారు. పార్టీ ఫిరాయింపు చట్టం ప్రకారం ఈ కింది కారణాలతో సభ్యులను తొలగించవచ్చు.

- పార్టీ సభ్యుడు తాను ఎన్నికైన పార్టీకి స్వచ్ఛందంగా రాజీనామా చేసినప్పుడు.
- పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా సభలో తన ఓటు హక్కును వినియోగించినప్పుడు, ముందుగా అనుమతి తీసుకోకుండా ఓటింగ్‌కు గైర్హాజరైనప్పుడు.

అయితే అత్యవసర కారణాల వల్ల సభకు రాలేకపోయాడని గైర్హాజరైన 15 రోజుల లోపు పార్టీ గుర్తిస్తే పార్టీ ఫిరాయింపు చట్టం నుంచి తప్పించుకునే అవకాశం ఉంది. 1942లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం పార్టీలు జారీ చేసే విప్.. విశ్వాస, అవిశ్వాస తీర్మానాలకు మాత్రమే వర్తిస్తుంది. దీని ప్రకారం ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. స్వతంత్రంగా ఎన్నికైన సభ్యుడు ఏదైనా పార్టీలో చేరితే సభ్యత్వం కోల్పోతాడు. నామినేటెడ్ సభ్యుడు ఆరు నెలల తర్వాత ఏదైనా పార్టీలో చేరితే సభ్యత్వం కోల్పోతాడు.

ముఖ్యాంశాలు:

- భారత రాజ్యాంగంలో రాజకీయ పార్టీ అనే పదం 10వ షెడ్యూల్‌లో మాత్రమే ఉంది. రాజీవ్‌గాంధీ ప్రభుత్వ హయాంలో 52వ రాజ్యాంగ సవరణ చేసి ఫిరాయింపుల చట్టానికి సంబంధించి 102(2), 191(2) అధికరణలను చేర్చారు.
- దేశంలో రాజకీయ పార్టీలు రాజ్యాంగ బద్ధమైనవి కావు. అవి కేవలం చట్టబద్ధంగా ఎన్నికల కమిషన్ ద్వారా గుర్తింపు పొంది ఏర్పాటయ్యాయి.

వర్తించని సందర్భాలు:

- పార్టీలలో చీలిక ఏర్పడి మూడో వంతు సభ్యులు గ్రూప్‌గా ఏర్పడితే ఫిరాయింపుల నిరోధక చట్టం పరిధిలోకి రాదు.
- పార్టీ సభ్యుల్లో 2/3వ వంతు సభ్యులు వేరే పార్టీలో చేరినప్పుడు కూడా ఈ చట్టం పరిధిలోకి రాదు.
- లోక్‌సభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌లు తమ పదవులు వదిలి వారి పార్టీల్లో చేరినప్పుడు వారికి ఈ చట్టం వర్తించదు. రాష్ట్రాల్లో కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది.
- పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం అమలు విషయంలో చైర్మన్, స్పీకర్‌దే అంతిమ నిర్ణయం.
- రాజకీయ పార్టీల్లో చీలికలను నిరోధించడానికి, రాష్ట్రాల్లో మంత్రివర్గ పరిమాణాన్ని నియంత్రించడానికి ఉద్దేశించిన 97వ రాజ్యాంగ సవరణ బిల్లు, 91వ రాజ్యాంగ సవరణ చట్టం 2003గా అమల్లోకి వచ్చింది. ఈ బిల్లు ప్రకారం పార్టీ నుంచి ఎంతమంది ఫిరాయించినా వారు అనర్హులవుతారు. తిరిగి పోటీ చేసి గెలిచే వరకూ వారు ప్రతిఫలాన్నిచ్చే ఏ పదవీ చేపట్టడానికి వీలులేదు.
- పార్టీ అధ్యక్షుడి ఫిర్యాదు మేరకు స్పీకర్ వారి సభ్యత్వాన్ని రద్దు చేసే అవకాశం ఉంటుంది.

సభ్యత్వం రద్దు–సుప్రీంకోర్టు తీర్పు

1993లో కిహోటో ఉలాహన్ వర్సెస్ జాచి లు కేసులో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ.. సభ్యుడి సభ్యత్వం రద్దుపై స్పీకర్(సభాధ్యక్షుడు)ది తుది నిర్ణయం కాదని వారి నిర్ణయం న్యాయసమీక్షకు లోబడి ఉంటుందని పేర్కొంది.

ప్రజాప్రాతినిధ్య చట్టం సవరణ

క్రిమినల్ కేసుల్లో కోర్టు దోషులుగా నిర్ధారించిన వ్యక్తులు శిక్ష అనుభవిస్తున్న కాలం తర్వాత మరో ఆరేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేసే వీలు లేకుండా ప్రజాప్రాతినిధ్యం చట్టం (సవరణ) బిల్లును లోక్‌సభ ఆమోదించింది. నేర చరితులను చట్ట సభలకు దూరంగా ఉంచాలనే ఉద్దేశంతో నిబంధనలను మరింత కఠినతరం చేస్తూ ప్రజాప్రాతినిధ్య చట్టానికి సవరణ చేస్తున్నారు. గతంలో దీర్ఘకాలం శిక్షపడిన వ్యక్తులు తొలి ఆరేళ్లలో పోటీ చేయలేకపోయినా తర్వాత జైలులో ఉండి పోటీ చేసే అవకాశం ఉండేది. ఇప్పుడు అలాంటి అవకాశం లేకుండా చేశారు. అవినీతి నిరోధక చట్టం, తీవ్రవాద నిరోధక చట్టం కింద శిక్షపడిన వారు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులు. అవినీతి నిరోధక చట్టం కింద కనీసం రెండు సంవత్సరాలు శిక్షపడినా అనర్హత వర్తిస్తుంది.

రాజ్యాంగ సమీక్ష జాతీయ కమిషన్	ఎం.ఎన్. వెంకటాచలయ్య (అధ్యక్షుడు)
సభ్యులు..	కె.పరాశరన్ (మాజీ అటార్నీ జనరల్ ఆఫ్ ఇండియా)
జస్టిస్ బి.పి.జీవన్‌రెడ్డి (ఛైర్మన్, లా కమిషన్ ఆఫ్ ఇండియా)	డాక్టర్. సుభాష్ సి.కశ్యప్ (లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్)
జస్టిస్ ఆర్.ఎస్.సర్కారియా (సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి)	సి.ఆర్.ఇరానీ (ది స్టేట్స్‌మన్ పత్రిక చీఫ్ ఎడిటర్)
జస్టిస్ కె.పున్నయ్య (ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి)	అబిద్ హుస్సేన్ (యూఎస్‌ఏలో భారత మాజీ రాయబారి)
పి.ఏ.సంగ్మా (లోక్‌సభ మాజీ స్పీకర్)	శ్రీమతి సుమిత్ర జి.కులకర్ణి (మాజీ ఎంపీ)
సోలీ జె.సొరాబ్జీ (అటార్నీ జనరల్)	

మాదిరి ప్రశ్నలు

1. రాజ్యాంగ సమీక్ష కోసం ఏర్పాటైన జాతీయ కమిషన్‌కు అధ్యక్షత వహించిన వారు?
   ఎ) పి.ఎ సంగ్మా బి) జస్టిస్ బి.పి జీవన్‌రెడ్డి
   సి) జస్టిస్ ఎం.ఎన్. వెంకటాచలయ్య
   డి) సీఆర్ ఇరానీ
2. జిల్లా కలెక్టర్ వ్యవస్థను ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
   ఎ) 1771 బి) 1772 సి) 1773 డి) 1774
3. ఎన్నికల ప్రక్రియలో వ్యయాన్ని ప్రభుత్వమే భరించాలని సిఫారసు చేసిన కమిషన్?
   ఎ) వీరప్ప మొయిలీ కమిటీ
   బి) రాజ్యాంగ సమీక్ష జాతీయ కమిషన్
   సి) సర్కారియా కమిషన్ డి) పైవేవీ కావు

సమాధానాలు

1) సి; 2) బి; 3) బి.

నిజాం కాలంలోనే రోడ్డు రవాణాకు బీజం!

రవాణా సౌకర్యాలు

ఒక దేశంలోని ప్రజల ఆర్థిక, సాంఘిక, రాజకీయ, జీవన స్థితిగతులు ఆ దేశంలోని రవాణా సౌకర్యాల అభివృద్ధిపై ఆధారపడి ఉంటాయి. వస్తువులను, ప్రయాణికులను ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి చేర్చడాన్ని 'రవాణా' అంటారు. ప్రాథమిక, పారిశ్రామిక, సేవా రంగాల అభివృద్ధిలో రవాణా సౌకర్యాల పాత్ర అత్యంత కీలకం.

రాష్ట్రంలో ప్రధానంగా మూడు రకాల రవాణా సౌకర్యాలు ఉన్నాయి.

అవి:

1. రోడ్డు రవాణా
2. రైల్వే రవాణా
3. వాయు రవాణా

తెలంగాణకు సముద్ర తీర ప్రాంతం లేదు కాబట్టి రాష్ట్రంలో జల రవాణాకు తగిన ప్రాధాన్యం లేదు.

రోడ్డు రవాణా

తెలంగాణ రాష్ట్రంలో 'నిజాం స్టేట్ రైల్వే'లో భాగంగా 1932లో భారతదేశంలోనే మొట్టమొదటి రోడ్డు రవాణా సంస్థను ఏర్పాటు చేశారు. దీని పేరు 'నిజాం రాష్ట్ర రైల్ అండ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్' (ఎన్ఎస్ఆర్–ఆర్‌టీడీ).

- రాష్ట్రంలోని మొదటి రోడ్డు రవాణా సంస్థ 27 బస్సులు, 166 మంది కార్మికులతో ప్రారంభమైంది.
- నిజాం రాజ్య ప్రధానమంత్రి సాలార్జంగ్ చొరవతో హైదరాబాద్ – షోలాపూర్ రహదారిని నిర్మించారు.
- 1932లో రహదారులను జాతీయం చేసి ప్రభుత్వమే బస్సులను నడిపింది.
- 1936 నాటికే హైదరాబాద్ నుంచి తెలంగాణలోని అన్ని జిల్లాలకు బస్సులు నడపటం ప్రారంభమైంది.
- ఎన్ఎస్ఆర్–ఆర్‌టీడీ సంస్థను హైదరాబాద్ రాష్ట్రంలో విలీనం చేసిన తేదీ 1951 నవంబర్ 1.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 1965లో 'రోడ్లు, భవనాల శాఖ (ఆర్ అండ్ బీ)'ను ఏర్పాటు చేశారు.
- ప్రస్తుతం రాష్ట్రంలోని రోడ్లు 'తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ' పరిధిలో ఉన్నాయి.
- రాష్ట్రంలో 80 శాతానికి పైగా సరకులు, ప్రయాణికుల రవాణా రోడ్డు మార్గాలపైనే ఆధారపడి ఉంది.

రోడ్లు - రకాలు

రాష్ట్రంలోని రోడ్లను 'ఆర్ అండ్ బీ నెట్ వర్క్' కింద ఉన్న రోడ్లు, 'పంచాయతీ రాజ్' రోడ్లు అని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

ఆర్ అండ్ బీ నెట్‌వర్క్ కింద ఉన్న రోడ్లను తిరిగి జాతీయ రహదారులు (ఎన్‌హెచ్), రాష్ట్ర రహదారులు (ఎస్‌హెచ్), ప్రధాన జిల్లా రహదారులు, గ్రామీణ రోడ్లుగా విభజించవచ్చు.

రాష్ట్రంలో రహదారుల నెట్‌వర్క్:

- రాష్ట్రంలోని మొత్తం జాతీయ రహదారుల విస్తీర్ణం 2,592 కి.మీ.
- రాష్ట్ర రహదారుల పొడవు 3,152 కి.మీ.
- ప్రధాన జిల్లా రహదారుల పొడవు 12,079 కి.మీ.
- గ్రామీణ రహదారుల పొడవు 9,014 కి.మీ.
- జాతీయ రహదారులు మినహాయించి రాష్ట్ర రహదారుల మొత్తం పొడవు 24,245 కి.మీ.

జాతీయ రహదారులు

ఇవి సెంట్రల్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ పరిధిలో ఉంటాయి.

- తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదార్లు అధికంగా (266 కి.మీ.) ఆదిలాబాద్ జిల్లాలో విస్తరించి ఉన్నాయి. అతి తక్కువగా హైదరాబాద్‌లో (36 కి.మీ.) ఉన్నాయి.
- రాష్ట్రంలో జాతీయ రహదారుల సాంద్రత100 చ.కి.మీ. ప్రాంతానికి 2.25 కి.మీ.గా ఉంది.
- దేశంలో జాతీయ రహదారుల సాంద్రత 100 చ.కి.మీ. ప్రాంతానికి 2.82 కి.మీ.
- రాష్ట్రంలో అతి పొడవైన జాతీయ రహదారి 'ఎన్‌హెచ్–44', అతి చిన్న జాతీయ రహదారి 'ఎన్‌హెచ్–61'.
- రాష్ట్రంలోని మొత్తం జాతీయ రహదారుల పొడవు 2,592 కి.మీ. ఇందులో..
  - నాలుగు లేన్ల జాతీయ రహదారుల పొడవు 964 కి.మీ.
  - రెండు లైన్ల జాతీయ రహదారుల పొడవు 1264 కి.మీ.
  - మధ్య తరహా (ఇంటర్మీడియెట్) లైన్ జాతీయ రహదారుల పొడవు 153 కి.మీ.
  - సింగిల్ లైన్ జాతీయ రహదారుల పొడవు 211 కి.మీ.

రాష్ట్రంలోని జాతీయ రహదారులు

1. **జాతీయ రహదారి నంబర్ – 44**
   ఇది వారణాసి నుంచి కన్యాకుమారి వరకు ఉంది. దీని పాత నంబర్ – 7. ఇది మహారాష్ట్ర సరిహద్దు నుంచి ఆదిలాబాద్, నిర్మల్, రామాయంపేట, హైదరాబాద్, మహబూబ్‌నగర్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశిస్తుంది. తెలంగాణలో ఈ రహదారి పొడవు 519.64 కి.మీ.
2. **జాతీయ రహదారి నంబర్ – 65**
   దీని పాత నంబర్ –9. ఇది కర్ణాటక సరిహద్దు నుంచి జహీరాబాద్, హైదరాబాద్, సూర్యాపేట్ మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశిస్తుంది. రాష్ట్రంలో దీని పొడవు 291.74 కి.మీ.
3. **జాతీయ రహదారి నంబర్ – 63**
   దీని పాత నంబర్ –16. ఇది నిజామాబాద్ నుంచి ఆర్మూర్, జగిత్యాల, లక్సెట్టిపేట, చెన్నూర్ మీదుగా మహారాష్ట్రలోకి ప్రవేశిస్తుంది. రాష్ట్రంలో దీని పొడవు 235.15 కి.మీ.
4. **జాతీయ రహదారి నంబర్ – 167**
   ఇది నూతన రహదారి. ఇది కర్ణాటక సరిహద్దు నుంచి జడ్చర్ల (మహబూబ్‌నగర్) మీదుగా ఎన్‌హెచ్–44ను కలుస్తుంది.
5. **జాతీయ రహదారి నంబర్ – 163**
   దీని పాత నంబర్–202. ఇది హైదరాబాద్ నుంచి జనగాం, వరంగల్, వెంకటాపురం మీదుగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోకి ప్రవేశిస్తుంది. తెలంగాణలో దీని పొడవు 306 కి.మీ.
6. **జాతీయ రహదారి నంబర్ – 30**
   దీని పాత నంబర్–221. ఇది ఆంధ్రప్రదేశ్ సరిహద్దు నుంచి పెనుబలి,కొత్తగూడెం,పాల్వంచ, భద్రాచలం మీదుగా ఛత్తీస్‌గఢ్‌లోకి ప్రవేశిస్తుంది. రాష్ట్రంలో దీని పొడవు 100 కి.మీ.
7. **జాతీయ రహదారి నంబర్ – 61**
   దీని పాత నంబర్ – 222. ఇది రాష్ట్రంలో మహారాష్ట్ర సరిహద్దు నుంచి నర్సాపూర్ మీదుగా నిర్మల్ వరకు ఉంది. తెలంగాణ రాష్ట్రంలో దీని పొడవు 53.6 కి.మీ.
8. **జాతీయ రహదారి నంబర్ – 161**
   ఇది నూతన జాతీయ రహదారి. ఇది సంగారెడ్డి మీదుగా మహారాష్ట్రలోకి ప్రవేశిస్తుంది. రాష్ట్రంలో దీని పొడవు 140.5 కి.మీ.
9. **జాతీయ రహదారి నంబర్ – 363**
   ఇది నూతన జాతీయ రహదారి. ఇది మహారాష్ట్ర సరిహద్దు నుంచి మహదేవ్‌పూర్, పరకాల, ఆత్మకూరు ద్వారా ఎన్‌హెచ్–163తో కలుస్తుంది.
10. **జాతీయ రహదారి నంబర్ –365**
    ఇది నూతన జాతీయ రహదారి. ఇది నకిరేకల్ నుంచి తుంగతుర్తి, మహబూబాబాద్, నర్సంపేట మీదుగా మల్లంపల్లి వద్ద ఎన్‌హెచ్–163తో కలుస్తుంది.
11. **జాతీయ రహదారి నంబర్ – 565**
    ఇది కూడా నూతన జాతీయ రహదారి. ఇది నకిరేకల్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశిస్తుంది.
    - 363, 365, 565 నంబర్ జాతీయ రహదార్ల మొత్తం ఉమ్మడి పొడవు 330 కి.మీ.
12. **జాతీయ రహదారి నంబర్ – 563**
    ఇది నూతన జాతీయ రహదారి. ఎన్‌హెచ్–63పై ఉన్న మంచిర్యాల మీదుగా కరీంనగర్–వరంగల్ ద్వారా ఎన్‌హెచ్–163తో కలుస్తుంది. రాష్ట్రంలో దీని పొడవు 136 కి.మీ.
13. **జాతీయ రహదారి నంబర్ – 365ఎ**
    ఇది కూడా నూతన జాతీయ రహదారి. ఇది ఎన్‌హెచ్–65పై ఉన్న కోదాడ మీదుగా ఖమ్మం – మహబూబాబాద్ ద్వారా ఎన్‌హెచ్ –365తో కలుస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో దీని పొడవు 75 కి.మీ.
14. **జాతీయ రహదారి నంబర్ – 765**
    ఇది నూతన జాతీయ రహదారి. హైదరాబాద్ నుంచి ఆమన్‌గల్, వెల్దండ,కల్వకుర్తి,వంగూర్, అచ్చంపేట మీదుగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశిస్తుంది. రాష్ట్రంలో దీని పొడవు 196 కి.మీ.
    - నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా రాష్ట్రంలో 768 కి.మీ. పొడవైన జాతీయ రహదారులను 'నేషనల్ హైవేస్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు' కింద నాలుగు లైన్ల రహదారులు గా అభివృద్ధి చేస్తోంది.

రాష్ట్ర రహదారులు

రాష్ట్ర రహదారులు ప్రధానంగా జిల్లాల ప్రధాన కేంద్రాలను రాష్ట్ర రాజధానితో అనుసంధానం చేస్తాయి.

- రాష్ట్ర రహదారులు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అత్యధికంగా ఉన్నాయి.

జిల్లా రహదారులు

తాలూకా కేంద్రాలతో; జిల్లా కేంద్రాలతో; ప్రధాన ఉత్పత్తి ప్రాంతాలు, మార్కెట్ కేంద్రాలను రాష్ట్రీయ రహదారులతో; రైల్వేస్టేషన్‌లతో కలిపే రహదారులను 'జిల్లా రహదారులు' అంటారు.

పంచాయతీరాజ్ రహదారులు

పంచాయతీరాజ్ రహదారుల నిర్మాణం, నిర్వహణను రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ పర్యవేక్షిస్తుంది. ఈ శాఖ గ్రామీణ ప్రాంత రోడ్లు, గ్రామాల్లో అంతర్గత రోడ్లు, బిల్డింగ్‌లు, కమ్యూనిటీ హాళ్లను నిర్మిస్తుంది.

ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)

ఇది హైదరాబాద్ చుట్టూ విస్తరించి ఉంది. ఈ రింగ్ రోడ్డు పొడవు 158 కి.మీ. దీన్ని హైదరాబాద్ మెట్రోపాలిటన్ అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) నిర్మించింది. ఈ రింగ్ రోడ్డుకు మరో పేరు 'నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డు'.

- పంచాయతీ రాజ్ రోడ్లు అధికంగా ఉన్న జిల్లా – ఉమ్మడి మహబూబ్ నగర్
- పంచాయతీ రాజ్ రోడ్లు అత్యల్పంగా ఉన్న జిల్లా ఉమ్మడి రంగారెడ్డి (హైదరాబాద్ కాకుండా).
- అన్ని రకాల రోడ్లను కలిపి చూసినప్పుడు.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రోడ్ల విస్తీర్ణం అధికంగా, హైదరాబాద్ జిల్లాలో అత్యల్పంగా ఉన్నాయి.

మాదిరి ప్రశ్నలు

1. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం రోడ్లను అధికంగా కలిగి ఉన్న ఉమ్మడి జిల్లా ఏది?
   1) ఆదిలాబాద్ 2) కరీంనగర్
   3) రంగారెడ్డి 4) మహబూబ్ నగర్
2. రాష్ట్ర రహదారులు అధికంగా ఏ జిల్లాలో ఉన్నాయి?
   1) ఆదిలాబాద్ 2) కరీంనగర్
   3) వరంగల్ 4) నల్లగొండ
3. తెలంగాణలో అతి పొడవైన జాతీయ రహదారి ఏది?
   1) NH - 65 2) NH - 63
   3) NH - 44 4) NH - 163
4. రాష్ట్రంలో ఒక చదరపు కి.మీ.కు ఉన్న రోడ్డు సాంద్రత ఎంత?
   1) 0.86 కి.మీ. 2) 2.82 కి.మీ.
   3) 2.25 కి.మీ. 4) 0.23 కి.మీ.
5. 16వ నంబర్ జాతీయ రహదారి కొత్త నంబర్ ఏది?
   1) 63 2) 163 3) 61 4) 65
6. తెలంగాణలో మొట్టమొదటి రోడ్డు రవాణా సంస్థను ఏ సంవత్సరంలో స్థాపించారు?
   1) 1936 2) 1932
   3) 1951 4) 1956
7. నెహ్రూ రింగ్ రోడ్డు మొత్తం పొడవెంత?
   1) 168 కి.మీ. 2) 196 కి.మీ.
   3) 158 కి.మీ. 4) 3152 కి.మీ.
8. 2015 జనవరి 30 నాటికి రాష్ట్ర రహదారుల పొడవెంత?
   1) 3,512 కి.మీ. 2) 3152 కి.మీ.
   3) 2,59 కి.మీ 4) 9014 కి.మీ.

సమాధానాలు

1) 4; 2) 2; 3) 3; 4) 4;
5) 1; 6) 2; 7) 3; 8) 2.

- హైదరాబాద్ - కర్నూలు, హైదరాబాద్ - మచిలీపట్నం రహదారులను నిజాం కాలంలోనే నిర్మించారు.
- 1936 నాటికే తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాల్లో బస్ డిపోలను ప్రారంభించారు. హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాలకు బస్సులు నడిపారు.
- తెలంగాణ రాష్ట్రం మీదుగా 14 జాతీయ రహదార్లు వెళుతున్నాయి.
- తెలంగాణలో అతి పొడవైన జాతీయ రహదారి ఎన్‌హెచ్–44.

దేశంలోనే మొదటి ఎలక్ట్రానిక్ నాలెడ్జ్ ఆధారిత పంచాయతీ?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సైన్స్ అండ్ టెక్నాలజీ

మాదిరి ప్రశ్నలు

1. భూమిపై నుంచి ఒక పౌనపున్యం ఉన్న సమాచారాన్ని స్వీకరించి మరొక పౌనపున్యం ఉన్న సమాచారాన్ని భూమికి పంపడాన్ని ఏమంటారు?
   ఎ) ట్రాన్స్‌మిషన్ బి) ట్రాన్స్‌పాండర్
   సి) డౌన్‌లింకింగ్
   డి) రిసీవింగ్ పౌనపున్యం
2. తిరుపతి సమీపంలోని ఎంఎస్‌టీ –రాడార్ కింది ఏ ఆవరణంపై పరిశోధన చేయదు?
   ఎ) మీసో స్పియర్
   బి) స్ట్రాటోస్ఫియర్
   సి) ట్రోపోస్ఫియర్
   డి) ఎక్సోస్ఫియర్
3. టాటా స్కై, డిష్ టీవీ ప్రసారాలు కింది ఏ శాటిలైట్ నుంచి లభిస్తాయి?
   ఎ) ఇన్‌శాట్ – 4 సీఆర్
   బి) ఇన్‌శాట్ – 6 ఆర్
   సి) జీశాట్ – 6
   డి) ఇన్‌శాట్ – 1 ఎ
4. టెలీ మెడిసిన్– వైద్యయోజన్‌ను మొదట ఏ రాష్ట్రంలో ప్రారంభించారు?
   ఎ) తెలంగాణ బి) కర్ణాటక
   సి) ఒడిశా డి) తమిళనాడు
5. దేశంలోనే మొదటి ఎలక్ట్రానిక్ నాలెడ్జ్ ఆధారిత పంచాయతీ?
   ఎ) మెదక్‌లోని రామచంద్రాపురం
   బి) విజయవాడలోని మొఘల్రాజపురం
   సి) రంగారెడ్డిలోని మియాపూర్
   డి) కడపలోని ఓబులవారి పల్లి
6. అంతరిక్ష కార్యక్రమాల్లో వివిధ భాగాల్లో అవసరమైన పరికరాలు తయారీ ఎక్కడ జరుగుతోంది?
   ఎ) ముంబయి బి) హైదరాబాద్
   సి) పింప్రీ డి) కోయంబత్తూర్
7. మనదేశంలోని ఎత్తయిన రాకెట్?
   ఎ) సింథటిక్ అపర్చర్ రాడార్
   బి) ఎస్ఏఆర్ఏఎల్
   సి) పీఎస్ఎల్‌వీ చాప్టర్–2
   డి) కేఐటీ శాట్
8. ఇస్రో చరిత్రలో 'సువర్ణ సంవత్సరం'గా పేర్కొనదగిన ఏడాది?
   ఎ) 1969 బి) 2008
   సి) 2014 డి) 2003
9. కిందివాటిలో చంద్రయాన్ లక్ష్యం కానిది?
   ఎ) చంద్రుడి ఉపరితలాన్ని 3–డిలో ఫొటోలు తీసి మ్యాపింగ్ చేయడం
   బి) ఖనిజాలు, రసాయనిక పరిశోధనలు
   సి) నీటి ఉనికి గుర్తింపు
   డి) మానవ జాడ అన్వేషణ
10. ప్రధానంగా స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు ఉపయోగించుకునే సమాచార ప్రసార సాంకేతికత?
   ఎ) ఇ–మెయిల్
   బి) వి–శాట్ నెట్‌వర్క్
   సి) కార్టోశాట్
   డి) మొబైల్‌ఫోన్ – వాట్సప్
11. 1995లో మనదేశంలో ఏ సంస్థను ప్రారంభించడం ద్వారా ఇంటర్నెట్ సేవలు ప్రారంభమయ్యాయి?
   ఎ) ఐఎస్‌డీఎన్ బి) వీఎస్ఎన్ఎల్
   సి) బీఎస్ఎన్ఎల్ డి) ఫ్లిప్‌కార్ట్
12. మనదేశంలో ఏర్పాటు చేసిన మొదటి జల విద్యుత్ ప్రాజెక్ట్?
   ఎ) శివ సముద్రం
   బి) కృష్ణ రాజసాగర్
   సి) నాగార్జునసాగర్ డి) జంఝావతి
13. జతపర్చండి.
   1. కల్పకం ఎ) కర్ణాటక
   2. కాక్రపారా బి) తమిళనాడు
   3. కైగా సి) గుజరాత్
   ఎ) 1–ఎ, 2–బి, 3–సి
   బి) 1–సి, 2–బి, 3–ఎ
   సి) 1–బి, 2–సి, 3–ఎ
   డి) 1–ఎ, 2–సి, 3–బి
14. కల్పకం రియాక్టర్‌ను 'ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్' అంటారు. ఇందులో వాడే ఇంధనం?
   ఎ) ప్లుటోనియం
   బి) యురేనియం
   సి) సీసం కలిసిన పెట్రోలు
   డి) ద్రవ హైడ్రోజన్
15. తారాపూర్ అణు విద్యుత్ కేంద్రంలో వాడే ఇంధనం?
   ఎ) ప్లుటోనియం
   బి) యురేనియం
   సి) కార్బన్‌డై ఆక్సైడ్
   డి) మిక్స్‌డ్ ఆక్సైడ్
16. రావత్ భట్టా అణు రియాక్టర్ ఎక్కడ ఉంది?
   ఎ) మహారాష్ట్ర బి) రాజస్థాన్
   సి) తమిళనాడు డి) తెలంగాణ
17. మణుగూరు(ఖమ్మం)లో ఏ ప్లాంటు ఉంది?
   ఎ) అణువిద్యుత్ కేంద్రం
   బి) భార జల ప్లాంట్
   సి) యురేనియం శుద్ధి
   డి) అణుబాంబు తయారీ
18. ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ 1962లో వేటిపై అవగాహన కల్పించింది?
   ఎ) బయోగ్యాస్ బి) ఖాదీ దుస్తులు
   సి) సిమెంట్ వాడకం
   డి) కాలుష్య నియంత్రణ
19. దేశంలో పవనశక్తి ఉత్పత్తిలో మొదటిస్థానంలో ఉన్న రాష్ట్రం?
   ఎ) తెలంగాణ బి) తమిళనాడు
   సి) కేరళ డి) హిమాచల్‌ప్రదేశ్
20. ప్రపంచంలో అత్యంత సామర్థ్యం ఉన్న గాలిమర ఎక్కడ ఉంది?
   ఎ) పెరంబూర్ బి) పనాజీ
   సి) మంగుళూరు డి) పెరంబుడి
21. గాలి మరలను రూపొందించే సంస్థ?
   ఎ) బీహెచ్ఈఎల్ బి) ఈసీఐఎల్
   సి) హెచ్ఏఎల్ డి) మిధాని
22. సుజ్లాన్ కంపెనీకి సంబంధమున్న అంశం?
   ఎ) పవనశక్తి
   బి) సముద్ర అలల శక్తి
   సి) జీవ ఇంధనం
   డి) ఉదజని ఇంధనం
23. టైడల్ ఎనర్జీ ఉత్పత్తికి కావలసిన అలల ఎత్తు?
   ఎ) 5 – 12 మీటర్లు
   బి) 10 –15 మీటర్లు
   సి) 2 – 3 మీటర్లు
   డి) 12 – 16 మీటరు
24. భూగర్భోష్ణశక్తి కేంద్రం ఎక్కడ ఉంది?
   ఎ) గంగాలోయ
   బి) సబర్మతి లోయ
   సి) తాతావని డి) మణికారన్
25. భారతదేశంలో పెట్రోల్‌ను మొదట కనుగొన్న ప్రాంతం?
   ఎ) మఖుమ్ – అసోం
   బి) డిగ్బాయ్ – అసోం
   సి) బాంబే హై – మహారాష్ట్ర
   డి) కృష్ణపట్నం– ఆంధ్రప్రదేశ్
26. ద్రవరూప సోడియంను మితకారిగా ఏ రియాక్టర్లలో వాడతారు?
   ఎ) లైట్ వాటర్ రియాక్టర్
   బి) ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్
   సి) హెవీ వాటర్ రియాక్టర్
   డి) ఎలక్ట్రిక్ రియాక్టర్
27. మిశ్రమ ఆక్సైడ్‌లో ఉండే పదార్థాలు?
   ఎ) సీసం, యురేనియం
   బి) సీసం, సెలీనియం
   సి) యురేనియం, ప్లుటోనియం
   డి) యురేనియం, ప్లుటోనియం ఆక్సైడ్‌లు
28. కెనడా సహకారంతో స్థాపించిన అణు రియాక్టర్ ఏది?
   ఎ) సిరస్ బి) అప్సర
   సి) జెర్లీనా డి) ధ్రువ
29. కల్పకంలోని మినీ రియాక్టర్?
   ఎ) పూర్ణిమ బి) ధ్రువ
   సి) కామిని డి) టోక్‌మాక్
30. భారజలం రసాయనిక నామం?
   ఎ) డ్యుటీరియం ఆక్సైడ్
   బి) డ్యుటీరియం హైడ్రాక్సైడ్
   సి) కార్బన్ డై ఆక్సైడ్
   డి) సల్ఫ్యూరస్ ఆమ్లం
31. ప్లాస్మా స్థితిని ఉత్పత్తి చేయడానికి ఉపయోగించే పరికరం ఏది?
   ఎ) టోక్‌మాక్ బి) ప్లాస్మోడ్రోమ్
   సి) టోరోడియల్ డి) ట్యూరమ్ థీ
32. 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా రీసెర్చ్' ఎక్కడ ఉంది?
   ఎ) అలహాబాద్ బి) కోల్‌కతా
   సి) గాంధీనగర్ డి) భువనేశ్వర్
33. మనదేశంలో ఎనర్జీ స్టేట్‌గా పిలిచే రాష్ట్రం?
   ఎ) మేఘాలయ
   బి) హిమాచల్‌ప్రదేశ్
   సి) న్యూఢిల్లీ డి) కేరళ
34. సెంట్రల్ షీప్ బ్రీడింగ్ ఫార్మ్ ఎక్కడ ఉంది?
   ఎ) సింగూరు – పశ్చిమబెంగాల్
   బి) అనంతపురం – ఆంధ్రప్రదేశ్
   సి) నిర్మల్ – తెలంగాణ
   డి) హిస్సార్ – హర్యానా
35. 'ఆమ్రపాలి' ఏ మొక్కల్లోని ఒక రకం?
   ఎ) అరటి బి) మామిడి
   సి) పెసర డి) వరి
36. కిందివాటిలో అధిక దిగుబడిని ఇచ్చే బాతులు?
   ఎ) కాకి కాంబెల్
   బి) ఇండియన్ రన్నర్
   సి) బకర్‌వాల్
   డి) గొడ్డి
37. జీవ ఎరువుల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన జాతీయ సంస్థ ఎక్కడ ఉంది?
   ఎ) భువనేశ్వర్ బి) హిస్సార్
   సి) ఘజియాబాద్ డి) నాగపూర్

సమాధానాలు

1) బి;	2) డి;	3) ఎ;	4) సి;
5) ఎ;	6) బి;	7) సి;	8) బి;
9) డి;	10) బి;	11) బి;	12) ఎ;
13) సి;	14) ఎ;	15) డి;	16) బి;
17) బి;	18) ఎ;	19) బి;	20) డి;
21) ఎ;	22) ఎ;	23) ఎ;	24) ఎ;
25) ఎ;	26) బి;	27) డి;	28) ఎ;
29) సి;	30) ఎ;	31) ఎ;	32) సి;
33) బి;	34) డి;	35) బి;	36) ఎ;
37) సి.			

First electronic computer in the world?

BANK EXAMS

COMPUTER AWARENESS

COMPUTER GENERATIONS

Generation in computer terminology is a change in technology a computer is/was being used. Initially, the generation term was used to distinguish between varying hardware technologies. But nowadays, generation includes both hardware and software, which together make up an entire computer system. There are totally five computer generations known till date.

FIRST GENERATION

- The period of first generation was 1942-1954.
- First generation of computer started with using vacuum tubes as the basic components for memory and circuitry for CPU (Central Processing Unit).
- In this generation mainly batch processing operating system were used.
- In this generation Punched cards, Paper tape, Magnetic tape Input & Output device were used.

The main features of First Generation are:

- Supported Machine language only.
- Very costly.
- Generate lot of heat.
- Slow Input/output device.
- Huge size.
- Need of A.C.
- Non portable.
- Consumed lot of electricity.

Some computers of this generation were:

- ENIAC, EDVAC, UNIVAC, IBM-701, IBM-650

SECOND GENERATION

- The period of second generation was 1952-1964.
- This generation using the transistor was cheaper, consumed less power, more compact in size, more reliable and faster than the first generation machines made of vacuum tubes.
- In this generation, magnetic cores were used as primary memory and magnetic tape and magnetic disks as secondary storage devices.
- In this generation assembly language and high level programming language were used.
- There was Batch processing and Multiprogramming Operating system used.

The main features of Second Generation are:

- Reliable as compared to First generation computers.
- Smaller size as compared to First generation computers.
- Generate less heat as compared to First generation computers.
- Consumed less electricity as compared to First generation computers.
- Faster than first generation computers.
- Still very costly.
- A.C. needed.

Some computers of this generation were:

- IBM 1620, IBM 7094, CDC 1604, CDC 3600, UNIVAC 1108

THIRD GENERATION

- The period of third generation was 1964-1972.
- The third generation of computer is marked by the use of Integrated Circuits (IC's).
- This development made computers smaller in size, reliable and efficient.
- In this generation Remote processing, Time-sharing, Real-time, Multi-programming Operating System were used.
- High level languages were used during this generation.

The main features of Third Generation are:

- More reliable.
- Smaller size.
- Generate less heat.
- Faster.
- Lesser maintenance.
- Still costly.
- A.C needed.
- Consumed lesser electricity.
- Support high level language.

Some computers of this generation were:

- IBM-360 series, Honeywell-6000 series, PDP (Personal Data Processor), IBM-370/168, TDC-316

FOURTH GENERATION

- The period of Fourth Generation was 1972-1990.
- The fourth generation is made of Very Large Scale Integrated (VLSI) circuits.
- Fourth Generation computers became more powerful, compact, reliable, and affordable. As a result, it gave rise to personal computer (PC) revolution.
- In this generation Time sharing, Real time, Networks, Distributed Operating System were used.
- All the Higher level languages like C and C++, DBASE etc. were used in this generation.

The main features of Fourth Generation are:

- VLSI technology used.
- Very cheap.
- Portable and reliable.
- Use of PC's.
- Very small size.
- Pipeline processing.
- No A.C. needed.
- Concept of internet was introduced.
- Great developments in the fields of networks.
- Computers became easily available

Some computers of this generation were:

- DEC 10, STAR 1000, PDP 11, CRAY-1(Super Computer), CRAY-X-MP (Super Computer)

FIFTH GENERATION

- The period of Fifth Generation is 1990-till date.
- In the fifth generation, the VLSI became ULSI (Ultra Large Scale Integration) technology.
- This generation is based on parallel processing hardware and AI (Artificial Intelligence) software.
- All the Higher level languages like C and C++, Java, .Net etc. are used in this generation.

The main features of Fifth Generation are:

- ULSI technology.
- Development of true artificial intelligence.
- Development of Natural language processing.
- Advancement in Parallel Processing.
- Advancement in Superconductor technology.
- More user friendly interfaces with multimedia features.
- Availability of very powerful and compact computers at cheaper rates.

MODEL QUESTIONS

1. The first microprocessor built by the Intel Corporation was called_____
   1) 8008 2) 8080 3) 4004
   4) 8800 5) None of these
2. Daisy wheel printer is a type of_______
   1) Matrix primer
   2) Impact printer
   3) Laser printer
   4) Manual printer
   5) None of these
3. The first electronic computer in the world was________
   1) UNIVAC
   2) EDVAC
   3) ENIAC
   4) All of above
   5) None of these
4. Before a disk can be used to store data it must be _____
   1) Formatted
   2) Reformatted
   3) Addressed
   4) Readdressed
   5) None of the above
5. _____is network operating system
   1) DOS 2) Win-95 3) Win-98
   4) WIN-2000 server 5) None
6. Orkut was officially launched ______
   1) 20-jan-2004 2)15- jan-2004
   3) 26-jan-2006 4)24-jan -2004
   5) None
7. Malicious Hacker known as_______
   1) White hat hacker
   2) Hacker 3) Cracker
   4) Ethical 5) None
8. AltaVista, Google and Bing are the example of_____
   1) Search engine
   2) Brand name 3) Virus name
   4) Antivirus program 5) None
9. What is the Transmission rate of fiber optics cable?
   1) 10 mbps 2) 1000 mbps
   3) 100 mbps 4) 1000 bps
   5) None
10. ______ is a search engine introduced by MICROSOFT?
   1) Google 2) Khoj.com
   3) Bing 4) Yahoo 5) None
11. Tally is __________
   1) Open S/W 2) System S/W
   3) Application S/W
   4) Closed S/W 5) None
12. Keyboard Converts typed in character to ___________code
   1) Binary 2) ASCII
   3) Decimal 4) EBCIDIC
   5) None
13. Which of the following sequence is correct?
   1) Source code -linker - object code-compiler - executable code
   2) Source code - compiler - object code - linker - executable code
   3) Object code - compiler - source code - linker - executable code
   4) Object code -linker - source code - compiler - executable code
   5) None
14. Who developed the language C#?
   1) Dennis Ritchie
   2) Brian Kernighan
   3) Anders Hejlsberg
   4) John McCarthy 5) None
15. An affordable technology that uses existing telephone lines to provide high-speed connections is called ____
   1) ISDN 2) Cable modem
   3) Microwave 4) DSL
   5) DSN
16. Codes consisting of lines of varying widths or lengths that are computer readable are known as____
   1) an ASCII code
   2) a magnetic tape
   3) a bar code
   4) an OCR scanner
   5) None of these
17. Time required by a sector to reach below the head is known as_____
   1) Seek time 2) Latency time
   3) Access time 4) Disk time
   5) None of these
18. IP-Address 192.5.48.3 belong to________
   1) Class A 2) Class B
   3) Class C 4) Class D
   5) None of these
19. Internet-like networks within an enterprise known as______
   1) Intranet 2) Internet
   3) Extranet 4) Network
   5) None of these
20. What is standard Layout of keyboard?
   1) QWERTY 2) DVORAK
   3) AZERTY 4) 1 and 2
   5) None
21. Most powerful computer in a typical network is________
   1) Desktop 2) Network client
   3) Network server
   4) Network 5) None
22. _______Viruses are often transmitted by a floppy disk left in the floppy drive
   1) Trojan horse
   2) Boot sector
   3) Script
   4) Logic bomb
   5) None of these
23. ______is a combination of black hat and white hat hacker.
   1) White hat
   2) Grey hat
   3) Blue hat
   4) Red hat
   5) None
24. The ability to recover and read deleted or damaged files from a criminal's computer is an example of a law enforcement specialty called_____
   1) Robotics. 2) Simulation
   3) Computer forensics.
   4) Animation. 5) None of these
25. How many types of database objects are there in MS Access?
   1) 5 2) 6 3) 7
   4) 8 5) None of these

KEY

1) 3	2) 2	3) 3	4) 1
5) 4	6) 4	7) 3	8) 1
9) 2	10) 3	11) 3	12) 2
13) 2	14) 3	15) 4	16) 3
17) 2	18) 3	19) 1	20) 1
21) 3	22) 2	23) 3	24) 3
25) 3			